# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, ఫిబ్రవరి, 2016 ₹ 25

ISSN 2454–4329



రాధాకృష్ణులు

# మిసిమి
మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
*- Dammapada.*

**సంపుటి 27** | **ఫిబ్రవరి** | **సంచిక 2**

*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*
వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*
కాండ్రేగుల నాగేశ్వరరావు

సాంకేతిక సహాయకులు
పడవల ఉమాశంకర్, చేపూరి రమేష్,
మహమ్మద్ కుత్రముద్దీన్ జీ షాన్, వెల్దండ రమేష్,
వేముల రాణి, సారిక నిర్మల,
నీలకంఠం నరసరాజు

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**

*Printed & Published by*
**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536. Cell : 9949 51 6567
E-mail : misimi_monthly@yahoo.in
www.misimimonthly.com
e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹ 25/- సంవత్సరానికి : ₹300/-
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

LIBRARY OF CONGRESS
LCCN 91-903060
ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
ISSN 2454-4329


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు ........ 5
జీనియస్ - కోటికొక్కడు ........ 7
*- ఆర్థర్ షోపెన్‌హోవర్*
నాటకం అంటే?... 'భారతీయ' దృక్కోణం ........ 12
*- ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ*
చాట్ల జ్ఞాపకాలు ........ 22
*- గొల్లపూడి మారుతీరావు*
మొరసునాటి తెలుగువారి స్థితిగతులు ........ 26
*- కొసరాజు వెంకటేశ్వరరావు*
క్రోమోసోమ్ కథనమ్ - 6 ........ 31
*- ము.పా.సా.*
వలసలు ........ 35
*- సాయి పాపినేని, జయశ్రీ నాయని*
ఆనందీబాయి జోషి (1865-1887)
మొదటి భారతీయ మహిళా డాక్టరు ........ 44
*- అనువాదం : జనపన లక్ష్మీరెడ్డి*
బెథోవెన్ సంగీతము - వెన్నెల రాత్రి ........ 51
*- ఆవంత్స సోమసుందర్*
మొల్ల రామాయణం (కవయిత్రి - ఆతుకూరి మొల్ల) ....... 53
*- కసిరెడ్డి వెంకటపతిరెడ్డి*
స్త్రీల జానపద ప్రదర్శనలు ........ 58
*- టి. జయామనోహర్*
ఇ.ఎస్. రెడ్డి గురించి కొన్ని విషయాలు ........ 62
*- టి. రవిచంద్*
షేక్స్‌పియర్ - బుచ్చిబాబు ........ 64
*- అంపశయ్య నవీన్*
మా నాన్న చెన్నారెడ్డి ........ 73
*- కోడూరు పుల్లారెడ్డి*
భవాని ........ 82
నాకు తెలిసిన చాట్ల ........ 92
*- ఎన్నార్కె*
వేదిక ........ 93
*- వి.ఎ.కె. రంగారావు*
చదవండి ........ 96


*ముఖచిత్రం* : గోపాలుడు
*రెండవ అట్ట* : రాధాకృష్ణులు
*మూడవ అట్ట* : అనామిక
*నాల్గవ అట్ట* : గోపిక

*చిత్రకారుడు :*
**అహోబిలం ప్రభాకర్**

అట్టతో కలిపి 100 పుటలు

*వివరాలు : 50 వ పుటలో...*

సాధారణంగా జ్ఞానులు అన్ని యుగాల్లో ఒకే విషయం, మంచినే బోధిస్తారు. కాని మూర్ఖులు – దురదృష్టమేమంటే – వీరి సంఖ్య – అసంఖ్యాకం, వీరూ తమ దారిలో జ్ఞానులకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తారు. ఇది ఇలాగే సాగిపోతుంటుంది.

అందుకే వోల్టేర్ అంటాడు – "ఈ ప్రపంచాన్ని ఇలాగే వదిలివేద్దాం – మనం వచ్చినపుడు ఎంత మూర్ఖంగా, క్రూరంగా వుందో – అలాగే వదిలి వెళ్ళిపోదాం" అని!

అయితే మానవజాతిని ఉద్ధరించాలని ఎవరూ ప్రయత్నించలేదా? లేకేం – బుద్ధుడు అర్ధశతాబ్దికాలం ఆ కార్యంలోనే తన జీవితం గడిపివేశాడు – క్రీస్తు తన జీవితకాలం మానవ ఉద్ధరణ కోసమే సకల కష్టాలు అనుభవించాడు – కాని ఇప్పటి ప్రపంచపు తీరు గమనిస్తుంటే – వోల్టేర్ వేదన అర్థంచేసుకోవచ్చు.



వోల్టేర్

ధర్మపురి శేషప్ప కవి –

"అధిక విద్యావంతులప్రయోజకులై
పూర్ణ శుంఠలు సభాపూజ్యులై..." అంటూ

"ఎండిన ఊళ్ళ గోడెరిగింపడెవ్వడు,
పండిన ఊళ్ళకే ప్రభువులంతా.." అంటాడు తన నృసింహ శతకంలో–

ప్రపంచంలోని అన్ని వ్యవస్థలు రెండు స్థంభాల ఆటలోనే మునిగిపోయి వున్నాయి –

ఒకటి డబ్బు – మరొకటి ప్రలోభం – ఎంత సమయం ఎందుకు వృధా అయిపోతోందోనని వ్యధచెందటంలోనే వోల్టేర్ బాధవుంది!

షోపెన్‌హోవర్ – 'మేధావి – కోటికొక్కడు' చదవండి – మనం మేధావి వర్గాన్ని డాక్టర్లు, లాయర్లు, జర్నలిస్టులుగా గుర్తిస్తున్నాము – ఎంత హాస్యాస్పదం!

'నాటకమంటే? భారతీయ దృక్కోణం' – ఎంతో సాంద్రతగల వ్యాసం. ఎనిమిది రసాలను వడకట్టి మనకందించిన తత్త్వసారం – రసోవైసః!

నాటకాన్నే జీవితంగా గడిపిన చాట్ల శ్రీరాములు లేని లోటు ఎలా పూడుతుంది? ఏ శ్రీ లు ఆశించకుండా శలవు తీసుకున్న ప్రయోక్త శ్రీరాములు.

**మిసిమి** పాఠకులకు మరొక అద్భుతమైన – ఆశ్చర్యాన్ని అందిస్తున్నాం – (పుట. 82).

ఇది కూడా చర్చావేదికకు తెరతీస్తుందని ఆశిస్తున్నాము.

ఆలపాటి రవీంద్రనాథ్ 20వ వర్ధంతికి మా స్మృత్యంజలి.

**– సంపాదకులు**



# కమ్మతెమ్మెరలు

❋ "... డిసెంబరు నెల ***మిసిమి*** లో శ్రీ దాశరథి రంగాచార్య గారి *రామాయణ సమాజం* చదివాక అనిపించింది – రామాయణాన్ని గురించి ఎందరో పండితులు, ఏవేవో విషయాలను వారి వారి దృక్కోణాలనించి వారి పాండిత్యాన్నీ, అవగాహననూ వ్రాస్తూ వుంటారు. ఒక విషయాన్ని విశ్లేషిస్తూ రామాయణాన్నించి ఉటంకిస్తూ తమ తమ నమ్మకాలను సమర్థించుకుంటుంటారు. సమాజానికి ఒక ముందు చూపో, వెనక చూపో పాఠకుల మీదికి విసిరి పోతుంటారు. కాని రంగాచార్యవారి లాగ రామాయణాన్ని సామాజిక దృష్టితో, ఇంత ఆధునికంగా వివరించిన వారు అరుదు. సంప్రదాయపరమైన ఎలాంటి భేషజాలూ పెట్టుకోకుండా ఇంత అధునాతనంగా, అతిసామాన్య పాఠకులకూ అర్థం అయ్యేట్టు వివరించిన రంగాచార్యుల వారికి నమస్కరించాలి. ఎలాంటి ఛాందసాలకూ అవకాశమీయని వారి సాహితీసంస్కారం ఉన్నతమయింది. వాల్మీకి దృక్పథాన్ని వారు వివరించిన తీరుకు చేతులెత్తి నమస్కరించాలి...

... రెండవది – ఇదే సంచికలో వరవరరావుగారి *మా జాతి గులాబీ రెమ్మ* శ్రీమతి సరోజినీనాయుడి మీద వొచ్చిన గొప్ప వ్యాసం. సరోజినీదేవిని గురించి ఎందరో వ్రాశారు. కాని వరవరరావుగారిలాగ ఎన్నో తెలియని విషయాలను, ఎవరూ చెప్పనివాటిని, దాపరికం లేకుండా చెప్పిన వరవరరావుగారి పద్ధతి స్వచ్ఛంగా వుంది. ఎంతో ఎరుకతో అఘోరనాథ్ చట్టోపాధ్యాయను గురించీ, సరోజినినీ, ఆమె కుమార్తెలను గురించీ, వారి వ్యక్తిత్వాలూ, వారి పోరాటాల గురించీ – ముఖ్యంగా వారి సాంస్కృతిక వారసత్వం గురించీ ఏమాత్రమూ తెలియని నేటి పాఠకులకు ఈ వ్యాసం గొప్ప కనువిప్పు...

... తెలంగాణ గర్వించదగిన ఈ యిరువురికీ – శ్రీ దాశరథి రంగాచార్యులవారికీ, శ్రీ వరవరరావుగారికీ పాఠకుడిగా నమస్కరిస్తున్నాను..."

**– బి.వి.రామిరెడ్డి,** రుద్రవరం

❋ 1. "... 2016 జనవరి సంచికలో 91వ పుట. *మరాఠీ సాహిత్యపు మణిపూసలు* రచయిత అడ్రసు చివరలో ప్రచురించలేదు. (మిగతా వారి వలె)...

2. ... ఇందులో ఉదహరించిన రెండు గ్రంథాలలో మొదటిది *యయాతి* హెడ్డింగ్ బోల్డుగా కాలం మధ్యలో కొట్టవచ్చినట్లు ముద్రించారు. రెండవది *యుగాంత*ను కూడ అలాగే ముద్రిస్తే (పుట 93) బాగుండేది...

3. ... పుట 7. ఏ.ఆర్. కృష్ణ ఫొటో విడిగా వేసి వుంటే బాగుండేది...

4. ... 'చిత్రము' పేరుతోపాటు 'చిత్రకారుని' పేరు కూడ వుంటే బాగుండేది...

5. ... వాళ్ళకు అభ్యంతరం వుంటే తప్ప రచయితల ఫోను నెంబరు కూడ యిస్తే రచయితలతో పాఠకులు సంభాషించి మరింత దగ్గరవుతారు...




6. వెనుక అట్టమీద కూడ ***మిసిమి*** టైటిల్ పెద్ద అక్షరాలు వేసి సంచిక నెంబరు (312) కూడ వేసి, లోపల కొన్ని వ్యాసాల పేర్లు కూడ రిఫర్ చేస్తే (బొమ్మ పోగా చోటువుంటే), అట్ట వెనుక కూడా అలా చోటు వుంచితే బావుంటుంది. ***మిసిమి*** పత్రికల కట్ట అలమారలోంచి క్రిందపడితే నేను వ్రాసిన పద్ధతిలో వుండి వుంటే 2 నిమిషాలలో వరుసలో పెట్టుకోవచ్చు...

7. ... పత్రిక ఎన్ని కాపీలు, ఎంత ఖర్చు ఎక్కువా/కాదా? ఆ సంగతి పాఠకులకు తెలిస్తే బాగుంటుందా? బాగుండదా? డా. రంగనాయకమ్మ తన భారతం చివర ఈ విషయాలు తెలిపాక ఆవిడ స్వభావాన్ని అర్థం చేసుకోవడం శత్రువులకు కూడా తెలుస్తుంది...

8. వి.ఏ.కె. రంగారావుగారు ప్రతినెల ఒకటి, రెండు పేజీలు వ్రాస్తే అత్తరు అద్దిన పత్రికలాగ వుంటుంది. మేము ఇలా అడిగినట్టు ఆయనకు వ్రాయండి...

9. ... వెల్చేరు నారాయణరావుగారి జవాబు తెప్పించి కలిపి ప్రచురించితే ఇంకా బాగుండేది...

10. ... ***మిసిమి*** సాహిత్య, సంగీత, విజ్ఞాన సమావేశాల పేరు మీద మూడు, నాలుగు పట్టణాలలో సభలు జరిగితే ఎంత లాభం...!"

***– పేరు రాయలేదు***

❋ "... తమ పత్రిక సకాలంలో వస్తున్నది. ఏ నెలకానెల కొత్త పెళ్ళికూతురిలా ముస్తాబై పాఠకుల మనోభావాలు దోచేస్తూ నా కరకమలాలను అలంకరిస్తున్నది. ఇంకా మరింతగా అందరిని అలరించాలని కోరుకుంటూ..."

**– ఏ. సిద్ధయ్య నాయుడు,** కూచివారిపల్లె

❋ "... జనవరి 2016 ***మిసిమి*** సంచికలోని ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్ళకు సదును పెడుతుంది. అనే వాక్యం అద్భుతం. సాహిత్యం ఒక కళలాంటిది. అపురూప రచనల ద్వారా కీర్తి ప్రతిష్టలు అనేవి మానవుని నిరంతర దీక్షతో వచ్చేవిగాని, ఒకరి సహాయ సహకారంతో వస్తే అవి నిలబడవు అనేది. ఏ భాషలోగానీ, లక్షల్లో ఒక పుస్తకం మాత్రమే సాహిత్యంలో ధృవతారగా వెలుగొందుతుంది. *హంపీ నుంచి హరప్పాదాక* రావినూతల సత్యనారాయణగారు, ఆ రోజులలో డా॥ తిరుమల రామచంద్ర గారు తెలుగు భాష కొరకు వారి కృషి అమోఘం..." **– విజయ చౌదరి,** హైదరాబాదు



# వేదిక

"***మిసిమి*** పత్రిక ప్రామాణిక రచనలతో అందంగా వస్తున్నందుకు అభినందనలు.

డిసెంబరు 2015 సంచికలో *దేవాసుర యుద్ధం* వ్యాసంలోని ఒకటి రెండు అంశాలపై నా ప్రతిస్పందన ఈ లేఖకు జతపరచి పంపుతున్నాను. వీలును బట్టి ప్రచురించగలరు. ఆ వ్యాసం పట్ల నాకు వ్యతిరేక ధోరణి లేదు. కుతూహలం మాత్రమే ఉన్నదని స్పష్టం చేస్తున్నాను.

***మిసిమి*** డిసెంబరు 2015 సంచికలో ప్రచురితమైన *దేవాసుర యుద్ధం* లోని కొన్ని విశ్లేషణలపై ప్రతిస్పందన –

"దస్యులు అసుర నేపథ్యానికి చెందిన గ్రామీణ వ్యావసాయిక జనజాతులు అనే ఊహకు అవకాశముంది" అన్నారు. ఆ తర్వాత అసురలపై స్థానిక శక్తుల తిరుగు బాటు ప్రక్రియ గురించి రాస్తూ వైవాహిక సంబంధాలతో ఒనగూడిన రాజకీయ సమీకరణల గురించి చెప్పారు. ఆ సందర్భంలో, "అసురులపై యుద్ధం శ్రమ దోపిడీ వ్యవస్థపై స్థానికుల తిరుగుబాటు అనుకుంటే హైహయులకు రాక్షసుల సహకారం వలసవాదుల ప్రతి చర్యగా భావించవచ్చు" అన్నారు. ఇక్కడ స్థానికులు ఎవరు? వలస వాదులు ఎవరు? గ్రామీణ వ్యావసాయిక జనజాతులలో రెండు వర్గాలున్నాయా? అనే సందేహం కలుగుతుంది. వారు స్థానికులా కాదా? అనేదీ స్పష్టంగా లేదు. శ్రమదోపిడీ వ్యవస్థ అసురులదా? దేవగణాలదా? త్రేతాయుగం గురించి చెబుతూ ఇక్ష్వాకుల ప్రయత్నాలు వివరిస్తూ "సస్యశ్యామలమైన నేలను ఎడారిగా మార్చిన తాటకిని చంపి ఆ భూములను మునుపటి స్థాయికి తేవటం తాటక వధలో ముఖ్యాంశం" అన్నారు. తాటక వధలో ముఖ్యాంశం వర్ణధర్మ పరిరక్షణ – గో బ్రాహ్మణ హితమూను. సేద్యపు వ్యవస్థను అది ప్రతిబింబించదు. తాటకిని చంపించటానికే విశ్వామిత్రుడు రామలక్ష్మణులను తీసుకువెళ్ళాడు. తాటకి బ్రహ్మవరప్రభావం వల్ల జన్మించింది. యక్షి, కామరూపిణి, తాటకి భర్త సుందుడు – అగస్త్యుని వల్ల మరణించాడు. అదేమిటని అడగటానికి వెళ్ళిన తాటకినీ, ఆమె కొడుకునూ అగస్త్యుడు శపించాడు. తాటకి వికృత రూపంతో నరమాంసం తింటూ ఉండవలసి వచ్చిన శాపం అది. ఆమెను రామలక్ష్మణులు (ఇక్ష్వాకు రాకుమారులు) ముక్కు చెవులు కోసి గుండెల్లోకి బాణాలు వేసి చంపారు. "గోబ్రాహ్మణ హితార్థాయ", "చతుర్వర్ణ హితార్థాయ" దేశస్యాస్యసుఖాయచ అంటూ (బాలకాండ 24–26 సర్గలు). తాటకి వధ ఉత్తమం అని విశ్వామిత్రుడు ముని–పురోహిత వర్గ ప్రతినిధిగా రాముని తొందరపెట్టాడు. తాటకి సహస్ర నాగబలం కలది. 'నాగబలం' అంటే ఏనుగుల బలం అని కాదు – నాగుల / నాగ సైనికుల బలం అని అర్థం. నాగులు అసుర వర్గం లోని వారు. తాటకి యక్షి – యక్షులూ అసుర వర్గానికే చెందుతారు. శాపాలతో రాక్షసులయ్యేది వారే. తాటకి వధ వర్ణ ధర్మ వ్యవస్థను క్షత్రియుడైన రాముడు రక్షించటాన్ని సూచిస్తుంది.

తాటకి జీవించి ఉండగా భీకరంగా కనిపించిన ఆ వనం తాటకి చనిపోగానే చైత్రవనంలాగా మనోహరంగా మారిపోవటం విజేతల మానసిక విభ్రమం – ఉద్వేగం మాత్రమే. జయించిన వారే చరిత్ర రాస్తారు అని నానుడి."

**డా. బి. విజయభారతి, హైదరాబాదు.**

# జీనియస్ - కోటికొక్కడు

– ఆర్థర్ షోపెన్‌హావర్



ఆర్థర్ షోపెన్‌హావర్

ఈ లోకంలో కొందరు ధనికులు, కొందరు పేదలు, ఉన్నతోద్యోగాలు చేస్తారు. కూలీ నాలీ పనులు చేసుకుంటారు. కులీనులమంటారు కొందరు. మరెందరో పీడితులు, బహిష్కృతులు. ఇలా ఎన్నో తేడాలున్నా మనుషులు తమ మేధస్సును ఉపయోగించే పద్ధతినిబట్టి మాత్రం రెండు రకాలుగా చూడవచ్చు. కొందరు తమ తెలివితేటల్ని డబ్బు సంపాదన కోసం మాత్రమే ఉపయోగిస్తారు. అతి కొద్దిమంది మాత్రమే “మేధోసంపత్తిని యిటువంటి నీచకార్యాల కోసం వృథా చేయకూడదు. మన చుట్టూ ఎన్ని అద్భుతాలు జరుగుతున్నాయి! ఈ ప్రకృతి వైచిత్రిని అర్థం చేసుకోవలసిన అవసరం లేదా? నా లక్ష్యం ఈ మిస్టరీని అవగాహన చేసుకోవటమే. ఈ క్రమంలో నాకు కలిగిన అనుభవాలను సాహిత్యంలో, కళలో పునఃసృష్టి చేస్తాను” అంటారు. నా ఉద్దేశంలో ప్రతి వ్యక్తీ యిలాగే వుండాలి. నిజమైన వున్నతులు, కులీనులు, మహానుభావులు యిలాంటివారే. మిగతావాళ్ళంతా బానిసలకన్న ఎక్కువేంకాదు. మట్టిలో పుట్టి నామరూపాలు లేకుండా మట్టిలో కలిసిపోయే పిచ్చి మొక్కలలాంటివారే. “నా మేధస్సును ఉన్నత లక్ష్యాలకోసమే వినియోగిస్తాను” అనటానికి ఖలేజా కావాలి. అదొక్కటే సరిపోదు. అందుకవసరమైన మేధస్సు కూడా వుండాలి. ఆ తేజస్సు మాత్రమే అతడికి దారిని చూపిస్తుంది. అంతేనా – త్యాగాలకు సిద్ధపడి ఉండాలి. అయితే అందరూ యిన్ని వదులుకోవటానికి యిష్టపడకపోయినప్పటికీ సుఖాన్వేషణ కోసం మాత్రమే తన బుద్ధికుశలతను వాడుకునే అసంఖ్యాకులకూ, వున్నతాశయాల కోసం జీవితాలను అంకితం చేసే అతి కొద్దిమందికీ మధ్య చెరిపివేయలేని గీత ఒకటి వుంటుందనిమాత్రం చెప్పగలం.

ఒక ప్రత్యేక విషయాన్ని గురించి మాత్రమే అధ్యయనం చేస్తాడా లేదా ఆ విషయము లేదా వస్తువు లేదా మనుషుల మౌలిక స్వభావాలనూ, తద్వారా వాటి సార్వజనీనతలనూ అధ్యయనం చేస్తాడా అన్నదాన్నిబట్టి ఒక వ్యక్తి మేధోపరిణతిని గుర్తించవచ్చు. మెదడుకు పని చెప్పనివాళ్ళు వ్యక్తుల్ని వ్యక్తులుగా మాత్రమే అర్థం చేసుకుంటారు. అతడి ఆలోచనాపరిధి అంతకన్నా మించదు. కానీ జీనియస్సులు వ్యక్తి లక్షణాలను సామాన్యీకరించి మానవ స్వభావాన్ని పరిశోధిస్తారు.

ఈ లోకంలో కళ, కవిత్వం, తత్వశాస్త్రం వగైరాలను సృష్టిస్తున్నది, జనసామాన్యంకన్నా ఎక్కువ మేధస్సు ఉన్నవాళ్ళే.

జీనియస్సుకూ, సగటు మనిషికీ ఉన్న తేడా వివరించడానికి ఓ చిన్న ఉదాహరణ : జీనియస్సు ఆలోచనలకు రెండు పార్శ్వాలుంటాయి. ఒకటి – స్వంత అవసరాలకోసం, మరొకటి ప్రకృతి రహస్యాలను, లోక స్వభావాన్ని తెలుసుకోవటంకోసం. అంటే, సత్యాన్వేషణ కోసం. ఇందుకోసం అద్దంలా పనిచేస్తుంది అతడి మేధస్సు. అతని మేధోమథనసారమే కళ, కవిత్వం, తత్వశాస్త్రం.

సగటు మనిషి, తక్షణ సమస్యల గురించి, కనిపించే విషయాల గురించి తప్ప మరేమీ ఆలోచించడు. అతని మేధస్సు, గ్రహించిన విషయాల ఉపరితల దశలకు మాత్రమే స్పందిస్తుంది. స్వప్రయోజనమే దాని పరిధి. స్వీయ మానసిక దృక్పథం దాని లక్షణం. అయితే, జీనియస్సులు గంభీరమైన, సార్వజనీనమైన సత్యాన్వేషణలో వుంటారు గనుక స్వంత విషయాలలో అశ్రద్ధ కనబరుస్తారు. అందువల్లనే రోజువారీ విషయాలలో సగటు మనిషి ప్రవర్తించినంత చాకచక్యంగా వీళ్ళుండలేరు.

**ఒకరు గొంతు విప్పి గానం చేస్తారు. మరొకరు కూనిరాగాలు తీస్తారు. కచేరీలు చెయ్యగలిగినవాళ్ళకూ, బాత్‌రూం సింగర్స్‌కూ ఉన్నంత తేడా వుంటుందిద్దరికీ.**

శారీరక ఆరోగ్యానికి ఏ రకంగానూ ఉపయోగించని

పరాన్నభుక్కులాంటిది బుద్ధి. అది శరీరంలో ఒక భాగంలా కాక స్వతంత్ర జీవితం గడుపుతున్న జీవిలా తలలో దాగివుంటుంది. మేధావులు, అందరిలా అందరిమధ్యా గడుపుతున్నా మరో జీవితం కొనసాగించటానికిదే కారణం. అది మేధోజీవితం. జ్ఞానాన్వేషణ దాని లక్ష్యం. కేవలం విషయ పరిజ్ఞానం సేకరించటంకోసం గాక, అంతరార్థాలు తెలుసుకోవాలనుకుంటుందది. చివరికి, శరీర పోషణ కోసం కాక, సత్యాన్వేషణలో గడుస్తుంది జీవితం.

ఇలా మేధోజీవితం గడిపినవాళ్ళకు ఒక మంచి ఉదాహరణ గోతే. షాంపేన్ (నగరం) యుద్ధ బీభత్సం మధ్య వర్ణసిద్ధాంతం (Theory of Colour) గురించి ఆలోచించాడాయన. ఆ తర్వాత స్వల్ప విరామం చిక్కినప్పుడు లక్సెంబర్గ్ చేరుకొని తన పరిశోధన ఫలితాలు గ్రంథస్తం చేశాడు. బాహిర ప్రపంచంలో ఎన్ని వింతలు, విశేషాలు జరిగినా ఏవీ మేధోజీవితానికి అడ్డు రాకూడదని మనకు గోతే ఉదాహరణ నిరూపిస్తుంది. మేధావులు, పరిస్థితులకు బానిసలు కారు. నిజమైన స్వేచ్ఛాజీవులు వీళ్ళు. పెనుగాలులను తట్టుకొని ఎప్పటికప్పుడు మధుర ఫలాలను అందించే పళ్ళచెట్టులాంటివాడు జీనియస్.

కేవలం మేధోమథనానికే జీవితం అంకితం చేసిన వ్యక్తి కూడా తన పద్ధతిలో సమాజాన్ని ప్రభావితం చేస్తాడు. అతనిది జ్ఞానభిక్ష. శాస్త్ర, కళారంగాలు అతని కృషి ఫలితమే. అయితే ఇతర రంగాల లాగ వుండదు వీటి అభివృద్ధి. కొన్ని తరాలు, కొన్ని శతాబ్దాలలో అతి నెమ్మదిగా వీటిలో మార్పువస్తుంది. అదృశ్యంగా వుంటూనే సమాజాన్ని ప్రభావితం చేస్తుంది మేధోకృషి. మలయమారుతం వంటిదది. లేదా వినిపించీ వినిపించని సంగీతంలాంటిది. యుద్ధాలతో, రక్తపాతాలతో, అధికార మార్పిడితో చరిత్ర ముందుకు సాగుతుంది. కానీ, మనకు తెలియకుండానే చరిత్ర గతిని మారుస్తాయి. కళలు, సాహిత్యం, తత్వశాస్త్రం, సైన్సు.

జీనియస్సుకూ, సగటు మనిషికీ వున్న తేడా కేవలం సామర్థ్యాన్నిబట్టి, ఎక్కువ తక్కువలుగా అంచనావేశాం. కానీ అసలైన తేడా స్వభావాలలో వున్నది. సగటు జనం అందరూ యించుమించు ఒకేలాగా ఆలోచిస్తారు (మనిషికీ మనిషికీ తేడాలుండకపోవు. కానీ అది యిక్కడ అప్రస్తుతం). ఒకే దిశలో ముందుకు సాగుతారు. ఒకే గీతమీద పయనిస్తారు. అందువల్ల వాళ్ళ నిర్ణయాలు కూడా ఒకేరకంగా వుంటాయి. చాలా విషయాలలో వాళ్ళది ఏకాభిప్రాయమే. అయితే అంతమాత్రంచేత వాళ్ళందరూ సత్యాన్వేషకులనీ, అందరూ ఒకే సత్యాన్ని కనుగొన్నారనీ కాదు. కానీ మేధావులు దేనిగురించైనా స్వంతంగా ఆలోచిస్తారు. గుణగణాలు పరిశీలిస్తారు. ఎవరి దారిలో వారు నడుస్తారు. అందువల్ల సగటు మనుషుల్లాకాక, వీళ్ళు స్వంత లక్ష్యాలను ఎంచుకొంటారు.

జీనియస్సు బుద్ధి అద్దంలాంటిది. అందులో లోకం ప్రతిఫలిస్తుంది. సగటు మనిషి బుద్ధిలాగ. ఈ అద్దంమీద మరకల్లేవు. అందువల్ల లోకం యిందులో మరింత విస్పష్టంగా, తేటగా కనిపిస్తుంది. మార్గనిర్దేశనం కోసం మానవాళి అతనివైపు ఆశగా చూస్తుంది. లోకస్వభావాన్ని, నిగూఢ రహస్యాల్ని అవగాహన చేసుకున్నాడతడు. ఏ కళా రూపంలోనైనా, ఏ తాత్విక బోధలాగైనా మరే రూపంలోనైనా అతను మార్గనిర్దేశనం చెయ్యవచ్చు. జీనియస్సంటే, ఒక్కమాటలో అన్నింటి గురించీ స్పష్టత వున్నవాడు. స్పష్టత లేని వ్యక్తులకు చివరికి తనకు తాను కూడా వ్యతిరేకం.

అందువల్ల, లోకం అతడివైపు చూడటంలో ఆశ్చర్యం లేదు. అయితే ఒక జీనియస్ ప్రభవించటానికి అనేక విషయాలు కలిసిరావాలి. అంటే యిది చాలా అరుదుగా జరుగుతుంది. అలాంటివాడు శతాబ్దంలో ఒకడు పుట్టినా గొప్పే. అయితే ఒక జీనియస్ తమ మధ్యనే వున్నాడన్న విషయం అతడి జీవిత కాలంలో ఎవరూ గుర్తించలేకపోవచ్చు. అసూయా, ద్వేషాలు వాళ్ళ దృష్టిని కలుషితం చేస్తాయి. కానీ ఈ సంకుచితత్వం సమసిపోయిన తర్వాత జ్ఞానదీపం తమ మధ్యనే వుందని గ్రహిస్తారు జనం. తమ మధ్యనే ఉన్నాడు. కానీ తమకన్నా ఉన్నతుడు. అతని మేధోసంపత్తిలోని ఒక లేశం మాత్రమే సగటు మనిషికి చేరుతుంది.

**ఒక్క క్షణం మనం ఈ లోకంతో సంబంధం లేదన్నట్టుగా భావించుకొన్నామనుకోండి. పరిసరాలన్నీ కొత్తగా, వింతగా కనిపిస్తాయి. రోజూ చూసిన మనుషులు కూడా అపరిచితులనిపిస్తారు. అదో అపూర్వ అనుభవం. అయితే, జీనియస్సుకు తప్ప సగటు మనిషికి యిలా చూడగలగటం అసాధ్యం.**

మరో విషయం. జీనియస్సు కూడా తనకై తాను కొత్తగా ఏమీ ఆలోచించలేడు. స్త్రీ తనకై తాను పిల్లల్ని కనలేనట్టుగా బాహిర ప్రపంచంతో సంబంధం పెట్టుకోవటం ద్వారా

మాత్రమే అతడి ఆలోచనాధోరణికి పరిపక్వత వస్తుంది. రంగు రాళ్ళ మధ్య తళుక్కున మెరిసిన మరకతమణి లాంటిది జీనియస్ మేధస్సు. అది స్వయంప్రకాశం. కాంతి పరావర్తనం చెందటంవల్ల వెలుగుతారు సామాన్యులు, ఒకరు విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. మరొకరు దానికి వాహకాలు మాత్రమే.

పుస్తక జ్ఞానం సంపాదించిన పండితుణ్ణి జీనియస్ అనటం సమంజసం కాదు. అతడు విద్యుత్తు ప్రసారం చేస్తాడు. ఉత్పత్తి చేయడు. పాటకు సాహిత్యంలాంటివాడు జీనియస్. పండితుడు చాలా నేర్చుకున్నాడు నిజమే. కానీ అదంతా జీనియస్సుల భిక్షేగదా. అతడు ఎవరినుండి నేర్చుకోలేదు. జీనియస్‌లు కోటికొక్కరున్నా గొప్పే. మానవాళికి లైట్‌హౌజ్‌లు వాళ్ళు. జీనియస్ లేని మానవాళి అడవిలో తప్పిపోయిన అనాథ అవుతుంది.

అందువల్ల పండితుడు అంటే మనకు తెలిసిన ప్రొఫెసర్లకు జీనియస్ కుందేలులా కనిపిస్తాడు. చంపి తినటానికే పనికొస్తాడు. అతడు బతికున్నది ప్రొఫెసర్ల చేత చంపబడటానికే.

*సమకాలికుల అభిమానాన్నీ, కృతజ్ఞతనూ పొందాలనుకునేవాడు – వాళ్ళతో రాజీపడటానికి సిద్ధపడాలి. కానీ యిలా చెయ్యటంవల్ల గొప్ప రచనలు జరిగే అవకాశం లేదు. అందువల్ల మహాకావ్యం రాయదలచుకున్నవారెవరైనా ముందు తరాలను మాత్రమే దృష్టిలో పెట్టుకోక తప్పదు. ఇలా చెయ్యటంవల్ల అతడు సమకాలికుల మధ్య అనామకుడిగా ఉండిపోతాడన్నది కూడా స్పష్టమే. సముద్ర మధ్యంలో ఒక ద్వీపం మీద ఒంటరిగా బతికి ఒక దీపస్తంభం నిర్మించినట్టుగా నావికులకు మాత్రమే ఉపయోగపడుతుందా వెలుగు. ఇది దురదృష్టమనుకోవద్దు. సమకాలికుల కరతాళ ధ్వనుల మధ్య బతికినవాడు కొద్దిరోజుల్లోనే ఊరూ పేరూ లేకుండా పోవటంలేదా? పాపం, కష్టపడ్డాడతడు. చాలా సంపద ఉత్పత్తి చేశాడు. నలుగురికీ సాయపడి కూడా వుంటాడు. కానీ మరణానంతరం అతన్నెవరు గుర్తుపెట్టుకుంటారు. వారసులకు ఆస్తి దక్కుతుందేమోగాని అతడికి పేరు దక్కుతుందా?*

ఒక వ్యక్తి ఆలోచనలు అతడి తర్వాత కూడా బతికుండటమంటే, అంతకన్నా అభిలషణీయమేముంటుంది? జీనియస్‌కు అదే సాంత్వన. సమకాలీనుల గందరగోళానికి దూరంగా తన స్వంత మేధాలోకంలో బతకటమే అతడు చెయ్యగలిగిన పని, తను రాబోయే తరాలకు అందించగల సంపద అదే. శిలాజంలాగ దాన్ని అందిపుచ్చుకుంటారు భవిష్యత్ మానవులు (ఈ అనుభవానికి ఉదాహరణగా బైరన్ రాసిన 'Prophecy of Dante' ను ప్రస్తావిస్తాడు షోపెన్ హోవర్).

జీనియస్‌దెప్పుడూ ఏకాంత జీవితమే. కాకపోతే, అజరామరమైన కళాఖండాలు సృష్టించటమే అతనికి సాంత్వన. తరువాతి తరాలవాళ్ళు వాటిని ఆస్వాదిస్తారు. ఆ ప్రతిభకు అబ్బురపడతారు. 'జీనియస్ – మహానుభావుడు' అంటే అర్థమేమిటి? అతడు అతి సాధారణమైన మనుషులమధ్య జీవించినట్టేగదా. అతడు మహాకాయుడంటే యితర్లు మరుగుజ్జులన్నమాట. తరువాతి తరాలవాళ్ళు అతని కళాఖండాలను ఆస్వాదించారంటే సమకాలికులు అభిరుచి లేని మూర్ఖులన్నమాటే. ఒక మనిషి శిఖరం మీదున్నాడంటే, మిగతావారంతా పర్వత పాదాలవద్దే వున్నారని అర్థం.

జీనియస్‌లు నలుగురితో కలుపుగోలుగా వుండకపోవటానికి యిదే కారణం. పలకరించినా చిరాకు పడతారు. ముక్కోపులుగా కనిపిస్తారు. పచ్చికబయళ్ళలో మార్నింగ్‌వాక్ వెళ్ళిన వ్యక్తిలాంటివాడు జీనియస్. చుట్టూ వున్న ప్రకృతి సౌందర్యంలో మైమరచిపోతాడు. కాని పలకరించాలంటే, అందరూ పంటపొల్లాలో పనులు చేసుకుంటున్న రైతుకే కనిపిస్తారు. అతడిలాంటివాడికి వాళ్ళతో మాట్లాడటానికేముంటుంది? అంటే నలుగురిలో వున్నా ఒంటరి. అతడు ఏకాంతాన్ని ఎంచుకోవటానికిదే కారణం.

జ్ఞానులు వినయ సంపన్నులు కావాలని కాంక్షిస్తుంది లోకం. కాని, దురదృష్టవశాత్తూ జీనియస్ తన అభిప్రాయాలను దాచుకోలేడు. ఎవరికిష్టమున్నా లేకున్నా, సహేతుకంగా వివరిస్తూనే వుంటాడు. తను తెలుసుకున్నదంతా వాళ్ళూ తెలుసుకోవాలని ఆయన తాపత్రయం. జనం తన మాటల్ని, సలహాలను విస్మరించినా, గేలి చేసినా అతను లెక్కచెయ్యడు. తన నిజాయితీని ఎవరికీ నిరూపించుకోవలసిన అవసరం లేదు. తనకు తానే జవాబుదారీ. చీకటి పడిన తర్వాత కనీస సౌకర్యాలు కూడా లేని ఒక సత్రంలో విశ్రమించి, తెల్లవారగానే తన దారిన తాను వెళ్ళిపోయే పథికుడతడు.

బుద్ధిని భుక్తి కోసం ఉపయోగించటం అందరూ చేసేపనే. ముఖ్యంగా శారీరక శ్రమ చేసేవాళ్ళకిది ఎక్కువగా వర్తిస్తుంది. వీళ్ళలో అసంతృప్తి కూడా వుండదు. కానీ

మేధావుల పరిస్థితి వేరు. తమ సామర్థ్యాన్ని కేవలం తిండి, యితర సౌందర్యాలకోసమే వెచ్చించాలా? ఇంతకన్నా ఈ జనసందోహం నుండి దూరంగా, ఒంటరిగా బతికినా మేలనుకొంటారు. వాళ్ళక్కావలసింది మేధోపరిస్థితిని పెంచుకోవటం మాత్రమే. అందుకోసం, విరామం కావాలి అతడికి.

కానీ సగటు మనిషికి 'విశ్రాంతి'తో ఏం చేసుకోవాలో తెలియదు. పైగా యిది ప్రమాదకరంగా కూడా పరిణమిస్తుంది. సుఖవిలాసాల కోసం నిత్యం వందలు వేలుగా రకరకాల వస్తువులు ఉత్పత్తి అవుతూనే వున్నాయి. విశ్రాంతి అంటే విలాస జీవితమా లేక మేధోజీవిత విహారమా అని ప్రశ్న వచ్చినప్పుడల్లా వీళ్ళు సుఖాలనే ఎంచుకుంటారు. ఆలోచనల స్వేచ్ఛ ఎందుకు మద్య ముండగా అనుకుంటారు. పైగా మేధోజీవితం గడిపేవాళ్ళను 'తిక్క మనుషు'లని తృణీకారంగా చూస్తారు. వీళ్ళక్కావలసింది పంచభక్ష్య పరమాన్నాలు. హంసతూలికాతల్పాలు, మదిర, మగువ. జీవితమంటే వీళ్ళకు తెలిసిన అర్థం అదే.

కానీ మార్గాంతరం కూడా లేదు. భౌతికావసరాలు తీర్చుకోవటానికి అవసరమైనంత బుద్ధి మాత్రమే ఉంటుంది వీరికి. ఎలాగొలా కష్టపడి, కొంత సంపాదించుకున్న తర్వాత యిక అనుభవించటంతప్ప మరే లక్ష్యమూ కనిపించదు. ఇంతకు మించిన మేధస్సు వున్నవాళ్ళెంతమంది ఈ లోకంలో. కానీ వున్న కొద్దిమందికీ మేధోజీవితమే ఆనందధామం. నిత్య జీవిత సుఖాలు వాళ్ళను ఆకర్షించవు. తమ ఆనందం కోసం ఏదో కళను అభ్యసిస్తారు. ఒంటరిగా ఉన్నామనిపిస్తే సగటు మనుషుల సాంగత్యంకన్నా కుక్కను పెంచుకొమ్మని సలహా యిస్తాను. భౌతిక సుఖాలే అంతిమ లక్ష్యమనుకున్న మనుషులకన్నా యివి ఏ విధంగా తక్కువ?

అయినప్పటికీ, మనం న్యాయంగా మాట్లాడుకోవాలి. నా కుక్క తెలివితేటల్నీ, మూర్ఖత్వాన్నీ చూసి అప్పుడప్పుడూ ఆశ్చర్యమేస్తుంది. మనుషులతో కూడా నాకు యిలాంటి అనుభవమే ఎదురైంది. అందుకే కాబోలు, తప్పు చెయ్యటం మానవ సహజమంటారు.

అయితే, మానవజాతి తప్పులు చేస్తే చేసుండవచ్చుగాని కళా, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎన్ని అద్భుతాలు సాధించింది! ఎంత సౌందర్యసృష్టి చేసింది! కొద్దిమందే వుంటారు మహానుభావులు. వాళ్ళు చూపిన దారిలో పయనించటానికి ప్రయత్నిస్తాం. హోమర్, ప్లేటో, హోరేస్ లాంటివాళ్ళు మన సమిష్టి సంపద. వాళ్ళు కనుమరుగు కాకుండా చూసుకోవటం మన బాధ్యత. ఎన్ని ఘోరాలు జరగనీ, ఎన్ని విపత్తులు రానీ వీళ్ళను మనం పదిలపరచుకోవాలి. జనసామాన్యం వీళ్ళ గొప్పతనం తెలుసుకోవాలి.

మానవాళికి జీనియస్సులు మట్టిలో మాణిక్యాల్లాంటివాళ్ళు. ఈ స్థితిని చేరుకోవటానికి వాళ్ళు ఎన్ని త్యాగాలు, మరెన్ని పోరాటాలు చెయ్యాలో! "ఒకణ్ణి జీనియస్ చెయ్యాలనుకుంటే అతడిమీద ఓ ముద్రవేసి, పంపిస్తుంది ప్రకృతి" అంటాడు అరియాస్టో.

అయితే ప్రకృతిలో వైరుధ్యాలు కూడా సహజమే. వ్యక్తిలో ఎంత ప్రత్యేకత, ఎంత విలక్షణత వున్నా అతడికొన్ని బలహీనతలు కూడా వుంటాయి. మేధోపరంగా సంకుచితత్వం కూడా వుండొచ్చు. ఎంత శక్తివంతుడో అంత శక్తిహీనుడు. అందరికీ ఒకే రకమైన బలహీనతలుండవు. ప్లేటో బలహీనతే అరిస్టాటిల్ బలం కావచ్చు లేదా గోతె బలం కాంట్ (తత్వవేత్త) బలహీనత కావచ్చు.

ఒక వ్యక్తినో, ఒక భావాన్నో ఆరాధించటం మానవ స్వభావం. అయితే వీళ్ళు తరచూ అర్హత లేనివాటినే ఆరాధించటానికి యిష్టపడుతుంటారు. ఎప్పుడో, ఎవరో వచ్చి చెప్పిందాకా ఈ పరిస్థితి యిలాగే కొనసాగుతుంది. గౌరవించటం వేరు, ఆరాధించటం వేరు. తెలివైనవాళ్ళు గౌరవిస్తారు. సగటు మనుషులు రాళ్ళు రప్పలతో సహా దేనికైనా మొక్కటానికీ, పూజలు చెయ్యటానికీ యిష్టపడతారు. ఒక వ్యక్తి గురించి ఏమీ తెలియకపోయినా, మహా పురుషుడని ముద్రపడితే చాలు, అందరూ అతడి ముందు మోకరిల్లుతారు. క్రిస్టియన్లు సెయింట్లనూ, బౌద్ధులు పవిత్ర దంతాన్నీ, పాదముద్రల్నీ బుద్ధుడు నాటాడని చెప్పిన మొక్కల్నీ యిలాగే పూజిస్తారు. ఇది కేవలం విశ్వాసం. అంతే తప్ప మహానుభావుల బోధనలను తెలుసుకోవాలనీ, అర్థంచేసుకొని, చర్చించి, స్వంత నిర్ణయాలు తీసుకోవాలనీ ఎవరూ ప్రయత్నించరు. ఆర్కాలో వున్న పెట్రార్క్ (నివసించిన) యిల్లు; ఫెరారోలో టాసో (నిర్బంధించబడిన) జైలు, స్ట్రాట్‌ఫర్డ్‌లోని షేక్స్‌పియర్ యిల్లు, (ఆయన కూర్చున్న) కుర్చీ, వైమార్‌లోని గోతె యిల్లు, కాంట్ పెట్టుకున్న హ్యాట్, ప్రముఖుల ఆటోగ్రాఫులు ప్రత్యేకమైన విలువ సంతరించుకోవటానికి యిదే కారణం. వాటిని చూస్తే వీళ్ళకు భయం, భక్తీ ఏకకాలంలో

పొంగి, వరదలైపారతాయి. దండాలు పెట్టి, మొకరిల్లటంకన్న ఎక్కువ ఏమీ చెయ్యలేరు మరి.

ఈ మహానుభావులు వాడిన వస్తువులను చూసి మనిషినే స్వయంగా చూసినంత ఆనందపడిపోతారు మరికొందరు. ఆయన అంశ ఏదో యింకా వాటిని అంటుకొని వుందనుకొంటారు. అతి కొద్దిమంది మాత్రమే ఈ మహానుభావుల రచనల్ని, వాళ్ళ జీవిత కృషిని అధ్యయనం చెయ్యటానికి ప్రయత్నిస్తారు. ఒక తత్వవేత్త జీవిత చరిత్ర మాత్రమే చదివి సంబరపడటమంటే, బొమ్మనుకాక, ఫ్రేము మాత్రమే చూసి ఆనందిస్తామన్నట్టుంటుంది. కొన్ని బొమ్మలకు బంగారు ఫ్రేము కూడా వుండవచ్చు. కానీ అది బొమ్మకన్న ముఖ్యం కాదుగదా!

ఇక, మరోరకమైన "మహా మేధావు"లుంటారు. రంధ్రాన్వేషణే వాళ్ళ లక్ష్యం. తరతరాలుగా సమాజాన్ని ప్రభావితం చేసిన ఒక మహానుభావుడున్నాడు. కానీ "అతడు అంత మచ్చలేని మనిషా? ఏ లోపమూ ఉండకపోతుందా? వెదికితే, పరిశోధిస్తే ఒక్క చిన్న బలహీనతైనా దొరక్కపోతుందా? చంద్రునిలో కూడా మచ్చ వుందే. ఇతనిలో ఎందుకుండదు?" ఇదీ వాళ్ళ ధోరణి. అలా, ఏదో ఒకటి వుందని నిరూపించి, నిరర్థక జీవితాలు కూడా ఆ మహానుభావునికన్నా ఏమీ తీసిపోవని ఆత్మవంచన చేసుకుంటారు.

మేధావుల్లో మెతకలు వెదికేవారు – వీళ్ళు రాసే పుస్తకాలు, పరిశోధనలు, సమీక్షలు, చేసే ఎడతెగని చర్చల అంతిమ లక్ష్యమిదే. గోతె ఎందుకు త్వరగా పెళ్ళిచేసుకోలేదు? ఆశ్రయమిచ్చిన డ్యూక్ గారి సేవలో గడపక ప్రజలపక్షం ఎందుకు వహించాడు? గోతె జీవితానికి వీళ్ళు న్యాయనిర్ణేతలా? ఇంతకన్న నీచత్వం, దిగజారుడుతనం మరేముంటుంది? 'ఆత్మలోకంలో దివాళా' అంటే యిదే.

*(ప్రతిభావంతులు, డబ్బు, కీర్తి కావాలని ఆశించవచ్చు. కానీ జీనియస్ ఏమాశిస్తాడో చెప్పటం కష్టం. అతడు సాధించినదానితో పోలిస్తే డబ్బు చాలా తుచ్ఛమైందనిపిస్తుంది. ఇక, కీర్తి గురించి మాట్లాడుకోవలసిన అవసరమే లేదు. అసలు 'కీర్తి' అంటే ఏమిటో ఎవరికీ తెలియదు. అది నిరుపయోగం కూడా. కేవలం నలుగురి నోళ్ళలో నానటం కోసం, నాలుగు మంచి మాటలకోసం ఎవరూ జీవితాన్ని పణంగా పెట్టరు.*

అంటే, చివరికి, అది ఆత్మానందమే. ఒక పనిచేయటం వల్ల కలిగే తృప్తి, ఆనందంతో పోలిస్తే, డబ్బు, కీర్తి, ఎందుకూ కొరగావు. జీనియస్ ఒక సంకల్పం చేసుకున్నప్పుడు, యిది తప్ప, అతడు మరేమీ ఆశించడు. చెట్టు పళ్ళెందుకు కాస్తుందంటే ఏం చెబుతాం? వేళ్ళు నిలదొక్కుకోవటానికి నేల తప్ప దానికి మరేమీ అక్కర్లేదు. జీనియస్ ప్రసరించే వెలుగు, మానవాళిని కమ్ముకొన్న అంధకారాన్ని పటాపంచలు చేస్తుంది. సగటు మనిషిలో వున్న సుప్త చైతన్యాన్ని జాగృతం చేస్తుంది.

బహుశా, యిలాంటి ప్రేరణ ఏదో జీనియస్‌ను కార్యోన్ముఖుణ్ణి చేసే అవకాశముంది. అంతే తప్ప, కీర్తి, కరతాళధ్వనులూ కావు. ఒకసారి పయనం ప్రారంభమైతే, యిక అతడు తనకేమవుతుందోనని కూడా ఆలోచించడు. సమకాలికుల గురించిగాక, భవిష్యత్ తరాల శ్రేయస్సు అతడికి ముఖ్యం. "సమకాలము వారలు ఎట్లాగూ మెచ్చరు."

మరణానంతరమైనా, మరో వందేళ్ళకైనా ఎవరో ఒకరు తనను అర్థంచేసుకోలేకపోతారా? అన్నదే అతనికున్న చిన్న ఆశ. గోతె ఒక కళాకారుడి గురించి చెప్పినట్లుగా "అతడికి మహారాజపోషకులు లేరు. ప్రోత్సహించి, వెన్నుదట్టే మిత్రులు లేరు."

కృషి అతనికి పవిత్రం. అది అతని జీవఫలం. ఆకలిగా వున్న ముందుతరాలవాళ్ళ అవసరం తీరుస్తుందది.

ఈ లక్ష్యంతో అతడు సంతోషంగా ముళ్ళకిరీటం ధరిస్తాడు. అదే ఒకనాడు పూలమాలగా మారుతుందని తన విశ్వాసం. ప్రారంభించిన పని పూర్తి చెయ్యటం తప్ప మరో ధ్యాస ఉండదు. కీటకం తను బతకనని తెలిసి గుడ్లను మాత్రం క్షేమంగా భద్రపరుస్తుందే అలాంటిది జీనియస్ జీవితకృషి. కొన్నాళ్ళకు ఆ గుడ్లు పొదిగి, తన ప్రతిరూపాలు తిరిగి ఈ లోకంలో వృద్ధికాకపోవచ్చు!

*(ఇంత చక్కని వ్యాసాలను ప్రచురణకు ఎంపిక చేసినందుకు సంపాదకవర్గానికి అభినందనలు. దీనిని తెలుగులో చెప్పే అవకాశం యిచ్చినందుకు కృతజ్ఞతలు.)*



తెలుగు సేత :
ముక్తవరం పార్థసారథి
హైదరాబాదు.
ఫోన్ : 91 77 61 87 08

# నాటకం అంటే?...
## 'భారతీయ' దృక్కోణం

– ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ

నాటకం అంటే? అన్న ప్రశ్నకు ప్రపంచవ్యాప్తంగా అనేక వివరణలు, నిర్వచనాలు ఉన్నాయి. పాశ్చాత్య దృక్పథాలకంటే ప్రాచ్యదృక్పథం, అందులో 'భారతీయ' దృక్కోణం మరీ భిన్నమైంది. 'భారతీయ' అనడంతో, భరతాచార్యులమతమూ, వారికి నేపథ్యంగా ఉన్న భరతావని దృక్పథమూ రెండూ సంకేతింపబడుతున్నాయి.

నాటకానికి 'అనూహ్యత' ప్రాణం. ఊహ, భావన సర్వ మానవ లేదా సర్వ ప్రాణి సహజం. ఆకాంక్ష ముందుకు కదిలి 'భావన'గా, 'ఊహ'గా స్పష్టాస్పష్టమైన ఆకృతి ధరిస్తుంది. ఎప్పుడైతే ఆకాంక్ష, ఊహగా మారుతుందో, అప్పుడు ప్రత్యాకాంక్షలు లేదా ప్రతీక్షలు (వీటినే మనం ఇంగ్లీషులో expectations అంటుంటాం) కూడా మొదలవుతాయి. మన ప్రతీక్షలకు అనుగుణంగానే అన్నీ సాదాసీదాగా జరిగి మన ఆకాంక్షలు నెరవేరి ఫలరూపం ధరిస్తే వాటిని సహజంగా తీసుకొంటాం. అలాకాక అనుకోని మలుపులు తిరిగి 'అనూహ్య' పరిణామాల మధ్య సంభవిస్తే 'నాటకీయంగా' జరిగిందంటాం. రంగస్థలమ్మీదే కాదు, బయటి, సామాన్య జీవితంలో కూడా మనం విరివిగా వాడే మాటే ఈ నాటకం. ఇక్కడ 'నాటకం' అంటే అనూహ్యతనే ఉద్దేశిస్తున్నాం. ప్రతీక్షలకనుగుణంగా ఫలరూపం ధరిస్తే, వాస్తవిక ప్రతీక్షలకు అతీతంగా అనూహ్య ఫలరూపం సంభవిస్తే నాటకీయత. రెంటికీ ఆకాంక్షే – బీజం. ఆపైన భావనాక్రమమంతా నాటకంలో భాగమే. భావనలు, భావానుభావాలు వాటి పరిణామ 'సంభవా'లు అన్నీ నాటకంలో భాగమే. 'అనూహ్య'తే దాని ప్రాణం.

ఈ 'అనూహ్యత'ను పూర్వ కావ్య శాస్త్రవేత్తలు వైచిత్రి, వక్రత అని పలువిధాలుగా వ్యాఖ్యానించి నిర్వచించారు. వారి నిర్వచనాలు మొత్తం కావ్య శాస్త్ర పరిధికి సంబంధించినవి. అందులో ఒక భేదమైన, అన్నిటికన్నా అత్యుత్తమ భేదమైన నాటకానికి మాత్రమే పరిమితంచేసి చూస్తే దాన్ని "ఘటనావైచిత్రి" అనడం అత్యంత సమంజసంగా ఉంటుంది.

కథావస్తువుతో సంబంధం లేని ముక్తకాల (individual pieces)వంటి ఆధునిక కవితల్లాటి అనుభూతి ఖండికల విషయం పక్కనపెడితే మొత్తం సృజనాత్మక సాహిత్య ప్రపంచంలో ఈ ఘటనావైచిత్రిని కల్పించడమే సృజనకు పెద్ద ఛాలెంజ్, అసలైన సవాలు. సృజన సామర్థ్యానికి 'బీజం' అక్కడే ఉంది.

'ఘటన'ను బట్టి పాత్ర. ఘటన+పాత్ర శీలాన్ని (స్వభావాన్ని)బట్టి కథ, అంటే ఘటననుబట్టే కథ, శిల్పం, వగైరాలన్నీ. ఈ 'ఘటన'ను పరోక్షంగా కొంత భరతాచార్యుడు తప్ప భారతీయ కావ్యశాస్త్రకారులెవరూ తగినంత నేరుగా చూడకపోవడం ఒక పరిమితి. అరిస్టాటిల్‌తోపాటు పాశ్చాత్య శాస్త్రకారుల్లో కూడా పరోక్ష వీక్షణే ఉంది. 'ట్రాజెడీ' మీద మధ్యయుగాలలో తాత్త్విక చింతన పెరిగేకొద్దీ, ఘటన మీద కూడా ఆ పరోక్ష వీక్షణ కూడా పెరుగుతూపోయింది. అయితే వారి మతచింతనలో 'విధి' అత్యంత ప్రభావస్థానం ఆక్రమిస్తుండటంవల్ల, సామ్యవాద దృక్పథంతో ప్రభావితుడైన బ్రెఖ్ట్ వరకు 'విధి'కి సంబంధించిన మత పరిమితులకు లోబడే వారి ఘటన అనుశీలన కూడా సాగింది.

"వైరుధ్యాల మధ్య సంఘర్షణవల్ల అనూహ్యంగా రూపొందే ఘటనావైచిత్రే నాటకం" అని స్థూలంగా నిర్వచించుకొందాం*. కనుక నాటక కథానిర్మాణంలో 'ఘటన' కేంద్రస్థానం ఆక్రమిస్తూంటే వైరుధ్యాలు, సంఘర్షణ వాటి పూర్వ రంగాన్ని ఆక్రమిస్తాయి. నాటక కథానిర్మాణంలో ప్రాణ భూత లక్షణాలు ఈ మూడే – వైరుధ్యాలు, సంఘర్షణ, ఘటన. వాటిని చిత్రంగా తిప్పుతూ నాటకీయత కలిగించే అంశం – 'అనూహ్యత'.

ఒకవిధంగా కాంక్ష, దాని అనుక్రమరూపమైన ఊహ

* ఈ నిర్వచనాన్ని నేనే డా. విజయభాస్కర్ గారి గాంధీజయంతి, మూడు నాటికలు ముందుమాటలో ఇచ్చాను.

మానవుడి సొత్తు. అయితే 'అనూహ్యత' విధి లీల కావచ్చు. రెంటి సన్నికర్షే జీవన్నాటకం కాబోలు. అదృష్టవంతులకు సుఖాంతం. దురదృష్టపీడితులకు దుఃఖాంతం. ఏదేమైనా ఈ సన్నికర్షే జీవితం.

ఈ ఘటనావైచిత్రి ఒక విస్ఫోటం. ఈ విస్ఫోటానికి రెండు కారణాలు కావచ్చనుకొంటాడు అరిస్టాటిల్. వాటిని అసాధ్యత (impossible), అసంభావ్యత (improable)లని వ్యవహరిస్తాడు. ఇవి ఆయన నాటకతత్త్వ వివేచనలో అత్యంత కీలకమైన పదాలు. ట్రాజెడీని ఆయన కానీ ఆ కాలపు గ్రీకులు కానీ ఆ తర్వాతి యూరోపియన్లు కానీ అంత తలపై పెట్టుకోవడానికి, వారి చింతనలో పై పదాలకు, పరికల్పనల (concept)కు ఉన్న స్థానమే కారణం. వాటి ప్రభావ ఫలితమే జీవన అనూహ్యత, ఘటనావైచిత్రి. అసాధ్యత అసంభావ్యతల్లో రెండవదానికంటే మొదటిది శ్రేష్ఠమని అరిస్టాటిల్ భావన. వాటి వివరణలు, తులనాత్మక పరిశీనలలు, మరో చర్చకు వ్యాసానికి సంబంధించిన అంశాలు.

ఈ ఘటనను, విధిని భారతదేశంలో చూసే విధానం వేరు. ఆధునికులు తరచూ ఈ మాటలను స్మరించి, తమ దుర్విధికి, ప్రాప్తించిన దుర్ఘటనకు తల బాదుకొన్నా, ప్రాచీన తత్వశాస్త్ర అనుశీలనలో వీటి ప్రమేయం తక్కువ. వీటికే పట్టంకట్టి తత్వశాస్త్రానికి అనువర్తిత రూపమైన నాట్యశాస్త్రం కూడా తన సిద్ధాంత పరిశీలనను సాగించలేదు. కథానిర్మాణం లేదా కథానుసంధానానికి సంబంధించిన అంశాలుగా మాత్రమే పరిమితంగా వాటిని అనుశీలించింది. అంతకు మించిన నేపథ్యంలో నాటకతత్త్వ పరిశీలనను సాగించింది. ఆ పరిశీలనకు సంబంధించిన అన్ని అంశాలను సాకల్యంగా చూడటమంటే పెద్ద గ్రంథమే అవుతుంది. ప్రస్తుత వ్యాసం ఒకటి, రెండు పరికల్పనల (concepts) వివరణలకు మాత్రమే పరిమితమవుతున్నది. అందులో ప్రధానంగా రసభావాల వివరణలకు! ప్రపంచ నాటకరంగంలో భారతీయ నాట్యశాస్త్రం అనన్యంగా నిరూపించిన అంశాలలో రసభావాలు ప్రథమ స్థానంలో ఉంటాయి.

* * *

**ఈస్థటిక్స్ : అనువర్తిత తత్వశాస్త్ర భేదం**

'తత్త్వము కవిత్వమునకు పెద్దన్న' అంటారొకచోట మహాకవి వేలూరి శివరామశాస్త్రిగారు. తత్వశాస్త్రం సాహిత్యాలు ఒకే వారసత్వాన్ని అందిపుచ్చుకొన్న అన్నదమ్ముల్లాంటివి. రెండూ భావనా జగత్తుకు సంబంధించినవే. వాస్తవానికి భావనతో నిండుతనం కలిగించడానికి కృషిచేసేవే. పెద్దన్న గంభీరంగా ఉంటాడు. తమ్ముడు కాస్త ఉల్లాస విలాసంగా ఉంటాడు. చేస్తున్న ఊహలు, చెబుతున్న మాటలు ఇహజీవన సౌందర్యానికి సంబంధించినవైతే సాహిత్యం – సత్యం, శివం, సుందరం క్రమంలో పరాన్ని ప్రతిపాదించేదయితే – తత్వశాస్త్రం. ఇహానికి పరం పూరణ, పరానికి ఇహం ఆలంబన.

ఇహ–పరాలు రెండూ సమాంతరాలు. సమాంతరాల 'పూర్ణ మదం, పూర్ణ మిదం' అంటూ ఈశోపనిషత్తు పరోక్షంగా చెప్పింది దీన్నే. సమన్వయంలోనే మానవ జీవనసౌందర్యం ఉంది. ఇహ సౌందర్యాన్ని ఇనుమడింపచేసే విద్యలన్నీ కళలు. పరసుందరాలను దర్శింపచేసేవి తత్త్వాలు, తత్వదర్శనాలు. మొదటివాటికి రెండవది ఆత్మ. రెండోవాటికి మొదటిది ఆకారం. ఆకృతి రూప విశేషాలను చర్చించే శాస్త్రం – Aesthetics. దీన్ని మనం కళామీమాంస అని పాక్షిక అర్థంలో మాత్రమే అనువదించుకొన్నాం (దీని వివరణలకు The Story of Philosophy చూడండి పుట. XXVII). ఆత్మస్వభావ విశేషాలను వివరించేది Philosophy తత్వమంటున్నాం. ఆత్మ అంటే, ప్రతి దానిలోనూ అంతర్లీనంగా ఉంటూ దాన్ని నడిపించే స్వభావ చేతన. కేవలం ఆ చైతన్యాన్నే సూత్రరీత్యా పరిశీలించేది శుద్ధతత్వశాస్త్రం (Pure Philosophy). సాకారంగా ఉన్న అంశాలకు అది చెట్టయినా, చేమయినా, మనిషైనా, మనిషి చేసిన ఏ నిర్మాణమైనా వాటికి అన్వయించి పరిశీలించేది అనువర్తిత తత్వశాస్త్రం (Applied Philosophy). అలా సమగ్ర రూప సౌందర్యాన్ని అనుశీలించి చూపే ఈస్థటిక్స్, అప్లయిడ్ ఫిలాసఫీలోని అతి ప్రధాన భాగం. అప్పటికీ, ఇప్పటికీ ప్రపంచంలోనే అతి సమగ్రమైన, విస్తృతమైన ఈస్థటిక్స్ గ్రంథం భరతాచార్య నిర్మితమైన 'నాట్యశాస్త్రం'.

పేరుకు అది నాట్యశాస్త్రమైనా, నిజానికది సకలకళా సమన్వయశాస్త్రం; జీవసౌందర్య శాస్త్రం. ఇందాకే అన్నట్లు జీవనసౌందర్యాన్ని ఇనుమడింపచేసేవి కళలు.

సమాంతరంగా ఉన్న అన్ని ప్రధాన కళలను సమన్వయిస్తూ మానవ జీవనసౌందర్య చేతనను పెంపొందించడానికుద్దేశించిన సమగ్ర మానవ కళాశాస్త్రం నాట్యశాస్త్రం. ఆ సౌందర్య చేతననే 'నట్' (నాట్య) అనే క్రియాధాతువుతో సంకేతించాడు భరతుడు. వివిధ రూప, క్రియల మధ్య పొందికే సౌందర్యం. అన్ని రూప – క్రియ

విన్యాసాల సమాహారమే నటరాజ విలాసమైన నాట్యం – జగన్నాటకం! నాటకంపట్ల ఆ తత్వదృష్టి లేనిది, భారతీయ నాటకమనే ఏమిటి, ఏ భారతీయ కళా అర్థం కాదు; అర్థ పరిపూర్ణత రాదు. నాటకాన్ని ఆ తాత్వికదృష్టితో అనుశీలించి, జ–గత్ (జ=పుట్టి, గత్=గతించే, సాగే) జీవనాటకాన్ని సమగ్ర సుందరంగా తీర్చుకొమ్మని ఉద్బోధించడానికే భరతాచార్యుడు నాట్యశాస్త్రాన్ని – నాటక శాస్త్రాన్ని నిర్మించాడు.

ఆ భరతాచార్యుని అసలు పేరేమిటో తెలియదు. బహుశ ఈ రంగంలో భారతజాతికి ఆయన ప్రథమాచార్యుడై మార్గదర్శక సూత్రగ్రంథాన్ని నిర్మించి ఇస్తున్నారు కాబట్టి, తన పూర్వ ప్రవక్తల సంప్రదాయాలన్నిటినీ అందులో పొందుపరచి చెబుతున్నాడు కాబట్టి, తన జాతిపరంగా తనని 'భరతుడ'ని వ్యవహరించుకొని ఉండవచ్చు. జాతిపర బిరుదనామాలను ధరించడం పూర్వుల పద్ధతి. చాలామంది ప్రసిద్ధుల అసలుపేర్లేమిటో తెలియదు. శిబిచక్రవర్తి ఉన్నాడు. ఆయన ప్రతాప, శౌర్య, ధర్మాలకు పేరుమోసిన శిబిగణానికి చక్రవర్తి. అంతే! గాంధారి ఉన్నది. అసలు పేరేమిటో తెలియదు. గాంధార దేశపు రాకుమార్తె – ఆ పేరుతోనే శాశ్వత ప్రసిద్ధి. జాతి (అంటే వంశం, గణం) పేరిట, తండ్రి పేరిట లేదా ప్రత్యేక, సాహస, లక్షణాల పేరిట వర్తిల్లే బిరుదనామాలతోనే పూర్వులు ప్రసిద్ధులయ్యారు. భరతుడు అన్నది భరతజాతి గౌరవాన్నంతా ప్రతిఫలించే, అలాంటి బిరుద వాచకమే. ఆయనకలాటి నామవ్యవహారముండటం ఈనాటి భారతీయుల అదృష్టాల్లో ఒకటి.

**'యద్భావం తద్భవతి' – జగన్నాటక సూత్రం :**

నాటకం తరంగాలు తరంగాలుగా విస్తరించే జీవన వలయానికి ఒక నడి బిందువు.

కోనేరులో, లేదా, ఓ చెరువులో నీళ్ళు నిశ్చలంగా ఉంటాయి. ఏ అల్లరి పిల్లగాలో సోకినప్పుడో కలిగే చిరు తరగల కదలిక, కనపడీ కనపడనట్లుంటుంది తప్ప, సాధారణంగా నీరు నిశ్చలంగా ఉంటుంది. అందులోకి ఒక రాయో, మరొకటో పడితే క్రమంగా ఒకదాని వెనుక ఒకటిగా అలల వలయాలు వ్యాపిస్తాయి. కాస్సేపు అలా వ్యాపించి మళ్ళీ క్రమంగా తగ్గుముఖం పట్టి అంతరిస్తాయి. తరగలు వ్యాపిస్తున్నప్పుడు వాటికి వలయం మధ్యలో ఒక కేంద్ర బిందువు ఉంటుంది. సరిగ్గా రాయి పడ్డచోట. ఆ బిందువుకున్న శక్తివల్ల దాని సంకర్షణ శక్తివల్లనే ఆ వలయమూ, తరగలు.. ఆ సంకర్షణశక్తి ఓ గ్రావిటేషన్ పాయింట్‌లాటిది. దాని బలం ఉండేకొద్దీ తరగలు వ్యాపిస్తాయి. బలం తగ్గేకొద్దీ తగ్గుముఖంపట్టి అంతరిస్తాయి.

జీవన వలయమూ, దాన్ని కల్పించే జీవన్నాటకమూ కూడా సరిగ్గా అలాటిదే.

ఆత్మ సహజంగా నిశ్చలంగా ఉంటుందనేది భారతీయ దృక్పథం. దానికి మరో పేరే నిర్వికారత. జీవన వ్యాపారంలోని తరంగాలనన్నిటినీ ఉపశమింపచేసుకొని, ఆ నిశ్చల, నిర్వికార స్థితిలోకి మనసును కుదుటపరచుకోవటమే ఆత్మదర్శనం. ఇప్పుడా తత్వదర్శనం మనకవసరంలేదు.

నిశ్చలమైన ఆత్మ ఓ కొలనులాటిదైతే, అందులోకి ఓ కోరికో, ఆశో, ఆశయమో, ఏదో ఒక 'భావం' పై నుంచి చిన్న రాయిలాగా పడుతుంది. ఆశయినా, కోరికయినా, ఆలోచనయినా, ప్రతి సంకల్పమూ ఒక భావమే. ఆ భావ పరితృప్తికోసమే జీవుడి పుట్టుక. పుట్టుకనుబట్టి గిట్టుక. ఇవన్నీ నిశ్చలమైన ఆత్మసరస్సులో సంభవించే వలయతరంగాలు. మహాసంకల్పాలకనుగుణంగా పుట్టేవి ఎంత పెద్ద తరంగాలయినా అవీ మళ్ళీ క్రమంగా అంతరిస్తాయి. 'భవం' నుంచి ఏర్పడే గుణ రూపమే 'భావ'మైనా ('వసుదేవ' నుంచి 'వాసుదేవ' శబ్దం వచ్చినట్లు), 'కల్ప' స్థితినిబట్టి సంకల్పం రూపుదిద్దుకొన్నా, మళ్ళీ ఆ భావపరితృప్తి కోసం భవపరంపర ఏర్పడుతోంది. సంకల్పసిద్ధి కోసం 'కల్ప' స్థితి రూపుగడుతోంది. వీటి సంబంధం చెట్టు–విత్తనంలాంటిది. వీటిల్లో ఏది ముందో, దేనివల్ల ఏది వస్తోందో చెప్పడం అంత సులభం కాదు. విడదీయరాని ద్వంద్వత తెలుసుకోలేనంత గాఢంగా పెనవేసుకొని ఉంటుంది. అయితే మొదటగా నామరూప రహితమైన చైతన్యస్థితి మాత్రమే ఉందనీ, తర్వాత ఈ వికల్ప తరంగాలు అందులో ఏర్పడ్డాయనీ ఒక తార్కిక భావన విశ్వాసం. అంచేత 'భావా'న్నిబట్టి 'భవం' – యద్భావం తద్భవతి – అని నాట్య శాస్త్రకారుడు నిర్వచించాడు. భావాన్నిబట్టి ఏర్పడే వలయ తరంగాలే జీవితం. కనుక ఈ వలయ తరంగాల తాత్కాలిక స్థితిని గుర్తుపడుతూ వీటి ఆవేశ ఉద్రేకాలకు లోనుకాకుండా తటస్థ భావంతో అంతిమమైన శాంతస్థితిని అర్థంచేసుకొని అందుకోండి అని చెప్పడానికి, 'చూపించి, చెప్పడానికి' నాటక ప్రక్రియను నిర్మించాడు. భారతీయ నాటక సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఈ తాత్విక సూత్రాన్ని గ్రహించవలసి ఉంటుంది.

ఈ కేంద్ర బిందువు లక్షణాలేమిటి? దాని ఆకర్షక శక్తి ఏమిటి? వగైరాలు శుద్ధ తాత్విక ప్రశ్నలు. నాటకం అనువర్తిత

కళారూపమే (Applied form) కానీ, మౌలిక మీమాంస రూపం కాదు. తరంగాలు, వాటి తమాషాలను లోకానికి చూపించడంవరకే దాని పని. ఆ తరంగాల తాత్కాలిక స్థితిని మనిషే గ్రహిస్తాడు. అలా గ్రహించేలా శక్తిమంతంగా చెప్పడమే అందులోని కళ. ఎంత మొద్దుబారిన మనస్సునైనా మేల్కొలిపి చెప్పేటంత శక్తి ఒక్క 'నాటక కళ'కే ఉంది.

**భావం : స్థాయి : రసం – ఆంతరిక పరిణామ స్థితి**

ఎందుకంటే నాటకం బయటిది కాదు. మనలోదే. మనలో జరిగేదే. మనలో ఉత్పన్నమయ్యే అనేకానేక భావతరంగాల మధ్య, ఆ వలయాల అడుగులో అజ్ఞాతంగా ఉండే సుప్తాకాంక్షకు సంబంధించింది. ఆ సుప్తాకాంక్ష తరంగాలే ఈ జీవన్నాటకం. అందులోని శక్తే, ఈ వలయాన్ని ఇంత చిత్రవిచిత్రంగా, అనంతంగా, జన్మజన్మాంతరాల అంకాలమధ్య తిప్పుతోంది. విష్ణువు (సర్వవ్యాపకుడు – అని అర్థం) 'సుదర్శన' చక్రంలో వేలూని తిప్పుతున్నట్లు ఈ చక్రాన్ని ఎవరు తిప్పుతున్నారో లేక మనకు మనమే తిప్పుకొంటున్నామో తెలియదు. ఈ నానా అనుబంధరూపమైన తరంగ ఖేల ఈ నాటకం, అంటే మనలోని సుప్తాకాంక్షారూపమైన జీవచేతన, తనకు తగ్గ 'క్రియాభివ్యక్తి' రూపాన్ని తాను పొందడమేనన్న మాట. జీవ చేతన అనేది మనలోని సుప్తాకాంక్షకు సహజావరణ, దాని బహిరావరణ క్రియారూపంలో అగుపించేది, క్రియాభివ్యక్తి – లేదా – క్రియాచేతన. Action అనే మాటకు మన భాషలో అన్వయించి చెప్పుకోదగ్గ చక్కటి మాట. నటన అంటే మనకు కానిదాన్ని మనం ఆరోపించుకొని ఊరూరకే, పైపైనే ప్రదర్శించి చూపడం కాదు. నటన అంటే నైసర్గికమైన భావచేతనకు ఒక క్రమపద్ధతిలో మనమిచ్చే ఆవిష్కరణ.

క్రియాభివ్యక్తి to act అంటే అదే. ఆ క్రియాభివ్యక్తే! అంటే మనలోని సహజమైన చైతన్యాన్ని, ఆంగికంగానో, వాచికంగానో అంటే క్రియారూపంతో బయటికి అభివ్యక్తీకరించడమన్నమాట. మనలో పడ్డ భావబీజానికి, లోపలి తొలి ఆవరణ 'భావచేతన' అయితే బాహిరమైన మలి ఆవరణ 'క్రియాచేతన'. మనం తరచూ ఒక మాటంటుంటాం: "అతను అనుభవించి నటించాడు", "పాత్రలో జీవించాడు" అని. అలా అనుభవించి నటించినప్పుడే, జీవించినప్పుడే పాత్ర పండుతుంది అంటాం. ఇవన్నీ మనం లోకంలో వినేవే, వాడేవే. అయితే "అలా జీవించడంవలన కాదు, పాత్రతో తాదాత్మ్యాన్ని అభినయించాలేకానీ, అనుభవించకూడదు. ఒక psychic distance ను పాటించాలి" అని ప్రాచ్య, పాశ్చాత్య నాటకవేత్తలందరూ ఏక కంఠంతో పేర్కొన్నారు. లోకంలో వినే, వాడే మాటకు సరిగ్గా విరుద్ధంగా!

ఇందులో ఏది సత్యం? లోకం రూఢినిబట్టి శాస్త్రం సూత్రాన్ని నిర్వచించాలికానీ, తన సూత్రనిర్దేశంతో లోక రూఢిని శాసించలేదు కదా? పాత్రతో పూర్తిగా మమేకం చెందిన నటుడు, ఏ ఉగ్రనరసింహావతారాన్ని అభినయిస్తూనో, తాదాత్మ్య ఆవేశంలో మహోగ్రుడై, వాస్తవంగా హిరణ్యకశిపుణ్ణి చంపితే ఏమిటి గతి అని శాస్త్రకారుని ప్రశ్న. అలా జరిగిందటకూడా! శృంగారంలోనూ అంతే. సున్నితమైన హద్దును దాటితే మొత్తం రసాభాసమే. ఆ దురాకారణను తప్పించడానికే దూరీకరణ. కానీ దూరీకరణ అంతా బాహిరమైన ఆవరణకు సంబంధించిందే. లేదంటే లోని భావావరణం బయటి క్రియావరణగా పరివర్తితమయ్యే సంధిస్థితికి సంబంధించింది. అంతేకానీ మౌలికమైన నైసర్గిక – అంటే – సహజస్థితికి సంబంధించింది కాదు. సహజస్థితిని గ్రహించినవారికి ఈ వైరుధ్యాలు, విపరీతాలు ఉండవు. సహజస్థితిని గ్రహించినవారు, ఆ పాత్రల్లో అత్యంత సహజంగా జీవిస్తారుకూడా! బీజబిందువూ, దాని తొలి ఆవరణ అయిన భావచేతన బయటి ఆవరణ అయిన క్రియాచేతన సహజ క్రమపరిణామాలే కనుక ఒకటి లేకుండా మరొకటి ఉండవు కనుక, బీజ–చేతన–క్రియల మధ్య వైరుధ్యముండదు. ఏకత్వముంటుంది. అయితే, అవి సహజ క్రమస్థితిలో ఉన్నంతవరకూ వాటి అభివ్యక్తి రూపంలో క్రమంతప్పే అతిరేకత కానీ, విపరీతం కానీ ఉండవు.

సాధన కలిగినవారికి తమలో ఉత్పన్నమయ్యే వివిధ తరంగాలను, వాటి ఉపసంహారాన్ని తటస్థమైన బుద్ధితో నిస్సంగంగా చూసే మనోశిక్షణ కూడా వస్తుంది. 'మయా' (= నా చేత) అనే భావంతో జీవితం లేకుండా 'మాయ'ను అర్థంచేసుకొనే సామర్థ్యం వస్తుంది. ఆ సామర్థ్యం పొందినవాడు అచ్చమైన నటయోగి.

'సత్యాన్ని మరుగుపరిచే 'మాయ' యొక్క కార్యానికి 'ఆవరణ'మనీ, అసత్యాన్ని ప్రతిబింబించే కార్యానికి విక్షేపమనీ పేరు, అని అంటారు తత్వశాస్త్ర ఆచార్యులు, సమున్నత భారతీయ నవలా రచయిత ఎస్.ఎల్. భైరప్పగారు. అట్టే నిదానించి చూస్తే నాటకమంతా విక్షేపమే. నాటకమనే ఏమిటి ఈ జగన్నాటకమంతా విక్షేపమే. అందుకే నాట్యశాస్త్ర నిర్మాత 'విక్షేప'మనే మాటను పలు సందర్భాల్లో ఓ సాంకేతిక పదంగా

తయారుచేసి వాడాడు. 'నాటక కళ'కు వేదాంతులు వాడే విక్షేపమనే మాటకంటే దానికి సమాంతరంగానే బౌద్ధులు వాడే 'సంవృతి' అనే మాట మరింత ఎక్కువ ఉపాదేయంగా ఉంటుంది. ప్రాచీన భారత తత్వ దర్శన ప్రవాహాన్ని రూపొందించిన రెండు ప్రధాన స్రవంతులు వేదాంత – లేదా – ఉపనిషద్దర్శనం, బౌద్ధ దర్శనం. అత్యంత ఆదర్శవంతమైన నైరూప్యీకరణకు మొదటిది ప్రయత్నిస్తే లోక – అలోక అంటే కనిపిస్తున్న – కనిపించని భావధర్మాలను సమన్వయించి, ఇహజీవనాన్ని క్రమబద్ధం చేయడానికి కృషిచేసింది బౌద్ధదర్శనం. నిర్దిష్టంగా ఒకచోట, ఒక రూపంలో ఒక మొత్తంగా దృగ్గోచరమయ్యేది లోకసంవృతి. ఈ ఇండివిజుయల్ ఎంటైటీలన్నిటిలోనూ వ్యాపించి ఉన్నది పరమార్థస్థితి. మాధ్యమిక కారికలో ఆచార్య నాగార్జునుడన్నమాట:

*"ద్వే సత్యే సముపాశ్రిత్య బుద్ధానాం ధర్మదేశనా ।*
*లోక సంవృతి సత్యం చ సత్యం చ పరమార్థతః ॥*

*(XXIV-8; ఆచార్య భైర్పగారిచే 'ఆవరణ' నవల ప్రవేశికలో ఉదాహృతం)*

లోక రూపంలో ఆవరించి ఉన్న సత్యాన్ని ఆచార్య నాగార్జునులు, లోకసంవృతి సత్యమన్నారు. అలాగే అన్నిటినీ ఆవరించి వున్నదాన్ని మౌలిక స్థితిని పరమార్థ సత్యమన్నాడు. భరతుని 'లోకధర్మి', 'నాట్యదర్మి' పరికల్పనలకు ఇవి ప్రేరణలు కావుకదా! ఇక్కడ 'సంవృత'మన్న మాటే చాలా అందమైంది, అర్థవంతమైంది. మనం వద్దనుకొన్నా అది మనల్ని ఆవరించుకొనే ఉంది. ఆ వలయాలు, తరంగాలు మనతో నిమిత్తం లేకుండా అలా అల్లుకుపోతూ తమ ఆటను తాము సాగిస్తాయి. సంవృతి (సంసారాన్ని)ని రచిస్తాయి.

**విభావం?!**

లోకసంవృతికి మూలం ఏమిటి? నాట్యశాస్త్ర నిర్మాత సమన్వయం మేరకు భావం. ఆ భావం నుంచి విముక్తం కావడమే అసలైన మోక్షం. భావం యొక్క విపర్యాయ రూపం కనుకే దాన్ని నడిపే కథాగత పాత్రలకు ఆయన 'విభావం' అనే పేరు పెట్టాడు. నాకు తెలిసి – 'విభావ'మనే మాట కథాసూత్రం ధరించే 'పాత్ర'కు పర్యాయపదంగా ఎందుకు పెట్టారు? అది వి–భావమయితే, అసలు భావమనే మాటకు నాట్యశాస్త్రం ఇచ్చే అర్థమేమిటి? అసలు ఓ వ్యక్తికి 'విభావం' అని అలా అమూర్త (abstract) నామాన్ని పెట్టడంలో అంతరార్థం ఏమిటి? – వంటి ప్రశ్నల తాత్త్విక నిగూఢ భావాలను ఎవరూ పరామర్శించలేదు. దేవతలు–రాక్షసుల కథలను వినిర్మాణం (deconstruct) చేస్తూ వాటికి భరతుడూహించడానికైనా సాధ్యం కాని వంకర వ్యాఖ్యానాలను చెప్పే పెద్దలు, వంకరో, సక్రమమో ఏదో ఒక రూపంగానైనా ఈ భావ–విభావాల తాత్త్విక స్వరూపాన్ని వినిర్మించి చూపడానికి ప్రయత్నించపోవడం విడ్డూరం. ఆ మాటలను సాంకేతిక పరిభాషలుగా ఎంచుకొన్న భరతముని తాత్త్విక దృష్టిని గురించి, విపులీకరించకపోవడం ఆశ్చర్యం.

భావం విత్తనమైతే, అందులో ఒడిసి ఉన్న సంపూర్ణ స్వరూపాన్ని చూపే వృక్షంలాటిది 'విభావం'. 'వి' అనే ఉపసర్గ అత్యధికమనే అర్థాన్నీ సూచిస్తుంది. (చిత్రం / విచిత్రం): సరిగ్గా దానికి వ్యతిరేక క్రమంలో 'ఏమీ లేనిది', 'అంతరించినది' అనే శూన్యార్థాన్నీ సూచిస్తుంది. ఉదా: (విధవ=ధవుడు (భర్త) లేనిది) ఈ అతిరేక, వ్యతిరేక క్రమాలను సూచించడానికి సంస్కృత పండితులు ఒక మాటంటుంటారు. 'విధవా విధవాయశ్చ రమ్యతే' – విధవ, విధవులతో (ఎక్కువమంది భర్తలతో) రమిస్తున్నది – అని. లోక ప్రసిద్ధం కనుక ఉదాహరించడమైంది. నీచార్థ సూచనకు క్షంతవ్యుణ్ణి) విశ్వమే ఒక భావసమాహార రూపం.

విశ్వమంతా వివిధ భావాల సమాహారమే. కొందరు తత్త్వవేత్తల ప్రకారం విశ్వమే ఒక భావసమాహార రూపం. వ్యక్తులు ఇవ్వాళ ఉంటారు, రేపు పోతారు. పుడుతూ–గిడుతూ ఉండడం పరిపాటి. భావాలు అలా అంతరించేవి కావు. బీజప్రాయంగా వ్యక్తుల సంస్కారాల రూపంలో మొలకెత్తుతూ ఉంటాయి. పరిసరాలబట్టి అభివృద్ధి, పరివర్తన పొందుతుంటాయి. మానవ సమాజాన్ని, సంస్కృతిని తీర్చిదిద్దుతుంటాయి. భావాల సౌష్ఠవం మీద వ్యక్తులు, వ్యక్తి సమూహ సౌష్ఠవం మీద సమాజం ఆధారపడి ఉంటాయి. వ్యక్తుల్లో భావాలు అభివ్యక్తమవుతుంటాయి. సంపూర్ణ రూపావిష్కారం పొందుతుంటాయి. అయితే వ్యక్తుల వరకే భావాలు పరిమితం కావు. వ్యక్తులు మాధ్యమాలు మాత్రమే. అభివ్యక్తికి ఆధారాలు మాత్రమే.

అందుకే భారతీయ నాటక పరిభాషలో వారిని 'పాత్రలు' అంటాం. నీళ్ళు పట్టుకోవటానికి, త్రాగటానికి పాత్ర ఎలా అనివార్యమో, భావానికి – పాత్ర కూడా అంతే. ప్రాణులు గతించినా, ప్రాణం వాయురూపంలో ఎలా శాశ్వతమో, ఒక జీవుడిలో ప్రవేశించి తన శక్తిని చూపే వాయువునే మనం ప్రాణమని ఎలా అంటామో, భావం కూడా అలానే. అలాగే

శాశ్వతమైంది. అలానే జీవుడిలో చేరి, తన శక్తిని ప్రదర్శించేది. ఏ జీవుడిలో చేరినప్పుడు, ఆ జీవుడి భౌతికధర్మాలబట్టి, శారీరక ధర్మాలబట్టి, ఆ భావం పరివర్తనకు లోనవుతుంది. అది పెరిగి, మరింత నాణ్యంగా కనిపించవచ్చు లేదా తరిగి న్యూనంగా భాసించనూవచ్చు. కుండనుబట్టి, నీటి రుచి మారినట్లు! హెచ్చుతక్కువలకు లోనుకావచ్చు. అందుకే ఆ పాత్రలు విభావాలు. అధికమైనా చేసి చూపవచ్చు. అల్పంగానైనా మార్చి చూపవచ్చు. మూలతః ఆ భావాలు వాటికి మాత్రమే సంబంధించినవి కావు. సామాజికులందరికీ సంబంధించినవి. సకల లోకానికీ సంబంధించినవి. రూపారూపాలకు మూలమై, వాటిని భాసింపచేసి, తాము ప్రకాశించేవి. సంస్కారవంతమైన లోకం వాటిని నిత్యం జాగృతం చేసుకొని, సంవర్ధింప చేసుకోవాలి. భావాలు వర్ధిల్లటంలోనే, లోకం శ్రేష్ఠత, మనుగడ కూడా వర్ధిల్లుతుంటాయి. 'యద్భావం తద్భవతి' – ఇదే నాటక శాస్త్ర మూలతత్త్వం. ఈ భావాలను తటస్థ భావంతో 'తాను వాటిని అభివ్యక్తపరుస్తున్నాడు' అనే జ్ఞానంతో, వ్యవహరించినవాడు ఉత్తమ నటుడు. 'రసం యన్నిష్ఠం' (ఎందులో ఎవరిలో రసముంది?) అనే చర్చలో ఆ సూత్రాన్నే నాటక శాస్త్రకారుడు వివరంగా అన్వయించి చూపుతాడు. వ్యక్తి, వ్యక్తికి సంబంధించిన స్త్రీ పురుషాది భేదాలు వగైరాలతో సంబంధం లేకుండా లోని 'ఉపాధి' (అంటే జీవుడిలోనున్న భావధర్మం)కి మాత్రమే నిమిత్తమైన నిష్కామ క్రియాస్వరూపం విభావం.

ఆ విభావం సకామక్రియలో భాగమైనపుడు పొందేది స్థాయీభావం. నిస్సంగంగా గ్రహించినపుడు కలిగేది 'రసం'.

**నాటక కళా కీలకసూత్రాలు : ముండకోపనిషత్తు**

భారతీయ కళల్ని, వాటికి ప్రాణంలాంటి 'రసా'న్ని అర్థం చేసుకోవాలంటే భారతీయ తాత్త్విక మూలసూత్రమొకదాన్ని ముందుగా గ్రహించాలి. సంగత్వానికి – నిస్సంగత్వానికి ఎడం ఎంతో లేదు. రెండూ ఒకే నాణేనికున్న రెండు బొమ్మలు. ఒకటి లేకుండా ఇంకొకటి చెల్లదు. తనలోని చైతన్యం అర్థాన్ని గ్రహించి, దాన్ని సార్థకపరచుకోవాలనుకొనే భావనాశీలి, రెంటినీ సమన్వయం చేసుకొనే ముందుకుసాగాలి. భవం 'భవం – అనుభవం – భావం' ఒక క్రమం. అది ప్రకృతి సహజ క్రమం. సర్వ ప్రాణులకు సమానమైన ప్రాకృతిక పరిణామ క్రమం. ఆ క్రమంలో ఒక ఉన్నత పరిణామ స్థాయిని అంటే భావనోన్నతిని పొందిన 'మానవుడ'నే సాంస్కృతిక పరిణత జీవి, భావం – భవం – అనుభవం అనే క్రమానికి లోనవుతున్నాడు. మానవ చింతన, ఆ పరిణామక్రమాన్ని అంటే సాంస్కృతిక జీవ పరిణామ క్రమాన్నిగూర్చి ఆలోచిస్తుంది. ప్రకృతిని అర్థం చేసుకోవటం ఒక దశ. సంస్కృతిని నిర్మించుకోవడం ఒక దశ. 18వ శతాబ్ది మధ్యనుంచి, ముఖ్యంగా 19వ శతాబ్దినుంచి పాశ్చాత్యదేశాలు మొదటి దశను సునిశితంగా ఆచరిస్తూ, అతి సూక్ష్మ పరిశీలనతో కూడిన ప్రకృతి శాస్త్రాలను నిర్మించుకొన్నాయి. అయితే అది అంతిమం కాదు. అధి ప్రాకృతిక స్థితి ఒకటున్నదనే ఎరుకతోనే, అక్కడి ఉన్నతశ్రేణి శాస్త్రజ్ఞులు కృషిచేశారు. అందుకు ఫిజిక్సులో నోబెల్ పురస్కారాన్ని అందుకొంటూ మెటాఫిజిక్స్‌ను ప్రస్తావించిన ఐన్‌స్టీన్ ప్రసంగమే సాక్ష్యం. ప్రాకృతిక శాస్త్ర అవగాహనలు వినా, అధిప్రాకృతిక దర్శనాన్ని ఎవరూ పొందలేరు. ఆ అవగాహనలు ప్రయోగశాలల్లో పొందుతారా? విశ్లేషణ – చింతన – మన నాదుల ద్వారా పొందుతారా? అన్నది వేరే విషయం. ప్రాకృతిక స్థితికానీ, అధిప్రాకృతిక స్థితి కానీ అందరూ ఒక్కలాగా చూసేది కాదు, చూపేదీ కాదు. లోకమెంత అపరిమితమో, లోక దర్శనం కూడా అంతే అపరిమితం. ఈ అపరిమిత విస్తృతి ఒక పాయ అయితే, ఎక్కడికక్కడ వీటి సమన్వయం ఒక పాయ. సంగత – నిస్సంగతలెలా అవిభాజ్యమైన సమాంతరాలో, ఈ విస్తృత వివేచనలు, సమన్వయాలు కూడా అలాటి సమాంతరాలే. ఎటు తిరిగి మన పూర్వులు సాగించిన విస్తృతి వివేచనలు, బహుశ అప్పటికి, వారి ప్రయోగశాలలో లేదా ఇతర విధానరూపాలో కాలగర్భంలో కలసిపోవడంవల్ల మిగల్లేదు, సమన్వయ సిద్ధాంతాలు మాత్రమే సూత్రరూపంలో కంఠస్థం చేసి ఎప్పటికప్పుడు వల్లెవేసుకోవడానికి వీలుగా ఉండడంవల్ల మిగిలాయి. 19వ శతాబ్దిలో ముద్రణ సౌకర్యం విరివిగా అందుబాటులోకి వచ్చేదాకా, ఆ కంఠస్థపు కలిమి వల్లనే, ఆ బలిమి వల్లనే తరతరాలకూ తరలివచ్చాయి.

అలా తరలివచ్చిన సంపదలోనే ఇంతసేపూ పైన చర్చించిన ఈ విడదీయరాని, ద్వంద్వత సూత్రాన్ని అద్భుతమైన కవితాప్రతీకతో, పరమ అందంగా ఆవిష్కరిస్తోంది ముండకోపనిషత్తు. బహుశః ప్రపంచ సాహిత్యంలోనే అతి అందమైన ప్రతీకాత్మక సూఫీ కవిత ఇది :

*"ద్వా సుపర్ణా సయుజా సఖాయా*
*సమానం వృక్షం పరిషస్వజాతే*
*తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్య*
*నశ్నన్నన్యో శ్న అభిచాక శీతి ॥* (3-1-1)

(సయుజా, సఖాయా, ద్వా, సుపర్ణా, సమానం, వృక్షం, పరిషస్వజాతే ॥ నిత్యం కలిసి ఉండే పరమ సఖులైన రెండు పక్షులు సమానం – అంటే ఒకటే, వృక్షాన్ని, ఆశ్రయించి ఉన్నాయి;

తయోరన్యః, పిప్పలం, స్వాదు, అత్తి, అనశ్నన్, అన్యః, అభిచాక్ శౌతి ॥ వాటిల్లో ఒకటి, పండును, రుచి తింటున్నది, తినకుండా, మరొకటి, చూస్తూవున్నది.)

భారతీయ సకల తాత్త్విక దృక్పథానికి అత్యంత అందమైన, అద్భుతమైన ప్రతీక చిత్రణ ఇది. ప్రతీక అంటే అలాటిలాటిది కాదు. ఎంతో కవితాత్మకంగా, సమగ్రంగా, సంక్షిప్తంగా ఉన్న భావచిత్రం. ఇందులో ఒకర్ని సఖీ అనుకొన్నామంటే ఇది అద్భుతమైన సూఫీ కవితే. ప్రపంచంలో తొలి సూఫీ కవిత.

భారతీయ కళామీమాంసకు ప్రధాన మార్గదర్శక సూత్రం కూడా ఇందులోనే ఉంది. మొదటగా దీన్ని చూసి, చదువుకొన్నది ఎం.ఏ. విద్యార్థిగా ఉన్నప్పుడు, పూజ్యులు ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు కొన్ని దశాబ్దాలపాటు స్నాతకోత్తర విద్యార్థులకు సాహిత్య విమర్శను పాఠంగా బోధించిన బోధనాసార రూపమైన 'సాహిత్య శిల్ప సమీక్ష'లో. ఆ చిన్నవయసుకు దీని అన్వయం తలకెక్కలేదు. మావంటి అపండిత కుటుంబాల నుంచి వచ్చినవారికి, తగినంత వివరంగా అన్వయించి చెబితేకాని బోధపడే సూత్రం కాదిది.

కాశ్మీరశైవం, 'ప్రకృతి – పురుష, శక్తి – సదాశివ, కళా – విద్యా' అంటూ జతలు జతలుగా విశ్వతత్త్వాన్ని, విశ్వేశతత్త్వాన్ని 36 తత్త్వాలుగా నిరూపించి, సమన్వయించి చెబుతోంది. ప్రకృతి – పురుషుల జత ఎలా అన్యోన్యసమాశ్రితమైందో, కళా–విద్య (జ్ఞాన)ల జత కూడా అలా అన్యోన్య సమగ్రత కలిగించేది. ప్రకృతి – పురుషులకు (పురుషుడంటే జీవుడు, జీవచేతనారూపం అని అర్థం; పురుః=అంటే మొదట సమగ్రంగా భాసిల్లిన జీవపరిణామ రూపం అని భావం), శక్తి–శివులు ఎలా ప్రతిమానరూపాలో, కళా–విద్యలు కూడా అలానే ప్రతిమాన రూపాలు. అనుభవరూపమైన జ్ఞానం కళగా ఒదుగుతుంది; వివేచించి అంతఃస్వరూపాన్ని దర్శిస్తే అదే జ్ఞానంగా మారుతుంది. అది నేర్పు, ఇది సాధన. మొత్తానికి రెండూ ఒకదానికొకటి పూరణ, విడదీయరానివి. అందుకే అవి 'సయుజా'లు. కేవలం విడిపోకుండా కలిసి ఉన్నవే కాదు, 'సఖాయాః' – పరమస్నేహం కలిగినవి కూడా! సఖ శబ్దానికి అర్థం కేవలం స్నేహితుడని కాదు. పరమ స్నేహితులై, విశ్వకాంతి (ఖ)ని 'స'మంగా 'ఒక్కటి'గా గ్రహించి ఒక్కటైనవారు సఖులు – నామమాత్రమైన రూపభేదమే కాని, సర్వంకషంగా ఒక్కటైన చేతనామూర్తులు సఖులు. అలాటి సఖులు ఆ 'జీవాత్మ – పరమాత్మ'లు, ఆ 'ప్రకృతి–పురుష'లు, 'కళా–విద్య'లు. అద్వైతులు సమన్వయాన్ని నొక్కిచెప్పరు. విడదీసి అన్వయాన్ని ప్రతిష్ఠిస్తారు. ఈ సయుజ సఖులైన రెండు (ద్వా) సుపర్ణాలు (పక్షులు) ఒక్క చెట్టునే – అంటే ఈ దేహాన్నే – ఆశ్రయించి ఉన్నాయి అని గూఢ అన్వయాన్ని పేర్కొంటారు. అది శాస్త్రక్రమం. అయితే లోకానుభవంలో ఒకటి రుచిని ఆస్వాదిస్తున్నది. మరొకటి నిమీలిత నేత్రాలతో ఊరక చూస్తున్నది.

తరచూ పెద్దలు పై ఒక్క శ్లోకాన్నే వివరిస్తారు. కాని ఆ తర్వాతి శ్లోకంలో, ఆ 'క్రియ–నిష్క్రియ'ల ఆంతర్యం తేటపడుతుంది.

*సమానే వృక్షే పురుషో నిమగ్నోఽ*
*నీశాయా శోచతి ముహ్యమానః ।*
*జుష్టం యదా పశ్యత్యన్యమీశమస్య*
*మహిమానమితి వీతశోకః ॥* (3-1-2)

(సమానే వృక్ష (ఒకే చెట్టులో) భ్రాంతి కలిగి (ముహ్యమానః) ఆ పండును ఆస్వాదించడంలో నిమగ్నమైవున్న (నిమగ్నః), జీవాత్మ (పురుషః) ఆపై తన అనీశతకు, తనపై తన ఆధిపత్యలేమికి, నిరీశ్వరతకు (అనీశయా) శోచతిహి (దుఃఖిస్తుంది). ఎప్పుడైతే (యదా) సర్వాధిప పరమాత్మ స్థితిని (ఈశం) దాని అస్య ఆరాధ్యమైన (జుష్టం) మహిమోపేతమైన (మహిమానం) ఇలా అని (ఇతి) చూస్తుందో (పశ్యతి), అప్పుడు దుఃఖాన్ని పోగొట్టుకొంటుంది (వీతశోకః).

ఆ ఒకే చెట్టుల్లోని పిట్టల్లో ఒకటి ఎంత భ్రాంతిగా పండును తింటున్నా, తినడమయ్యాక దుఃఖాన్నే పొందుతోంది. భ్రాంతిలో ఉన్నంతసేపే ఆస్వాదన. ఆ తర్వాత అనీశంవల్ల దుఃఖం.

సర్వమాన్యమైన ఈశత వల్లే మహిమానత. ఆ ఈశత చూపు స్పర్శ సోకినప్పుడే ఆ దుఃఖం మటుమాయం.

దీన్నే కొంత ఆధునికంగా ఇలా చెప్పొచ్చు: ప్రతి మనిషిలోనూ 'ఉదాత్తత' అనేది సహజంగా ఉంటుంది. నిత్యం అనేక రకాల క్రియాకలాపాల్లో నిమగ్నుడై ఉన్న మనిషి, ఆ కార్య నిమగ్నతలోని ఒత్తిళ్ళవల్ల, విభిన్న రీతుల్లో అనేక రకాల దుఃఖాలకు లోనవుతుంటాడు. కొన్ని అచ్చపు దుఃఖాలయితే

కొన్ని సుఖపు రకాల దుఃఖాలు. మనలోని విశ్వకాంతి (ఖ; ఖగోళము=విశ్వము) మ్లానతపాలు కావడమే దుఃఖం. అది, అతని సుప్త చిత్తానికి తెలుసు. అందుకే ఎప్పటికప్పుడు ఉదాత్తత కోసం ఆరాట పడతాం. వివేకవంతులు ఎరుకతో ప్రయత్నం చేస్తే అవివేకులు కేవలం తమలో తాము, తమకు తెలియకుండానే తాము ఆశపడుతుంటారు. ఎంత దుర్మార్గులైనా, రామాయణం చూస్తున్నప్పుడు రాముడితో తాను తాదాత్మ్యం అనుభవిస్తాడు తప్ప, రావణునితో కాదు. అందుకే ముండకోపనిషత్తులోని పై రెండు శ్లోకాలూ అద్భుతమైన ప్రతీకాత్మక కవితలు. ముండకులు అంటే సన్యాసులు కాగోరేవారికి ఉద్దేశించిన బోధనల సంపుటి ముండకోపనిషత్తు. ఇప్పుడు చూడండి – సన్యాసమంటే జగత్తంటే నాటకమని దూరంగా పోవడమా? లేక 'తెలిసి' దీన్ని నటించటమా? అభినయించటమా*? నయం నుంచి పుట్టిన మాట – న్యాయం – నయమంటే ఏమిటో దాన్నుంచి వచ్చిన న్యాయమే వివరిస్తున్నది. నయమంటే 'సరైనది ఆచరించటం' – అని భావం. 'ఎప్పటికప్పుడు కొత్తగా' అనే భావాన్ని తెలిపే ఉపసర్గ – 'అభి'. కనుక అభినయమంటే "ఎప్పటికప్పుడు 'తెలిసి', తెలియనట్లు సాగడం". 'సన్యాసం' అంటే అదే! 'సత్' పదార్థంలో 'న్యసించుట' – తనను తానుంచుకొనుట. అసత్తు – సత్తుల కలయిక అయిన జగన్నాటకంలో, అసత్తులో జీవితాన్ని నెట్టుకెళ్తున్నా, సత్తులో తన అంతస్సునుంచుకొనడం సన్యాసం. 'నట్' (to act) అనే క్రియాధాతువు అర్థం కూడా అదే. 'తెలిసీ', తెలియనట్లు చేస్తుండడం/సాగడం – జగన్నాటకంలో ప్రతి జీవుడూ అలానే నటిస్తున్నాడు. పాత్ర (ఆ శరీరంలో) జీవిస్తూ నాటకాన్ని రక్తికట్టిస్తున్నాడు. ఈ జగత్‌స్థితి మొదటి నకలు. దానిమీద తీసిన రెండవ నకలు నాటకం. >నటుడు, నటన.

* * *

**విభావం : 'రసోవైసః'**

ఇంతకీ ఈ చర్చ అంతా వచ్చింది రసభావాల వివరణ సందర్భంలో. ఈ దేహపు చెట్టులో జీవితపు పండు తినడంలో 'నిమగ్న'మైన పక్షి అనుభవించేది స్థాయీ భావం – అలా అనుభవిస్తున్నది కనుకే ఆ పక్షి పాత్రను 'విభావం' అంటోంది నాటకశాస్త్రం. అలాగాక నిస్సంగంగా 'ఊరక చూస్తున్న' పక్షి గ్రోలుతున్నది 'రసం'.

ఆత్మలో నిస్సంగత భావం (total objectivity) కలిగినప్పుడే 'రసం' అనుభూతమవుతుంది. సంగత్వం (subjectivity)లో నిమగ్నమవుతున్నప్పుడు మనం పొందేది స్థాయీభావాలే. ముహ్యమానమైన లోకంలో మనం స్థాయీభావాలను పొందుతాం. లోన మహిమానమైన ఆత్మ రసానందాన్ని పొందుతుంది. ఈ రెంటిమధ్య పరిణామాన్ని (transformation) పొందడమే అసలైన అతిగొప్ప జీవానందం – ఆ పరిణామం పొందినవాడే 'రసోవైసః' (He is Rasa) అనే మాటకు అర్హుడవుతాడు.

**ఆత్మగత పరిణామం (Transformation) కరుణరసం :**

భావ – రస పరిణామ క్రమాన్ని తగు ఉదాహరణతో వివరిస్తే తప్ప స్పష్టంగా బోధపడటం చాలా కష్టం.

కరుణ రసమనే మాట అందరికీ తెలిసిందే. అదొక్కటే రసం, అదొక్కటే రసం, తతిమ్మావి కావంటాడు ఒక మహాకవి. దానికి స్థాయీ భావం శోకం – అంటే మనం లోకంలో అనుభవించేది శోకం. అది రసంగా పరిణామం పొందినపుడే – కరుణంగా మారుతోంది. "కరుణ అంటే జాలి, ఎదుటివారి మేలును ఆశించే భావన కదా! మన ఈ దుఃఖాతిశయం అంటే శోకానికి, ఇంత ఉదాత్తమైన కరుణకూ సంబంధమేమిటి?" అనేది తరచూ ప్రతి నాటక విద్యార్థి, ఎంత పెద్దవారైనా వేసే ప్రశ్న. 'నాయనా! ఇది లోక వ్యవహారంలో ఉండే కరుణ. నాటక పరిభాషలోని ఈ

---

* ఇక్కడ 'యోగవాసిష్ఠము'లోని 'వసిష్ఠోపదేశము'నకు భగవాన్ శ్రీ రమణ మహర్షి గారు చేసిన అనువాదం గుర్తుకు వస్తున్నది. (శ్రీ గుణ్టూరు సుబ్బరామయ్య విరచిత 'రమణ స్మరణామృతము'లో ఉదాహృతం. పు. 68-69). భగవాన్ గారి చక్కటి పద్యప్రసాదమిది:

సీ॥ బహువిధ దశలన్ని పరీశీలనము చేసి
సత్పరంపద మెది తత్పదమును
హృత్తుతనగొని భువినెన్నడున్ గ్రీడింపు;
భావములన్నింట భావమదియు
నెఱిగితి, వాదృష్టి యెప్పుడున్ విడువక
యిలయందు ***నర్తిలుమిచ్చపగిది***
*సంభ్రమసంతోష సంతాపకోపస*
*మారంభ* **సంరంభధారియనగ**

**వ్యాజముగ విహరింపు**లోనమలుడగుచు,
ఆశబంధన ముక్తుడై యన్నివృత్తు
లందు సమభావముగలిగి యవనియందు
**వేషయుక్తుడై** వెలినాడు, వీరరామ ॥

ఇందులో దళమైన (thick) అక్షరాల్లోని మాటలు ఉపనిషత్తుపదేశించే 'నటన'కు మరోమాటలే. అలాగే సీసభాగం నాలుగో పంక్తిలోని వక్రముద్రాక్షరా (italics)ల్లోని మాటలు ఆయా రస సంబంధి స్థాయీ భావాలకు సూచికలే.

'కరుణము' అనే మాట దానికంటే భిన్నమైంది. అది కరుణ, ఇది కరుణం – రెంటికీ అర్థం వేరు' అనేది తరచూ పాఠం చెప్పే పెద్దల మాట. దానికిది పరిణామ రూపమని ఎవరూ చెప్పరు. ఆ పరిణామ రహస్యాన్ని, క్రమాన్ని ఎవరైనా వివరించి ఉంటేగా చెప్పడానికి!

ఒక నష్ట జాతకుడికి చిన్న కుమారుడు గతించాడు. ఆ పిల్లవాడు వున్నంత కాలం ఏదో ఒకందుకు ఈ దురంత పీడితుడు కోప్పడుతూ ఉండేవాడు. అంతగా ముద్దుమురిపాలు చూసినదీ లేదు. అయినా ఆ పిల్లవాడు ఆకస్మిక మరణంపాలు కాగానే, అపరిమిత దుఃఖానికి లోనయ్యాడు. ఎంత కఠినాత్ముడైనా కన్న గుండె, కన్నీటిలో కరిగిపోయింది. అతని ఎదురింటిలో మరొకడున్నాడు. అంతకంటే కఠినాత్ముడు, కుమారుడిమీది కోపంతో, అతన్ని ఇంటినుంచి గెంటి దూరంగా పెట్టాడు. కొడుకు గూర్చి లోన ఏ దిగులైనా పడేవాడో కాదో కూడా తెలియదు. ఇప్పుడు పుత్రశోకానికి గురైనవాడు, అంత దుఃఖాతిశయంలోనూ ఎదురింటివాడిని చేరబిలిచి 'చూశావటయ్యా! ఇలా లేదు అలా లేదు అని బ్రతికి ఉన్నంత కాలం కోప్పడేవాణ్ణి. ఇప్పుడు లేనే లేడు. ఎందుకు కోప్పడ్డాను. ఎవరికోసం తాపత్రయపడ్డాను. ఇప్పుడు నా బ్రతుక్కి అర్థం ఏమిటి? వాడు పోయి ఉన్నాడు. నేను ఉండి, పోయాను. కాస్త నన్ను చూసయినా బుద్ధి తెచ్చుకో. బిడ్డలను పోగొట్టుకొన్నాక మన బ్రతుకులకు అర్థం ఏమిటి? ఉన్న బిడ్డలనెందుకు దూరం చేసుకొని, ఉండీ, పోయినవాళ్లతో సమానమవుతున్నావ్?" అంటూ అతి జాలిగా, బాధగా, కనికరంగా చెప్పాడు. అదేమిటి? అచ్చమైన కరుణ, తనవరకు పరిమితమైనప్పుడు, శోకంలో విలవిల్లాడిన గుండె 'తను' అనే చిన్న పరిధిని దాటి, తదతీతంగా వెళ్ళినప్పుడు సాటి జీవిపట్ల జాలితో సహానుభూతి కలిగిన బాధతో ("నా జాలి తెలిసి" – త్యాగరాజు ప్రయోగం) జీవకారుణ్యంతో పలికిన మాటలవి. ఇది వాస్తవంగా జరిగిన సంఘటన. తనవరకు ఉన్నప్పుడు శోకం, తదతీతంగా ఎదిగినప్పుడు రసం. నిమగ్నుడైన జీవి అనుభవించినది స్థాయీభావం. నిస్సంగుడైన ఆత్మ పొందినది కరుణమనే రసం. దీన్నే ఇంగ్లీషులోకి మార్చి చెప్పాలంటే స్థాయీ భావం Subjective emotional exeperience - రసం; Objective - Aesthetic (Philosophycal) - Experience. స్థాయి అన్నది Subject అంటే అనుభవించే వ్యక్తి యొక్క subjectivity - వ్యక్తిగత స్థితిని తెలిపేమాట. రసం అన్నది ఆ జీవ స్థితి పొందిన పరిణామాన్ని సూచించే మాట. భారతీయ కళామీమాంస ప్రపంచానికి ప్రసాదించిన అత్యంత అర్థవంతమైన, అన్వయాత్మక తాత్విక పరికల్పన (applied philosophical concept) రసం. ఆత్మలోని involved and detached states లో పొందే లౌకిక అలౌకిక అనుభవాలకు అతి సంక్షిప్తమైన అతి లోతైన పరిభాషలు = స్థాయీభావం, రసం అనే ఈ రెండూ!

**రస సంఖ్య: 'శాంత' స్వరూపం :**

'నవరసాలు' అనే మాట లోకంలో రూఢికెక్కినా, రస సిద్ధాంతాన్ని మొదటగా తెలియచెప్పిన నాట్య శాస్త్రకర్త, ఆ తొలి భారతీయ కళాదర్శనవేత్త, ఎనిమిది రసాలను మాత్రమే చెప్పారు. ఆయన శాంతాన్ని రసంగా చేర్చి చెప్పలేదు. ఆయన హృదయం తెలిసినవాడు కనుకనే, సర్వశ్రేష్ఠుడైన భారతీయ నాటకకర్త, కాళిదాసు కూడా 'అష్టౌ రసాసు' అని మాత్రమే వ్యవహరించాడు కాని, శాంతంతో కలిపి నవరసాలనే మాట వాడలేదు. ఆ పిదపకాలంవారే భరత (భారతీయ) హృదయాన్ని అర్థంచేసుకోలేక 'శాంతరస'మనే పేరు పెట్టి దానితో కలిపి తొమ్మిదనే ఏమిటి? కాలం గడిచేకొద్దీ 12, 13 రసాలను చెప్పారు. రస సిద్ధాంత స్వరూప ప్రణాళికనే పూర్తిగా మార్చివేశారు. ఆ చర్య అంతా ప్రస్తుతం మనకనవసరం. అదంతా రసమనే మాటకు అర్థవిపరిణామం ఏర్పడిన, రెండవ దశా ఫలితం.

భరతయోగి శాంతాన్ని రసంగా లెక్కించక, ఎందుకు 'హాస్యం' నుంచి 'బీభత్సం' దాకా ఎనిమిది రసాలనే చెప్పాడు?

శాంతం కూడా రసమైతే, ఇక నిస్సంగుడైన ఆత్మ అనుభవించే రసానికి అర్థమేమిటి? శాంతానికి స్థాయీభావం శమం. దాన్ని పేర్కొన్నాడు కానీ, శాంతాన్ని రసంగా చెప్పలేదు. హాసం నుంచి జుగుప్స దాకా అని స్థాయీభావాలను నిమగ్నుడై అనుభవించే జీవుడు, వాటిన్నిటికంటే ఒక మెట్టు పైకెక్కి వాటి శమనం, ఉపశమనం చేతనే వాటికి సంబంధించిన రస స్థితిని అనుభవిస్తున్నాడు. రసానందాన్ని అనుభవిస్తున్నాడు. నిమగ్న స్థితిలో పొందుతున్నది ఆనందం కాదు, భావోద్రేకం మాత్రమే. అందులోనూ ఆ భావానికి సంబంధించిన, అత్యంత (highest) ఉద్రిక్త స్థితినే. అందుకే అది 'స్థాయీభావం' అని పిలువబడుతోంది. దాన్నుంచి మానసికంగా దూరం (Psychlic Distance) జరిగి, నిస్సంగతను పాటిస్తున్నప్పుడే, తన భావస్థితిని తానే నిస్సంగంగా పర్యాలోకిస్తున్నప్పుడు మాత్రమే, దాన్ని రసానందంగా స్వీకరించగలడు. భావోద్రేకత

అనుభవిస్తున్న జీవుడు వేరు. తాను వేరు అనే భావన సహజస్థితిగా ఉన్నప్పుడు మాత్రమే, లోకగతమైన జుగుప్స, కళాగతంగా బీభత్సం, బీభత్స రసంగా, రసానందంగా పరిణమిస్తుంది. ఆ పరిణామ క్రియ ఒక్క కళకే సాధ్యం. అందుకే అది కళ! సృజనాత్మకమైన నేర్పు నైపుణ్యం! మహిమానమైన ముహ్యామానతను సృష్టించేదే కళ. రెంటినీ తెలుసుకోవడం విద్య. తెలియకుండుట అవిద్య.

జీవచేతన పొందే వివిధ స్పందనల్లో, జీవిత గమనాన్ని ప్రభావితం చేసే ప్రధాన భావ సంపుటులు, ఆయా రసాలకు సంబంధించిన, స్థాయీభావ ఘటాలు. ఇందాకా పునఃపునంగా అన్నట్లు. నిమగ్నమై అనుభవిస్తే స్థాయీభావాలు, నిస్సంగంగా భావిస్తే రసభావాలు. మరో మెట్టు పైకెళ్ళి నిర్వికారంగా గ్రహిస్తే రసానందాలు. హాసం నుంచి జుగుప్సదాకా ఉన్న భావోద్రాకాలన్నీ అవశ్యం అనుభవంలోకి వచ్చే వికారాలే. వాటికి బయటి స్థితి శాంతం. దాన్ని కూడా ఒక లౌకికభావ భేదంగా గ్రహిస్తే 'హాస్యం' నుంచి 'శాంతం' దాకా సకల భేదాలు జీవతత్వానికి విపుల వ్యాఖ్యాలు జీవచేతనకు బహిరావర్తనలు.

జీవచేతనకు మొదటి స్తరం నిర్వికారమైన హాస్యమైతే, ఆఖరి స్తరం శాంతం. శిశుస్థితిలో బహుశః ఈ రెండే నిరామయంగా ఉంటాయేమో! జీవుడు ఎదిగేకొద్దీ అంటే వివిధ జీవన వికారాలకు లోనయ్యేకొద్దీ, క్రమక్రమంగా ఇతర భావోత్కర్షలు పొటమరిస్తాయి. ఇందులో హాసం, శృంగారం ఒక జంట. తుది, మొదలును కలిపే జంట. ఆహార, విహారాది వికారాలకు ఆలవాలమైనది 'హాస'మయితే (నాట్యశాస్త్రం మేరకు) అన్ని వికారాలను అధిగమించినది శాంతం. అది ఎంత ఆకరు పరిణతో అంత ప్రాథమిక స్వాభావికరీతి కూడా. అందుకే దాన్ని 'తురీయ' మంటున్నది. ఈ మధ్యలో ఉన్న శృంగార లేక కరుణాదులన్నీ వివిధ వికారాల క్రమానుగతులే. అన్ని క్రమగతులను లోనుంచుకొన్న ప్రాథమికపు జిత హాస్య, శాంతాలు. శిశువులో 'జ్ఞాత స్థితి' మొలకెత్తినప్పటినుంచీ, వీటి స్పర్శ కూడా అజ్ఞాతంగా మొదలవుతుంది. శృంగారంకు Sex అనేది చాలా ముదనష్టపు అనువాదం. ఒక పార్శ్వాన్ని అది ప్రతిఫలిస్తున్నది కనుక, పాక్షిక అనువాదంగానైనా దాన్ని అంగీకరించామంటే, అది శిశువులో 'జ్ఞాతస్థితి'తోపాటు మొదలయ్యేది ఎంత వాస్తవమో, సిగ్మండ్ ఫ్రాయిడ్‌ని కొద్దిగా మార్చుకొని అన్వయించుకొంటే అర్థమవుతుంది. ఆయన ఆకలి, కామ భావనలు శిశుస్థితిలోనే తొంగిచూసే అతి సహజేచ్ఛలు అంటాడు. ఆయన చూసింది భౌతిక తనువు వరకే. భావాంకుర స్థితిని కాదు. భావాంకురత లేని శిశువు అలాంటి నిర్మలమైన హాస్య, శాంత ముద్రలను చూపలేదు. తను, మనస్థితులను పాలించే జీవచేతన (ఆత్మ)ను చూసే భరతయోగి క్రైస్తవ మతబద్ధులైన పాశ్చాత్యులు అందుకోలేని సమున్నత స్థితిలో, జీవుడు శిశు స్థితి నుంచి పొందే జీవావరణలను, భావావరణలను దర్శించడానికి కృషిచేశాడు. పరిణామ క్రమాన్నిబట్టి ఒక్కొక్క ఆవరణలో జీవుని ప్రగతి ఉంటుంది. నిజమైన ప్రగతియైన 'పరిణతి' సాధించినవాడు, నిస్సంగతలో రసానందాన్ని అనుభవిస్తాడు. 'నిమగ్నత'ను అభినయిస్తాడు. తెలిసి చేసే అభినేత ఉత్తమ నటుడు, అది తెలియచెప్పేది 'నాటకం'. దానికి సంబంధించిన సమగ్ర శాస్త్రం నాట్యశాస్త్రం. మరోమాటలో సమగ్ర జీవన సౌందర్య శాస్త్రం.

ఈ మర్మమెరిగినవాడు ఉత్తమ నటయోగి.

జీవితంలో చాలా కొద్దిమందిని మాత్రమే అటువంటి వారిని చూస్తాం.

జీవిత కాల సాధనతో ఒక నటుడు సాధించగలిగే అత్యున్నత పదం – నటయోగి.

ముందుతరంలో ఏ చిత్తూరు నాగయ్యవంటి మహానుభావులకో చెల్లే పదం. ఆయన ఏ పాత్రను అభినయిస్తున్నప్పుడైనా ఆ కంటి తళుకును, పెదవి విరుపును, అప్పుడు ధ్వనించే భావముద్రను చూస్తే ఆ మాట అర్థమవుతుంది. ఆ అర్థంచేసుకొని ఔరా అనడమే రసానందం. ఆ రసానందం పొందడం చూస్తున్న సహృదయునివంతు; ఆ భావ స్థాయీ స్థితిని చూపెట్టడం ఆయనవంతు.

లౌకిక అనుభవంలో, అలౌకిక ఆనంద సిద్ధిని తెలియచెప్పడమే భరతయోగి ఆశయం. నిస్సంగత పాటించి, నిమగ్నతను అభినయించ నేర్పించడమే భారతీయ నాటక శాస్త్ర లక్ష్యం. వస్తుతః భారతీయ తత్వదర్శనానికి నాట్యశాస్త్రం అనువర్తిత విస్తరణే.

అంత లోతైన భారతీయ 'నాటక' దృష్టికి – ఈ చిన్న వివరణ అందులోని ఒక చిన్న పార్శ్వానికి మాత్రమే పరిమితమైనది... మి

**(భరతుడు : అరిస్టాటిల్ - *నటుడు : నాటకం* అనే అముద్రిత రచన నుంచి)**

**ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ**
**హైదరాబాద్. ఫోన్ : 94 41 80 95 66**



# చాట్ల జ్ఞాపకాలు

*- గొల్లపూడి మారుతీరావు*

1959 వేసవి శెలవుల్లో ప్రముఖ నటుడు కె. వెంకటేశ్వరరావు ఇంట్లో ఉండి నా 'రాగ రాగిణి' నాటకం రెండో వెర్షన్ రాస్తున్నాను. విజయవాడలో కనకదుర్గ గుడి మెట్ల పక్కన వెంకటేశ్వరరావు ఇల్లు. అప్పుడు చాట్ల శ్రీరాములు పరిచయం. నా వయస్సు అప్పటికి 19 నిండింది. శ్రీరాములు వయస్సు 28. నా చుట్టూ కళ్లు మిరుమిట్లు గొలిపే ప్రతిభావంతులు. అతిరథులు, కె. వెంకటేశ్వరరావు ఆనాటికే అమెచ్యూర్ నాటకరంగంలో మకుటంలేని మహారాజు. అప్పటి రచన సమాఖ్య నాటక సమాజంలో అందరూ మహానటులు. జి.ఎస్.ఆర్. మూర్తి, జి.వి. సుబ్బారావు, రాఘవరావు, శ్రీరాములు, పొట్టిప్రసాద్, శివరామిరెడ్డి - వీరంతా నాటకరంగంలో స్టార్స్. వెంకటేశ్వరరావు బాపట్లలో కొర్రపాటి గంగాధరరావు నేతృత్వంలో (?) కొడాలి గోపాలరావు 'దొంగవీరడు' ప్రదర్శించినప్పుడు నేనున్నాను. అప్పుడే రంగప్రవేశం చేసిన మరొక నటుడు రాజబాబు. నేను 'రాగరాగిణి' రాసే రోజుల్లో వెంకటేశ్వరరావు ఇంటి కిటికీ దగ్గర మెరుపులాగ కనిపించి, తనకోవేషం రాయమని మాయమయిపోతూ ఉండేవాడు రాజబాబు.

చివరి రోజుల్లో ఓసారి మద్రాసు 'హోటల్ మారిస్' లిఫ్టులో కనిపించాడు. మత్తులో ఉన్నాడు. అప్పటికి లబ్ధప్రతిష్టుడు. పెద్ద స్టార్ (గొప్ప టైమింగ్ ఉన్న గొప్ప హాస్యనటులలో ఒకడు రాజబాబు) కెరీర్ చివరిరోజులవి. మళ్ళీ అడిగాడు 'నాకో మంచి వేషం రాయండి గురువుగారూ' అని. జీవితం ఒక విచిత్రమైన వలయం. ఈ రెండు విజ్ఞప్తుల మధ్య రాజబాబు కెరీర్. నా సమాధానం గుర్తుంది. ''రాజబాబుకి మంచి వేషం ఇందులో ఉందా? అని ప్రొడ్యూసర్లు అడిగే పరిస్థితి. మీరు అడగాల్సిన స్థితికి వచ్చారు" అన్నాను బాధగా. లిఫ్టు నేలమీద వాలింది. నవ్వేశాడు.

సరే. ఇది విషయాంతరం. చాట్ల 'దొంగవీరడు'లో వేశాడేమో. గుర్తులేదు. కానీ ఆ రోజుల్లోనే పరిచయం. ఆ తరం నటులంతా ఒక ఉద్యమానికి ఉద్యుక్తులయిన యోధులలాగ కనిపించేవారు. నా రచనాకాలంలో దాదాపు ప్రముఖమయిన నాటకాలన్నీ కేవలం ప్రయోక్తల్ని దృష్టిలో పెట్టుకుని రాసినవే. 'రాగరాగిణి', 'మహానటుడు', 'సత్యంగారిల్లెక్కడ' కె. వెంకటేశ్వరరావుకోసం రాసినవి. ఆఖరి నాటకం వెంకటేశ్వరరావు వెయ్యలేకపోయాడు అనారోగ్యం కారణంగా. తర్వాత శ్రీరాములికి ఇచ్చాను.

'లావాలో ఎర్రగులాబి', 'సత్యంగారిల్లెక్కడ', 'జగన్నాటకం', 'గో టు హెల్' - ఈ నాలుగు నాటకాలూ శ్రీరాములు కోసం రాశాను. 'రెండు రెళ్లు ఆరు', 'కళ్ళు', 'కరుణించని దేవతలు' (నాటకం), బి.వి. రామారావు కోసం రాశాను. మరొక మంచి నాటిక 'ప్రశ్న', మిత్రుడు జవ్వాది రామారావు కోసం రాశాను. నన్ను విజయవాడ రైల్వేస్టేషన్ మేడమీద గదిలో కూర్చోబెట్టి రాయించుకున్నాడు. విశేషమేమంటే - నేనే తన కోసం రాయని నాటిక 'పతిత'ని నిడదవోలు చుట్టుపక్కల పరిషత్తులన్నింటిలో ప్రదర్శించి బహుమతులు పుచ్చుకున్నాడు కానీ, తనకోసం రాయించుకున్న 'ప్రశ్న'ని ఒక్కసారీ ప్రదర్శించిన గుర్తు లేదు. అది నాకు ఇష్టమయిన రచన. ఆ రచనకు 'మహాత్మాగాంధీ అవార్డ్ ఫర్ క్రియేటివ్ లిటరేచర్' బహుమతిని కేరళ సంస్థ ఏదో ఇచ్చింది. తనకోసం రాయని నాటిక 'కళ్ళు'ని వెంకటేశ్వరరావు ప్రదర్శించాడు.

నా రచనలన్నీ పాషాణాలు కావు. ఒకంతకు లొంగేవి కావు. ఎందుకంటే ఆయా ప్రయోక్తల శక్తిసామర్థ్యాలను దృష్టిలో పెట్టుకుని రాసిన రచనలవి. 'అనంత', 'ఆశయాలకు

సంకెళ్ళు', 'దొంగగారొస్తున్నారు స్వాగతం చెప్పండి' వంటి రచనలు ఎవరయినా, ఎప్పుడయినా వేసుకోగలవి. దాసరి, కోడి రామకృష్ణ, రంగనాథ్, మరళీమోహన్, గిరిబాబు, అన్నపూర్ణ, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం, ముదిగొండ వీరభద్రశాస్త్రి, కె.వి. రమణాచారి వంటివారెందరో ప్రదర్శించారు.

వెంకటేశ్వరరావు ప్రతిభ స్వయం సంపాదితం. అతని పెట్టుబడి గొప్ప Instinct. శ్రీరాములు దరిమిలాను ఇంగ్లండు వెళ్ళి సాంకేతికపరమైన విజ్ఞానాన్ని సమకూర్చుకున్నాడు. అతని ప్రయోగాల్లో ప్రొఫెషనల్ మెరుగులు నాకు ఎక్కువగా కనిపిస్తాయి.

ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ పౌరసంబంధాల శాఖ నిర్వహించిన నాటక రచనాపోటీలకు (దాదాపు 50 ఏళ్ల కిందటి మాట) ఒక నాటకం రాశాడు – భారత చైనా యుద్ధం అప్పటి ఇతివృత్తం. నాటకం పేరు "మరి చీకటి రాదు". నాకు బహుమతి రాలేదు. కానీ నాకే ప్రథమ బహుమతిని నిర్ణయించారు న్యాయనిర్ణేత కె.వి. గోపాలస్వామిగారు. చాలాకాలం తర్వాత ఆయన్ని కలసినప్పుడు నన్ను అభినందించారు బహుమతి వచ్చినందుకు. నాకు బహుమతి ఇవ్వలేదని తెలిసి ఆశ్చర్యపోయారు. ఆ రోజుల్లోనే శ్రీరాములు ఇంగ్లండులో నాటకాల కోర్సు పూర్తిచేసుకు వచ్చాడు. అతన్ని దృష్టిలో పెట్టుకొని ఆ నాటకాన్ని తిప్పిరాశాను. అదే 'లావాలో ఎర్రగులాబి'. తన పరిణతినంతా ఉపయోగించి నిర్వహించిన నాటకం అది. ఆ నాటకాన్ని చూసి ముగ్ధులయి అతి హృద్యమైన ముందుమాట రాశారు మిత్రులు సి. నారాయణరెడ్డి గారు. ప్రదర్శన అద్భుతం. ఈ మధ్య విద్యాసాగర్, తన అంగవైకల్యంతోనే ఆ నాటకాన్ని ప్రదర్శించాడు – వీలయినంత మెరుగుగా.

'లావాలో ఎర్రగులాబి' రోజుల్లోనే ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగంలో చేరాడు. ఆ నాటకం 'ముందుమాట' రాస్తూ – ఎప్పుడూ చక్రాల మీద ఉండే జీవితాన్ని వదలి (శ్రీరాములు రైల్వేలో గార్డుగా పనిచేశాడు) నాటక రంగానికి సేవచెయ్యగల ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉద్యోగాన్ని చేపట్టే సమయంలో మిత్రులు శ్రీరాములుకి నా శుభాకాంక్షలుగా ఈ నాటకాన్ని అందజేస్తున్నాను. శ్రీరాములూ! ఆధునిక నాటకరంగం ఇంకా రూపుదిద్దుకుంటున్న సమయంలో పుట్టాం. అది మన దురదృష్టం. తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలు చరిత్రలో మిగలరు. కానీ ముందుతరాల ముందు నిలవబోయే తాజ్‌మహల్‌కి తాపీ పనిచేసే అవకాశం మనకి దక్కింది. Let us die with humility for the theatre of tomorrow. అదే మన అదృష్టం అన్నాను. సరిగ్గా శ్రీరాములు అదే పనిచేశాడు. శ్రీరాములు Humility కి ప్రతిరూపం. ఈ తాజ్‌మహల్‌కి మహాశిల్పి.

చాట్ల బెర్టోల్ట్ బ్రెక్ట్, ప్రింటర్, బెన్ క్లార్క్ వంటి ఎందరో రచయితల రచనలు – బాదల్ సర్కార్, విజయ్ తెందూల్కర్ వంటి భారతీయ రచయితల తెలుగుసేతల్ని ప్రదర్శించాడు. నాటకరంగాన్ని ఒక ఉద్యమం చేసుకున్న వ్యక్తి. అతని ఉద్యోగమూ, అభిరుచీ ఒకటే కావటం నాటకరంగానికి దక్కిన అదృష్టం.

శ్రీరాములు నా వ్యాస సంపుటిని సమీకరించి ప్రచురణకు కారణమయాడు. దానికి ముందుమాటని రాశాడు. ఇటీవల అతని వ్యాస సంపుటికి నేను ముందుమాట రాశాను. ముగింపు వాక్యాలు ఇంకా గుర్తున్నాయి. "గత 60 సంవత్సరాల తెలుగు నాటకరంగంలో ప్రభావాలు, ప్రయోగాలు, వినిపించిన గొంతులు, వేసిన అడుగులను గుర్తుపట్టాలంటే చక్కని రిఫరెన్సు పుస్తకం చాట్ల జ్ఞాపిక. ఇది కేవలం జ్ఞాపిక అని సరిపెట్టుకుంటే చాలదు. 'కరదీపిక' అనాలనిపిస్తుంది నాకు. నాటకరంగానికి చెందినవాడిగా చాట్లతో ఒక్కమాట: "థ్యాంక్స్ చాట్ల. You owe this to us. To the theatre you served all your life."

2012 జూన్‌లో విశాఖపట్నం కళాభారతిలో 'గో టు హెల్' నాటకాన్ని ప్రదర్శింపచేశాడు శ్రీరాములు. బహుశా అది అతని ఆఖరి ప్రయోగమేమో. 'గో టు హెల్' నాటకం. అదిన్నీ శ్రీరాములు నటించని నాటకం అనగానే భయపడ్డాను (కృష్ణేశ్వరరావు శ్రీరాములు వేషాన్ని చూశాడు). తీరా నాటకాన్ని చూశాక – ప్రయోక్త శ్రీరాములుకి వయస్సు మీద పడలేదని అర్థమయింది. 15 సంవత్సరాల ప్రదర్శన కళ్ళముందు కదులుతుండగా కళ్ళనీళ్ళతో ఆద్యంతమూ చూశాను. నా రచనలను అపురూపమయిన జ్ఞాపకాలుగా, అనుభూతులుగా తీర్చిదిద్దిన ప్రయోక్తలలో ప్రథముడూ, ఆఖరి ప్రయోక్తా శ్రీరాములు. ఎందుకంటే అతనికోసమే ఎక్కువ రచనల్నీ, ఎంతో వివాదాస్పదమైన గడ్డు నాటకాల్ని రాశాను. నా 'గో టు హెల్' నాటకాన్ని ప్రదర్శించడం ఒక సాహసం – రచన దృష్ట్యానూ, ఇతివృత్తం దృష్ట్యానూ. కాని నా అంత ధైర్యంగా నిలబడిన ప్రయోక్త శ్రీరాములు. ఆ నాటకం మీద

*హిందూ* పత్రిక సమీక్ష వినదగ్గది. "Some plays delight and some provoke but a few make the viewers think and one such is Gollapudi Maruthirao's *Go to Hell* that drew a full house at Kalabharati, Visakhapatnam... With every frame bearing a stamp of Chatla's directorial acumen, it was a theatre buffs' delight."

అలాంటి దమ్మున్న ప్రయోక్తలు, నటులు అరుదు.

శ్రీరాములు వ్యక్తిగతంగా నాకు ఆప్తుడు. మా కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. నా తమ్ముడు, నా కొడుకు, నా భార్య – అందరూ వాడికి దగ్గరవారే. మా నాన్నగారికీ, అమ్మకీ కూడా. అతను రైల్వేలో పనిచేసే రోజుల్లో ఖాజీపేటలో ఉండేవాడు. హనుమకొండ మా అత్తవారి ఊరు. మా మామగారితో కలిసి శ్రీరాములు ఇంటికి వెళ్ళిన జ్ఞాపకాలున్నాయి. నాకంటే 9 ఏళ్ళు పెద్ద. నాకు 'నువ్వు' అని పిలిచే చొరవనిచ్చినవాడు. ఆ మధ్య నా 'గో టు హెల్' నాటకం మీద మా పెద్దబ్బాయి సుబ్బారావు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషులో ఎంఫిల్ చేస్తుంటే అతని పిలుపున ఉదయం హైదరాబాదు నుంచి వచ్చి సాయంకాలం వరకూ తన అనుభవాలను చెప్పి శ్రీరాములు వెళ్లాడట. తర్వాత మా అబ్బాయి చెప్పాడు.

ఆ మధ్య శ్రీరాములు కొడుకు చాలా దురదృష్టకరమైన పరిస్థితుల్లో కన్నుమూశాడు. శ్రీరాములు ఫోన్ చేసి 'నీ కష్టం నాకూ వచ్చిందిరా' అన్నాడు, వెళ్ళాను. మా అబ్బాయి నన్ను హెచ్చరిస్తూనే ఉన్నాడు. శ్రీరాముల్ని పలకరిస్తూ దుఃఖాన్ని ఉగ్గపట్టుకోగలిగాను. వాడి భార్యని చూడగానే దుఃఖం కట్లు తెంచుకుంది. ఆవిడ ఏడుపుతో నేనూ కలిసిపోయాను. శ్రీరాములు నా భుజం మీద చెయ్యి వేసి నన్ను లాగాడు. "ఒరేయ్! నువ్వు పోరా" అని నన్ను బయటికి గెంటేశాడు. దుఃఖం దగ్గర నేను బేషరతుగా ఓడిపోయాను. కాని శ్రీరాములు అనే ప్రయోక్త ధైర్యంగా నిలిచాడు.

వృద్ధాప్యం శ్రీరాములుని లొంగదీసింది. చేతికర్రతో వొంగి నడిచే శ్రీరాములు నాలాంటివాళ్ళకి దయనీయమైన దృశ్యం. శ్రీరాములు నాకు 'లావా', 'జగన్నాటకం' 'జగన్', 'ఇబ్బన్' పాత్రకు వారసుడుగా నిలిచిన నా 'సత్యం' ('సత్యంగారిల్లెక్కడ').

శ్రీరాములు గంభీరమైన వ్యక్తి. ఉదాత్తతకి మారుపేరు. నిగర్వి. ఏనాడూ అహంకారాన్నో, తన ప్రతిభనో చాటుకోని వ్యక్తి. నిన్నటి తరం పరిణతికీ, పరిపూర్ణమైన ప్రతిభకీ, అవ్యాజమైన స్నేహానికీ, ఆప్యాయతకీ మారుపేరు.

నా నాటక రచనకి ఆఖరి ప్రయోక్త చాట్ల శ్రీరాములు వెళ్ళిపోయాడు. అతని సంతాప సభలో ఎవరో నన్ను ఆటోగ్రాఫ్ అడిగితే "శ్రీరాములు నా ఆఖరి ప్రయోక్త. నా నాటక రచనకూ ఇది ముగింపు" అని రాశాను. నా రచనల్ని ఉయ్యాలలో ఊరేగించిన అపూర్వమైన ప్రయోక్తల తరమది.

దువ్వూరి రామిరెడ్డిగారి మాట పదేపదే మనస్సులో కదులుతుంటుంది.

"మనమునకెక్కినట్టి యభిమానులు మిత్రులు చెల్లినారు,
యౌవన మధుమాసమున్ కుసుమభారము రాలిచిపోయె..."

*వృద్ధాప్యం అంటే శరీరాలు అలసిపోవడం కాదు. వయస్సు మీదపడటం కాదు. మనతో అనుభూతుల్ని పంచుకున్న స్నేహితులు మన నుంచి శలవు తీసుకొని వెళ్ళిపోవడం. మన చుట్టూ స్నేహసౌరభం ఖాళీ అవడం. ఇది భరించరాని ఒంటరితనం. అలా వెళ్ళిపోయిన అత్యంత ఆత్మీయుడు చాట్ల.*

ము

# వేదిక

## యాత్ర ముగింపు

**గు**రజాడ అప్పారావుగారు వెళ్ళిపోతున్నారని తెలిసినప్పుడు కుటుంబ సభ్యులు వైద్యుడిని పిలిపించారట. అప్పారావుగారు వైద్యుడిని చూసి "తాంబూలం వేసుకోవాలని ఉందయ్యా" అన్నారట. వైద్యునికీ పరిస్థితి తెలుస్తోంది. తాంబూలం ఇచ్చారట. వేసుకున్న తర్వాత ఆయన శాశ్వతంగా

వెళ్ళిపోయారు. మొన్న అప్పారావుగారి శతవర్ధంతి సభలో ఆయన మునిమనుమడి భార్య ఈ విషయాన్ని చెప్పారు.

ప్రముఖ రచయిత కుష్వంత్‌సింగ్ తల్లి 94 సంవత్సరాలు బతికారు. ఆమె పక్కన కూర్చుని కుష్వంత్ సింగ్ తల్లిని అడిగారట – ఏం కావాలని. ఓ పెగ్గు స్కాచ్ కావాలన్నారట ఆమె.

ఒంగోలులో మా మిత్రుడి తండ్రిని చివరి రోజుల్లో నేను చూశాను. చాలా నెలల తర్వాత మా మిత్రుడు ఫోన్ చేశాడు – నాన్న వెళ్ళిపోయాడని. చివరి క్షణాల్లో కొడుకుని పిలిచి – ఓ గ్లాసుతో బ్రాందీ కావాలన్నారట. తాగి, ఒక సిగరెట్టు కాల్చి హాయిగా కన్నుమూశాడు.

మృత్యువుని మజిలీగా గుర్తుపట్టటం గొప్ప సంస్కారం. మృత్యువుని సెలబ్రేట్ చేసుకోవటం ఇంకా గొప్ప సంస్కారం. దుఃఖం ఒక దృక్పథం. నిర్వేదం ఒక బలహీనత. భారతీయ సంస్కృతి మనిషి పుట్టినప్పటినుంచీ ఒక ఆలోచనకు మనల్ని తరిఫీదు చేస్తుంది. ఏదో ఒకనాడు వెళ్ళిపోక తప్పదని. కొందరు ఆ క్షణాన్ని గంభీరంగా ఆహ్వానిస్తారు. కొందరు బెంబేలు పడతారు. కొందరు బేల అవుతారు.

ప్రఖ్యాత అమెరికన్ టెన్నిస్ ఆటగాడు *ఆర్థర్ ఆష్* కి ఎయిడ్స్ వ్యాధి వచ్చింది. 1983లో గుండెకి శస్త్రచికిత్స జరిగినపుడు శరీరంలోకి ఎక్కించిన రక్తం ద్వారా ఈ వ్యాధి సంక్రమించి, చావు తప్పదని అర్థమవుతోంది. అభిమానులు దుఃఖంతో గుండెపట్టుకున్నారు. ఎందరో ఉత్తరాలు రాశారు. ఒక అభిమాని అన్నాడు – "ఇంత దారుణమైన రోగానికి దేవుడు మిమ్మల్నే ఎందుకు గురిచేయాలి" అని.

దీనికి *ఆర్థర్ ఆష్* ఇలా సమాధానం రాశాడు :

"ఈ ప్రపంచంలో 5 కోట్ల మంది పిల్లలు టెన్నిస్ ఆడుతున్నారు. 50 లక్షల మందికి టెన్నిస్ వంటబట్టింది. 5 లక్షల మంది ప్రొఫెషనల్‌గా టెన్నిస్‌ని ఆడగలుగుతున్నారు. 50 వేల మంది టెన్నిస్ పోటీ టోర్నమెంట్‌లలో ఆడుతున్నారు. 50 మంది మాత్రమే వింబుల్డన్ స్థాయికి వచ్చారు. నలుగురే సెమీఫైనల్స్‌కి వచ్చారు. ఇద్దరే ఫైనల్స్‌కి వచ్చారు. నేను చాంపియన్‌షిప్‌ని సాధించి, వింబుల్డన్ కప్పుని గెలిచి, చేత్తో పట్టుకున్నప్పుడు నేను దేవుడిని అడగలేదు. 'ఎందుకయ్యా నన్నొక్కడినీ ఎంపిక చేశావు' అని. ఇప్పుడు కష్టంలో ఉండి 'నాకే ఎందుకు ఈ అనర్థాన్ని ఇచ్చావు' అని దేవుడుని అడిగే హక్కు నాకేముంది?"

*ఆకెళ్ళ అచ్యుతరామమ్* గారు రైల్వేలో పెద్ద ఆఫీసరుగా చేశారు. రామాయణాన్ని 'రగడ' వృత్తంలో రాశారు. ఆదిశంకరుల రచనల్ని, త్యాగరాజ భక్తితత్వాన్ని రచనల ద్వారా నిరూపించారు. 1984 ఫిబ్రవరి 12 ఉదయం సికింద్రాబాదులో వారి అమ్మాయి కొత్త ఇంటికి శంకుస్థాపన. శుభకార్యానికి తెల్లవారుఝామున ఒక బాచ్‌ని దింపి ఇంటికి వస్తున్నారు. దారిలో గుండెపోటు వచ్చింది. సికింద్రాబాద్ టాడ్‌బండ్ దగ్గర ఉన్న పురాతన ఆంజనేయస్వామి గుడి ముందు కారుని పక్కకి ఆపి, పార్కింగు దీపాలు వెలిగించి, కారు తాళంచెవులు జేబులో వేసుకుని, స్టీరింగు మీద తల ఆనించి వెళ్ళిపోయారు. రామభక్తుడికి మృత్యువు ఆంజనేయుడి సమక్షంలో ఒక యాత్ర.

ఒక విచిత్రమైన సంఘటన. మా వియ్యపురాలి తండ్రిగారు దాదాపు 69 ఏళ్ళ కిందట విజయవాడలో పి.డబ్ల్యూ.డి. లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు. విజయవాడ రేడియో స్టేషన్ పాత బంగళాలో ఉండేవారు. చల్లా వెంకటరత్నం గారు వారి తండ్రిగారు. రామభక్తుడు. శ్రీరామనవమి నవరాత్రులలో ఆయన పూజలుచేసి, ప్రవచనాలు చెప్పించేవారు. ఆ సంవత్సరం మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారు (అప్పట్లో వారు ఇరవైయ్యవ పడిలో ఉండి ఉంటారు) రామాయణం చెప్తున్నారుజ ఉదయం కళ్యాణం జరిగింది. సాయంకాలం ప్రవచనం. జటాయు నిర్యాణం గురించి చెప్తున్నారు శాస్త్రిగారు. వెంకటరత్నం గారు స్థంభానికి చేరబడి కూర్చుని వింటున్నారు. జటాయువు 'రామా! రామా!' అంటూ ప్రాణాలు విడిచిపెట్టాడు – అన్నారు శాస్త్రిగారు. "జటాయువు వెళ్ళిపోయాడా?" అన్నారు వెంకటరత్నంగారు. అవునన్నారు శాస్త్రిగారు. అంతే, స్థంభానికి ఆనుకున్న వెంకటరత్నంగారి తల వాలిపోయింది. వెళ్ళిపోయారు. దాదాపు 21 ఏళ్ళ కిందట మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారు సికింద్రాబాదు మెహబూబ్ కాలేజీలో మహాభారత ప్రవచనం చెప్తూ ఈ ఉదంతాన్ని చెప్పారు. వెంకటరత్నం గారికి మృత్యువు ఒక ముహూర్తం.

చాలామందికి మృత్యువు ఒక మజిలీ. కొందరికి ఆటవిడుపు. మహాయోగులకి నిర్యాణం. కొందరికి ఐహికమైన 'మోజు'లకు విడాకులు ఇచ్చే ఆఖరి క్షణం. కొందరి అదృష్టవంతులకు మరో గమ్యానికి చేరే వంతెన. మి

గొల్లపూడి మారుతీరావు

విశాఖపట్నం

# మొరసునాటి తెలుగువారి స్థితిగతులు

- కొసరాజు వెంకటేశ్వరరావు

*(ఈ వ్యాసకర్త తమ మిత్రుడు, కవి అయిన అమరనారా బసవరాజు గారి వివాహానికి హోసూరు (తమిళనాడు) నవంబరు నెలలో వెళ్ళిన సందర్భంలో హోసూరు, డెంకణికోట (కృష్ణగిరి జిల్లా) తాలూకాలలోవున్న అనేక గ్రామాలు సందర్శించి, అనేకమంది కవులను కలిసి అక్కడ తెలుగువారు అనుభవిస్తున్న అనేక బాధలను, వారి స్థితిగతులను తెలుసుకున్నారు.)*

"మొరసు" అంటే గులకరాతి నేల అని తెలుగులో అర్థం. కన్నడంలో "మొరసు" అనే మాటకు అర్థం లేదు. కాని "మొరసు" అనే పదానికి "రాళ్ళుగుట్టలతో నిండిన ప్రదేశం'' అని అర్థం. చరిత్రలోకి చూస్తే గాంగరాజ వంశీయులకు, రాష్ట్రకూటులకు మధ్య జరిగిన అనేక పోరాటాల ప్రదేశంగా కనిపిస్తున్నది. ఆ ప్రదేశంలో లభించిన శిలాశాసనాలలో ఈ ప్రాంతాన్ని ''సణ్ణనాడు'' అని పేర్కొన్నట్లుగా తెలుస్తున్నది.

చోళులు ఈ ప్రాంతాన్ని చోళమండలం అని వ్యవహరించగా, నోళంబులు దీనిని నోళంబవాడిగా పేర్కొన్నారు. మొరసునాడు అనే పదం క్రీ.శ. 9 వ శతాబ్దపు శిలాశాసనాలలో మొదటిసారిగా మనకు వినిపిస్తుంది. మొరసునాడులోనే యలహంకనాడు (బెంగుళూరు), కూవూరునాడు, చీకలనాడు, హరుహనాడు వంటి చిన్న నాడులు కూడా వుండేవి.

శ్రీనాథ కవి మొరసునాడు గురించి వ్రాస్తూ ఈసడించుకున్నట్లుగా ఆయన రచించిన పద్యమును బట్టి అర్థం చేసుకోవచ్చును. మొరసునాడు ప్రస్తుతం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడులో భాగాలై, మూడుముక్కలైంది.

ఆంధ్రప్రదేశ్‌లోవున్న ప్రాంతాలు పాత కుప్పం, చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, హిందూపురం, మదనపల్లె తాలూకాలలో చేరగా, కర్ణాటకలో కోలారు, చిక్కబళ్ళాపూర్, బెంగుళూరు, ఆ జిల్లాలోనేవున్న దొడ్డబళ్ళాపూర్, దేవునిపల్లి (దేవనహళ్ళి), హోసకోట, గౌరీబిదనూరు, చింతామణి, అనేకల్ తాలూకాలలో చేరగా, తమిళనాటిలో హోసూరు, డెంకణికోట తాలూకాలు, వేసవిపల్లి ఫిర్కాలో వున్న గ్రామాలే వకప్పటి మొరసునాడు. తొలినాటి నుండి పాలకునిబట్టి సరిహద్దులు మారుతూవుండి ప్రస్తుతం ఛామరాజ నగర్‌లు జిల్లా తుమకూరు (తుంకూరు) జిల్లాలోని మధుగిరి, కొరటగిరి అలాగే రాయవేలూరు తాలూకాలోని గడిఅయాత్తం, ధర్మపురి వరకు అనంతపురం జిల్లాలోని పెనుకొండ, కడప, కర్నూలు జిల్లాలు (రేనాడు), చిత్తూరు జిల్లాలోని మదనపల్లె వరకు వ్యాపించి వుండేవి. మొరసునాడులో 9 వేల ఊళ్ళు వుండేవని ఒక కన్నడ శాసనంలో వున్నదని స.వెం. రమేశ్ మరియు స. రఘునాథ్ వ్రాసిన "మొరసునాడు కతుల" అనే గ్రంథంలో తెలియచేశారు.

ఇప్పుడు ఆంధ్ర రాష్ట్రంలో మండలాలుగా వున్న గుడిపల్లి, కుప్పం, శాంతిపురం, రామకుప్పం, వెంకటగిరి కోట, బైరెడ్డిపల్లి, పలమనేరు, గంగవరం, పెదపంజాణి, సోమల, చౌడేపల్లి, పుంగనూరు, రామసముద్రం, మదనపల్లి, నిమ్మనపల్లి, కురబలకోట, కొత్తకోట, పెద్దతిప్ప సముద్రం, హిందూపురం, చిలమత్తూరు, లేపాక్షి మొదలైన ప్రాంతాలు మొరసునాటి ప్రాంతాలే అని శాసనాల ద్వారా తెలుస్తున్నది.

మొరసునాడు సముద్రానికి 2,500 అడుగుల ఎత్తులో వుంటుంది. మండే వేసవికాలంలో కూడా ఇక్కడ వేడి $35^0$ డిగ్రీల సెంటిగ్రేడుకు మించదు. మొత్తంమీద ఈ ప్రాంతం సంవత్సరమంతా సమశీతోష్ణంగా వుంటుంది. ఈ ప్రాంతంలో వర్షాకాలంలో మంచి వర్షాలు కురుస్తాయి. ఏనుగు మల్లమ్మ

కొండ (హార్స్‌లీ హిల్స్), నందికొండతల్లి (తళి)లాంటి వేసవి విడుదులు సముద్ర మట్టానికి సుమారు 3,500 అడుగుల ఎత్తులో వున్నాయి. నంది కొండలలో పుట్టిన పెన్నేరు నది రెండు పాయలుగా చీలి ఉత్తరపు పాయ అనంతపురం (పెన్నా), కడప, నెల్లూరు జిల్లాలను సస్యశ్యామలం చేయగా, దక్షణపు పాయ కృష్ణగిరి, ధర్మపురి తిరువణ్ణామలై, విల్లుపురం, కడలూరులను తాకుతూ పోతున్నది. ఇదేకాక పాపాగ్ని, చిత్రావతి నదులు మొరసునాటిలో పుట్టి ప్రవహిస్తాయి.

మొరసునాడులో సుమారు 18 కోట్ల తెలుగు ప్రజలు వుండేవారంటే అతిశయోక్తి కాదేమో. ఈ ప్రాంతంలో నూటికి 50 మంది తెలుగువాళ్ళు, 30 మంది కన్నడిగులు, 10 మంది తమిళులు, మిగిలిన 10 మంది వేరే భాషలవారు నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్నవారిలో మొరసు అనే పేరును తగిలించుకున్న కులాలు మూడు కనిపిస్తాయి. అవి మొరసుకాపు, మొరసుమాల, మొరసు శ్రీవైష్ణవ కులాలు. చివరి రెండు కులాలు మొరసునాడంతా లేరు.

మొరసు కాపులు (వీరిలోనే రెడ్డి, కమ్మ, గౌడ, బలిజ, వెలమలు కూడా వున్నారు) ఎక్కువ వున్నారు. మొరసునాడులో వున్న ప్రజలు తెలుగు, కన్నడం, తమిళం భాషలు ధారాళంగా మాట్లాడతారు. ఇక్కడ ముఖ్యమైన పంటలు రాగులు, అనుములు, నూవులు, మొక్కజొన్న మొదలైన అపరాలు పండుతాయి. చెరువుల క్రింద ఇప్పుడిప్పుడే వరి, చెఱకు కూడా పండిస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వం హోసూరులో అనేక పరిశ్రమలు స్థాపించి, ఆ ప్రాంతానికి తమిళులను ఎగుమతిచేసి, తెలుగువారి ఆధిక్యతను తగ్గించాలని చేయవలసిన ప్రయత్నాలన్నీ చేస్తున్నది. 1950 కు ముందు బజార్లో కూడా తమిళం మాట్లాడేవారు కనిపించేవారు కాదట. కానీ 1960 తరవాత సీను పూర్తిగా మారిపోయింది. తెలుగువారు తమ మాతృభాషను ఇంటివరకే పరిమితం చేసుకోవలసిన దుస్థితి దాపురించింది.

ఒకప్పుడు హోసూర్‌లో తెలుగులో కనిపించే బోర్డులన్నీ తమిళంలోకి మార్చబడినాయి. కొన్ని వందలుగా వున్న తెలుగు పాఠశాలలు పదుల స్థానానికి మార్చబడినాయి. 1956లో జరిగిన భాషారాష్ట్రాల విభజన సమయంలో ఈ ప్రాంతపు తెలుగువారికి ఘోరమైన అన్యాయం జరిగింది. తమ ప్రాంతాన్ని ఆంధ్ర రాష్ట్రంలో కలపమని ఎన్ని విజ్ఞప్తులు ఇచ్చినా ఎన్ని ఆందోళనలు చేసినా విన్న నాథుడే కరువయ్యాడు. కేంద్ర ప్రభుత్వం వారి ఆక్రందనలను, ఆక్రోశాలను పట్టించుకోలేదు. భాషాప్రయుక్త రాష్ట్రాల విభజన సందర్భంగా జరిగిన అవకతవకల్లో, అన్యాయంగా తోసివేయబడ్డ అనేక తెలుగు ప్రాంతాల్లో హోసూర్ కూడా అన్యాయానికి, అవమానాలకి గురైంది. కేంద్ర ప్రభుత్వం నియమించిన పటాస్కర్ కమిషన్ ఈ ప్రాంతంలో తెలుగువారే ఎక్కువగా వున్నారని, ఈ ప్రాంతాన్ని ఆంధ్ర రాష్ట్రంలో కలపాలని నివేదిక సమర్పించినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవటం తెలుగువారి దురదృష్టంగానే భావించాలి. ఎన్ని ఉద్యమాలు నిర్వహించినా హోసూరు ప్రాంతం తమిళనాడులోనే వుండిపోయింది. ఆనాటి మన రాజకీయ నాయకులు తమతమ స్వార్థ రాజకీయాల కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు చుట్టూవున్న (తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలలో వున్న ప్రాంతాలు) తెలుగు ప్రాంతాలను ఆంధ్రలో కలపాలని పట్టుపట్టకపోవటం తెలుగు జాతికి శాశ్వతంగా శాపమైంది.

మొరసునాడులో తెలుగువారు తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్న సంప్రదాయాలు, ఆచారాలు, విజ్ఞాన సంప్రదాయాలు ఇప్పుడు కనుమరుగు అయ్యే పరిస్థితి దాపురించింది. ఒకప్రక్క ఇంగ్లీషు, మరొకప్రక్క తమిళం చేరొక ప్రక్క చేరి తెలుగు భాషను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మొరసునాటి ప్రజల బ్రతుకులు వింతగా కనిపిస్తాయి. అవి ప్రక్కనే వున్న రాష్ట్రాలవారికి అంతుపట్టనంత గొప్పగా వుంటాయి. తెలుగు భాషోద్యమ నాయకుడు, గ్రంథకర్త స.వెం. రమేశ్‌గారి "కతల గంప"లోని అడివంచుపల్లె కతలో మొరసునాడులో వున్న తెలుగువారు "ఈడ పుట్టుక తెలుగు, సావు (చావు) తెలుగు, పుటక సావులకు నడాలనుండే బతుకంతా తెలుగే" అని భావిస్తారని తెలియచేశాడు.

దీనినిబట్టి ఈ ప్రాంతంలోవున్న తెలుగువారికి వారి మాతృభాషపై వున్న గౌరవం, భాషాభిమానం ఎంత గట్టిగా వుందో మనం అర్థం చేసుకోవచ్చును. తెలుగు రాష్ట్రాలలో నివసిస్తున్న తెలుగువారు, ఆంగ్ల, పారశీక, ఉర్దూ భాషల ప్రభావంతో, మరచిపోయిన తెలుగు భాషను మొరసునాటి ప్రజలు తరతరాలుగా బ్రతికించుకుంటూ రావటం విశేషం. వీరికి తెలుగుభాష అన్నా, తెలుగువారు అన్నా చాలా ఇష్టం.

మొరసునాడులో వున్న తెలుగువారి ఆచార వ్యవహారాలను, సంస్కృతీసంప్రదాయాలను గురించి అనేకమంది గ్రంథాలు, వ్యాసాలు ప్రచురించారు. వీనిలో

నంద్యాల నారాయణరెడ్డిగారి "ఇరుల దొడ్డి బతుకులు", "కంటతడి చిందిన తల్లి నుడి వేదన – నిర్బంధ శాసనం దుర్భర జీవితం", స.వెం. రమేశ్, స. రఘునాథ్ గారి ''మొరసునాడు కతలు'', రమేశ్‌గారి ''కతల గంప'', కె. మునిరాజు మరియు జి. సురేశ్ రెడ్డి గార్ల "జతగాళ్ళు – కతగాళ్ళు'', డా॥ వసంత్‌గారి ''తెల్లకొక్కర్ల తెప్పం'', రామక్కగారి సుమ వ్రాసిన "పొయ్యిగడ్డ కతలు", 11 మంది కవులు వ్రాసిన "ఎర్నాగు పూలు", కృష్ణగిరి రచయితల సంఘం సభ్యులు వ్రాసిన ''వోతుకుపూల వాన'', డా. రాయదుర్గం విజయలక్ష్మి వ్రాసిన "పొరుగు తెలుగు బతుకులు", ఎ. వసంత్‌గారి కథాసంకలనం "ముంగారువాన" మొదలైన రచనలు.

స.వెం. రమేశ్‌గారి సంపాదకీయంలో ప్రచురింపడిన నడుస్తున్న చరిత్రలో ప్రచురింపబడిన అనేక వ్యాసాలు, కథలు మొరసునాడులో నివసిస్తున్న తెలుగువారి స్థితిగతులను, ఆచార వ్యవహారాలను, వారి సంస్కృతీ సంప్రదాయాలను, భాషాభిమానాన్ని బయటి ప్రపంచానికి తెలియచేశాయి. మొరసునాటి తెలుగువారిని గురించి ఎందరు ఎన్నో పుస్తకాలు వ్రాసినా అవి ఇంకా తక్కువే అని అనుకోవాలి. ఆ ప్రాంతంలో వున్న తెలుగువారిని గురించి తెలుసుకోవలసినది ఇంకా ఎంతో వున్నట్లుగా అనిపిస్తున్నది.

పైన పేర్కొన్న పుస్తకాలలో తమ ప్రమేయం లేకుండానే తమ బ్రతుకులను శాసించే శక్తులకు, ఎదురొడ్డి పోరాడుతున్న తెలుగు ప్రజల వెలకట్టలేని మాతృభాషాభిమానం మన కనులముందు విశ్వరూపంతో ప్రత్యక్షమవుతుంది. ఎన్నో ప్రతికూల పరిస్థితులమధ్య నాలుగు వందల తెలుగు బడులను నిలుపుకుని, వాటిని కొనసాగిస్తున్న హోసూరు తెలుగువారి ఆదర్శం వెలకట్టలేనిది కాని తమిళనాడు ఏవో అర్థం పర్థం లేని జీ.వో.లు తెచ్చి ఆ రాష్ట్రంలో తెలుగు భాష లేకుండా చేయాలని కంకణం కట్టుకున్నట్లుగా కనిపిస్తుంది.

తెలుగు బడులలో తమిళ ఉపాధ్యాయులను నియమించి, తెలుగు విద్యార్థులకు బలవంతంగానైనా తమిళం నేర్పించే ప్రయత్నం చాలా పకడ్బంధీగా చేస్తున్నది. 9 వ తరగతి వరకు తెలుగు మాధ్యంలో చదివిన విద్యార్థులు 10 వ తరగతి పరీక్షలు తమిళంలోనే వ్రాయాలని బలవంతం చేయటం ఎంతటి మూర్ఖత్వంగా వుంటుందో విజ్ఞులు ఆలోచించవలసి వుంటుంది.

మరి ప్రక్క రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లు కూడా తమిళ భాషకు అదేవిధానం అవలంబిస్తే జాతీయ సమగ్రత విచ్ఛిన్నం కాదా? మన అందరం వున్నది వేరువేరు దేశాలలో కాదు కదా! తమిళ ప్రభుత్వం ఇప్పటికైనా తన తప్పిదాన్ని గ్రహించి, పొరపాటును సరిదిద్దుకుని మైనారిటీ భాషలకు కూడా తగిన గౌరవం ఇస్తారని ఆశిద్దాం. తమ బాష కాని రాష్ట్రంలో బలవంతంగా కలపబడిన అక్కడి తెలుగువారి ఆవేదనను తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు గ్రహించి, తమిళనాడు ప్రభుత్వం పై వత్తిడి తెచ్చి, ఆ బలవంతపు జీ.వో.లను ఉపసంహరింపచేస్తారని ఆశిద్దాం. కృష్ణగిరి రచయితల సంఘం సభ్యులు తమ ప్రాంతంలోవున్న తెలుగువారితో రచనలు చేయించి, తమ భాషాసంస్కృతులను అక్షరబద్ధం చేయిస్తున్న విధానాన్ని తెలుగువారందరూ ప్రోత్సహించాల్సిన అవసరం వున్నది.

హోసూరు ప్రాంతంలో తెలుగు భాషను బ్రతికించుకుంటూ, భావితరాలవారికి ఈ భాషాసౌరభాన్ని అందించాలనే తపనతో అనేకమంది కవులు, రాజకీయ వేత్తలు, ఉపాధ్యాయులు, వైద్యులు, వకీళ్ళు, సాహిత్యవేత్తలు, పత్రికావిలేఖర్లు అవిశ్రాంతంగా కృషిచేస్తున్నారు. 1967 మరియు 1971 సంవత్సరాలలో హోసూరు నియోజకవర్గం నుండి గౌరవ శాసనసభ్యునిగా ఎన్నుకోబడిన కీ.శే. కోదండరామయ్యగారు తమిళనాటి శాసనసభలో తెలుగువాణిని వినిపించిన మొట్టమొదటి వ్యక్తి. ఆయన తమిళనాడులో తెలుగు తేజాన్ని ప్రజ్వలింప చేసి, స్థానిక తెలుగు ప్రజల సమస్యలను అవగాహన చేసుకుని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి ఆ సమస్యలను పరిష్కరింపచేయించి, ఆ రాష్ట్రంలో తెలుగు భాషను అధికారిక స్థాయిలో ఉపయోగింపబడేందుకుగాను పాటుపడి ఆ ప్రయత్నంలో కృతకృత్యులైనారు. కానీ దురదృష్టవశాత్తు ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు అదే వరవడిని కొనసాగించలేక పోవటం తెలుగువారి దురదృష్టం.

శ్రీ కోదండరామయ్య స్థానిక తెలుగు ప్రజల భాషాభిమానాన్ని గ్రహించి హోసూరు నగరంలో 1970లో ఆంధ్ర సాంస్కృతిక సమితిని స్థాపించి, తెలుగు భాషాభివృద్ధికి ఎంతో పాటుపడ్డారు. ఈ సమితి దినదిన ప్రవర్ధమానమై నేటికీ ఆ ప్రాంతంలో తెలుగు సౌరభాల్ని వెదజల్లుచున్నది. ఆ సమితి అనేక కవిసమ్మేళనాలు, సాహిత్యోపన్యాసాలు, నాటక

ప్రదర్శనలు, కళాప్రదర్శనలు, తెలుగు ఉపాధ్యాయులకు అవగాహనాశిబిరాలు నిర్వహిస్తూ తెలుగు భాషాభిమానాన్ని ఉద్దీపనం చేస్తున్నదని శ్రీ జి. చంద్రశేఖర్ గారు తన వ్యాసం "కృష్ణగిరి తెలుగు తేజాలు (**మిసిమి** ఏప్రియల్, 2015 సంచిక)లో తెలియచేశారు. ప్రస్తుత శాసన సభ్యులు (హోసూరు) శ్రీ గోపినాథ్ తళి నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీరామచంద్రన్, మాజీ శాసన సభ్యులు వెంకటస్వామి, మనోహర్ గార్లు తెలుగు భాషా వైతాళికులుగా ఆ ప్రాంతంలో తెలుగు భాషాసంస్కృతుల సువాసనల్ని నలుదిక్కులా వెదజల్లటానికి నడుంకట్టి, తెలుగు భాషను, సాంప్రదాయాలను, ఆచారాలను సజీవంగా వుంచటానికి విశేష కృషి చేస్తున్నారు. కృష్ణగిరి జిల్లాలో అనేకమంది తెలుగు కవులు, తెలుగు సంఘాలు తెలుగు భాషాభివృద్ధికి నిస్వార్థంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

గొండపల్లి కృష్ణప్పగారు అధ్యక్షులుగా వున్న కృష్ణరసం (2001 స్థాపన)లో అనేక సభ్యులలో ప్రముఖ సభ్యులైన శ్రీ నంద్యాల నారాయణరెడ్డి, డా. వసంత్, డా. సుబ్బనారాయణ మూర్తి (లేటు), అశ్వత్థరెడ్డి, డా. ఎన్. వేణుగోపాల్, స.వెం. రమేశ్, మునిరాజు, సురేశ్‌రెడ్డి, బసవరాజు, కుమారి సుమ, అగరం వసంత్, కలువకుంట నారాయణ, చంద్రశేఖర్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస ప్రసాద్ మొదలైన కవులు మొరసునాడు (ముఖ్యంగా కృష్ణగిరి ధర్మపురి జిల్లాలు) ప్రాంతంలో స్థిరపడిన తెలుగువారి స్థితిగతులను బయటి ప్రపంచం దృష్టికి తీసుకువచ్చారు.

హోసూరు తెలుగు యాసలో ఆ ప్రాంతపు మాండలిక భాషలో ప్రచురింపబడిన ఈ రచనలు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌లలో చాలా ప్రాచుర్యం పొందాయి.

ఈ రచనల్లో ఎక్కువ భాగం కృష్ణ ర.సం. వారే ప్రచురించగా, కొన్ని రచనల్ని నిజామాబాద్ జిల్లా బోధన్ (తెలంగాణ) వాస్తవ్యులు మల్లవరపు శౌరీలు, మరియదాస్ దంపతులు (మల్లవరపు వెలువరింతలు) గార్ల ఆర్థిక సహాయంతో ప్రచురింపబడటం అభినందనీయం.

వీటిలో చాలా భాగం రచనలు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లోవున్న తెలుగువారి జీవనశైలిని, ఆచార వ్యవహారాలను, వారి ఆహారపు అలవాట్లను, వారి భాషావేషాలను ప్రతిబింబించాయి. ఈ పైన పేర్కొన్న రచయితలేకాక "తెలుగు సాహిత్య పరిషత్తు", "కళావేదిక", "వికాస వేదిక", "స్వరాలయం", "బస్తీ యువక బృందం", ''హోసూరు మిత్ర బృందం'', ''ఉపాధ్యాయులు, పత్రికావిలేఖర్లు, పీఠాధిపతులు, నాటక రంగాలు, తెలుగు సాహిత్యం సాంస్కృతిక రంగాలు తెలుగు భాషాభివృద్ధికి యెనలేని సేవల్ని అందిస్తున్నాయి.

కృష్ణ. ర.సంలో ప్రముఖ సభ్యులైన శ్రీ నంద్యాల నారాయణరెడ్డి గారు తెలుగు భాషలోనేకాక కన్నడ, తమిళ భాషల్లో ప్రావీణ్యుడు. స్వయంగా రైతుబిడ్డ అయిన వీరు తన గ్రామంలోవున్న సుక్షేత్రమైన సేద్యపు భూమిని వదలివేసి హోసూరు నగరంలో ఒక గది అద్దెకు తీసుకుని హోటలు భోజనం చేస్తూ 24 గంటలూ తెలుగు భాషను ఆ ప్రాంతంలో బతికించుకోవటానికి తన జీవితాన్నే ధారపోస్తున్న మహనీయుడు. ఆయన వ్యక్తిగతంగా ఎన్ని అవమానాలు పొందినా తెలుగు భాష కోసం అలుపెరుగని ధన్యజీవి.

శ్రీ నారాయణ రెడ్డిగారు. కె. రాజనారాయనన్ (కీ.రం) గారు తమిళంలో వ్రాసిన *గోపల్లెపురం* అనే గ్రంథాన్ని *గోపల్లె* అనే పేరుతో తెలుగులో అనువదించారు. తమిళ రచయిత కొన్ని వందల యేళ్ళ క్రితం తమ పూర్వీకులు దక్షిణాంధ్ర దేశాన్నుండి తమిళ దేశానికి వలసవెళ్ళిన తెలుగువారేనని, తనకు తెలుగులో వ్రాయటం రాదు కనుక తమ పూర్వీకులు పడిన కష్టాలు పాండ్య మండలం (మధురై, తంజావూరు, తూత్తుకూడి, చెంజి ప్రాంతాలు)లో వున్న దట్టమైన అడవులను నరికి, నల్లరేగడి భూములను చదునుచేసి, దానిని వ్యవసాయ యోగ్యంగా చేసి, అడవి ఆవులను మచ్చిక చేసుకుని మంచి వ్యవసాయదార్లుగా, నాయకర్లుగా ఎదిగిన వైనాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించారు.

ఆ రచయిత మాటల్లోనే చెప్పాలంటే *గోపల్లెపురం* నవలకు శరీరం తమిళమైతే, ఆత్మ తెలుగే అని చెప్పుకున్నారు. ఆ తమిళ నవలను నారాయణరెడ్డిగారు తమిళ-తెలుగు మాండలికాలతో తెలుగులో అనువదించి తమిళదేశంలో కొన్ని వందల యేళ్ళ క్రితమే స్థిరపడిన తెలుగు కుటుంబాల సంస్కృతి, సంప్రదాయాలను తెలుగువారికి తెలియచేస్తూ తెలుగువారు మరచిపోయిన, తమిళనాట ప్రచారంలోవున్న తెలుగు మాండలికాలను తెలుగువారికి ప్రచారం చేశారు.

తెలుగునాట లుప్తమైన తెలుగు నుడికారాన్ని తమిళనాట కొన్ని వందల సంవత్సరాల క్రితమే స్థిరపడిన తెలుగువారు కాపాడుకుంటూ వస్తున్న వైనాన్ని మన కళ్ళముందు వుంచారు.

గోపల్లె నవల దక్షిణాంధ్ర సాంఘిక జీవనానికి అద్దంపట్టే సాహిత్యం. నారాయణరెడ్డిగారు హోసూరు కతల శీర్షికపై "ఇరుల దొడ్డి బతుకులు" అనే విలక్షణమైన కదన శైలి కలిగిన ఈ కతలు పాఠకుల మనసుపై మంచి ముద్రవేశాయి.

రచయిత హోసూరు నగరానికి నాలుగైదు ఆమడల దూరంలో అడవుల మధ్యలో ఉండే ఇరులదొడ్డి అనబడే చిన్న పల్లెను కేంద్రంగా చేసుకుని, ఏభై సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనలను, మాయమర్మాలు తెలియని అక్కడి ప్రజల్ని, వారి దైనందిన బ్రతుకు పోరాటాన్ని, తన గత అనుభవాల్ని, అనుభూతుల్ని నెమరువేసుకుంటూ ఈ కతల్లో పూసగుచ్చినట్లు వివరించారు. రాజకీయ, భౌగోళిక యెల్లలు తుడిచివేసిన ఈ తెలుగు భాష ఆరాధకుని గుండెల్లో గూడుకట్టుకున్న ఆవేదన, పలుకు తీరులో వైవిధ్యం, వారి భాష, అక్కడి ప్రాంతీయ యాస కమ్మటి తేట తెలుగు పదాలు వీరి రచనలో సుగంధాలు విరచిమ్మే తెలుగు నుడి సౌరభాలు పాఠకుల్ని విచతుల్ని చేస్తాయి.

రచయితలో మనం ఒక ప్రకృతి పురుషుణ్ణి, ఒక నిజాయితీపరుణ్ణి, ఒక కార్యశీలిని, ఒక శ్రమైక జీవినీ, ఒక సరసుణ్ణి వెరసి ఒక నిండైన, తెలుగు మనిషిని చూస్తామని, "నడుస్తున్న చరిత్ర" సంపాదకులు, తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు సామల రమేశ్‌బాబు ఆ పుస్తకం ముందుమాట (నాలుగు మాటలు)లో వ్రాసింది అక్షరసత్యాలే. హోసూరు ప్రాంతానికి నారాయణరెడ్డి గారు వెలుగు దీపంలాగా అక్కడి తెలుగువారికి దారిచూపిస్తున్న గొప్ప వ్యక్తి. వీరిదే ఇంకొక రచన (తెలుగు, తమిళం, కన్నడ భాషలు) "కంట తడి చిందిన తల్లి నుడి వేదన – నిర్బంధ శాసనం దుర్భర జీవనం" పాఠకులకు నిజంగానే కళ్ళవెంట నీరు తెప్పిస్తుంది.

హోసూరు ప్రాంతంలో నివసిస్తున్న తెలుగువారి భాష కన్నడ (బేగినా), తమిళ (ఇదిదా హోసూర్) మిశ్రమాల యాసతో వినసొంపుగా వుంటుంది. ఇక్కడి తెలుగువారు "అన్నా, అక్కా" అని ఎంతో ఆప్యాయతగా పలకరిస్తారు. వీరివి కల్మషం లేని హృదయాలు. వీరికి తెలుగు భాష అన్నా, తెలుగు ప్రజలన్నా చాలా గౌరవం, ఇష్టం.

ఆ ప్రాంతం, పల్లెలో నివసిస్తున్న తెలుగువారు వారి ఇంటికి వెళ్ళినప్పుడు ఎంతో మర్యాద చేస్తారు. వారి మనసులు నిండు వెన్నెలలాంటివి. వారు తోటి తెలుగువారిని ఎంతో ఆప్యాయంగా పలకరిస్తారు. వీరు వివాహాలు రెండు రోజులు నిర్వహిస్తారు. ముందురోజు రాత్రి వధూవరులను వేదికపై ప్రక్కప్రక్కనే కూర్చోబెట్టి రిసెప్షన్ ఏర్పాటు చేస్తారు. వచ్చిన బంధువులకు, స్నేహితులకు చక్కని విందు ఇస్తారు. మరునాటి ఉదయం అదే వేదికపై వివాహం జరుపుతారు.

కొన్ని వివాహాలు ఉదయం 10 గంటలకే ముగిసినా, వెంటనే అతిథులకు విందుభోజనం ఏర్పాటు చేస్తారు. మనలాగా ఉదయం అల్పాహారం వుండదు. సరాసరి 9 గంటలకే వివాహం ముగిసినా భోజనమే ఏర్పాటు చేస్తారు. భోజనాలలో రెండు రకాల స్వీట్లు, హోటు, సారు (చారు), కూరలు, చట్నీ, అప్పడాలు, పెరుగన్నం తప్పకుండా వుంటాయి. వివాహపు తంతు ముగిసిన తరువాత అప్పగింతలు కార్యక్రమం ముగియగానే వధువు, వరుని ఇంటికి తీసుకువెళ్తారు. ఇక్కడి తెలుగువారు వివాహం జరిపే పద్ధతులు కన్నడ వారి పద్ధతులనే అనుకరిస్తున్నట్లుగా వున్నది. ఇక్కడి రోడ్లు, రవాణా వ్యవస్థ చాలా బాగా వుంటాయి.

డెంకణికోట బస్టాండులో తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వపు, ప్రైవేటు బస్సులు కనిపించాయి కానీ ఒక్క ఆంధ్రా బస్సు అయినా కనిపించలేదు. హోసూరులో తెలుగు బోర్డులు వున్న కొన్ని బస్సులు కనిపిస్తాయి. ఈ రెండు తాలూకాలలో వున్న ప్రజలందరికీ తెలుగు భాష కూడా వస్తుంది. ఈ ప్రాంతంలో తెలుగు, కన్నడ, తమిళ భాషల వారందరూ మనసులో ఎట్లావున్నా పైకిమాత్రం ఐకమత్యంగా వున్నట్లుగా కనిపిస్తారు.

మొరసునాటి తెలుగువారి ఆవేదనలను, ఆక్రందనలను తెలుగు రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలలో వున్న ప్రజలు, రాజకీయ నాయకులు, కవులు, కళాకారులు, విద్యావంతులు అర్థం చేసుకుంటారని వారికి అండగా వుంటారని ఆశిద్దాం. ఈ విధంగానైనా మనం వారి ఋణం తీర్చుకునే అవకాశం కలుగుతుంది. ౘ

కొ. వెంకటేశ్వరరావు
హైదరాబాదు
ఫోన్ : 94 90 63 66 59

# క్రోమోసోమ్ కథనమ్ – 6

– ము.పా.సా.

## తెలివితేటలు

ఇప్పటికి జన్యువులే రోగాలన్నింటికీ కారణం అన్న నిశ్చితాభిప్రాయానికి వచ్చివుంటారు మీరు. నేను రాసింది చదివి, అలా అనుకోవటంలో తప్పు లేకపోయినా, అది నిజంగా శుద్ధ తప్పేనని మీకు విన్నవించదలచుకుంటున్నాను.




జన్యువుల మ్యుటేషన్‌వల్ల వ్యాధులొస్తాయిగాని, ఈ వివరణ కూడా అన్నింటికీ ఒకేలా వర్తించదు.

జన్యువుల గురించిన సరదా కబుర్లు చెప్పుకోవటం ఆపి, జటిల విషయాలను చర్చించవలసిన సమయం ఆసన్నమైంది. ఇక, జన్యువుల కీకారణ్యంలోకి ప్రవేశించాలి. తెలివితేటలకూ, వారసత్వానికీ వున్న సంబంధమేమిటో తెలుసుకొందాం –

ఈ అరణ్యంలోనికి అడుగిడటానికి అనువైనచోటు క్రోమోసోమ్ – 6. తెలివితేటలకు సంబంధించిన జన్యువు యిదేనని 1997లో తెలుసుకున్నారు.

సుమారు 160 I Q (Base = 100) Average = 120–130, Very high = 160) వున్న స్కూలు విద్యార్థులతో (వయస్సు 12 – 14 సంవత్సరాలమధ్య వున్న బాల మేధావులే అందరూ) పరిశోధన జరిపాడు రాబర్ట్ ప్లోమిన్. అందరి నెత్తుటి నమునాలు సేకరించి DNA క్రోమోసోమ్ – 6 మీద ప్రత్యేకంగా దృష్టిపెట్టాడు (క్రోమోసోమ్ – 6 గురించి అప్పటికే కొంత సమాచారం సేకరించాడు ప్లోమిన్). ఈ బాలమేధావుల జన్యువులలో $IGF_2R^1$ సీక్వెన్స్ కనిపించింది.

అయితే I Q గురించిన పరిశోధనలు అంత ఖచ్చితమైనవని చెప్పలేం. తెలివితేటలను గురించి మూర్ఖమైన వాదనలనేకం వున్నాయి. అసలు I Q ను నిర్ధారించటం గురించి కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. తెలివితేటలకు కొలమానాన్ని అంగీకరించటమంత తెలివితక్కువ పని మరొకటుండదు. అమెరికాలో I Q నిర్ధారించే పద్ధతి మరీ దిగజారిపోయింది. ఈ టెస్టులు నిర్వహించిన కొందరు తమ అసూయా, ద్వేషాలను కూడా జోడించి, వలస వచ్చినవాళ్ళందరూ I Q విషయంలో జంతువులుకన్న ఎక్కువేమీ కాదన్నారు. అమెరికా గురించి తెలియనివాళ్ళంతా మూర్ఖులేనని వాళ్ళ అభిప్రాయం. ఉదాహరణకు – వలస వచ్చిన పోలిష్ – యూదులను అడిగిన ప్రశ్న : "టెన్నిస్ కోర్ట్ మధ్యలో నెట్ వుంటుందని తెలుసా?" ఇలాంటి చచ్చు ప్రశ్నలడిగిన హెచ్. హెచ్. గొడార్డ్‌ను శాస్త్రజ్ఞుడిగా పరిగణిద్దామా? అయినా, ఉద్యోగుల ఎంపికకోసమూ ఏరివేతకోసమూ యాజమాన్యాలు I Q టెస్టులను బాగా ఉపయోగించుకున్నాయి. జాతి, మత విద్వేషాలను వీటిలో ఆయుధాలుగా వాడుకొన్నారు.

సైన్సంటే సత్యాన్వేషణ. అంతేకాని మన అభిప్రాయాలు, అసూయలు, యిష్టాయిష్టాలతో శాస్త్రబద్ధత వుందని నిరూపించటానికి ఆడే దొంగ నాటకం కాదు. ఈ కారణంవల్లనే 1920లలో జన్యుశాస్త్రం తప్పుదారి పట్టింది. పండితులు పొరపాట్లు చేస్తే సామాన్యుడు వాళ్ళతో వాదించలేడుగదా.

అసలు విషయం 'తెలివితేటలు' అనే మాటకు నిర్వచనం లేదు. ఆలోచనల మెరుపువేగమా? హేతుబద్ధతా, జ్ఞాపకశక్తా, భాషాప్రావీణ్యతా, కాగితం, కలం లేకుండా లెక్కలు చెయ్యగలగటమా? దేన్ని తెలివితేటలు అంటే యిదేనని

నిర్ధారిద్దాం? అన్ని రంగాలలోనూ పరిపూర్ణ జ్ఞానం ఎవరికీ ఉండదు. కొందరు ఏదో ఒక పనిలో మాత్రమే నిష్ణాతులమనిపించుకుంటారు. ఫుట్‌బాల్ ఆటలో తనకు తానే సాటి అనిపించుకున్నవాడు నిరక్షరాస్యుడు కావచ్చు. గొప్ప సంగీతకారుడికి సాహిత్య జ్ఞానం లేకపోవచ్చు.

I Q టెస్టుల్లో, విశ్లేషణా సామర్థ్యాన్ని ఎక్కువగా పరిగణనలోకి తీసుకొంటారు. స్కూలు పాఠాలు బాగా అర్థంచేసుకొనే పిల్లల I Q ఎక్కువని టెస్టుల్లో తేల్చారు. అయితే "ఇంటెలిజెన్స్ జన్యువులు" శూన్యంలో ఎదగవు. వాటికి వాతావరణం, పర్యావరణం కూడా సహకరించాలి.

1904 లో చార్ల్స్ స్పీర్‌మాన్ అనేకరకాల ఇంటెలిజెన్స్ టెస్టులు చేసి, వచ్చిన ఫలితాలకు జనరల్ ఇంటెలిజెన్స్ లేదా దాన్నే సూక్ష్మంగా 'జి' (G) అన్నాడు.

ప్రస్తుతానికి మనం, టెస్టులన్నీ మూర్ఖమైనవే అనుకున్నా కాసేపు 'G' ని అంగీకరిద్దాం. మార్క్ ఫిల్పాట్ ప్రకారం, I Q కూ, జన్యువులకూ ఎంతో కొంత సంబంధం వుండకపోలేదు. అంటే, అది వారసత్వంగా సంక్రమిస్తుంది లేదా సంక్రమించే అవకాశముంది.

I Q కు కనీసం 50 శాతం వారసత్వం లక్షణాలున్నాయని అంగీకరించినా దీనికి సంబంధించిన జన్యువుల గురించి కూడా తెలుసుకోవాలిమరి. కానీ అనేక పరిశోధనల తర్వాత కూడా ఏ జన్యువులు లేదా ఎన్ని జన్యువులు దీనికి కారణమో తెలియలేదు. వారసత్వం వేరు. I Q ఎంతమట్టుకు సంక్రమిస్తుందని ఖచ్చితంగా తెలుసుకోవటం వేరు.

ఉదాహరణకు చేతికి అయిదే వేళ్ళు ఉన్నాయనుకుంటే దీనికి సంబంధించిన జన్యువు మనలో ఉన్నదన్నమాటే. కానీ నాలుగు వేళ్ళున్న వాళ్ళకోసం వెతికితే వాళ్ళంతా (అత్యధికులు) ప్రమాదాల్లో ఒక వేలు పోగొట్టుకున్నవాళ్ళే అయివుంటారు. అంటే జన్యుపరంగా నాలుగు వేళ్ళుండే అవకాశం తక్కువ. పరిస్థితుల ప్రభావంతో ప్రమాదాలవల్ల మాత్రమే అలా జరుగుతుంది. అయినప్పటికీ వేళ్ళ సంఖ్యను నిర్ధారించటంలో జన్యువుల పాత్ర లేదని చెప్పలేం. I Q వారసత్వ లక్షణాల కోసం రాబర్ట్ ప్లోమిన్ చేసిన పరిశోధనలు కూడా యిలాంటివే. కొంత నిజం, కొంత ఊహ.

క్రోమోసోమ్-6 మీద వుంటుంది $IGF_2R$[1] (జన్యువు). దీన్ని ఇంటెలిజెన్స్ జన్యువు అన్నారుగానీ, రాబర్ట్ ప్లోమిన్ పరిశోధనలకు ముందు దీనికి లివర్ కాన్సర్ జన్యువు అని పేరుంది. జన్యువులను జబ్బులతో ముడిపెట్టకూడదనేదందుకే, ఈ వాదన యిలాగే కొనసాగిస్తే, లివర్ క్యాన్సర్‌కూ, తెలివితేటలకూ ఏమైనా సంబంధముందా అని కూడా తుంటరి ప్రశ్న వేయవచ్చు.

$IGF_2R$ చాలా పెద్ద జన్యువు. 7,473 అక్షరాలుంటాయి యిందులో. అంటే, జీనోమ్‌లోని 98,000 అక్షరాలలో అర్థవంతమైన సందేశాలు తక్కువగా ప్రసారమవుతాయి. కనీసం 48 సార్లు అర్థంలేని సందేశాలు వీటికి అడ్డుతగుల్తాయి (పత్రికలో వ్యాసాలమధ్య వ్యాపార ప్రకటనలలా). $IGF_2R$లో ఇన్సులిన్ వంటి ప్రొటీన్లుంటాయి. శక్కరను ఎక్కువగా ఖర్చుచెయ్యటం దీని లక్షణం. అంటే, అధిక IQ వున్నవాళ్ళ మెదళ్ళు ఎక్కువ గ్లూకోస్‌నుపయోగిస్తాయనుకోవచ్చు. Tetris అనబడే ఒక కంప్యూటర్‌గేమ్ ఆడుతున్నప్పుడు ఎక్కువ IQ వున్నవాళ్ళు ఎక్కువ గ్లూకోస్‌ను వాడినట్టుగా నిరూపితమైంది. కానీ దీన్నిబట్టి మనం ఏదైనా నిర్ధారణకు వచ్చామంటే కాలవలో కొట్టుకుపోతున్నవాడు గడ్డిపోచలు పట్టుకొని ప్రాణం దక్కించుకున్నట్టే. ప్లోమిన్ చెప్పిందంతా నిజమని అంగీకరించినా, తెలివితేటల్ని నిర్ధారించే అనేక జన్యువులో ఇది కూడా ఒకటని మాత్రమే స్పష్టమవుతుంది. పైగా యివి IQ లెవెల్‌ను నాలుగు పాయింట్లు మాత్రమే పెంచుతుంది. అంటే దీనివల్ల జీనియస్సులు తయారయ్యే అవకాశం లేదు.

అన్నింటికన్నా ముఖ్యంగా జన్యువులకూ, తెలివితేటలకూ, సంబంధం వుందనుకుంటే మరో వినాశకర పరిణామాలకు తెరతీస్తున్నామన్నమాటే. 1920, 30 లలో శాస్త్రపరిశోధనలకే మాయని మచ్చగా మారిన యూజెనిక్స్ (Eugenics) ప్రమాదం యింకా పొంచివుంది (Eugenics = జన్యువుల ఎంపిక ద్వారా ఉత్తమ జాతి మానవులను సృష్టించవచ్చుననే సైన్సు ఆర్యన్ రేస్ గురించి హిట్లర్ కాలంలో జరిగిన పరిశోధనల ఉద్దేశమిదే). "తెలివితేటల మీద జన్యువుల ప్రభావం కొద్దోగొప్పో వుంటుందనుకొన్నప్పటికీ వాటి ఎదుగుదలమీద సామాజిక, పర్యావరణ పరిస్థితుల ముద్ర కూడా వుంటుంది" అంటాడు స్టీఫెన్ జే గూల్డ్. మొత్తంమీద ఈ వాదనలను పొడిగించటం అభిలషణీయం కాదు. ఉత్తమ విద్యాప్రమాణాలతో పిల్లల తెలివితేటలు పెరగవా? Dyslexia (బుద్ధి ఎదగని)తో బాధపడిన పిల్లలకు చదవటం, రాయటం నేర్పించిన ఉపాధ్యాయులు లేరా?

ఈ ఇంటెలిజెన్స్ టెస్టింగ్‌లో అందరికీ మార్గదర్శకుడైన ఫ్రెంచి శాస్త్రజ్ఞుడు ఆల్ఫ్రెడ్ బినె "IQ టెస్టుల ఉద్దేశం ఎవరు




గొప్ప అని నిర్ధారించటం కాదు. తెలివితేటలు తక్కువగావున్న పిల్లల్ని గుర్తించి, వాళ్ళకు ప్రత్యేకంగా బోధించే ఏర్పాట్లు చేయటమే" అన్నాడు. అంటే, తెలివితేటలు వారసత్వంగా వచ్చినప్పటికీ IQ టెస్టులలో ఎక్కువ తక్కువలనుబట్టి మనుషుల్ని విభజించటం అనాగరికం, అనైతికం కూడా. 1980లలో జరిగిన కొన్ని పరిశోధనల, సర్వేల ప్రకారం IQ ప్రపంచమంతటా ఏడాదికి మూడు పాయింట్లు చొప్పున పెరుగుతున్నదని తేలింది.

మాంసకృత్తులు ఎక్కువగా తీసుకొన్నవాళ్ళలో కూడా యిది సగటుకన్నా ఎక్కువున్నదట. అయితే ఏమిటి? గత యాభైఏళ్ళలో IQ పదిహేను పాయింట్లు పెరిగిందన్నారు మరికొందరు. అంటే యాభై ఏళ్ళ క్రితం వున్నవాళ్ళందరూ చవట దద్దమ్మలూ, యిప్పుడు అందరూ జీనియస్సులనుకుందామా? ఆధునిక ప్రపంచంలో వ్యక్తులు తమ తెలివితేటలు పెంచుకోవటానికి అవకాశాలు అధికంగా వున్నాయనుకోవటం సబబుగా వుంటుంది.

అంతా జీన్స్‌లో వుందనుకోవటానికి బదులు పుట్టిన నేల, పెరిగిన వాతావరణం కూడా మనిషి బుద్ధిని వికసింపచేస్తాయని యిప్పటికి తెలుసుకున్నాం.

## క్రోమోసోమ్ – 7

### స్వభావం

శరీర నిర్మాణాన్ని శాసించేది జన్యువులే అనటంలో ఎవరికీ సందేహం లేదు. అయినప్పటికీ, మనిషి స్వభావాన్ని నిర్ణయించేది క్రోమోసోమ్–7 మీదున్న ఒక జన్యువు అని చెప్పటానికే ఈ ప్రయత్నం. మానవ సంస్కృతికి మూలం మానవ స్వభావమేగదా.

'స్వభావం' అనే మాటను మనుషులకన్న జంతువులకెక్కువ ఉపయోగిస్తాం. Salmon చేప తను పుట్టిన స్థలంవైపే ప్రయాణిస్తుంది. కీటకాల ప్రవర్తనలో తరతరాలుగా మార్పులేదు. పక్షులు చలికాలంలో, క్రితం సంవత్సరం వెళ్ళి గుడ్లు పెట్టినచోటికే మళ్ళీ చేరుకుంటాయి (ఇందుకోసం అవి వేలాది మైళ్ళు ప్రయాణిస్తాయి). కానీ మనుషులకు స్వభావం పుట్టుకతో రాదు. చాలా విషయాలు వాళ్ళు నేర్చుకుంటారు. ఆలోచించి, ఊహించి, ఫలితాన్ని ముందుగానే అంచనావేసి పనికి సంకల్పిస్తారు.

ఇప్పటివరకు యిదీ మనకు మనుషుల మనస్తత్వాన్ని గురించి తెలిసిన సమాచారం. కానీ ఈ వాదనను అంగీకరిస్తే, మనుషులందరూ స్వభావాల ప్రకారమే నడుచుకుంటారు. ఆలోచన, విజ్ఞత, విచక్షణలాంటి మాటలకే విలువ వుండదిక. మనిషికి మరే అవకాశమూ లేదన్నమాట. మరి, విద్యాసంస్కారాల గురించి మాట్లాడుకోవటమెందుకిక. పలు కారణాలు వ్యక్తి జీవిత సరళినీ, స్వభావాన్నీ, మనస్తత్వాన్నీ ప్రభావితం చేస్తాయని నిరూపించాడు ఫ్రాయిడ్. ఆర్థిక, ఉత్పత్తి సంబంధాలు సమాజ జీవితానికి మూలస్తంభాలన్నాడు మార్క్స్. సాంస్కృతిక ప్రభావం గురించి దీర్ఘంగా చర్చించారు ఫ్రాంజ్ బోస్, మార్గరెట్ మీడ్ వంటివాళ్ళు. అలాగే స్టిమ్యులస్ రెస్పాన్స్ గురించి వాట్సన్, బి.ఎఫ్. స్కిన్నర్, భాషాప్రభావం గురించి ఎడ్వర్ట్ సేఫిర్, బెంజమిన్ వార్ఫ్‌లు కొత్త సత్యాలను ఆవిష్కరించారు. వెరసి వీళ్ళందరూ చెప్పిందొక్కటే. వ్యక్తి ప్రవర్తన, స్వభావాలమీద సామాజిక, సాంస్కృతిక ప్రభావం అధికంగా ఉంటుంది.

అయితే 1950–1990 ల మధ్య ఫ్రాయిడ్ చెప్పిందంతా యథాతథంగా నమ్మటం మానేశారు. మార్క్సిజంకేమైందో అందరం చూశాం. మార్గరెట్ మీడ్ పరిశోధనల్లో స్వీయ మానసిక ధోరణి వుందన్నారు కొందరు. ఇంక భాష విషయంలో నోమ్ చామ్స్కీ తన ప్రామాణిక గ్రంథం Synctatic Structures తో లింగ్విస్టిక్స్‌లో భూకంపం సృష్టించాడు. మానవ స్వభావంలోనే కళాసృజన దాగివుందన్న డార్విన్‌ను సమర్థించిన ఆధునిక శాస్త్రజ్ఞుడీయన. సంస్కృతిలో భాష ఒక భాగం అంటాడు.

ఇక్కడే జన్యువుల ప్రస్తావన మళ్ళీ వస్తుంది. భాషాసామర్థ్యాన్ని నిర్ణయించే జన్యువులు రెండు. ఇందులో

ఒకటి విలియంస్ సిండ్రోమ్. క్రోమోసోమ్-11 లో జరిగే మార్పులవల్ల వస్తుందిది. ఈ వ్యాధివున్నవాళ్ళలో తెలివితేటలు చాలా తక్కువగా వుంటాయి కాని భాషపట్ల మక్కువ ఎక్కువగా వుంటుంది. అంటే, వీళ్ళంతా ఒక రకమైన వాగుడుకాయలు. ఉదాహరణకు పిల్లిని చూపించి అదేమిటని అడిగితే మార్జాలమనో, వ్యాధి మరీ ముదిరినవాళ్ళైతే బిడాలమనో అంటారు. వీళ్ళు కొత్త భాషలను కూడా సులభంగా నేర్చుకొంటారు. వీళ్ళ ప్రవర్తనలో హేతుబద్ధత, వాదనలో తార్కికత వుండదుగానీ భాషావిన్యాసాలు చెయ్యటంలో దిట్టలు.

మరో జబ్బు దీనికి పూర్తి విరుద్ధమైనది. Specific Language Impairment (S.L.I.) అంటారు దీన్ని. వీళ్ళదీ భాషాసమస్యే. కానీ మాట్లాడటం - పదాలు ఎంపిక చేసుకోవటమే రాదు. దీనికి సంబంధించిన జన్యువు క్రోమోసోమ్-7.

దేనికైనా సరే, జన్యువులు కారణమంటే మలివారసత్వ లక్షణాలున్నట్టేగదా. S.L.I. కీ, పుట్టుకతో వచ్చిన నరాల జబ్బుకూ తేడా వుంది. మానసికంగా ఎదగని పిల్లలకూ, దీనికీ (S.L.I.) సంబంధం లేదు.

1997లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ శాస్త్రజ్ఞులు ఈ క్రోమోసోమ్-7కున్న ప్రత్యేక లక్షణాలను కనుగొన్నారు. ఉచ్చారణ, వినికిడి సమస్యలున్నవాళ్ళు భాష నేర్చుకోవటం చాలా కష్టం. ఈ లోపాలున్న పిల్లల నెత్తుటి నమూనాలను పరిశీలించిన తర్వాత S.L.I. గురించిన నిర్ధారణకు వచ్చింది కెనెడియన్ లింగ్విస్ట్ మిర్నా గోప్నిక్. అయితే, ఈ సమస్య కేవలం ఇంగ్లీషు మాట్లాడేవాళ్ళకే పరిమితమా? అన్న సందేహం వచ్చి జపనీస్, గ్రీక్ పిల్లల మీద కూడా పరిశోధనలు కొనసాగించి, అదే ఫలితాలు సాధించింది గోప్నిక్. S.L.I. వ్యాధిగ్రస్తులు శబ్దాలను సరిగా గుర్తించలేరు. ముఖ్యంగా 45 కన్నా తక్కువ డెసిబెల్స్‌తో పలికినప్పుడు వీళ్లకు ఆ పదమే వినిపించదు.

ఉచ్చారణ, భాషను నియంత్రించటానికి మెదడులో వుండే రెండు ప్రదేశాలను బ్రోకాస్ ఏరియా, వెర్నిక్స్ ఏరియాగా నిర్ధారించారు.

బ్రోకాస్ ఏరియా, మొహం, స్వరపేటిక, నాలుక, నోటి కండరాలను, ప్రవర్తనను నిర్దేశిస్తుంది. వెర్నిక్స్ ఏరియా యితర్లు మాట్లాడే మాటల్ని గుర్తించటానికి సహాయం చేస్తుంది (ఈ పరిశోధనలు కోతులమీద జరిగాయి). మొత్తంమీద



S.L.I. వ్యాధిగ్రస్తులెదుర్కొంటున్న సమస్యలకు ప్రధాన కారణం ఈ రెండు ఏరియాలే.

“ముందు తరంవాళ్ళ స్వభావాలకు, మనకు పుట్టుకతో వచ్చిన స్వభావాలు కలిసివున్న ప్రస్తుత స్వభావం ఏర్పడింది” అన్నాడు అమెరికన్ తత్వవేత్త విలియం జేమ్స్. ఇప్పటిదాకా మనం చెప్పుకున్న పరిశోధనలు ఈ వాదాన్నే బలపరుస్తున్నాయి. ఆంత్రపాలజిస్టు జూన్‌టూబీ, సైకాలజిస్ట్ లీడా కాస్మెడ్, సైకో లింగ్విస్ట్ స్టీవెన్ పింకర్‌లు విలియం జేమ్స్‌కు తోడుగా నిలుస్తున్నారు. స్వభావం ఏర్పడటానికి జన్యుపరమైన కారణాలేగాక, సామాజిక, సాంస్కృతిక వాతావరణం కూడా దోహదం చేస్తుందన్నది వాళ్ళ వాదన.

*ప్రపంచమంతటా అన్ని దేశాలు, అన్ని మతాలు, అన్ని సంస్కృతుల్లో కూడా సంతోషంగా ఉన్నప్పుడు మొహంమీద నవ్వు కనిపిస్తుంది. దుఃఖంలో మొహం ముడుచుకుపోతుంది. పదహారేళ్ళ ఆడపిల్లలు మగాళ్ళందర్లోనూ కోరికలు రేకెత్తిస్తారు. ఇలాంటి ప్రవర్తన మానవ స్వభావమేగానీ సాంస్కృతిక లక్షణం కాదన్నది నిర్వివాదాంశం.*

వ్యక్తి మానసిక ప్రవృత్తినిబట్టి, అతనిమీద సాంస్కృతిక ప్రభావం వుంటుందంటాడు టూబీ.

మొత్తంమీద జన్యువులూ పర్యావరణం కలిసి ఏర్పడింది మనిషి స్వభావం.

(Matt Ridley రచన ఆధారంగా)


**తెలుగు : ము.పా.సా.**

**హైదరాబాదు.**

**ఫోన్ : 91 77 67 87 08**

# వలసలు

– సాయి పాపినేని, జయశ్రీ నాయని

**క్రీ.పూ.** 2000 ప్రాంతంలో పరిణత హరప్పా నాగరికత పతనమైంది. దాదాపు 70వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అనేక పట్టణాలు, గ్రామీణ ఆవాసాలూ నిర్మానుష్యమయ్యాయి. లక్షలకొద్దీ ప్రజలు వలసలు పోయారు అనడం హేతుబద్ధం. తదుపరి కాలంలో ఆ నాగరికతా క్షేత్రపు పరిధుల్లో తుది హరప్పాయుగపు పట్టణాలు ఆవిష్కృతమయ్యాయి. కొంతవరకూ నాగరికతాకేంద్రమైన దిగువ సరస్వతీ, సింధు ప్రాంతాల నుండి సామాన్య ప్రజలూ, రాచరికాలు ఎగువ సరస్వతీ యమునా తీరాలకూ, గుజరాత్ మాల్వా ప్రాంతాలకూ తరలిపోయారు అనేందుకు సంప్రదాయిక ఆధారాలు ఉన్నాయి. ఎగువ సరస్వతీ మైదానంలోనూ, గుజరాత్ ప్రాంతంలోనూ వికసించిన తుది హరప్పా సంస్కృతులను వచ్చే సంచికలో మహాభారత ఇతిహాసం నేపథ్యంలో పరిశీలిద్దాం. ముందుగా క్రీపూ 2వ సహస్రాబ్దిలో భారత ఉపఖండంలోకి ప్రవేశించారు అని చెప్పబడిన 'ఆర్యుల' వలస సిద్ధాంతాలనూ, అందుకు సమర్ధించే ఆధారాలనూ, ఇండోయూరోపియన్, ఇండోఆర్యన్ భాషల విస్తరణ క్రమం నేపథ్యంలో మరోసారి పరిశీలించి, పురాణాల్లో సూచించిన వలస వృత్తాంతాలతో సరిపోల్చుకోవడం అవసరం.

**వోల్గా నుంచి గంగకి :**

1786లో కలకత్తా సుప్రీమ్ కోర్ట్ జడ్జీ సర్ విలియమ్



జోన్స్, భారతీయ వాఙ్మయంలోని సంస్కృతానికి, ఐరోపా ప్రాచీన భాషలైన ల్యాటిన్, గ్రీకు భాషలకూ పోలికలు గుర్తించి సంస్కృతం ఐరోపా భాషల మాతృక అని ప్రతిపాదించాడు. దానితో 18వ శతాబ్ది చివరిదశకంలో 'చారిత్రక భాషాపరిణామశాస్త్రం' (Historical Linguistics) ఆవిష్కరించబడింది. తదుపరి రెండు శతాబ్దాలలో ఆ ఇండోయూరోపియన్ భాషా సముదాయపు మూలాల వెదుకులాటకు కేటాయించిన సమయం, పరిశోధన, నూతన సాంకేతిక పరిజ్ఞానం, కొత్త వైజ్ఞానిక పద్ధతులు, భాషాపరిణామశాస్త్రంలో మరేవిషయానికీ దక్కలేదు. ఒకనాడు ఈ భాషలన్నింటికి మాతృకయైన ఒక మూలభాష ఉండేదనీ, కాలక్రమేణా ఆ జనజాతుల వలసలు లేదా సాంకేతిక పరిజ్ఞానపు వాడుకవల్ల ఆ భాష విస్తరించిందనీ, అన్యభాషా కుటుంబాలతో సంపర్కం మూలస్థానంనుండి వేరుబడటంవల్ల అనేక కొత్త భాషలు ఉదయించాయనే అంశాలపై భాషాశాస్త్రజ్ఞులలో ఏకాభిప్రాయం ఉంది. అయితే ఆ మూలస్థానం (Urheimat) ఉనికి, భాషావిస్తరణ యొక్క కాలక్రమం గురించే అనేక భిన్నమైన వాదనలూ, ఊహలూ, సిద్ధాంతాలూ ప్రాచుర్యంలోకి వచ్చాయి. ముందుగా ఎక్కువమందికి ఆమోదయోగ్యంగా అత్యంత ప్రాచుర్యం కలిగిన 'ఆర్యుల వలస' సిద్ధాంతాన్ని పరిశీలిద్దాం.

ఈ సిద్ధాంతం ప్రకారం, ఇండోయూరోపియన్ భాషల మాతృక యుక్రేనియా, రష్యా, కజకిస్తాన్ ఎల్లల్లో నల్లసముద్రానికీ, కాస్పియన్ సముద్రానికి ఉత్తరదిశలోని స్టెప్పీలు అనబడే గడ్డినేలల్లోని ఒక జనజాతి ఒకానొకప్పుడు మాట్లాడిన భాషగా (Proto Indo European - PIE) ఊహించడం జరిగింది. క్రీపూ. 4500 ప్రాంతంలో గుర్రాన్ని పెంచడం, స్వారీ చెయ్యడం అలవరుచుకోవడవల్ల ఈ జాతి మరింత విస్తృతమై, మరిన్ని కొత్త తెగలను తనలో కలుపుకొంది. కాలక్రమేణా ఆ జనసముదాయనికి చెందిన కొన్ని గుంపులు పశ్చిమదిశగా మధ్య-ఐరోపాకి వలసపోయాయి. మిగిలినవారిలో కొన్ని గుంపులు (Pre Proto Indo Iranian - PPII) టర్కీలోని అనతోలియా ప్రాంతానికి (క్రీపూ. 4000) వలసపోగా, మరికొన్ని వోల్గా తీరంలో వ్యవసాయం, పశుపాలనా, చేపలు పట్టడం ద్వారా పొట్టపోసుకుంటూ, క్రీపూ. 3500 నాటికి కాంశ్యయుగ సంస్కృతిగా ఎదిగారు. ఈ ప్రాంతంలోని కొన్ని స్థానిక పురావాస్తు సంస్కృతులను ఆ పరిణామదశలకి ఆధారాలుగా ఊహించారు. వీటిలో యమ్నా (క్రీపూ. 4000), కుర్గన్ గుంటసమాధుల సంస్కృతి (క్రీపూ. 3500-3000) ముఖ్యమైనవి. అదే సమయంలో కొన్ని గుంపులు విడిపోయి తూర్పుగా సైబీరియా ప్రాంతానికి వలసపోయి మధ్య ఆసియాలోని తొఖారిన్ (తుషార) చారిత్రక భాషా సంస్కృతులుగా పరిణామం చెందాయి. క్రీపూ. 3000-2500 ప్రాంతంలో ఈ కాంశ్యయుగానికి చెందిన జనజాతుల వలసలు మరింత విస్తారమయ్యాయి. పశ్చిమానికి విస్తరించిన జనజాతుల భాషలో కొన్ని మౌలికమైన మార్పులు వచ్చి నేటి జర్మనిక్, కెల్టిక్, గేలిక్ వంటి ఐరోపా భాషల మూలాలు ఏర్పడ్డాయి. తూర్పున వోల్గా తీరాన 'సిన్థస్థ' సంస్కృతిలో, ఆ పిమ్మట దక్షిణాన ఆరల్ సముద్ర ప్రాంతంలో (ఆండ్రోనోవా సంస్కృతి), ఇండియా, ఇరాన్ దేశాల్లో కనిపించే భాషలకు మూలమైన ప్రోటో ఇండో ఇరానియన్ (PII) భాష విడివడింది. ఈ సంస్కృతులకు చెందిన ప్రజలనే వైదిక ఆర్యులకు మూలపురుషులుగా తీర్మానించారు. క్రీపూ. 2000 నాటికి ఆండ్రోనోవా సంస్కృతి విస్తరించి, క్రీపూ. 2300 నుండి 1700 వరకూ, పార్థియా, మార్గావ్ ప్రాంతాలలో విస్తరించిన స్థానిక కాంశ్యయుగ సంస్కృతితో (Bactria Margiana Archaeological Complex) సంబంధాలు నెలకొల్పి, కాలక్రమేణా వారిపై ఆధిపత్యం సాధించిందనీ, మధ్య దక్షిణ ఆసియా ప్రాంతాలలో కనిపించే ఇండోఆర్యన్ (Indo Aryan - IA) తెగలన్నింటికీ ఈ సంస్కృతియే మూలస్థానమనీ భావించడం జరిగింది. భారతీయ ఆర్యులు క్రీపూ. 2వ సహస్రాబ్ది మధ్య కాలంలో ఈ సంస్కృతినుండి వేరుబడి భారత ఉపఖండంలో ప్రవేశించిన పిమ్మట క్రీపూ. 1500 ప్రాంతంలో ఋగ్వేద రచన జరిగిందనేది ఈ సిద్ధాంతం సారాంశం.

గత రెండు శతాబ్దులుగా ప్రాచుర్యంలో ఉన్న ఈ సిద్ధాంతాన్ని అన్ని వర్గాల శాస్త్రజ్ఞులు నమ్మడమేగాక ఆ కాలంలో వెలుగుచూసిన అనేక పురావాస్తు, భాషాశాస్త్ర ఆధారాలను ఈ ఆర్యులవలస సిద్ధాంతమనే రంగుటద్దంలోంచి చూడటం జరిగింది. వీలైనంత వరకూ సాంస్కృతిక ఆధారాలను ఆ సిద్ధాంతపు మూసలో బిగించడమేగాక, వెలుగుచూసిన వ్యతిరేక ప్రమాణాలు అవాస్తవాలని అసహనంతో కొట్టివేసారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ, పాశ్చాత్య విశ్వవిద్యాలయాల్లో ఈ వాదం ఘనీభవించడంతో స్వతంత్రమైన దృక్పథాలూ, వ్యతిరేక ప్రమాణాలు గల శాస్త్రజ్ఞులకు ఈ 'ప్రధానస్రవంతి'కి ఎదురీదే ధైర్యం

## ప్రోటో ఇండో యూరోపియన్ భాషలో సాంకేతిక / వృత్తి సంబంధిత పదజాలం
(ఊహించిన పురాతత్వ సంస్కృతులు)

| సాంకేతిక పదజాలం | భాషాశాస్త్రరీత్యా☆ పుట్టుక తేదీలు | ఆర్యులవలస మార్గంలోని సంస్కృతులు | భారత ఉపఖండంలోని స్థానిక సాంస్కృతులు |
|---|---|---|---|
| మెట్టవ్యవసాయం | క్రీపూ. 7500 | ? | మహాగర, మెహర్‌ఘడ్ |
| పశుపాలన | క్రీపూ. 6500 | ? | మెహర్‌ఘడ్ |
| లోహాల వాడకం | క్రీపూ. 5500 | సమారా (రష్యా) ? | ఝోబ్ లోయ (బలుచిస్తాన్) |
| నాగలి సేద్యం | క్రీపూ. 4500 | సమారా / యమ్నా ? | తొలి హక్రా (కాలిబంగన్) |
| బంగారం | క్రీపూ. 4500 | సమారా /యమ్నా ? | ఝోబ్ |
| గుర్రం మచ్చిక | క్రీపూ. 3500 | స్రెడ్నీ స్టాగ్ (ఉక్రేనియా) | **గుజరాత్ (క్రీపూ. 2300)** |
| చక్రం బండి | క్రీపూ. 3400 | ఫన్నెల్‌బీకర్ (పోలాండ్) | కుమ్మరిచక్రం, రాట్నం |

? - వృత్తి సంబంధిత ఆధారాలు ఆర్యులవలస పథంలో ఆ కాలానికి చెందిన సంస్కృతులలో లేవు

★ క్వెంటిన్ ఆట్కిన్సన్, రసెల్ గ్రే, సైమన్ గ్రీన్‌హిల్ (2011)

కరవయింది. కానీ గత నలభై యేళ్లలో భాషాశాస్త్రం, పర్యావరణశాస్త్రం, మానవ జన్యుశాస్త్రాల్లో పెరిగిన సాంకేతిక ప్రమాణాలవల్ల, ఈ సిద్ధాంతానికి ఎదురుగాలి ఊపందుకుంది. అయితే ఈ వ్యతిరేకతను వాస్తవ చరిత్ర శోధనకు గాక జాతీయత, హిందుత్వం వంటి కొత్తరంగులు పులిమే ప్రయత్నాల వల్ల ఈ వాదాలలో కొంత శాస్త్రీయత లోపించిందనడం నిజం. ఆర్యులవలస సిద్ధాంతంలో నిజమెంతో నిర్ధారించుకునే ముందు ఆ సిద్ధాంతాన్ని వ్యతిరేకించే ప్రమాణాలను కూడా ఒకసారి పరిశీలిద్దాం.

**భాషాశాస్త్రం :**

2003లో 87 IE భాషల్లోని 2500 పదాలను పరిశీలించిన శాస్త్రజ్ఞులు (రైడర్, ఆట్కిన్సన్) ఇండో యూరొపియన భాషలు క్రీపూ. 7800 – 5800 మధ్య కాలంలోనే విడిపోయాయని తీర్పుచెప్పారు. 2011 వరకూ రెండు వేరువేరు పదజాలాలతో స్వతంత్రంగా జరిపిన పరిశోధనలు కూడా అవే తేదీలను సూచించాయి. క్రీపూ. 6400 ప్రాంతంలో ఆసియా ఐరోపాలకు చెందిన IE భాషాకుటుంబాలు వేర్పడటం జరిగిందని నిర్ధారించారు. అదే నిజమైతే ఇండియాలోకి ఎర్రని వ్యవసాయక దైవం డయొనీసస్ రాకకు ‘ఇండిక’లో సూచించిన తేదీ (క్రీపూ. 6363) సరితూగుతుంది. కాలిన్ రెన్‌ఫ్రూ అనతోలియా సిద్ధాంతాన్ని గురించి ముందే ప్రస్తావించాము (మిసిమి జూన్ 2015) ఒక భాష మాట్లాడే మూలవాసులు, మరోభాషలో పదాలు స్వీకరించాలంటే, ఆ కొత్త భాష సాంకేతిక పరంగా ఒక మెట్టు పైన ఉండాలి అనే వారి వాదనలో నిజం లేకపోలేదు.

అంటే ఇండియాలో ప్రవేశించిన ఇండోఆర్యన్ భాషా సంస్కృతులను పశువులు కాసుకునే సంచారజీవులుగా కాక వ్యవసాయదారులుగా భావించాలి. ఆర్యుల వలస సిద్ధాంతాన్ని సమర్ధించే శాస్త్రజ్ఞులు PIE భాషలో వివిధ వృత్తుల ప్రాచీన సాంకేతిక పదజాలాన్ని పరిశీలించి ఆ పదాల పుట్టుక తేదీలు నిర్ధారించడం జరిగింది. (పటం.) ఈ తేదీలు వాయవ్య భారత ఉపఖండంలో వచ్చిన సాంకేతిక పరిణామాలకు, పురావాస్తు ఆధారాలకూ సరిపోతాయి. ఇది PIE భాషల జన్మస్థానం భారత ఉపఖండమనే వాదనకు కూడా బలం చేకూరుస్తుంది. అయితే ఆర్యుల వలస సిద్ధాంతానికి పునాదియైన మరో అంశం – PIE లో గుర్రపు పెంపకానికి సంబంధించిన పదజాలం క్రీపూ 4000 ప్రాంతానికి చెందడం, హరప్పా నేపధ్యంలో ఆ జంతువు లేకపోవడం. ఈ కోణం నుండి

# పైతృక (Y - DNA) ఏకస్థితాల ప్రపంచపటం

## ఆధునిక యుగానికి ముందు వివిధ ప్రాంతాల్లోని ప్రజల్లో ముఖ్య ఏకస్థితాలు, ఊహించిన వలస మార్గాలు



వైదిక వాఙ్మయంలో గుర్రానికి ఉన్న ప్రాముఖ్యతను పరిశీలించాలి.

**గుర్రం :**

భారత పురాతత్వ నేపథ్యంలో గుర్రం మొట్టమొదటగా క్రీపూ. 2300 ప్రాంతంలో కనిపిస్తుంది. హరప్పా ముద్రలలో గుర్రం లేదు. గుజరాత్‌లోని సుర్కోటడలో గుర్తించిన గుర్రపు అవశేషాలు క్రీపూ 2300 ప్రాంతానివిగా నిర్ధారించారు. అదే రాష్ట్రంలోని లోథల్‌లో దొరికిన చిన్న గుర్రపు బొమ్మ కూడా క్రీపూ 2200 స్తరానికి చెందినది. ఈ రెండూ రేవుపట్టణాలు. హరప్పా నాగరికత పశ్చిమ ఎల్లలోని బలుచిస్తాన్ పిరాక్ ప్రాంతంలో మొట్టమొదటి గుర్రపు చిత్రం కుండపెంకుల్లో దొరికింది. ఇదికూడా క్రీపూ 2300 ప్రాంతానికి చెందినదే. ఇవిగాక చెదురుమదురుగా హరప్పా, మొహెంజొదారో, కుంతసి వంటి స్థావరాల్లో దొరికినట్లు చెప్పబడుతున్న గుర్రపు ఆధారాలలో నిజమెంతో తెలియదు. అయితే ఈ ఆధారాలకు శాస్త్రజ్ఞులు ప్రతిపాదించిన తేదీలు కూడా క్రీపూ 2100 తరువాతివే. అంటే క్రీపూ. 2300కు ముందు హరప్పా వాసులకు ఈ జంతువుతో పరిచయం లేదనే చెప్పాలి. అయితే ఋగ్వేదం నుండీ వైదిక వాఙ్మయంలో గుర్రం అనే అర్థానిచ్చే పదాలు కనిపిస్తాయి. ఋగ్వేదంలో గుర్రం ప్రసక్తులూ, పురాణాల్లోని తొలితరం రాజుల పేర్లలో 'అశ్వ' శబ్దం, హరప్పా నాగరికత పతనానంతరం ఆర్యుల రాక అనే వాదానికి బలాన్నిచ్చాయి.

వాఙ్మయంలో మొట్టమొదటిగా (ఋ. 1.163-2) ఉచ్చైశ్రవం అనే గుర్రపు ప్రసక్తి కనిపిస్తుంది. ఇది క్షీరసాగర మథనంలో పుట్టింది. ఈ రెక్కలున్న తెల్లని గుర్రాన్ని ఇంద్రుడు గ్రహించాడు. దీనిని యముడు సృష్టించాడు. యమస్థానం దక్షిణ దిశ. ఇది గుర్రం దిగుమతి దక్షిణ దిశలోని (గుజరాత్) రేవుపట్టణాల ద్వారా జరిగిందనే ఊహకు బలమిస్తుంది. మరో ఋగ్వేద సూక్తంలో (ఋ. 5.61-63) మరుత్తులు గుర్రాన్ని స్వారీ చెయ్యడం వర్ణిస్తూ, శిశువును ప్రసవించే స్త్రీ వలెనే కాళ్లు ఎడంచేసి వీరుడు గుర్రాన్ని అధిరోహించాలి అని చెబుతుంది. ఇది గుర్రాన్ని చూసిన ప్రజలలో ఆశ్చర్యాన్నే గాక ఆ జంతువు యొక్క విదేశీ మూలాన్ని సూచిస్తుంది. అయితే ఐక్ష్వాకుల మొదటి తరాల్లోని రాజుల పేర్లలో 'అశ్వ' శబ్దం ప్రముఖంగా కనిపిస్తుంది. అంతేగాక తొలివేదంలో అశ్వినికుమారుల ప్రసక్తులు దాదాపు 50 వరకూ ఉన్నాయి.

చాంద్రమానంలో మేషరాశిలోని రెండు జంట నక్షత్రాల పేరు అశ్విని లేదా అశ్వయుజ. సుమేరియా ఖగోళశాస్త్రంలో కవల దేవతలు 'అన్సేర్, కిషార్' కూడా జంట నక్షత్రాలుగా చూపబడ్డాయి. అక్కడియన్ భాషలో 'అన్సె' పదానికి గాడిద (Wild Ass) అని అర్థం. అశ్వినీ దేవతల మూలాలు కూడా గుర్రానికి చెందినవి కాకపోవచ్చు.

ఇక, మన పర్జిటర్ పట్టికల్లో క్రీపూ. 3044-2810 వరకూ పదమూడు తరాల్లో తొమ్మిది ఐక్ష్వాకు రాజుల పేర్లు 'అశ్వ' పదంతో ముగుస్తాయి. ఈ అశ్వ పదం మిగిలిన వంశాలకు చెందిన రాజుల్లో కనపడదు. ఇక్ష్వాకు పదమూలాలను 'ఇక్-శ్-శి-వా-క్-కుమ్' అనే అక్కడియన్ పదం ద్వారా పరిశీలించి వారు మొదట అసుర ప్రతినిధులుగా (గవర్నర్) నిరూపించాము (మిసిమి, అక్టోబర్ 2015). అసురుని ప్రతినిధులు తమ పేర్ల చివర 'అసుర' శబ్దం ధరించడంలో ఆశ్చర్యంలేదు. కానీ అసురజాతి పతనానంతరం పురాణ శ్లోకాల్లోని ప్రాచీన చక్రవర్తుల పేర్లలో ఇబ్బందికరమైన 'అసుర' శబ్దాన్ని 'అశ్వ'గా మార్చడంవల్ల చంధస్సులో మార్పులేమీ ఉండవు.

మన పట్టికల్లోని పేర్లలో క్రీపూ. 2810లో కనపడకుండా పోయిన అశ్వ శబ్దం మళ్లీ 2110 లో పాంచాల వంశాల్లో 'భ్రమాశ్వునితో' తిరిగి ప్రత్యక్షమౌతుంది. ఇందువల్ల ఇండియాలో గుర్రం వాడుక గుజరాత్ ద్వారా ప్రవేశించి, ఎగువ సరస్వతీ యమునా మైదానాల్లో క్రీపూ 2000 నాటికి ప్రాముఖ్యానికి వచ్చిందని సందేహించక తప్పదు. వైదిక సంప్రదాయంలో కూడా గుర్రం మహాభారతకాలానికి (క్రీపూ. 1500) అశ్వమేధ క్రతువుగా (యజుర్వేదం) స్థానం సంపాదించింది. తొలితరాల రాజులు (పృథువు, నహుషుడు...) అనేక అశ్వమేధాలు చేసిన ప్రస్తావనలూ, రామాయణ గాథలో మొదట కనిపించే అశ్వమేధ వర్ణనలు (బాలకాండం, ఉత్తరరామాయణం) తరువాత జోడించిన ప్రక్షిప్తాలుగా ఊహించడం సులభమే.

**సింహం :**

హరప్పా నేపథ్యంలో కనబడని మరో ముఖ్యమైన జంతువు సింహం. నేడు 'ఆసియా సింహం' (Panthera leo persica) గుజరాత్‌లోని గిర్ అభయారణ్యంలో మాత్రమే మిగిలి ఉంది. గిర్ ప్రాంతం హరప్పా నాగరికతా క్షేత్రంలో భాగమే. వేదవాఙ్మయంలో సింహం ప్రసక్తులు లేకపోయినా, మహాభారత ఇతిహాసంలో సింహం రాచరికానికి చిహ్నంగా నిలిచింది. పురాణాల తొలిపుటల్లో ఒక్క దిలీపుని గాథలో

తప్ప సింహం ప్రసక్తి ప్రముఖంగా కానరాదు. క్రీపూ. 2000కు ముందు సింహం భారత ఉపఖండంలో లేదు. పరిణత హరప్పా నాగరికత పతనానంతరం ఇరాన్ పీఠభూమి నుంచి బలుచిస్తాన్ కనుమల ద్వారా ప్రవేశించి, కాలక్రమేణా ఉత్తర భారతదేశమంతా విస్తరించిందని జంతుశాస్త్రజ్ఞుల అభిప్రాయం. అదే నిజమైతే క్రీపూ 2000 – 1400 మధ్య కాలంలో ఎగువ సరస్వతీ మైదానంలోని తుదిహరప్పా సంస్కృతులకు సింహంతో పరిచయం అనివార్యం. తుదిహరప్పా నాగరికతల పతనం తరువాత, జనాభా క్షీణించడం, పర్యావరణంలో వచ్చిన మార్పులు, సింహం జాతి విస్తరణకి మరింత దోహదం చేసి ఉండవచ్చు.

**పురాజన్యు శాస్త్రం :**

ఈ తరంలో ప్రాగ్చరిత్ర అవగాహనకి లభ్యమైన మరో సరికొత్త పరికరం మానవ జన్యుశాస్త్రంలో వచ్చిన ప్రగతి. గత పాతిక సంవత్సరాల్లో ఈ శాస్త్రం వలన, మానవుడి మూలాలపై వెలుగుచూసిన అంశాలపై రెండు ముక్కలు చెప్పుకోవడం అవసరం. ప్రాగ్, పురాచారిత్రక కాలాల్లో మానవుని వలసలు, వివిధ తెగల జాతుల మూలాలను వెదికే జన్యుశాస్త్ర శాఖని పురాజన్యుశాస్త్రం (Archaeogenetics) అంటారు. 1980 నుండీ కంప్యూటర్ టెక్నాలజీలో ప్రగతివల్ల మానవ జన్యుపదార్థం (DNA) నిర్మాణంలో ఇటుకలవంటి కొన్ని లక్షల న్యూక్లియోటైడ్స్ యొక్క క్రమాన్ని, ఆ క్రమంలో కాలానుగుణంగా వచ్చిన ఉత్పరివర్తనాలను (Mutations) గుర్తించడం సాధ్యమయింది. నేడు వివిధ ప్రాంతాలకు, జాతులకు చెందిన జనాభాలోని జన్యు పదార్థంలో ఒకే ఉత్పరివర్తనం కానవచ్చే జనసమూహాన్ని ఏకస్థితగుంపు (Haplogroup) అని పిలుస్తారు. మానవ పరిణామంలో ఈ ఉత్పరివర్తనాల క్రమాన్ని బట్టి ఆయా ఏకస్థిత గుంపులను A-B-C---Z అక్షరాల క్రమంతో సూచిస్తారు. ఆయా గుంపుల్లో విడిగా వచ్చిన తదుపరి ఉత్పరివర్తనాలను అరబ్బీ సంఖ్యలతో (1–2–3–), ఆ పిమ్మట వచ్చినవి మరలా రెండవబడి అక్షరాలతో (a-b-c---z) సూచించబడుతాయి. ఉదాహరణకి C గుంపులో కనిపించే ఉత్పరివర్తనం C గుంపుకు చెందిన అన్ని శాఖల్లోనూ కనిపిస్తుంది. అలాగే C లో కనిపించే ఉత్పరివర్తనం ఆ పిదప వచ్చిన D, E, F వంటి ఏకస్థితగుంపుల్లో కూడా కనిపించవచ్చు. C1, C2 గుంపుల్లో మొదటి ఉత్పరివర్తనం రెంటిలోనూ కామన్‌గా ఉండి ఆ తదుపరి మరో ఉత్పరివర్తనం వేరుగా ఉంటుంది. అదే క్రమంలో గుర్తించిన ఉత్పరివర్తనాలను బట్టి ఏకస్థితగుంపుల సంఖ్య విస్తరిస్తుంది.

మానవుని జీవకణాల్లోని మైటోకాండ్రియాలో ఉండే జన్యుపదార్థం తల్లి నుండి బిడ్డకు సంక్రమిస్తుంది. అదేవిధంగా పురుషులలో మాత్రమే ఉండే Y క్రోమోజోమ్‌లోని జన్యుపదార్థం తండ్రి నుంచి కొడుకుకి వస్తుంది. ఈ మైటోకాండ్రియా, Y-DNA లలో వచ్చిన మార్పుల క్రమం ఒక జనజాతి, కులం లేదా ప్రాంతీయ ప్రజయొక్క మాతృక్రమపు, పితృక్రమపు వారసత్వాన్ని సూచిస్తుంది. వివిధ ప్రాంతాల్లో, జనాభాల్లో సేకరించిన ఈ మాతృ (Maternal - Mitochondrial), పైతృక (Paternal - Y-DNA) జన్యుపదార్థాల్లో కొన్ని వేల ఉత్పరివర్తనాలను, వాటి అనుబంధంగా వివిధ ఏకస్థితగుంపులనూ గుర్తించారు. అంతేగాక పర్యావరణం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆయా ఏకస్థితగుంపుల శాఖీయ క్రోమోజోముల్లో (Autosomes) జన్యురూపకాల్లో (Alleles) సమీప భూతకాలంలో వచ్చిన మార్పులు కూడా గుర్తించి విశ్లేషించారు.

ఇండోయూరోపియన్ భాషలు మాట్లాడే ప్రజల్లో Y-DNA పైతృక ఏకస్థితం 'R1a1' ప్రముఖంగా ఉంటుంది. ఈ ఏకస్థితికి గుర్తింపు M-17 అనే ఉత్పరివర్తనం. తూర్పు ఐరోపాలోనూ, ఉత్తర భారతదేశంలోనూ, దక్షిణదేశంలోని అగ్రవర్ణాల్లోనూ ప్రముఖంగా కనిపిస్తుంది. ప్రముఖ పురాజన్యుశాస్త్రజ్ఞులు, బమ్షెడ్, కోర్డో, తదితరులు (Cordaux et al.) తూర్పు ఐరోపా నుంచి మధ్యఆసియా ద్వారా ఇండియాకు క్రీపూ. 1500 ప్రాంతంలో c ప్రజల వలసలు సాగి ఉండవచ్చని సూచించారు. ప్రధానస్రవంతికి చెందిన చరిత్రకారులచే ఇది ఆర్యులవలస సిద్ధాంతానికి ఆధునిక శాస్త్రీయ ప్రమాణంగా చూపించబడింది. ఐరోపా వాసుల పూర్వీకులగా గుర్తించబడ్డ 'R' ఏకస్థితానికి చెందిన శాఖోపశాఖలపై పరిశోధనలు వేగం పుంజుకున్నాయి. అనేక కొత్త అంశాలు వెలుగులోకి వచ్చాయి.

2003లో జన్యుశాస్త్ర పరిశోధనలకు ప్రామాణికమైన అమెరికన్ జర్నల్ ఆఫ్ హ్యూమన్ జెనిటిక్స్‌లో ప్రముఖ శాస్త్రవేత్త కివిసిల్డ్ తదితరులు ప్రచురించిన వ్యాసం, గత రెండు శతాబ్దులుగా పాతుకుపోయిన ఆర్యులవలస సిద్ధాంతానికి మొదటి గొడ్డలి పెట్టయింది. ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య జనజాతులైన చెంచు, కోయ ప్రజలకు చెందిన Y-DNA

నిర్మాణాన్ని ఇండియాలో వివిధ కులాల, మధ్య ఆసియా పశ్చిమాసియా ప్రాంతాలకు చెందిన ప్రజాసమూహాలతో పోల్చిచూసారు. ఇండియాలోని పంజాబ్ ప్రజల్లో అత్యధికంగా కనిపించే R1a ఏకస్థితి చెంచులలో దాదాపు అదే ప్రమాణంలో 26% కనిపించింది. ఇది అగ్రకులాల్లోని R1a ఆర్యుల ద్వారా సంక్రమించిందనే వాదాన్ని తలకిందులు చేసింది. పైగా చెంచులలో మాతృ పితృ జన్యు క్రమాల విలీనం ప్లీస్టోసీన్ యుగంలోనే జరిగిందని, అ పిమ్మట వారి జన్యునిర్మాణంలోకి చేరిన అన్య పురుష జన్యుశాఖలు కూడా తొలి హోలోసీన్ నేపధ్యానికి చెందినవని సూచించారు. 2006లో అదే జర్నల్లో ప్రచురించిన పరిశోధన (సేన్‌గుప్తా తదితరులు) 36 కులాలు, 17 తెగలకు చెందిన పైత్రుక క్రోమోజోమ్‌లను, 8 పాకిస్తాన్, 175 తూర్పు ఆసియా సమూహాల్లోని, R2, R1a స్థితులతో పోల్చి, భారతీయుల జన్యు నిర్మాణంపై మధ్యఆసియా ప్రభావం పరిగణించ తగ్గ ప్రమాణంలో లేదని నిర్ధారించారు. అంతేగాక భారతీయ ప్రజల్లో కనిపించే జన్యువైవిధ్యం క్రీపూ. 13000–8000 నాటికే స్థిరపడిందనీ, ఆర్యులవలస కాలంగా చెప్పబడే 2వ సహస్రాబ్దిలో ఎటువంటి జన్యుసంపర్కానికీ ఆధారాలు లేవని సూచించారు. అదే సంవత్సరం, సంఘమిత్ర సాహూ తదితరులు అమెరికాలోని న్యాషనల్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ వారు ప్రచురించిన పరిశోధక వ్యాసంలో ఈ వాదం మరింత ముందుకెళ్ళింది. దేశంలో అన్ని ప్రాంతాలకూ చెందిన 32 తెగలు, 45 కులాల్లోని జన్యువైవిధ్యాన్ని పరిశీలించి మధ్యఆసియా సంపర్కం దాదాపు లేదనే తేల్చారు. పైగా మధ్యఆసియా ఐరోపా సమూహాల్లో కనిపించే కొన్ని పోలికలకు ఇండియానుండి బయటకి ఉత్తరదిశగా సాగిన వలసలు కారణంగా ఊహించారు. ఈ ఊహ భారతదేశమే ప్రపంచనాగరికతలకు పుట్టినిల్లనే జాతీయ, హిందుత్వ వాదాలకు బలాన్నిచ్చింది.

అయితే, 2010లో యూరోపియన్ జర్నల్ ఆఫ్ హ్యూమన్ జెనిటిక్స్‌లో ప్రచురించిన వ్యాసంతో ఈ వివాదానికి దాదాపు తెరపడింది. అండర్‌హిల్ ప్రభృతులు R1a1 ఏకస్థితి ఉపశాఖల్లోని ఉత్పరివర్తాల పరిశోధనతో ముందుకెళ్తూ, R1a1a7 వరకూ అనేక శాఖలు గుర్తించారు. వివిధ సైద్ధాంతిక స్రవంతులకి చెందిన శాస్త్రజ్ఞులచే ఇండోయూరోపియన్ భాషలకు మూలస్థానాలుగా ఊహించబడిన ప్రాంతాలన్నింటిలో (పాంటిక్ స్టెప్పీ గడ్డినేలలు, అనతోలియా, దక్షిణ కాకేసస్) R1a1a ఏకస్థితి చెప్పుకోదగ్గ ప్రమాణంలో కనిపిస్తుంది. అందువల్ల ప్రపంచవ్యాప్తంగా కనిపించే ఈ స్థితికం మంచుఖండాలు అత్యధికంగా విస్తరించిన కాలానికే స్థిరత్వం పొందివుండాలని సూచించారు. ఇది భాషాశాస్త్రజ్ఞులు ఇండోయూరోపియన్ భాష పుట్టుకకి సూచించిన కాలం కంటె ఎన్నో సహస్రాబ్దుల ముందు. స్వచ్ఛమైన R1a1a* ఏకస్థితి (Paragroup R1a1a) సింధునాగరికత ప్రాంతంలో ప్రముఖంగా ఉంది. మరో ఉత్పరివర్తనం (M-458) ద్వారా సూచించబడ్డ ఉపశాఖ R1a1a7, తూర్పు ఐరోపాలో పోలండ్ కేంద్రంగా విస్తరించింది. వీరి పూర్వికులు తొలి హోలోసీన్ యుగంలోనే విడిపడి వ్యవసాయ విస్తరణక్రమంలో ఐరోపా, మధ్యఆసియాల్లో విస్తరించారు. ఈ ఏకస్థితి భారత ఉపఖండంలో కానరాదు. అంటే మధ్యహోలోసీన్ (క్రీపూ. 5000) తరువాత మధ్యఆసియా ఐరోపాలనుండి భారతదేశంలోకి వ్యవసాయం లేదా పశుపాలనపై ఆధారపడ్డ సంచార జాతుల వలసలకు ఎటువంటి జన్యుపరమైన ఆధారాలూ లేవని నిరూపించబడింది. దీనితో జన్యుశాస్త్ర పరంగా 'క్రీపూ. 2వ సహస్రాబ్దిలో ఆర్యులవలస' అనే సిద్ధాంతానికి తెరపడింది.

అయితే క్రీపూ. 2వ సహస్రాబ్ది మధ్యకాలానికి పశ్చిమాసియాలో జనించిన కొన్ని ఇండోఆర్యన్ సంస్కృతులనూ, వారి భాషలో భారతదేశంలో మాత్రమే కనిపించే సంస్కృత ప్రాకృత భాషలతో పోలికలను ఎలా వివరించాలి? ఆర్యులవలస సిద్ధాంతం ప్రకారం, ఈ ఇండోఆర్యన్ భాషా సంస్కృతులు ఆంద్రోనోవా సంస్కృతినుండి విడివడి బాక్ట్రియా మార్జియానా కాంప్లెక్స్ (BMAC) ద్వారా వివిధ ప్రాంతాలకు విస్తరించాయని చెబుతుంది. ఈ పరిణామాల అవగాహనకు BMAC సంస్కృతి నేపధ్యంపై కొంత పరిశీలన అవసరం.

**బాక్ట్రియా మార్జియానా పురావస్తు సమూహం :**

ఎగువ వక్షునది (ఆక్సస్, అమూదర్యా) కేంద్రంగా, పార్థియా, మార్గు ప్రాంతాల్లో క్రీపూ. 2300–1700 మధ్య వెలుగుచూసిన కాంశ్యయుగ సంస్కృతిని రష్యా పురాతత్వవేత్తలు బాక్ట్రియా మార్జియానా పురావస్తు సమూహం (BMAC) అని పిలిచారు. క్రీపూ. 6000 నాటికే ఈ ప్రాంతంలో మెట్ట వ్యవసాయం, పశుపాలన, చేపలవేటల పై అధారపడిన జనజాతుల వ్యవస్థకి ఆధారాలు ఉన్నాయి. క్రీపూ. 4500కి ఈ సమాజాలు 'మెర్వ్' ప్రాంతం కేంద్రంగా విస్తరించాయి. క్రీపూ. 3500–3000 కి ఈ ప్రాంతంలోకి

మరో కొత్త సంస్కృతి చేరికతో మరింత విస్తరించింది. ఈ కొత్త సంస్కృతి మూలాలు నిర్ధారించడం కష్టం. అయితే ఆనాటికే దక్షిణ ఇరాన్, ఎగువ మెసొపొటోమియా, ప్రాగ్‌హరప్పా సంస్కృతులతో వాణిజ్యానికి సంబంధించిన అనేక ఆధారాలు కనిపిస్తాయి. BMAC ఒక స్థానికంగా పుట్టిన సంస్కృతి, కానీ దీని అభివృద్ధికి దక్షిణ ఇరాన్ సంస్కృతులు ఉత్ప్రేరితాలుగా ఊహించడం జరిగింది. క్రీపూ. 2600 నాటికి ఈ ప్రాంతంపై పరిణత హరప్పా నాగరికత ప్రభావం బలోపేతమయింది. హరప్పా ముద్రలూ, పరికరాలు ఎక్కువ సంఖ్యలో వెలుగుచూసాయి. అదే ప్రాంతంలో వక్షునది తీరంలోని ఒక పరిణత హరప్పా పట్టణం, 'షోర్తుగాయ్' ఈ రెండు ప్రాంతాల మధ్య వాణిజ్యానికి కేంద్రమయింది. క్రీపూ 2300 నాటికి BMACలో పట్టణాల నిర్మాణం ఊపందుకుంది. అదే సమయంలో వోల్గా తీరంనుండి విస్తరిస్తున్న ఆండ్రోనోవా సంస్కృతితో సంబంధాలు మొదలయ్యాయి. కోటగోడల నిర్మాణం ఆ ప్రాంతంలో స్థానిక స్పర్థలకూ, కొత్తగా ఏర్పడిన రాచరికాలకూ అధారంగా ఊహించారు. జనసంఖ్య పెరిగింది. గుర్రం, ఒంటెల మచ్చిక, యుద్ధానికి ఉపయోగించే 'రథం' పరిచయమయ్యాయి.

మొదట్లో ఈ సంస్కృతిలో వాడుక భాషలేవో ఊహించడం కష్టం. అయితే ఈ ప్రాంతంపై దక్షిణ ఇరాన్ సంస్కృతులతో పరిచయాన్ని బట్టి, వీటిపై మూలద్రవిడ-ఈలమైట్ భాషల ప్రభావాన్ని ఊహించవచ్చు. ప్రధానస్రవంతికి చెందిన చరిత్రకారులు క్రీపూ. 2వ సహస్రాబ్ది మొదట్లో ఇండోఆర్యన్ భాషలు ఈ సంస్కృతీ నేపథ్యంలోకి ప్రవేశించాయని ఊహించారు. అంతేగాక ఇండియా, ఇరాన్ ప్రాంతాలేగాక ఈజిప్టు, మెసొపొటేమియా, అనతోలియా, పశ్చిమ చైనాల్లో వెలుగుచూసిన ఇండోఆర్యన్ భాషా సంస్కృతుల, రాచరికాల వలసలకు ఈ ప్రాంతమే వారధిగా గుర్తించారు. రాజేశ్ కోచార్ వంటి రచయితలు ఆర్యుల వలస పథంలో ఈ ప్రాంతాన్ని ఆర్య-దశ్యు స్పర్థలకు, రామాయణ ఇతివృత్తంలోని సంఘటనలకు నేపథ్యంగా ఊహించడం జరిగింది. ఇదే ప్రాంతంలోని హర్హవతీ, హెల్మన్డ్ నదులను ఋగ్వేదంలోని సరస్వతీ, సరయూ నదులుగా నిరూపించే ప్రయత్నాలు చేసారు. పేర్లలో పోలిక కొట్టొచ్చినట్లు కనిపించినా పరిమాణంలో ఈ నదులకూ, ఋగ్వేదంలోని వర్ణనలకూ పొంతన కుదరదు. అయితే, క్రీపూ 2000 నాటికి ఈ సంస్కృతిపై ఇండోఆర్యన్ భాషా సంస్కృతుల ప్రభావం వాస్తవంగా తోస్తుంది. క్రీపూ. 4500కు పూర్వమే ఇండోఆర్యన్ భాషలు మాట్లాడే ప్రజలు హరప్పా క్షేత్రంలో నివసించారనీ, ఆ నాగరికత నిర్మాణంలో భాగస్వాములనే వాదంతో ముందుకెళ్లాలంటే, భారత ఉపఖండం వెలుపల, హరప్పా నాగరికత పరిధుల్లో విస్తరించిన BMAC చిక్కుముడిని విప్పాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకూ పరిశీలించిన పురాణ వాఙ్మయంలోని వృత్తాంతాల్లో, మన పర్గిటార్ కాలమానం ప్రకారం, కొన్ని ప్రశ్నలకు సమాధానాలు వెదుకుదాం.

ఈ ప్రాంతంలో క్రీపూ. 6000 నాటికే కొన్ని వ్యవసాయ, పశుపాలక సమాజాల పుట్టుకలో ఆశ్చర్యం లేదు. నవీనశిలాయుగం మొట్టమొదట వెలుగుచూసిన ఫర్టైల్ క్రెసెంట్‌కీ, భారత ఉపఖండంలోని బలుచిస్తాన్‌కీ మధ్య కీలకమైన ప్రాంతమది. ప్రస్తుతం మనకి లభ్యమౌతున్న ఆధారాలతో ఈ పరిణామానికి ఆవశ్యకమైన సాంకేతిక పరిజ్ఞానం ఎక్కడనుంచి వచ్చిందో, లేక స్వతంత్రంగా పుట్టిందో నిరూపించలేము. క్రీపూ. 3000 నాటికి భారత, ఎగువ మెసొపొటేమియా సంస్కృతుల మధ్య ఈ ప్రాంతం కూడా ఒక వారధిగా పనిచేసిందని చెప్పవచ్చు. తొలిహరప్పా దశలో హరప్పా ప్రాంతం నుండి కొందరు మూలవాసుల వలసలు ఈ దిశగా సాగివుండేందుకు అవకాశం ఉంది. అసురుల ఆగమనంతో తరువాత గంధర్వుల వలసక్రమంలో (మిసిమి, జులై 2015) ఈ పరిణామాన్ని ఊహించవచ్చు. యక్ష-వక్షు, మేరువు-మెర్వ్ పదాల్లో పోలిక ఈ ఊహకి కొంత బలాన్నిస్తుంది. అయితే అప్పటి BMAC ప్రాంతంలో కొత్తగా చేరిన సంస్కృతుల్లో దక్షిణ ఇరాన్, తొలిహరప్పా (ఝోబ్) సంస్కృతుల ప్రభావం దాదాపు సరిసమానంగా కలగాపులగంగా కనిపించడవల్ల ఆ ప్రజల వలసలు నిరూపించడం సాధ్యం కాకపోయినా, మేరువు సమీపంలోని అలకాపురికి కుబేరుని వలస, అతడిని యక్షులకు రాజుగా సూచించడంలో BMAC వాణిజ్యవర్గపు ఆధిపత్యంలో వచ్చిన పరిణామంగా ఊహించవచ్చు.

క్రీపూ. 2300తో BMAC పరిణత దశకి చేరింది. పురాణాల్లో దేవాసురయుద్ధాలు, అసురుల పరాజయం, క్రీపూ. 2300 ప్రాంతంలో సగరుని విజయం నేపథ్యంలో, హరప్పా క్షేత్రం నుండి పశ్చిమ వాయవ్యదిశల్లో అసురుల వలసలను సూచించాం (మిసిమి, నవంబర్ 2015). BMAC కేంద్రంగా విస్తరించిన ఇరానియన్ భాషా స్రవంతికి మూలమైన జెండ్

భాష, జొరాష్ట్రియన్ మతాల్లో, ఆ సంస్కృతి పరిణతికి, కోటల నిర్మాణానికి దారితీసిన పరిణామాలు కనిపిస్తాయి. ఈ ఆధారాలతో BMACలో కొత్తగా చొచ్చుకొచ్చిన ఇండోఆర్యన్ రాచరికానికి హరప్పా ప్రాంతవే మూలస్థానంగా నిరూపించవచ్చు. క్రీపూ. 2000 నాటికి పరిణత హరప్పా నాగరికత పతనంతో, జనసమూహాల వలసలు ఉధృతమయ్యాయి. అప్పటికే వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలున్న BMAC ప్రాంతానికి చేరిన హరప్పా వాసులలో ఇండోఆర్యన్ రాచరికాలను, స్థానిక ఆధిపత్య వ్యవస్థతో స్పర్థనూ ఊహించవచ్చు. వారి యుద్ధతంత్రంలో వచ్చిన కొత్త పరిజ్ఞానానికి (గుర్రం, రథం) ఆండ్రోనోవా సంస్కృతులతో పరిచయం, రాజకీయ సమీకరణాలు కొంతవరకూ కారణమై ఉండవచ్చు. క్రీపూ. 1700 నాటికి BMAC పతనదశకి చేరింది. పరిణత హరప్పా పతనం, కొడగట్టిన వాణిజ్యం ఈ పరిణామానికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది. అదేకాలంలో ఈజిప్టు (హిక్సోలు–క్రీపూ 1700), మెసొపొటేమియా (కాశేయులు–క్రీపూ. 1500), అనతోలియా (మిట్టని–క్రీపూ. 1450), పశ్చిమ చైనా (వుషాన్–క్రీపూ. 1500) లలో ప్రత్యక్షమైన ఇండోఆర్యన్ రాచరికాల వలసలకు BMAC ని వారధిగా సూచించే ప్రధానస్రవంతికి చెందిన చరిత్రకారుల అభిప్రాయం వాస్తవదూరం కాదు.

**ముగింపు :**

క్రీపూ. 1700 ప్రాంతంలో ఈజిప్టుపై దండెత్తి కొన్నాళ్లు ఆధిపత్యం సాధించిన హిక్సోలను ఈజిప్ట్ శాసనాల్లోని వర్ణనలను బట్టి ఇండోఆర్యన్ తెగగా గుర్తించారు. చైనా రికార్డుల్లో సిన్కియాంగ్ ప్రాంతంలో ఒకానొకప్పుడు నివసించిన వుషాన్ తెగ పేరుని 'అశ్విన్' పదానికి ప్రతిరూపంగా ఊహించారు. క్రీపూ. 1500లో బాబిలోనియాలో అధికారానికి వచ్చిన కాశేయ (కాసైట్స్) రాజుల పేర్లలో 'సూరియష్', 'మరుత్తష్' వంటి కొన్ని ప్రాకృత సంస్కృత నామాలు, వారి ఇండోఆర్యన్ వారసత్వాన్ని నిరూపిస్తాయి. అయితే ఈ తెగలన్నీ కొద్దికాలంలోనే స్థానిక సంస్కృతుల్లో విలీనమై తమ ఇండోఆర్యన్ భాషనూ, అస్తిత్వాన్ని కోల్పోయాయి. అనతోలియాలో వికసించిన మిట్టని రాచరికం మాత్రం మూడు శతాబ్దాల కాలం తన ప్రత్యేకతని నిలబెట్టుకుంది. మిట్టనీ రాజధాని 'బోగజ్ కూయ్' లో లభించిన మట్టిఫలకాల్లోని దేవతల పేర్లు – ఇన్దరస్సిల్, ఉరనాస్సిల్, మితిరస్సిల్, నాసత్తియ (ఇంద్ర, వరుణ, మిత్ర, నాసత్య) – ఋగ్వేదంలో ప్రముఖంగా కనిపించడం, కిక్కులి అనే వ్యక్తి రచించిన అశ్వశాస్త్రానికి సంబంధించిన సంకలనంలోని ప్రాకృత పదాలు, మిట్టని రాచరికానికి, వైదిక సంస్కృతికీ ఉన్న దగ్గర సంబంధాన్ని నిరూపిస్తాయి. ఈ ఫలకాలు క్రీపూ 1450 ప్రాంతానికి చెందడంవల్ల 'ఆర్యులవలస సిద్ధాంతం' ఇండియాలో ఆర్యుల ప్రవేశానికి కాస్త ముందువెనుకలుగా అదేకాలాన్ని సూచించింది. అయితే ఇవే ఆధారాలతో వారిని హరప్పా నాగరికత పతనానంతరం వలసబోయిన రాచరికాలుగా కూడా వాదించవచ్చు. చారిత్రకభాషాశాస్త్రంలో, పురాజన్యుశాస్త్రంలో పెరిగిన పరిజ్ఞానం, కొత్తగా వెలుగుచూసిన పురాతత్వ ఆధారాలను బట్టి, క్రీపూ 5000 కి పూర్వమే ఇండోఆర్యన్ భాష మాట్లాడే ప్రజల నివాసాన్ని భారత ఉపఖండంలో చూపవచ్చు. ఇండికలో డైయొనీసస్ రాకకు సూచించబడ్డ తేదీ, క్రీపూ. 6363 వాస్తవానికి దగ్గరగా ఉంది. క్రీపూ. 3100కి వీరు స్థానికులలో భాగమై రాచరికంగా కూడా ఎదిగారు అనుకోవచ్చు. అయితే వాఙ్మయంలో మాత్రం వారు భారత ఉపఖండం వెలుపలినుంచి వచ్చినట్లు స్పష్టమైన ఆధారాలు లేవు. హరప్పా నాగరికత నిర్మాణంలో వీరు కూడా భాగస్వాములే అనడం హేతుబద్ధం.

అయితే లక్షన్నర చదరపు కిలోమీటర్లు విస్తరించిన ఒక అభివృద్ధి చెందిన నాగరికత, తన చుట్టుపక్కల జనజాతులను ఆకర్షించకపోదు. ఉదాహరణకి భారత కాంశ్యయుగ నాగరికతలో మూడోవంతు విస్తీర్ణం ఉన్న ప్రాచీన మెసొపొటేమియా చరిత్రలో సుమేరియన్, అక్కడియన్, మార్ష్ అరబ్, అమోరైట్, ఈలమైట్, హిటైట్, హుర్రియన్, అస్సిరియన్, ఫోనీసియన్, కాసైట్, హిబ్రూ జనజాతుల రాకపోకలు వారి రాతప్రతుల్లో కనిపిస్తాయి. వారివారి భాషలు వేరు, సంస్కృతులు వేరు. అదే విధంగా హరప్పా నాగరికత కూడా అనేక భాషలకూ, ప్రజలకూ కర్మక్షేత్రంగా భావించడంలో తప్పులేదు. ప్రస్తుతం భారతదేశంలో వాడుకలో ఉన్న భాషాకుటుంబాల మూలాలను ఆ సంస్కృతుల్లో ఊహించవచ్చు. తుదిహరప్పాయుగపు నాగరికతల్లో భారత అంతర్భూమిలోకి అయా భాషల, జనజాతుల విస్తరణ క్రమాన్ని వచ్చే సంచికలో భారతేతిహాసం నేపథ్యంలో పరిశీలిద్దాం.

మి



సాయి పాపినేని
బెంగుళూరు
ఫోన్ : 0 98 45 03 44 42

## ఆనందీబాయి జోషి (1865–1887)

# మొదటి భారతీయ మహిళా డాక్టరు

– అనువాదం : జనపన లక్ష్మీరెడ్డి

ఆనందీబాయి జోషి అమెరికాలో డాక్టరు కోర్సు చదివిన మొదటి భారతీయ మహిళ. ఆమె భారత దేశంలో మొదటి డాక్టరుగా పట్టా పొందినప్పుడు విక్టోరియా మహారాణి తన అభినందనలు తెలుపుతూ వర్తమానం పంపింది. ఇది అనేక కష్టాలు ఓర్చుకొని ఆనాటి ప్రపంచంలో ఆనందీబాయి సాధించిన గొప్ప విజయానికి ఆమె ఇచ్చిన గుర్తింపు. మొట్టమొదటి బ్రిటిష్ మహిళా డాక్టరు ఎలిజబెత్ అండర్సన్ ఆనందీబాయి జోషీ కి సహపాఠి కావడం గర్వించదగ్గ విషయం. ప్రపంచంలోనే మొదటి మహిళా డాక్టరు ఎలిజబెత్ బ్లాక్ వెల్ కూడా అమెరికాలో వైద్యశాస్త్రంలో పట్టా పొందింది 1849 లోనే.

ఆనందీ బాయి గణపత్ రావ్ జోషి, గంగూబాయి జోషిల పుత్రిక. ఆమె పూనా లో 1865 మార్చి 31న జన్మించింది. ఆచారంప్రకారం పుట్టిన తర్వాత పదకొండవ రోజున ఆమెకు యమున, అని, క్లుప్తంగా యము అని పేరు పెట్టడం జరిగింది. యము అంటే సూర్యుని కూతురు అని అర్థం. యీ పేరును ఆమె వివాహం అయే దాకా ఉంచుకుంది.

గణపత్ రావు జోషి పెష్వాల కుటుంబానికి చెందినవాడు కావడం వల్ల ధనికుడైన భూస్వామి. అందరికి గౌరవాస్పదుడు. యమున ఆయనకు ముద్దుల కూతురు. అల్లారు ముద్దుగా పెరిగింది.

గోపాల వినాయక్ జోషి యమున ఐదవ ఏట అంటే, 1870లో పోస్టల్ డిపార్ట్మెంట్ లో క్లర్క్ గా చేరాడు. మహారాష్ట్ర లోని ఆ ప్రాంతంలో కొత్తవాడు కావడంతో అతడు తన కులానికి చెందిన వాళ్ళతో పరిచయం పెంచుకోవాలని ఉబలాటపడ్డాడు. గణపత్ రావు చదువుకున్నవాడు కావడంతో తన ముద్దుల కూతురు యమునకు చదువు చెప్పించాలనుకున్నాడు. అందువల్ల ఆమె గోపాల్ జోషి దగ్గర సంస్కృతం చదువుకోడానికి అనుమతించాడు.

వినాయక్ కొద్దికాలంలోనే గోపాల్ పోస్ట్ మాస్టర్ గా పదోన్నతి పొంది అలీబాగ్ కు వెళ్ళిపోయాడు. దాంతో యమున చాలా నిరాశచెందింది. కానీ ఆ నిరాశ యెంతో కాలం ఉండలేదు.

గణపత్ రావు జోషి కుటుంబం పూర్వాచార పరాయణుల కుటుంబం.ఆ రోజుల్లో యిలాంటి పూర్వాచారపరులైన బ్రాహ్మణ కుటుంబాల్లో ఆడపిల్లలు రజస్వల కాకముందే పెళ్ళి చేయడం ఆచారం. అలా చేయలేకపోవడం పెద్ద అవమానకరమైన విషయంగా భావించే వారు. అందువల్ల యము కు తగిన వరుణ్ణి వెదకడం పెద్ద సమస్య అయిపోయింది. ఆమె రంగు కొంత నలుపు. అంతేకాక స్థూలంగా, మసూచిపొక్కులతో ఉండడం సమస్యను మరింత పెద్దది చేసింది.

యము తొమ్మిదేండ్లదయి రజస్వల అయ్యే స్థితికి చేరుకొనేసరికి ఆమె తల్లిదండ్రుల చింత మరింత పెరిగి పోయింది. ఒక పెళ్ళిళ్ళ పేరయ్య గోపాల్ జోషిని యముకు తగిన వరునిగా సూచించగానే వారు వెంటనే సమ్మతించారు. గోపాల్ అభ్యుదయవాది, అప్పట్లో పెద్దగా ఆదరణలేని స్త్రీవిద్యను గట్టిగా సమర్థించేవాడు. అయితే గోపాల్ చూడడానికి బాగా ఉండేవాడు కాదు. పైగా విదురుడు, యముకంటే ఇరవై యేళ్ళు పెద్దవాడు కూడా. అతని మొదటి భార్య సావిత్రి మరాఠీ చదువుకొమ్మని అతడు పెట్టిన వేధింపుల కారణంగా చనిపోయింది.

ఇలాంటి ఇబ్బందులు చాలా ఉన్నా యముకు అతడంటే ఇష్టంగానే ఉండడం చేత, ఆమెకు బాగా చదువుకోవాలనే కోరిక ఉండడం చేత ఆమె తల్లిదండ్రులు ఈ పెళ్ళికి సమ్మతించారు. అప్పుడు గోపాల్ పెట్టిన షరతు ఒకే ఒకటుంది. తన ఇష్టానుసారం ఆమెను చదివించుకోనివ్వాలి, అని, అంతే.

పెళ్ళి సన్నాహాలు జరుగుతూండగా గోపాల్ హఠాత్తుగా మనసు మార్చుకున్నాడు. అతడు వితంతు వివాహాన్ని పెద్ద సంస్కరణగా భావించేవాడు, దాన్ని ఆదరించేవాడు కావటంచేత ఒక వితంతువును పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు.

దేన్నీ లక్ష్యం చేయకుండా, యెవరికీ చెప్పకుండా అతడు పూనా వెళ్ళిపోయాడు. పెళ్ళినాటికి కూడా తిరిగి రాలేదు. చివరకు ముహూర్తం గడిచిపోయిన తర్వాత కల్యాణ్ కు వచ్చాడు.

అందువల్ల మరో ముహూర్తం నిర్ణయించింతర్వాత 1874, మార్చి 31 న సంప్రదాయబద్ధంగా పెళ్ళి జరిగింది. అప్పుడే గోపాల్ ఆమెకు ఆనందీ బాయి అని కొత్త పేరు పెట్టాడు. (ఆ తర్వాత తెలిసిందేమిటంటే, గోపాల్ రావు ఒక వితంతువును పెళ్ళి చేసుకోడానికి పూనా వెళ్ళాడట. అయితే అతడు ఒక పోస్టల్ క్లర్క్ మాత్రమే అని విన్న ఆ వితంతువు అతన్ని చూడడానికి కూడా ఇష్టపడకపోవడంతో అతడు కల్యాణ్ కు తిరిగి వచ్చేశాడట!)

ఈ విధంగా తొమ్మిదేళ్ల వయసులో ఆమె వివాహం ఆమె కంటే ఇరవై యేళ్ళు పెద్దవాడు, విదురుడు అయిన గోపాల్ రావ్ జోషితో జరిగింది. ఆనందీ ఇంకా చిన్నపిల్ల కావడంతో కొత్త దంపతులు కొంతకాలం గణపత్ రావు జోషి కుటుంబంతో పాటే, ఆనంద్ లోనే ఉన్నారు. గోపాల్ రావ్ స్త్రీ విద్యను గట్టిగా సమర్థించేవాడు, అభ్యుదయ భావాలు కలిగినవాడు. అందుచేత ఆయన తీరిక సమయాల్లో ఆనందీ బాయిని మరాఠీ నేర్చుకొనెందుకు ప్రోత్సహించేవాడు. తర్వాత అతడామెకు ఇంగ్లీషు, సంస్కృతం, భూగోళం, ప్రాచీన శాస్త్రాలు నేర్పాడు. కొద్ది కాలంలోనె ఆనందీ విద్యావివేకాలు కలిగిన చురుకైన బాలికగా రూపొందింది. ఈ మార్పంతా ఆమె తల్లిదండ్రుల తీవ్ర ప్రతికూలత, కుటుంబ కలహాలు, ఆమె భర్త నిలకడలేనితనం మధ్య జరిగింది. గోపాల్ తన చిన్న వయసు భార్యను చాలా దూరం నడవడానికి తనతో తీసుకెళ్ళే వాడు, అప్పుడు ఆమెకు పాఠాలు చెప్పేవాడు. సంస్కృతం నేర్చుకోవడం కంటే ఇంగ్లీషు నేర్చుకోవడమే ముఖ్యమని అతడు గట్టిగా నమ్మేవాడు.



ANANDI JOSHI

అయితే భర్తతో చదువు నేర్చుకోవడం సులభం కాదని ఆనందీ బాయి చివరిదాకా అంగీకరిస్తూ వచ్చింది. అతడు ఆమెను పుస్తకాలతోను, కర్రతోను కొట్టేవాడు. ఒక రోజు ఆమె తన అమ్మమ్మకు ఒంటింట్లో వంటలో సహాయం చేస్తుండగా చూసి మహోగ్రుడై, ఆ చిన్నపిల్లను వెదురు కర్రతో కొట్టాడు. ఇరుగు పొరుగు గగ్గోలు పెట్టారు. భర్తలు సాధారణంగా వంట చేయనందుకు భార్యలను కొడతారు. భార్య చదువుకోకుండా వంట పని చేస్తున్నదని కొట్టే భర్తలెక్కడైనా ఉంటారా? ఆనందీ విద్యపట్ల తీవ్రమైన ఆసక్తి కలిగినదే అయినా, గోపాల్ లో గనక స్త్రీవిద్య విషయంలో ఉన్మాదస్థాయికి చేరిన పట్టుదల లేకుండా ఉండి ఉంటే, ఆమె ఇంత చదువు చదవ గలిగేది కాదు.

తర్వాతి కాలంలో ఆనందీబాయి తన భర్తకు రాసిన ఉత్తరాల్లోని కొన్ని అంశాలు ఇలా ఉన్నాయి:

“పాత విషయాలను గుర్తుకుతెచ్చి మీ హృదయానికి బాధ కలిగించడం గానీ, మన సంబంధాల్లో ఎలాంటి చీలిక తీసుకు రావడం గానీ నా ఉద్దేశ్యం కాదు. నా పట్ల మీ ప్రవర్తన మంచిగా ఉండిందా లేక చెడ్డగా ఉండిందా, అనేది నిర్ధారించి చెప్పడం కష్టం. మీరు గనక నన్నడిగితే అది రెండు విధాలుగానూ ఉండిందనే చెప్తాను. చివరి పరిణామాన్ని గనక దృష్టిలో ఉంచుకొని చెప్పాలంటే మీ ప్రవర్తన మంచిదనే చెప్పవచ్చు. అయితే, ఒక చిన్న పిల్ల మెదడు పైన అలాంటి కఠోరమైన ప్రవర్తన కారణంగా పడగలిగిన ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని చూస్తే మటుకు అది అనుచితమైందనే చెప్పాలి. నా పదేళ్ల వయసులో నన్ను విరిగిన బెత్తంతో కొట్టడం, నా పండ్రెండేండ్ల ప్రాయంలో నా పైన కుర్చీని, పుస్తకాలను విసిరేయడం, నన్ను వదలిపెట్టి వెళ్ళి పోతానని బెదిరించడం, నేను పద్నాలుగేళ్ల దాన్నైనప్పుడు ఇలాంటివే చిత్ర విచిత్రమైన శిక్షలు విధించడం – ఇవన్నీ ఆ చిన్న వయసులో నా శరీరాన్ని, మెదడును బాగా కృంగతీసేవే. చిన్నప్రాయంలో మెదడు అపరిపక్వంగాను, శరీరం అవికసితంగాను ఉంటుంది. అలాంటి సందర్భాల్లో నేనెలా ప్రవర్తించానో మీకు తెలుసు. అలాంటి తెలిసీ తెలియని వయసులో మీ ప్రవర్తన కారణంగా నేను గనక మిమ్మల్ని వదలి వెళ్ళిపోయి ఉంటే, ఏమయ్యేది? నేను ఎక్కడో పోగొట్టుకు పోయేదాన్ని (ఎంతమంది అమ్మాయిలు తమ అత్తల, భర్తల చేతుల్లో ఇలాంటి బాధలు పడ లేక ఇల్లు–వాకిలి వదలిపెట్టి వెళ్ళి పోతూ వచ్చారో గదా!).

నేనలా చేయలేక పోయాను. ఎందు చేతనంటే, ఈ విధంగా వెనక ముందు ఆలోచించకుండా ముందుకు అడుగు వేయడం మా తండ్రిగారి పరువు-ప్రతిష్ఠలను మంట కలపుతుందని భయపడ్డాను కాబట్టి. అందుకే నేను నా పైన దయ చూపకండి, నన్నుచంపేయండి అని మిమ్మల్నిప్రార్థించేదాన్ని. మన సమాజంలో ఎన్నో శతాబ్దాలుగా భార్యా భర్తలకు సంబంధించి ఎలాంటి చట్టపరమైన ఆంక్షలూ లేవు. ఒకవేళ ఉంటే, అవి స్త్రీలకు విరుద్ధంగానే ఉన్నాయి. అలాంటి పరిస్థితిలో మిమ్మల్ని నన్ను కుర్చీలతో కొట్టనివ్వడము, ఆ హింసనంతా కిమ్మనకుండా సహిస్తూ ఉండడము తప్పనాకు వేరే మార్గం లేకపోయింది. ఒక హిందూ స్త్రీకి భర్త ఎదుటనోరు మెదపడానికి గాని, అతనికి ఏదైనా సలహా ఇవ్వడానికి గానీ, అధికారం ఉండదు. భర్త తన ఇష్టానుసారం చేసే పనులన్నీ నోరు మెదపకుండా చేయనివ్వడానికి మాత్రమే అధికారం ఉంటుంది. ప్రతి హిందూ భర్త కావాలంటే భార్య నుంచి ఓర్పు విషయంలో ఎంతో పాఠం నేర్చుకో కలుగుతాడు. దానివల్ల అతనికి చాలా మేలు జరుగుతుంది కూడా (మీరు ప్రయత్నం లేకుండా నేను ఇప్పుడున్న స్థితికి ఎప్పటికీ చేరుకోగలిగి ఉండేదాన్ని కాదని నాకు బాగా తెలుసు. అందుకు గాను నేను మీ పట్ల ఎల్లప్పటికీ ఋణపడి ఉంటాను. ఐతే అన్నికష్ట పరిస్థితుల్లోనూ నేను ఓర్పుతోనే ఉండినాననే విషయాన్ని మాత్రం మీరు కాదనలేరు). ఇదంతా సహించడానికే నేను పుట్టాననుకుంటాను. అయినా నేనిప్పుడు సంతృప్తితోనే ఉన్నాను.

"స్త్రీ పురుష సంబంధాలగురించి ఆలోచించినప్పుడు నేను సంప్రదాయబద్ధమైనవిగా చెప్పబడే ఆలోచనల పక్షంలోనే నిలబడి ఉన్నట్లు నాకు తోస్తుంది. పురుషుని స్థాయికి ఎదిగి రానంత వరకు కొన్నిప్రత్యేకమైన సామాజిక అదుపాజ్ఞల్లో ఉండడమే స్త్రీకి శ్రేయస్కరమని నేను భావిస్తాను. ఉదాహరణకు పునర్వివాహం చేసుకోకుండా ఉండడం, పురుషుని అధీనంలో ఉండడం, భర్తను దైవంగా భావించడం. శాస్త్రాల్లో కూడా ఇలాంటి ఆదేశాలే ఉన్నాయి. కానీ అన్ని యుగాల్లోనూ, కాలాల్లోనూ స్త్రీలను ఎలాంటి హింసలకు గురిచేయడం జరిగింది, అనే దాన్ని గురించి ఆలోచించినప్పుడు మాత్రం పాశ్చాత్య దేశాల వెలుగు మన జీవితాలను విముక్తి దిశగా, శ్రేయస్సు దిశగా నడిపించేందుకు ఎప్పుడు అవతరిస్తుందా, అని మాత్రం ఆత్రంగా ఎదురుచూస్తాను. ఇక్కడ నన్ను నేను పూర్తిగా అభివ్యక్తి పరచుకొనేందుకు నా శక్తి చాలడం లేదు. స్త్రీ, పురుషులు ఇద్దరు తమను తాము కాపాడుకుంటూ ఉండాలని, వారు తమ జీవితం సాగించడానికి, తమ ఇతర అవసరాలను తీర్చుకోడానికి ఒకరు మరొకరి పైన ఆధారపడకూడదని నమ్మిస్తూ రావడం జరిగింది. ఇలాంటి స్థితి ఏర్పడినప్పుడు మాత్రమే అన్ని కుటుంబ జీవితాల్లోని ఉద్రిక్తతలు, సామాజిక అవమానాలు సమసిపోతాయి. భారతదేశంలో అనేకమంది స్త్రీలకు కేవలం వివాహం కోసమే విద్య నేర్పడం, పనిపాటల యోగ్యత కలిగించడం చూసి నాకు అపారమైన దుఃఖం కలుగుతుంది. అయ్యో, పెళ్ళికాని మగవారిని ఆకర్షించడానికి నిముష-నిముషానికి దుస్తులు మార్చుకుంటూ ఉండడం,, నగలతో అలంకరించుకుంటూ ఉండడం, స్త్రీకి ఎంత హీనం!

మన సమాజంలో బహుభార్యాత్వ ఆచారం లేదు. మనవాళ్లు ఒకరికంటే ఎక్కువ భార్యలు కలిగి ఉంటే, అందుకు కారణం వారికి తమ మొదటి భార్యవల్లనో, రెండవ భార్యవల్లనో పుత్రసంతానం కలగకుండా ఉండడమే అయి ఉంటుంది. దీనివల్ల సామాజికంగాను, మత పరంగాను మనం పుత్రసంతానం కావాలనే కోరికలో ఎంత లీనమై ఉన్నామో, తెలుస్తుంది. స్వర్గద్వారాలు పుత్రసంతానం కలిగి ఉన్న పురుషులకు మాత్రమే తెరవబడుతాయి! ఇతరులకు ఈ ద్వారాలు మూసే ఉంటాయన్నమాట!

మన సమాజంలో స్త్రీలు అన్ని ఋతువుల్లో ఒకే దుస్తులు ధరించడం ఉంది. మేము స్త్రీలం వెచ్చదనం కలిగించే దుస్తులు ధరించం. ఎందుచేతనంటే, అవి వికారమైనవిగా భావించబడతాయి కాబట్టి. అంతేకాదు, మేము చెప్పులు, బూట్లుకూడా తొడుక్కోం. ఎందుచేతనంటే, మాకు ఎప్పుడోగాని ఇంటి నాలుగు గోడల మధ్యలోంచి బయటికి వెళ్ళే అవకాశం కలగదు కాబట్టి. చెప్పొచ్చేదేమిటంటే, సమస్త ఐశ్వర్యాలు కేవలం పురుషులకోసమే ఉన్నాయి. చలి, ఎండ, వసంతశోభ, అన్నీ వారికే అనుభవమవుతాయి. స్త్రీలకు ఇవన్నీ అనుభవం కావు. ఋతువుల్లో వచ్చే ఈ మార్పులను వారు గమనించకుండా ఉండాలనే ఆశించడం జరుగుతుంది. అలాంటప్పుడు మీ పట్ల మాకు ఈర్ష్య కలగవద్దా?

ఈ మధ్య నేను ఏదో ఒక కారణంతో జబ్బుపడుతూ వచ్చాను. భారతదేశంలో ఉన్నతవర్గాల స్త్రీలు సాధారణంగా చాలా బలహీనంగా ఉంటారు. నా అభిప్రాయం ప్రకారం భారత దేశంలో అన్ని చోట్లా వ్యాపించి ఉన్న బాల్యవివాహాల ఆచారం ఇందుకు ఒక పెద్ద కారణం. కానీ మీరు కూడా

ఇలాంటి అసంతృప్తులే వ్యక్తపరుస్తున్నారు కాబట్టి మన వివాహ వ్యవస్థలోనే ఏదో లోపం ఉందని నాకు తోస్తుంది.”

గోపాల్ కు అలిబాగ్, భూజ్, తర్వాత కోల్హాపూర్ కు బదిలీ అయింది. ఆనందీబాయికి కలిగిన ఏకైక సంతానం ఆమె పదునాల్గవ ఏట 1878 లో కోల్హాపూర్లో కలిగింది. ఆ శిశువు పది రోజులు మాత్రమే జీవించి చనిపోయింది. సరైన వైద్య సదుపాయాలు లేనందువల్లనే ఆ శిశువు చనిపోయిందని ఆనందీబాయి గట్టిగా నమ్మింది. దీంతో ఆమెకు వైద్యశాస్త్రం చదవాలనే ఆలోచన కలిగింది.

గోపాల్ వైద్యశాస్త్రం చదవడానికి భార్యను ప్రోత్సహించాడు. తన వద్ద డబ్బు లేకున్నా ఆమెను విదేశాలకు పంపాలని కోరుకున్నాడు. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం విదేశీ మహిళలకు కూడా వైద్యశాస్త్రం చదివే అవకాశం కల్పిస్తోందని అతనికి తెలిసింది. అయితే ఆ కోర్సు చదివేందుకు 325.50 డాలర్లు ఖర్చుపెట్టవలసి వచ్చేది. 1885లో అది పెద్ద ఖర్చు.

అప్పుడతడు అమెరికాలో ఉండే రాయల్ విల్డర్ అనే తన మిషనరీ మిత్రునికి ఆనందీ బాయి వైద్యవిద్యాలయంలో చేరడంలోను, తానొక ఉద్యోగం సంపాదించుకోడంలోను సహాయపడమని కోరుతూ ఉత్తరం రాశాడు. విల్డర్ దంపతులు ఇద్దరు క్రైస్తవ మతంలోకి మారినప్పుడు మాత్రమే సహాయం చేయగలనని షరతు పెట్టాడు. అయితే వారందుకు అంగీకరించలేదు. ఆనందీ బాయి అందుకు పూర్తి విరుద్ధం.

విల్డర్ తను ప్రచురించే పత్రిక Princeton's Missionary Review లో గోపాల్ తో తనకు జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలు ప్రచురించాడు. థియొడొసియా కార్పెంటర్ అనే మహిళ యీ ఉత్తరప్రత్యుత్తరాలు చదివి ఈ దంపతులతో గాఢంగా ప్రభావితురాలైంది. ఆమె అమెరికాలో ఆనందీబాయికి నివాసం ఏర్పాటు చేసే విషయంలో తన ఆసక్తి కనపరుస్తూ ఉత్తరం రాసింది. వారిద్దరి మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు సాగిన తర్వాత వైద్యశాస్త్రం చదివేందుకు అమెరికా వెళ్ళాలని ఆనందీబాయి మానసికంగా సిద్ధపడింది. పెన్సిల్వేనియాలోని మహిళా వైద్యవిద్యాలయానికి పంపిన దరఖాస్తులో ఆమె ఇలా రాసింది:

“నా కులము, నా మిత్రుల ఉమ్మడి విరోధాన్ని కూడా లెక్క చేయకుండా నన్ను మీ దేశానికి తీసుకొచ్చిన నా పట్టుదల నేనే ఉద్దేశ్యంతో ఇక్కడికి వచ్చానో, ఆ ఉద్దేశ్యం నెరవేర్చుకోడంలో నాకు తోడ్పడుతుంది. నా దేశంలో ఎన్నో అగచాట్లు పడుతున్న పేద స్త్రీలకు, వారు చచ్చినా, మగ వైద్యున్నుంచి పొందడానికి ఇష్టపడని అత్యవసరమైన, నిజమైన వైద్య సహాయం అందించడమే ఇక్కడికి రావడంలో నా ఉద్దేశ్యమని చెప్పదలచాను. మానవాళి ఆశలు, ఆకాంక్షలు నాతో ఉన్నాయి. నేనీ పరీక్షలో తప్పడానికి వీల్లేదు. అసహాయులకు సహాయం అందించాలని నా ఆత్మ ఆక్రోశిస్తుంది.”

ఆ రోజుల్లోనే గోపాల్ కలకత్తా కు బదిలీ అయ్యాడు. ఆనందీబాయికి కలకత్తాలో మరిన్ని మంచి అవకాశాలు లభిస్తాయిని దంపతులిద్దరు చాలా సంతోషించారు. అయితే వారిద్దరు కలకత్తా లో ఉన్న రోజుల్లో ఆనందీబాయి బలహీనతతో, ఎడతెగకుండా ఉండే తలనొప్పితో, తరుచుగా వచ్చే జ్వరంతో, ఇవన్నీ చాలవన్నట్లు మధ్యమధ్యలో వచ్చి పీడించే ఊపిరిపీల్చుకోలేనితనంతో బాధపడింది. మందులు ఆమెకు పెద్దగా మేలు చేయలేకపోయాయి. 1883లో గోపాల్ సెరామ్‌పూరుకు బదిలీ అయ్యాడు. అప్పుడే అతడు ఆనందీబాయి ఆరోగ్యం సరిగా లేకపోయినా ఆమెను వైద్యవిద్య చదివించేందుకు ఒంటరిగానే అమెరికా పంపించాలని నిశ్చయించుకున్నాడు. ఆనందీబాయి సిద్ధంగా లేదు. అయినా గోపాల్ తన దృఢనిశ్చయాన్ని మార్చుకోలేదు.

ఈ దంపతుల నిశ్చయం పూర్వాచారపరులైన హిందువులకు ఆగ్రహం తెప్పించింది. వారిద్దరిపైన దాడులు కూడా జరిగాయి. ఆనందీబాయి సెరామ్ పూర్ కాలేజీ హాల్లో అలాంటివారిని ఉద్దేశించి ఉపన్యసించింది. ఆమె వారి ముందు మతం మారనని వాగ్దానం కూడా చేసింది. సమాజానికి హిందూ మహిళా డాక్టర్లు ఎంత అవసరమో వారికి బోధ పరిచింది. అమెరికా నుంచి తిరిగి వచ్చిన తర్వాత భారతదేశంలో స్త్రీలకోసం వైద్యశాల ఒకటి నెలకొల్పాలనే ఉద్దేశ్యం కూడా ఆమెకు ఉండేది. ఆమె ఉపన్యాసం తర్వాత చాలా చోట్ల నుండి ఆమెకు ఆర్థిక సహాయం అందింది.

ఈ విధంగా 1883లో, పందొమ్మిదేండ్ల ప్రాయంలో, శరీరం బలహీనంగా ఉన్నా ఎంతో మనోబలమే ఆసరాగా అనందీబాయి, ఇద్దరు థియోడోసియా మిత్రులతో అమెరికాకు బయలుదేరింది. అక్కడ పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం లోని మహిళా వైద్యశిక్షణాలయంలో చేరింది. అక్కడ ఆమె సంవత్సరానికి $ 600 చొప్పున మూడు సంవత్సరాలకుగాను స్కాలర్ షిప్పు కూడా పొందింది. ఆమె అధ్యయనాంశం హిందూ ఆర్యుల్లో ప్రసూతివిద్య. అమెరికాలో కూడా ఆమె

జీవనశైలి ఏమీ మారలేదు. ఎంతో నిరాడంబరంగా ఉండేది. మహారాష్ట్ర స్త్రీలు సాధారణంగా కట్టుకునే తొమ్మిది గజాల చీరే కట్టుకునేది. కార్పెంటర్ కుటుంబం ఆమెను బాగా ఆదరించడమే కాక కష్టసుఖాల్లో తోడుగా కూడా ఉండేది.

ఆనందీ బాయి అమెరికా వెళ్ళిపోయిన తర్వాత గోపాల్ రావు ఒంటరితనంతో మానసికంగా కృంగి పోయాడు. మనస్సు స్థిమితంగా లేనందువల్ల తన పై అధికారులతో వాదానికి దిగుతూ చివరికి తన పోస్టల్ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాడు. ఇక ఆనందీబాయిని కలుసుకోడానికి అమెరికా వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. అయితే అమెరికా టికెట్టు కొనడానికి ఆయన వద్ద డబ్బు లేకపోయింది. అందువల్ల రంగూన్ దాకా టికెట్టు కొని కొంతకాలం అక్కడి ఓడరేవులో కూలీగా పనిచేసి చివరకు ఎలాగో అమెరికా చేరడానికి అవసరమైనంత డబ్బు సంపాదించుకున్నాడు.

ఫిలడెల్ఫియాలో 3 సంవత్సరాల తర్వాత భార్య ఆనందీబాయిని కలుసుకున్నప్పుడు ఆమెకు చాలా సంతోషం కలిగింది. అప్పటికామె మొదటి తరగతిలో M.D. పూర్తి చేసింది. 1886 లో జరిగిన స్నాతకోత్సవంలో కాలేజీ ప్రెసిడెంటు ఆమెను ప్రశంసలతో ముంచెత్తుతూ ఇలా అన్నాడు : "మన కాలేజీ చరిత్రలో యీ దినాన్ని స్వర్ణాక్షరాలతో లిఖించాలని చెప్పడానికి గర్వపడుతున్నాను. వైద్యశాస్త్రంలో డిగ్రీ పొంది మన కాలేజీకి గౌరవం తెచ్చి పెట్టిన మొట్టమొదటి భారతీయ వనిత ఇక్కడ ఉంది. శ్రీమతి ఆనందీ బాయి కి భారతదేశంలో మొదటి మహిళా డాక్టరు అయిన గౌరవం దక్కింది." యీ ప్రశంసా వాక్యాలు విని అక్కడివారంతా కరతాళ ధ్వనులతో తమ హర్షాతిశయాన్ని వ్యక్తం చేశారు.

'ఫిలడెల్ఫియా పోస్ట్' అనే వార్తాపత్రిక ఇలా రాసింది : "తన తరగతిలో ఎంతో గౌరవప్రదంగా ఉత్తీర్ణురాలైన బక్కపలచని శ్రీమతి జోషిని హాల్లోవారంతా కరతాలధ్వనులతో అభినందించారు. మహారాణి విక్టోరియా కూడా ఆమెకు తన అభినందనలు పంపింది."

అక్కడ ఉన్న కాలంలోని రెండవ అర్ధ భాగంలో ఆనందీబాయి తరచుగా జబ్బుపడేది. ఆమెకు విపరీతమైన దగ్గు వచ్చేది. తర్వాత అది T.B అని తేలింది. తర్వాతి కాలంలో అది మరింత తీవ్ర రూపం ధరించింది. అందువల్ల 1886లో ఆమె భారతదేశం తిరిగి రావాలని నిశ్చయించుకుంది. గోపాల్‌రావ్‌తోసహా ఆమె ప్రయాణించి వచ్చిన ఓడ బొంబాయి చేరగానే ఆనందీబాయి గౌరవార్థం గొప్ప సన్మాన సభ ఏర్పాటు చేయడం జరిగింది. కొంతకాలం తర్వాత ఆమె జబ్బు మరింత విషమించింది. ఇక ఆ జబ్బు నయమయ్యే ఆశ కూడా లేకుండా పోయింది. ఆనందీబాయి అమెరికాలో వైద్యశాస్త్రం చదివి వచ్చిన డాక్టరే అయినా పూనాలో పేరుమోసిన ఆయుర్వేద వైద్యుడు డా.మెహండాలే తనను పరీక్షించాలని బలంగా కోరుకుంది. ఆమెను పూనాకు తీసుకెళ్ళారు కూడా. కానీ, రోగి మృత్యువు చెంతకు చేరి ఉందని చెప్పినా కూడా డా. మెహండాలే ఆమెను చూడడానికి కూడా సమ్మతించలేదు. పుండుపైన కారం చల్లినట్లు అతడు ఇలా అన్నాడు కూడా – "ఈ ఆడది అమెరికా వెళ్ళింది. పరదేశీయులతో ఒంటరిగా గడిపింది. హిందూ మతం బ్రాహ్మణులకు నిషేధించిన ఆహారం తినింది. బ్రాహ్మణులందరికి తలవంపులు తెచ్చిపెట్టింది." నిరాశ, నిస్పృహలతో, నీళ్ళు నిండిన కళ్ళతో ఆనందీబాయి తిరిగి ఇంటికి చేరింది.

పూనాలోని విశిష్టులు అనేకులు ఆనందీబాయి సాధించిన విజయాలవల్ల ఆమెను చూడడానికి వచ్చేవారు. కానీ ఎవరు కూడా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఆమె కుటుంబానికి సహాయం అందించడానికి ముందుకు రాలేదు. ఆ పరిస్థితుల్లోనే ఒక రోజు 'కేసరి' పత్రిక సంపాదకుడు లోకమాన్య బాలగంగాధర తిలక్ నుంచి ఒక ఉత్తరం వచ్చింది. అందులో ఆయన ఇలా రాశారు.

"ఎన్నో కష్టాలకు ఎదురు నిలిచి అమెరికా వెళ్ళి శ్రద్ధాసక్తులతో నీవు వైద్యవిద్య నేర్చుకొని వచ్చావని నాకు తెలుసు. ఈ ఆధునిక కాలంలో నీవు అతి గొప్ప స్త్రీలలో ఒక దానివి. నీవు ఆర్థికమైన ఇబ్బందులతో బాధ పడుతున్నావని నాకు తెలిసింది. నేనొక వార్తాపత్రిక సంపాదకుడిని. నాకు పెద్ద ఆదాయం అంటూ లేదు. అయినా నీకు వంద రూపాయలు పంపదలచుకున్నాను."

తిలక్ ఉత్తరం చూసి ఆనందీబాయి కళ్ళనుండి ధారగా కన్నీళ్ళు ప్రవహించాయి. అప్పుడామె ఇలా అంది – "ఈ పేదరికం, దానధర్మాలకోసం ఈ యాచన, నాకొద్దు. దీన్ని నేనిక భరించలేను. నేను మునుపు ఎలా ఉన్నాను? ఇప్పుడేస్థితికి చేరుకున్నాను? నేను ఒక బిచ్చగాని కూతురును కాను. నా కుటుంబంలో ఎవరూ బిచ్చమెత్తుకోలేదు. నేనొక భూస్వామి కూతుర్ని. నాపై దయదలచి నా బ్రతుకుదెరువుకు గాను లోకులు దానం ఇచ్చే పరిస్థితిని ఎలా భరించగలను? దేవుడు ఎంత కఠినాత్ముడు కదా! నాకీ హీనస్థితి నుంచి విముక్తి

ఎందుకు కలిగించడు?" దుఃఖార్తితో కూడిన ఈ మాటలు నోటినుండి వెలువడిన కొద్దిరోజుల తర్వాతే ఆనందీబాయి 21 సంవత్సరాల వయసులో అంటే 1887, ఫిబ్రవరి 26 వ తేదీన, తన 22 వ జన్మదినానికి ఒక నెల ముందు చివరిశ్వాస విడిచింది. "నేను చేయగలిగినంత చేశాను" ఇవే ఆమె చివరి మాటలు! ఆనందీబాయి మృత్యువుకు భారతదేశం శోకించింది. ఆమె చితాభస్మం థియోడేసియా కార్పెంటరుకు పంపగా ఆమె దాన్ని న్యూయార్క్ లో తమకుటుంబ సమాధులున్నచోట భద్రపరిచింది. విద్యపట్ల తపనతో శ్రమించే బాలికలందరికి ఆనందీబాయి నిజమైన ప్రేరణ. ఆమె తన జీవితం ద్వారా మన కలలను నెరవేర్చుకోవడం మన చేతిలోనే ఉందని, తగినంత దీక్ష, పట్టుదల ఉంటే అవి సాధ్యమేనని మనం నమ్మేట్లు చేసింది. గొప్ప పండితురాలు, సామాజిక కార్యకర్త, ఆనందీ బాయి సమకాలికురాలు, అయిన పండిత రమా బాయి ఆనందీ బాయి జోషి గురించి ఇలా రాసింది:

* * *

"1887 ఆరంభంలో ఒక దుఃఖవార్త అందింది. ఆనందీ బాయి జోషి అకాలమరణం పొందిందన్న వార్త. అమెరికాలోని చల్లని వాతావరణం, ఆమె జీవనశైలి, రెండు ఆమె ఆరోగ్యం పైన ప్రతికూల ప్రభావం కలిగించాయని చెప్పవచ్చు. క్షయరోగం కూడా ఆమెను కృంగతీసింది. కోల్హాపూర్‌లోని అల్బర్ట్ ఎడ్వర్డ్ ఆసుపత్రిలో ముఖ్య చికిత్సాధికారిగా ఆమె తన పని సరిగా మొదలు పెట్టకముందే మృత్యువు ఆమెను మన అందరి నుంచి లాక్కుపోయింది. నేనొక మంచి సహకర్మిణిని పోగొట్టుకున్నాను. నేను పూనాకు తిరిగి వెళ్ళిన తర్వాత నా ఆశ్రమం మొదలు పెట్టినప్పుడు ఆనందీ బాయితో చాలా సహాయంలభిస్తుందనే ఆశ నాకుండేది.

ఆనందీబాయితో వ్యక్తిగతంగా నేను కలుసుకున్నది కొద్ది నెలలు మునుపే. అయినా అంతకు మునుపు నుంచే మా మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు జరుగుతూ వచ్చాయి. కలుసుకోక ముందు మేమిద్దరము ఒకరిని గురించి ఒకరు ఎలా భావించుకున్నామో, కలుసుకున్నప్పుడు సరిగ్గా అలాగే ఉన్నామనిపించింది. ఫిలడెల్ఫియాలో నా ప్రవాస కాలంలో ఈ సోదరితో నేను కొన్ని మంచి క్షణాలు గడిపాను. మేమిద్దరము కలిసి ప్రపంచ ప్రఖ్యాతి కలిగిన నయాగరా జలపాతాన్ని చూసేందుకు వెళ్ళాము. నేనక్కడి ప్రకృతి సౌందర్యాన్ని చూసి స్తంభించిపోయాను. భగవంతుడు ఈ ప్రపంచంలో ఎలాంటి-ఎలాంటి అద్భుతమైన విషయాలను సృష్టించాడోగదా! మా ఇద్దరి ఉద్దేశ్యాలు ఒకటే, మేము కన్న కలలు ఒకటే. అయినా కొన్ని అంశాల్లో మా అభిప్రాయాలు వేరువేరుగా ఉండేవి. నాకు ఆశ్చర్యం కలిగించిన విషయం ఏమిటంటే, ఒక ఉపన్యాసంలో ఆనందీబాయి బాల్యవివాహ ఆచారాన్ని సమర్థించింది. బహుశా ఒక బ్రాహ్మణ స్త్రీ అయిన ఆమె బహిరంగంగా, విదేశీయుల మధ్య, విధర్ముల మధ్య ఒక హిందూ ఆచారాన్ని ఎదిరిస్తుందని ఆశించడం అత్యాశే అవుతుందేమో. అయితే ఆమె మామూలుగా తన అభిప్రాయాన్ని స్పష్టంగా వ్యక్త పరచేది. అమెరికా వెళ్ళక ముందు స్త్రీలకు విద్యావకాశాలు, ఆరోగ్యసేవలు లభించకపోవడాన్ని గురించి ఆమె బహిరంగంగా తన ఆవేదనను వ్యక్తం చేసింది. బహుశా విదేశంలో తన మతాన్ని, దేశాన్ని కించపరచడం దేశద్రోహంగా భావించబడేదేమో, అందుకే ఆమె బాల్యవివాహాన్ని తన సంస్కృతిలోని విశేషతగా చెప్పింది.

మతాంతరీకరణ విషయంలో మా ఇద్దరి దృష్టులు వేరువేరుగా ఉండేవి. డా. ఆనందీ బాయి జోషి హిందువుగా పుట్టి హిందువుగానే మరణించింది. ఆమె తనపై ఉన్న చర్చి ప్రభావాన్ని, క్రైస్తవుల ప్రభావాన్ని ఎన్నడు నిరాకరించలేదు. అయినా మతం మారలేదు. ఈ విషయంలో చాలా మంది నన్నుఎద్దేవా చేసేవారు. విధవాశ్రమం కోసం డబ్బు ప్రోగు చేసే అవసరం లేకున్నానేను క్రైస్తవం తీసుకున్నానని .ఆనందీ బాయి డాక్టరు కావడంలో కృతకృత్యురాలయింది, కానీ క్రైస్తవంలోకి మారలేదు, అనే ఉదాహరణ అందరి ఎదుట ఉండేది. అలాంటప్పుడు దేశం పట్ల, హిందూమతం పట్ల ఆనందీబాయికున్న నమ్మిక దృఢమైందని, నేను అస్థిరచిత్తురాలినిగా బయటపడిపోయానని చెప్పడం జరిగింది. నిజం చెప్పాలంటే, లోకులకు నా మతాంతరీకరణ ఎందుకు, ఎలా జరిగిందో, వివరించడం నా శక్తికి మించిన పని."

* * *

*(ఈ వ్యాసంతో పాటు ఈ క్రింది కృతజ్ఞత కూడా ప్రచురించండి Science Reporter, మే 2015 సంచికలో ప్రచురితమైన ధ్రువజ్యోతి చట్టోపాధ్యాయ వ్యాసం Anandibai Joshi : First Indian woman Doctor, పూర్వా భరద్వాజ్ రాసిన పండిత రమాబాయి జీవిత చరిత్ర ఆధారంగా రాసిన వ్యాసం. వీరిద్దరికి కృతజ్ఞతలతో.)*

మి

**అనువాదం : జనపన లక్ష్మీరెడ్డి**

**న్యూఢిల్లీ.**

**ఫోన్ : 95 33 58 16 30**

# అట్టమీద బొమ్మలు

మెతుకు సీమ చిత్ర తేజం – **అహోబిలం ప్రభాకర్**

అమలిన శృంగారానికి ప్రతీకగా నిలిచే రాధాకృష్ణుల మధురప్రణయం యుగయుగాలుగా ఎందరో కవులు, గాయకులు, చిత్రకారులు, శిల్పులను అలరిస్తూ వస్తుంది. సిద్ధిపేట వాస్తవ్యుడైన అహోబిలం ప్రభాకర్ తనదైన ప్రత్యేక శైలితో, రేఖావిన్యాసంతో, రంగుల పొందికతో దీనిని ఇతివృత్తంగా తీసుకొని ఎన్నో చిత్రాలు వేశారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు అన్ని రకాల వీక్షకుల అభిమానం చూరగొన్నారు. న్యూఢిల్లీలోని లలితకళా అకాడెమీ రవీంద్ర భవన్‌లో జరిగిన ప్రదర్శనలో ప్రభాకర్ గీసిన ఆరుచిత్రాలకు చోటు లభించింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన చిత్రకారులలో ఇతడే చిన్న వయస్కుడు కావటం విశేషం!



గోపాలుడు



రాధాకృష్ణులు

సిద్ధిపేటకు చెందిన కార్పెంటర్ లక్ష్మయ్య ప్రభాకర్ తండ్రి. చిన్నతనం నుంచి తండ్రి చేస్తున్న వృత్తిలో నిబిఢమై వున్న కళాత్మకతను పరిశీలించి చిత్రాలు గీయటం పై ఆసక్తి పెంచుకొన్నారు. పుస్తకాలపై చక్కటి చిత్రాలు గీసి తోటి విద్యార్థులను అబ్బురపరిచేవాడు. పదో తరగతి పూర్తయిన తరువాత సైన్ బోర్డు ఆర్టిస్టుగా రూపుపొందాడు.

తన కళకు పరిపూర్ణత చేకూరేటందుకు 2002వ సం॥లో హైదరాబాదు వచ్చి హైదరాబాదు ఆర్ట్ స్టూడియో నడుపుతున్న సుభాష్‌బాబును కలుసుకున్నాడు. అవిరామ కృషితో ప్రఖ్యాత చిత్రకారుడు వైకుంఠంగారికి ఏకలవ్య శిష్యునిగా మారి ఆయన మార్గంలో పయనిస్తూనే తనదైన సొంతబాట ఏర్పరుచుకున్నాడు. అతని చిత్రాలలో తెలంగాణ సంప్రదాయం, గ్రామీణ జీవితం, కట్టు, బొట్టు, వస్త్రధారణను స్పృశిస్తూ పేరుగాంచాడు. దాదాపు 30 పుస్తకాలకు ముఖచిత్రాలు చిత్రించారు. ఇందులో అంతర్లీనంగా తెలంగాణాలోని పల్లెజీవితం, కులవృత్తులు ఉన్నాయి. అక్కడ నుంచి వెనక్కు తిరిగి చూసింది లేదు. రాధాకృష్ణ చిత్రాలు ఇప్పటి వరకు 30కి పైగా గీశాడు. ఈ చిత్రాలలో అంతకు ముందు వేస్తున్న చిత్రాలకంటే భిన్నంగా రాధాకృష్ణుల కనుముక్కు తీరును కనుల కింపుగా తీర్చి దిద్దటంలో చిత్రకళా నైపుణ్యంలో మరో ముందడుగు వేశారు.



అనామిక

వీరిని హైదరాబాదు ఆర్ట్ సొసైటీ **హైలీ కమెండబుల్ ఆర్టిస్ట్** పురస్కారంతో సత్కరించారు.

ప్రభాకర్ చిత్రకారునిగా మరింత ముందుకు సాగాలని దేశానికి, రాష్ట్రానికీ పేరు తేవాలని ***మిసిమి*** ఆశిస్తుంది.

ఈ నెల నాలుగు బొమ్మలు అహోబిలం ప్రభాకర్ వేసినవే!



గోపిక

# బెథోవెన్ సంగీతము - వెన్నెల రాత్రి

- ఆవంత్స సోమసుందర్

**17**-12-1770 లో జర్మన్ సంగీతవేత్త లుడ్విగ్‌వాన్ బిథోవెన్ జన్మించాడు. సంగీత లోకంలో సామ్రాట్‌గా పరిపాలించాడు. అతని 53 ఏళ్ళ జీవితంలో యూరోప్‌ను ఇతర దేశాలనూ ఆకర్షించాడు. పియానిస్టుగా ప్రారంభమూ, సంగీతంలో సర్వతోముఖంగా గొప్ప వాగ్గేయకారుడయ్యాడు. ఆనాటి ప్రపంచంలో సంగీత విద్వాంసులను, వాగ్గేయ కారులను, కాంపోజర్స్‌ని ఆకర్షించి, ఎన్నో కొత్త మార్గాలు ప్రదర్శించాడు. పియానోకి-9 పూలై సింఫొనీలు, 5 కాన్సెర్ట్‌లు. వయొలిన్‌కి 1 కాన్సెర్ట్ 32 పియానొ సొనాటాలు 6 స్ట్రింగ్ క్వార్టర్స్ సమకూర్చి సంగీతంలో సార్వభౌముడిగా కీర్తిమంతుడయ్యాడు. బెతోవెన్ చిన్నవయస్సులోనే అతని తండ్రి జాన్ వాన్ దగ్గర ఆనాటి గొప్ప సంగీతవేత్తలైన మెజార్ట్‌తో కలసి విద్యాభ్యాసం చేశాడు. జోసెప్ ఏజన్‌కు స్నేహితుడై కృషిసల్పాడు.

1792లో వియన్నా వెళ్ళి హెడెన్‌తో కలిసి విద్యాభ్యాసం సాగించి, గొప్ప పియోనిస్టుగా పేరు సంపాదించాడు బెతోవెన్. బెతోవెన్ ఆమరణాంతం వియన్నాలో జీవించాడు. 1800 సంవత్సరం నాటికి తన వినికిడి శక్తి తగ్గి, మరణానికి దశాబ్ది ముందుగా పూర్తిగాపోయింది. అయినా ఆ దశాబ్దిలోనే అతనికి గొప్ప పేరు తెచ్చిన సంగీత సృజన జరిగింది. ప్రజలమధ్య సంగీత కార్యక్రమములు వినికిడి సమస్యలవల్ల విరమించుకున్నాడు. బెతోవెన్ తండ్రి తాతలు కూడా సంగీతవేత్తలే. బెతోవెన్ తండ్రి జాన్ వాన్‌కి కలిగిన ఏడుగురు సంతానంలో నలుగురు పోగా మిగిలిన ముగ్గురులో బెతోవెన్ ఒక్కడే సంగీతవేత్త అయ్యాడు. అతని ప్రథమ గురువు తండ్రే. తండ్రి దగ్గర నిలచిన బెతోవెన్ కీబోర్డువద్ద ఎన్నడూ కన్నీటితోనే ఉండేవాడు. తండ్రి శిక్షణ కఠినంగా ఉండడమే కారణం. పుత్రుడు సంగీతంలో కనబడరిచే ప్రతిభకు ముగ్ధుడయ్యేవాడు తండ్రి. బెథోవెన్ తన మొదటి కచేరీ పదవయేట (1778 మార్చి) జరిగింది. కానీ తండ్రి వాల్‌పోస్టర్స్ మీద మాత్రం ఆరేళ్ళ వయసుగానే ప్రింటు చేయించాడు.

ఒక శ్వేత రాత్రి బెథోవెన్ మహాశయుడు దాన్యూబ్



నదీతీరం వరకూ వాహ్యాళి వెళ్ళి రావాలనుకున్నాడు. అప్పటికి ఆయనకింకా బధిరం సంక్రమించలేదు. దారిలో ఒక పాడు సత్రపు గుమ్మంలో ఇరువురు వ్యక్తులు కూర్చున్నారు. అందులో ఒకామె “అబ్బ! ఎంత గొప్పగా కాస్తోందో వెన్నెల” అంది. అమ్మా! వెన్నెల అంటే ఏమిటీ? అని కుమార్తె అడిగింది. తల్లి చెప్పలేక, వెక్కివెక్కి ఏడ్చింది. గబగబ వెళ్ళి, వాళ్ళని సమీపించాడు. ఆ బిడ్డ మొగం రెండు చేతులా ఎత్తి చూశాడు. రెండు కళ్ళూ లేవు. “అమ్మా! నీకు వెన్నెల చూపించలేనుగానీ, వినిపించగలనమ్మా” అన్నాడు. ఆయున హృదయం కలతబారింది. వెనుదిరిగి వచ్చేశాడు. మథనపడ్డాడు. ఎప్పుడో అర్ధరాత్రి చటాలున ఈ సోనాటా స్ఫురించింది. వెంటనే స్వరలిపి పూర్తి చేసుకున్నాడు. మర్నాడు ఆర్కెస్ట్రాను ఆయత్తపరిచాడు. సంసిద్ధం చేవాడు. తాను అంథబాలికను చూసిన స్థలానికి వెళ్ళి తల్లినీ, బిడ్డనీ తీసుకొచ్చాడు. ఆతిథ్యం ఇచ్చాడు. వినిపించాడు. “అబ్బా! వెన్నెల ఇంత అందంగా ఉంటుందా? అని బాలిక ఏడ్చింది. అదృష్టవశాత్తూ అది కేసెట్‌లో లభిస్తోంది. కళ్ళు మూసుకు వింటుంటే మనకాస్వచ్ఛ శీతలమైన వెన్నెల అనుభవం మన సర్వస్వాన్నీ

ముంచెత్తుతుంది. ఇన్ని జంత్ర స్వరాల నాదాలలోంచి ఎన్ని వెన్నెల మైదానాలు, ఎలా తెరుచుకున్నాయో, దూరంలో మసకబారిన కొండలు – బూడిద బుంగలు అనుభూతికి అవతలి సరిహద్దుల్లా, పోతరించిన ఎద్దుల్లా మనకెందుకివి? ఇవతల ఇంత విశాల మైదానంలో ఎన్నెన్ని ఎత్తుపల్లాలు లేచిన భూమిపుళ్ళు! కణితలు, కంతెల, అగడ్తలూ, లోయలూ, సోలోపులూ, చాళ్ళూ – ఎందుకివన్నీ? ఆ వార అదిగో నీటి చార, రెక్క కదలించే హంస, ఒంకర్లు తిరిగి సోయగాలు పారే సెలయేరు. మరచిన కలలో మిగిలిన వెలుతురు, తీపుల స్మృతిరేఖలా, నీటి పాయపై నిరంతర వర్తమానం సరాగాలాడుతున్న పసిబిడ్డ. ఈ మూల ఇవేమిటి నిగనిగలు? ఎవరూ పండించని మొక్కలు ఏపుగా పెరిగి, తళతళలాడుతూ తలల్లో ఎన్నెన్ని రంగుల పువ్వులో!

ఇంత వెన్నెల్లో ఎలా తెలిసేది? రంగులపై పలచని మంచు మేలి ముసుగు జార్చి, నీరంధ్రంగా వెన్నెల ధావళ్య కాంతిలో మురిసి, దిగంతాల కొసల సన్నగా గొంతెత్తి తీతువు పిలుస్తూ ఎగురుతున్నట్లు సెల్లోనాదం ఒళ్ళంతా నిమురుతూ చేతకి వేదనలూ, వాయులీన మృదులాంగుళుల మన స్పర్శ! ఎలా పోల్చుకునేది! ఎక్కడ్నించి జాలువారుతూ, పరిమళ వైభవం వీచికలై, తరంగాలై, ఝంఝులై – ఓహ్! మూన్‌లైట్ సొనాటా! అంధస్సముద్రంలో లభించిన లైఫ్‌బాయ్, శ్రవణాలలోంచి మేలుకొన్న వెన్నెన్ని గుండెలు? గుండె గుండెకీ వెన్నెల సొనలు, లాలనలు! ఈ చీకటి రాత్రిలో నేనూ, మహర్షి బెథోవెన్నూ మిగిలి కెరటాలలో తేలుతూ – అసలాయన ఎక్కడ ఉన్నాడో గుడ్డి చీకటిలో? ఏ మూల నుంచి సోకుతున్న వెన్నెల మూర్తిగా? ఇక్కడ నేనే లేను; సంగీత సరస్సులో తంద్రాలసకమలమై నా నిద్రాతల్పంపై, నా పార్థివ శరీరం ఒక సదసత్తు! పూజిత అంగార కల్పంపై హిమతుషారం.

నా అహమంతా ఒకే నాదమై మిగిలినపుడు నాకెలా తెలిసేది; కోల్పోయిన నా అస్తిత్వం గురించి సముపార్జించుకున్న ఓజస్సు గురించి వేయి జంత్రాలు నియంత్రిస్తున్న సుస్వర ధ్వానాలై రోచిస్స్వర జవనాశ్వాలై – శ్వేతకపోతాలై, నయనతారలకు లభించినదే మాధుర్యం? బెథోవెన్ దీర్ఘ బాహువుల మాత్రం – మెల్లగా కాంతి ధ్వజాలై సంచలిస్తూ, పాలిస్తూ, చేతిలోని మంత్రదండం, నవరత్న ఖచిత ప్రకాశకాష్టం! అంతే, ఇక్కడ చీకటి ఎక్కడ? అంధత్వమెక్కడ? చెప్పుతల్లీ నువ్వు – వెన్నెల నెలా స్పర్శించావు? శ్రవణించావు? ఆఘ్రాణించావు? నిమిరావు? బెథోవెన్ అనుగ్రహమెలా అనుభవించావు... ఆరిపోయిన వీధిదీపాలతో విశ్రమించే చీకటి నిద్రలో మునిగి గుర్రుపెడుతున్న కొండ గొర్రె, వెన్నెల కురిపించే సంగీతం సుధాసరస్సులో – పూలపడవలా సాగుతూ ఆగుతూ నా హృదయం ఇంకెందుకు ఇతరేతర ప్రమేయాలు? వాసనామయ బంధాలు? లంపటాలు? అంధస్సముద్రంలో బెథోవెన్ బాహా బంధాలు సదా రక్షణలో అభయ ముద్రల అనునయంలో పునర్జన్మనందుకొని విశ్వానంతా సంగీతంగా అవతరించి, వెన్నెలలో నగ్నంగా జల క్రీడలాడుతూ తరించి, అణువణువునా పులకల మెరుపులు కురిసే కొబ్బరిచెట్లు! పాపం, బెథోవెన్ చూడలేదో?! వెన్నెలనంతా ఒడిసిపట్టేసుకుని చారెడేసి హరిత పత్రాలతో పిచ్చి లోకానికి విందుల నీరాజ నాలందించే అరటిచెట్లు! పాపం, బెథోవెన్ – చూసి ఎరగడో?



నోట్సు రాస్తూ బెతోవెన్

* * *

చేతిలో నవరత్న ఖచిత మంత్రదండమున్న నాదబ్రహ్మ బెథోవెన్ కరుణాంతరంగం నీపై కప్పి, మెస్మరించి దృశ్యమాన చంద్రరేఖల అదృశ్య హృదయానుభూతిగా నాదమయమొనర్చి; ఎలా మంత్రించాడో – ఎలా ప్రసన్నమొనరించాడో చెప్పు తల్లీ చెప్పు! సెలయేళ్ళకా సరిహద్దులుండవు; సౌరభాలకు ఆంక్షలు పనికిరావు, సంగీత స్రోతస్విని ఎవరి నిషేధాజ్ఞల్నీ శిరసావహించదు! అదృశ్య శరాసారమై, రసజ్ఞ లోకం నిరంతర అవినీతి హృదయంతో పాదాభివందనమాచరించే బెథోవెన్‌కు మరణం లేదు. ఆ చిట్టి కారకురాలైన మూన్‌లైట్ సొనాటాకు ముగింపులేదు.


డా. ఆవంత్స సోమసుందర్
ఫోన్ : 93 47 84 89 05

# మొల్ల రామాయణం

## (కవయిత్రి - ఆతూకురి మొల్ల)

– *కసిరెడ్డి వెంకటపతిరెడ్డి*

“తేనెచుక్క నాలుకపై వేస్తే ఒక్కసారి నోరంతా తియ్యనైపోతుంది”. ఒక మంచి కావ్యం చదివితే, దానిలోని మాధుర్యం చదువరికి ఇట్టే అందాలి. అలా కాకుండా నిగూఢమైన శబ్దాలు కూర్చి కావ్యరచన చేస్తే చెవిటివాడు మూగవాడు మాట్లాడుకున్నట్లు ఉంటుంది. అందువల్ల కవికి, పాఠకునికి నడుమ భావసమన్వయం లోపిస్తుంది.

“తేనె సోక నోరు తీయనయగు రీతి తోడనరమొల్ల తోచేటట్లు” తేటతెల్గు మాటలతో రామాయణాన్ని వ్రాసి అసంఖ్యాకమైన తెల్గు రామాయణాల్లో తనది మేల్బంతి అనిపించుకొన్న కవయిత్రి ‘మొల్ల’. పాశ్చాత్యులు భారతదేశాన్ని పాలించటానికి ముందు స్త్రీలకు ఏ రంగంలోనైనా యీ దేశంలో ప్రాతినిథ్యంగాని, చొరవగాని లేదు. ‘న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి’ అనే నానుడి ప్రచారంలో ఉండేది. సాంఘిక రంగంలోనూ కళాసాహితీ రంగాలలోనూ స్త్రీలకు చోటు లభించలేదు. మొన్నమొన్నటిదాక స్త్రీ అంటే ‘వంటింటి కుందేలు’ అనే దురభిప్రాయమే వుంది. నేటికి నాలుగు వందల యేండ్లకు ముందు ఇంకెంత దుర్భర వ్యవస్థ వుండేదో మనం పోల్చుకోవచ్చు.

చారిత్రకంగా ఎలాంటి ప్రోత్సాహం లేని ‘మొల్ల’ కవితారంగంలో కాలుమోపింది. ఆనాటి కవులు, పండితులు అగ్రవర్ణస్థులే. విద్యావిజ్ఞానాలు వారి సొత్తే. అలాంటి విషమ సమయంలో ఒక నిమ్నజాతి మహిళ సాహసోపేతంగా కావ్యరచనకు పూనుకోవటం గర్వకారణం. ఆమె విద్వాంసులైన అగ్రజాతులనుండి ఎంత నిరసనకు, అవహేళనకు గురైవుంటుందో మనం సులభంగా ఊహించుకోవచ్చు.

అసలు ఈమె ఎవరు? పుట్టుపూర్వోత్తరాలేమిటి? ఈమె చదువుసంధ్యలేపాటి? అనేవన్నీ నేటికీ పూర్తిగా జవాబులేని ప్రశ్నలు.

**మొల్ల పుట్టుపూర్వోత్తరాలు :** ప్రాచీన తెలుగు సాహిత్యంలో కవుల జీవిత చరిత్రకి ఆధారమైనది ఆయా కవుల గ్రంథాలలోని అవతారికలు. క్వాచిత్కంగా ‘శాసనాలు’ వాటిలోనైనా మన ప్రాచీనులకు సమగ్రంగా తమ జీవిత విశేషాల్ని వెల్లడించే అలవాటు ఉండేది కాదు. కవుల జీవిత చరిత్రల్ని వ్రాసిన క్రీ.శే. వీరేశలింగం వంటి ఉద్దండులు కవుల నిజజీవిత విశేషాల వాస్తవ స్వరూపం తెలియక తల బ్రద్దలు కొట్టుకొన్నారు. కవుల పుట్టుపూర్వోత్తరాలపట్ల పరిశోధకులు, విమర్శకుల మధ్య నేటికి కూడా వాదోపవాదాలు సమసిపోలేదు! ప్రాచీన కవులు ఎల్లరు ఆనాడు రాజాస్థానాల్ని ఆశ్రయించి, జీవించినవారే. అలాంటివారినిగూర్చి సమగ్రమూ, సంపూర్ణమైన వివరాలు అందటమే గగనమైతే, రాజాస్థానాల్లో కాలుమోపే అదృష్టానికి నోచుకోని కవి పండితుల్ని గూర్చి ఏమిచెప్పగలం?

రాజసన్మానాలకు అఱ్ఱులు చాచని ప్రాచీనాంధ్ర కవుల్లో బమ్మెరపోతన తొలి పంక్తిలో నిలిచిన మహాంధ్ర కవి. అంతకు పూర్వం పాల్కురికి సోమన, నాచన సోమన వంటి కవులు లేకపోలేదు. ఆ కోవలో నిలిచిన విద్వదంగ నాగమణి మొల్ల కూడా ఒకతె. రాజరాజు మొదలు శ్రీకృష్ణదేవరాయల దాకా ఆ స్థానాలలో అసలు ఎంత గొప్ప విదుషీమణియైనా స్త్రీకి ‘ఆస్థాన కవయిత్రి’ పదవి లభించినట్టి చారిత్రకాధారాలే లేవు. కానీ వర్ణాశ్రమాలతో నిమిత్తం లేకుండ రంగాజమ్మ, మధురవాణి, రామభద్రాంబవంటి విద్వత్కవయిత్రులకు ఆస్థాన కవయిత్రి పదువులిచ్చి మన్నించిన ఘనత తంజాపురాధిపతులైన రఘునాథ నాయకునికి, ఆమె కుమారుడు విజయరాఘవ నాయకునికి దక్కటం ప్రశంసనీయం. ఈ ఒరవడిని కొనసాగించిన ఆస్థానాధిపతులు, సామంతులు, పాలెగాండ్రు లేకపోలేదు.

తన రామాయణంలో మొల్ల తాను వ్రాసుకొన్న దిగువ అవతారిక పద్యాన్నిబట్టి మనకు తెలిసిన విషయాలు :

*క॥ గురులింగ జంగమార్చన*
*పరుడును, శివభక్తిరతుడు బాంధవహితుడున్*
*గురు డాతుకూరికేసయ*
*వరపుత్రిని మొల్లయనగ వఱలినదానన్ ॥*

1. గురులింగ జంగమార్చనయందాసక్తి గలవాడు,

శివభక్తిరతుడు బంధుజనహితుడు అయిన ఆతుకూరి కేసన వరపుత్రి మొల్ల.

2. ఆమె ఆనాడు ప్రసిద్ధుడైన శ్రీకంఠ మల్లేశు వరంచేత కవిత్వం చెప్పడం నేర్చుకొంది. ఆయనది 'గోదవరం'.

**కులం :** గురువుగారి యీ గోపవరం నెల్లూరు జిల్లాలోని ఒక పల్లె అన్నారు పరిశోధకులు. ఆ శ్వాసాంత గద్యలలో 'ఆతుకూరి కేసయసెట్టి తనయ మొల్ల' అని ఉండటంవల్ల పలువురు ఈమెది వైశ్యకులమని భావించారు. వాస్తవానికి అతి ప్రాచీన కాలం నుండి నేటిదాక జరుగుతున్న ప్రచారాన్నిబట్టి మొల్ల "కుమ్మరి కులానికి చెందిన మాత" అని రూఢి అయింది. కేసన, శ్రీకంఠ మల్లేశుడు – ఇర్వురు శైవులని వారి వ్యక్తి నామాలనుబట్టి స్పష్టమవుతుంది. కేసన గురులింగ జంగమార్చనాపరుడు. గురువుగారు శ్రీకంఠ మల్లేశు బిరుదాంకితుడు. కాబట్టి ఆరాధ్య శైవ శాఖకు చెందినవాడు. వైదిక బ్రాహ్మణులవలె శైవులు కులవిచక్షణని అంతగా పాటించరు. కావుననే శ్రీకంఠ మల్లేశుడు కులాల కుల స్త్రీయైన మొల్లని శిష్యురాలినిగ పరిగ్రహించి విద్యాదానం చేసి, ఆమెని 'కవయిత్రి'గా తీర్చిదిద్దాడని విశ్వసించక తప్పదు.

**కాలం :** మొల్ల కాలాన్నిగూర్చి తన రామాయణంలో ఆచూకి లేదు. కీ.శే. వీరేశలింగం పంతులుగారు *ఆంధ్ర కవుల చరిత్ర*లో ఈమె జీవిత చరిత్రని సంగ్రహంగా వివరించారు. 'మొల్ల తన రామాయణమందలి కవి స్తుతిలో

*'స్తుతగుణోద్దాము నాచనసోము భీము*
*నవ్యమాంజుల వాగ్ధుర్యునన్నపార్యు*
*రసికుడైనట్టి శ్రీనాథు రంగనాథు'*

అని వ్రాసుకొంది. తిక్కన సోమయాజి కించుమించుగా రెండు వందల సంవత్సరాల తర్వాత ఉన్న శ్రీనాథుని స్తుతించుటవల్ల మొల్ల శ్రీనాథుని తర్వాత ఉందనటానికి సందేహం లేదు. శ్రీనాథుని తర్వాతి యుగం శ్రీకృష్ణదేవరాయల యుగం. మొల్ల రాయల యుగ కవులైన పెద్దనాదుల్ని అవతారికలో పేర్కొనకపోవటంవల్ల, ఆమె ఆ కాలానికెంతో తర్వాతిది కాదు – అని పంతులుగారు వ్రాసి ఉన్నారు. ఆమె రాయల యుగంలో వున్నట్లు ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. తెనాలి రామలింగడు, మొల్ల పట్ల కోడిపెట్ట వ్యాజంతో అనుచిత వ్యంగ్య ధోరణి కనబరచిన కథ ఒకటి బహుళ ప్రచారంలో ఉన్నది. కానీ ఆ యిద్దరి మధ్య నడచిన వ్యంగ్య శ్లేషోదంతాన్ని ఇక్కడ వివరించటం సముచితం కాదు. ఏమైనా పరిశోధకులు ఆమె కాలాన్ని క్రీ.శ. 16 వ శతాబ్దంగానే నిర్ణయించారు. ఇక్కడ ఒక విచిత్రమైన కథనం ఏకామ్రనాథుడు రచించిన సిద్ధేశ్వర చరిత్ర అనే వచన గ్రంథంలో ఉంది. ఆయన మొల్లని గూర్చి చిత్రమైన అంశాలు వ్రాశాడు. తిక్కన సోమయాజి వరప్రసాదంవల్ల రామాయణాన్ని వచనకావ్యంగా రచించి మొల్ల ప్రతాపరుద్రుడికి అంకితం చేయాలని తీసుకొనిపోయిందట. రాజుగారి కొలువులోనున్న పండితులు ఇది శూద్రకావ్యం అని తిరస్కరించారట. అప్పుడు రాజుగారు బ్రాహ్మణ కృతరామాయణం కావాలని భాస్కరునిచే వ్రాయించి దాన్ని వింటున్నారు. ఆ సమయంలో మొల్ల అక్కడికి వచ్చి నేను రామాయణం ఇంతకుముందే వ్రాశాను అని చెప్పి, తన కృతి గురించి ఒక పద్యం వినిపించింది. ఆ రాజు ఆమె పద్యానికి సంతోషించి, బ్రాహ్మణ పండితులకు తెలియకుండా పల్లకి, నగరీ, నిత్యజీవితం కట్టడిచేసి తన రాణి విశాలాక్షి చెంతకు పంపాడట. అందులోని ఉదంతం. అదెంతవరకు ప్రామాణికమో చెప్పలేము. ఇదే నిజమైతే మొల్ల తిక్కన సోమయాజికి, ప్రతాపరుద్రుడికి మధ్య కాలంలో జీవించి ఉండాలి. అయినప్పుడు తిక్కనకు రెండువందల యేండ్లు అనంతర కాలంవాడైన శ్రీనాథుణ్ణి ఆమె స్తుతించటం అసంభవంగం. మన ప్రాచీన కవులు తమ రచనల్లో తమ పుట్టుపూర్వోత్తరాల చరిత్రని ఉటంకించనందువల్ల 20 వ శతాబ్దంలో పరిశోధకుల మధ్య బేధాభిప్రాయాలు పొడసూపాయి. పురాణాల కథలు చోటుచేసుకున్నాయి.

మొల్ల తండ్రి పేరు మాత్రమే పేర్కొంది. ఆయన ఇంటిపేరు ఆతుకూరి. అదే ఆమెకు వర్తించినందువల్ల ఆమెకు పెళ్ళి అయిందా? అయితే భర్త ఎవరు? సంతానం వుందా? లేక జీవితాంతం తాను అవివాహితగానే వుందా? అనే ప్రశ్నలకు నేటిదాకా జవాబులు లభించలేదు. తానొక కన్యకగానే వుండిందనే కొందరి ఊహలు విశ్వసనీయాలు కావు. ఎందుకంటె ఆమె గారి రామాయణ కావ్యాన్ని పరిశీలిస్తే శృంగార మధురానుభూతి, మాతృత్వ భావన ఆమెకు కొత్త అని చెప్పడానికి వీలులేదు. ఈ కావ్యంలోని పెక్కు ఘట్టాలలో ఆమె రసికతాముద్ర సాక్షాత్కరిస్తుంది.

**తెలుగులో రామాయణాలు :** నన్నయాదులు సంస్కృత భారతాన్ని అనువదించిన తర్వాత మళ్ళీ భారతానువాదాలు విశేషంగా రాలేదు. కీ.శే. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి గారి *కృష్ణభారత* మొక్కటి కనిపిస్తుంది. భాగవత విషయంలోనూ అంతే. నన్నయాదులు దాని జోలికి పోనందువల్ల దాన్ని తెనిగించి, నా జన్మని సఫలం చేసుకొంటానని పోతన

ఆంధ్ర భాగవతావతారికలో చెప్పుకొన్నాడు. ఇకపోతే రామాయణం మాత్రం ఇందుకు అపవాదం. వాల్మీకి రామాయణాన్ని ఆధారంగా చేసుకొని, కవులు తెలుగులో అసంఖ్యాకంగా రామాయణానువాదాలు సృష్టించారు. వాటిలో నిర్వచనోత్తర రామాయణం (తిక్కన), భాస్కర రామాయణం, రంగనాథ రామాయణం (గోన బుద్ధారెడ్డి), గోపీనాథ రామాయణం, వాసుదాసు రామాయణం (వావిలికొలను), శ్రీమద్రామాయణ కల్పవృక్షం (విశ్వనాథ), చెన్న రామాయణం (చెమికెల చెన్నసు కవి), మల్లేమాల రామాయణం (ఎమ్.ఎస్. రెడ్డి) – ఇలాంటివే లెక్కలేనన్ని. ఇలా ప్రోదిచేసిన అనువాదాలు వస్తూనే వుంటాయి.

భారత భాగవతాలకు లేని ప్రత్యేకత రామాయణానికే ఎందుకుండాలె? అనే ప్రశ్న ఉదయిస్తే, సీతాయాశ్చరితం మహత్ అన్నదే సమాధానం. సీతారాముల కథపైన ఆంధ్రులకెనలేని ప్రీతి. పైగా మహాభారతాదుల్లోవలె రామాయణమందు ఉపాఖ్యానాలు లేవు. అది గృహజీవితాన్ని చిత్రించే ఒకే కథ. కారణాంతరాలవల్ల శ్రీరామచంద్రుడు అరణ్యవాసానికి బయలుదేరితే, ఎండ కన్నెరుగని సుకుమారి సీతాదేవి కూడా భర్తననుసరించి వెళ్ళటం, రక్కసుని చెరలో బంధీ కావటం, అయోధ్యకు వచ్చిన తర్వాత మరల వనవాస గమనం, వాల్మీక్యాశ్రమంలో చివర భూగర్భంలోని మహాప్రస్థానం వంటి వాటితో ముగిసిన రామాయణగాథ ప్రపంచ సాహిత్య చరిత్రలోనే అద్వితీయమైంది. అందుకే రామాయణమంటే ఆంధ్రకవుల కంతటి ఆకర్షణ. మొల్ల రామాయణ రచనకు కూడ అదే ప్రేరణ.

రామాయణాన్ని అనువదించిన ప్రతి కవికి 'ఏదో తనదైన అనుభూతి' అనుకున్నట్లుగానే తోస్తుంది. 'మరలనిదేల రామాయణం' అనే ప్రశ్న మొల్లకు కూడ కలిగింది. అందుకే ఆమె కావ్యావతారికలో

*"రాజితకీర్తియైన రఘురాము చరిత్రము మున్ గవీశ్వరుల్*
*తేజమెలర్పఁజెప్పిరని తెల్సియుఁ గ్రమ్మఱ చెప్పనేలనన్*
*భూజనకల్పకంబమగు భుక్తికి ముక్తికి మూలమంచు నా*
*రాజును దైవమైన రఘురాము నుతించినఁదప్పుకల్గునే?"*

ఈ పద్యం చెప్పుకొంది. శ్రీరాముని చరిత్రని ఎందరో వ్రాశారుకదా! మళ్ళీ నీవెందుకు వ్రాయటం అనే ప్రశ్న తానే వేసుకొని ఆ కథ ప్రపంచానికి కల్పతరువులాంటిది. అది భుక్తికి మరియు ముక్తికి కూడ మూలమైంది. సాక్షాత్తు దేవుడే అయిన శ్రీరాముణ్ణి స్తుతిస్తే తప్పేముంది? అని జవాబు చెప్పుకొంది. కీ.శే. విశ్వనాథ సత్యనారాయణగారు కూడ 'ఈ లోకం తినుచున్న అన్నమే తినుచున్నది – చేసిన సంసారమే చేయుచున్నది. తనదైన అనుభూతి తనది కాదని' అని శ్రీమద్రామాయణ కల్పవృక్షికా వ్యావతారికలో చెప్పిన సమాధానం మనందరికి బాగా తెలిసిన విషయమే – ఒక వేశ్య తన చిలుకకు శ్రీరాముని పేరుపెట్టి పిలిచి 'పెంపు' చేసినదట. ఇలాగా ఎవరికి తోచిన తీరున వారు శ్రీరాముని స్తుతిస్తే 'హర్షము రాదే' అంటూ మొల్ల ఎదురు ప్రశ్న వేయటం అత్యంత స్వాభావికంగా వుంది. ఈ అవతారికలోనే ఆమె మరొక పద్యంలో

"నేరిచిపొగడినవారిని, నేరక కొనియాడువారిని ఆ రామచంద్రుడు కృపతో రక్షించటానికి భక్తియే కారణం కాని చదువుసంధ్యలు కావు" అని కుండబద్దలుకొట్టినట్లు చెప్పింది.

**మొల్ల వినయ సౌశీల్యాలు :** ఆమె వినయ వినమ్రతలకు అవతారిక అద్దంపడుతుంది. కవితావిలసనాన్ని చెప్తూతూ ఒకే సీసపద్యాన్నే ఉల్లేఖించింది. మార్గదేశి పదజాలం, సంధులు, వ్యుత్పన్న పదజాలం, శయ్యలు, రీతులు చాటు ప్రబంధాలు, సమాసాలు, భావచమత్కారాలు, ధాతువులు, అలంకారాలు చందోవిలక్షణాలు, నిఘంటువులు, వీటి క్రమం తనకేమీ తెలియదని విఖ్యాత గోపవరపు శ్రీకంఠ మల్లేశ వరంచేత మాత్రమే కవిత చెప్పగలిగానని ఆమె సవినయంగా మనవి చేసింది. శ్రీరామచంద్రుడే ఆదేశిస్తే ఆయన మాటమీదనే ఈ కృతి నేను చేస్తున్నాను. ఇది ఇహ పర సుఖ సాధనమైన పుణ్యచరిత్ర. తప్పులు పట్టవద్దు అని వినమ్రంగా వేడుకొంది.

మొల్ల నాజూకైన పైట, కమ్మని గంధపు వాసనలతో ఇంపై తేట తెనుగు మాటలతో కవిత పొలుపుగ, హృద్యంగా రాణించాలి తప్ప తప్పెట మోతలు పనికిరావని రసిక జనాహ్లాదంగా భావ వ్యక్తీకరణ చేసింది. సంస్కృత కావ్యాల్ని పరివర్తన చేసేటప్పుడు తమ పాండిత్య ప్రకర్షతో అవే సంస్కృత పదాల్ని ఏకరువు పెడితే ఆ కవిత రుచిస్తుందా? అని ప్రశ్నించింది. ఇంపైన మాటలు, సామెతలు అందంగా పొదిగి, తెలుగు సోయగం ఉట్టిపడేటట్లు చెవికింపుగా కవిత చెపితే 'విద్వాంసుల మదికి విందవుతుంద'ని స్పష్టంగా చెప్పింది. ఆమెలో అభివ్యక్తమైన యీ వినయం కావ్యమంతట దర్శనమిస్తుంది. ఏ కవికంటే కూడా తాను మిన్నగా కావ్యరచన చేస్తున్నానని ఆమె ఎక్కడా చెప్పలేదు. అలాంటి గర్వరేఖ కాగడాపట్టి వెదికినా మనకు కనిపించదు. అవతారికలోని సీసపద్యంలో కావ్యరచనకు అలంకారప్రాయమైన సామగ్రి

తనకేమీ తెలియదని ముక్తకంఠంతో చాటటమే ఆమెలోని గర్వరాహిత్యానికొక మచ్చుతునక. తన కావ్యాన్ని పోతనవలెనే శ్రీరామచంద్రునికే అంకితమిచ్చింది. అవతారికలోని చివరి పద్యం–

*సల్లలిత ప్రతాప గుణసాగరుడై...*

*అల్లము బెల్లముందినుచునప్పటికప్పటి కాసనేయునే*

శ్రీరాముని స్తుతించే జిహ్వకు చిల్లర రాజులిచ్చే అల్లం, బెల్లం తింటూ తాత్కాలిక సుఖాన్ని పొందటం రుచిస్తుందా? అని ప్రశ్నించి శ్రీకంఠ మల్లేశు వరప్రసాదంవల్ల కైవసమైన కవితని శ్రీరామునికే అంకితమిచ్చి తరించింది. ఆమె ధన్యజీవి.

**మొల్ల కవితాగుణాలు :** ఆమె కవితలోని లక్షణాలన్ని వివరించేముందొక ముఖ్య విషయం గమనించాలి. ప్రస్తుతం మొల్ల రామాయణంలోని ప్రస్తావన మరియు బాలకాండ యు.పి.యస్.సి. (ఫైనల్) పరీక్షనిచ్చే అభ్యర్థులకు పాఠ్యాంశంగా వుంది. వారిని దృష్టిలోనుంచుకొని ఈ రెండు ఘట్టాల ప్రాతిపదికగా మొల్ల కవిత్వ లక్షణాల్ని వివరించటం జరుగుతుంది.

మొల్ల రామాయణం ఒక ప్రబంధం. 'కథైక్యత, పాత్రచిత్రణం, అలంకారాలు, విస్తృత లేని కథాషమనంతో కూడిన ఇతివృత్తం, అష్టాదశ వర్ణనలతో కూడింది ప్రబంధమని సాహితీ విమర్శకులు లక్షణం చెప్పారు. ప్రకృష్టమైన బంధంగలది ప్రబంధమనికూడ స్పష్టమైంది. ఈ దృష్టితో మొల్లరామాయణాన్ని పరిశీలిస్తే పై లక్షణాలు ఇందులో చాలవరకు పొందుపడి వున్నాయి. ఇందులో ఉపాఖ్యానాలు లేవు. అందువల్ల కథైక్యత వుంది. కావ్యంలో గద్యపద్యాల సంఖ్య కేవలం 869 మాత్రమే. ఒక యుద్ధకాండని మాత్రమే ఆమె పెంచింది. పీఠికని 24 తోను, బాలకాండని 100 గద్యపద్యాలతోను ముగించింది.

బాలకాండలో అయోధ్యనగర వర్ణన, సీతారాముల కల్యాణం, పరశురాముని గర్వభంగం – ఈ మూడే ఘట్టాలు. వీటిని ఆమె కేవలం ఐదారు పద్యాల్లోనే వర్ణించింది. ఇక రామాదుల జననం, విశ్వామిత్ర యాగ రక్షణ, తాటక వధ, అహల్య శాపవిమోచనం మొదలైన అంశాల్ని చాల సంక్షిప్తపరచి, శాంతాఋష్యశృంగుల కథని వదలటంవల్ల కథైక్యత సిద్ధించింది.

మొల్ల బాలకాండ ప్రారంభంలో అయోధ్యాపుర వర్ణన వైభవంగా చేసింది. మొదటి మూడు సీసపద్యాలు ఆమె సంస్కృత పద ప్రయోగ చాతుర్యాన్ని చాటుతున్నాయి. ఇందులో 'మదనాగ, హరి, స్పందన, గణిక, పుణ్యజన' అనే పదాలు రెండర్థాలుగలవి. పాము, కోతి, పొదరిళ్ళు, అడవిమల్లెలు అనే అర్థాల్ని గూర్చి చక్కని శ్లేషని సంధించటం జరిగింది. ఆ నగరంలో మదపుటేన్గులేకాని పాములు లేవు. అది హరివాసమేకాని కోతుల కావాసంగాదు. అది అందమైన రథాలకు నెలవైనదేకాని అడవి మల్లెలకు నివాసం కాదు. ఆ ఊరిలోని జనులందరు పుణ్యజనులేకాని రాక్షసులు కారు. అలాగే 'దాన' శబ్దాన్ని ఈవి, మదజలం అనే అర్థంలో ప్రయోగించటం జరిగింది. కవి గురుమిత్ర, బుధ శబ్దాల్నికూడ ద్వందార్థంలో ప్రయోగించింది.

ఇక బ్రాహ్మణ, క్షత్రవైశ్య శూద్రులైన నాల్గు జాతుల్ని అభివర్ణించుటలోను పూర్వాంధ్ర కవులననుసరించిన వైఖరికంటే భిన్నవైఖరి మొల్ల వర్ణనలో కనిపిస్తుంది. అగ్నిహోత్రులో కాని అంగసాలెలు (స్వర్ణకారులు) లేరు. సూత్రధారులేకాని హాస్యనాటకులు లేరు. సంధ్యావిధులు మూడువేళల చేసేవారే కాని నిరాశాచరులు కారు. సద్విజులేకాని పక్షిజాతులు కారు. ధీవరులేకాని జాలర్లు కారు. ఈ వర్ణన అంతా శ్లేషోత్థాపితంగా అమరింది. ఇక్కడ క్రింది పద్యాన్ని గమనించాలి.

*ఉ॥ రాజులు కాంతియందు రతిరాజులు రూపమునందు వాహినీ*
*రాజులు దానమందు మృగరాజులు విక్రమకేళియందు గో*
*రాజులు భోగమందు, దినరాజులు సంతత తేజమందు, రా*
*రాజులు మానమందు, నగరమ్మున రాజకుమారులందఱున్*

కాంతిలో చంద్రులు, రూపంలో మన్మథులు, దానంలో మేఘసదృశులు, పరాక్రమంలో సింహాలు, భోగనియమున వృషభాలు, ప్రకాశంలో సూర్యులు, అభిమానంలో సుయోధజనులు – ఆ నగరంలోని రాజకుమారులంట. రాజశబ్దాన్ని అనేకమైన అర్థాలలో ప్రయోగించిన ఘనత మొల్లకే దక్కింది.

ఇదే ఘట్టంలో అయోధ్యలోని వారకాంతల్ని, ఉద్యానవనాల్ని, సరోవరాల్ని, మేడల్ని, గోవుల్ని భావస్ఫోరకంగాను, ఆ నగరం, స్వర్గతుల్యంగా రాణిస్తుందని మొల్ల ప్రతిపదహృద్యంగానూ అభివర్ణించింది.

అనంతరం దశరథ మహారాజు గుణగణాల్ని అభివర్ణించిన తీరులోను మొల్ల వర్ణనాపటిమ అభివ్యక్తమవుతుంది. అక్కడి సీస పద్యంలోని కీర్తికర్పూరం, శౌర్యదీప్తి, వైరినృపజాలమేఘము, సూర్యవంశపాథోధి వనజవైరి వంటి ప్రయోగాలలో రూపకాలంకారాన్ని

అచ్చొత్తించింది. దశరథ మహారాజు 'పరస్త్రీ లావణ్య సౌభాగ్యాల్ని కనగోరడట – తన్ను కొలిచేవారిపై ఎవరైనా చాడీలు చెపితే వినాలనుకోడట. కఠినంగా మాటాడడట. వార్తకెక్కిన రాజన్యుడట – ఈ పల్కులలో మొల్ల నిజస్వభావం మూసగట్టుతుంది.

తర్వాత పుత్రకామేష్టి, అగ్నిదేవుని పాయస ప్రసాదం, కౌసల్యాదుల గర్భధారణ, రామాదుల జననం, విశ్వామిత్రుని రాక అనే కథాఘట్టాలు నాతిదీర్ఘంగా రచించి, మొల్ల తన కథాకథన చాతుర్యానికి మెఱుగులు దిద్దింది. విశ్వామిత్రుడు తనకెదురుగా వస్తున్న తాటకిని చంపుతుంటాడు – రాముడు తనలో అనుకొన్న మాటలు

*కం॥ ఈ యడుదానిఁ జంపఁగ*
*నాయమ్మనకేమిగొప్ప? నగరేవీరుల్*
*ఛీ యని రోయుచు నమ్మని*
*నాయకు భయమెఱింగి తనమనమ్మున నీలుకన్;*

ఈ పద్యాలలో రాముని మనోభావాన్ని చక్కని స్వభావోక్తిలో అభివర్ణించింది మొల్ల. తాటక రొమ్ము గుఱ్ఱంమోపులా వుందట. ఈ పోలిక అత్యంత స్వాభావిక్తం. రాముని పాదధూళి సోకి రాయి అహల్య అయినప్పుడు విశ్వామిత్రుడు శ్రీరామునికి చెప్పిన అహల్యావృత్తాంతం చాలా సంగ్రహింపబడింది. విశ్వామిత్రుడు రామునితో నీ నామమెఱుంగు వారలకు నమ్మఁగ వచ్చును భుక్తిముక్తులున్ అంటాడు. ఈ మాటలో ఆధ్యాత్మికత ధ్వనిస్తుంది. రాముడు శ్రీహరి అవతారం. రామనామస్మరణ భక్తులకు భక్తిని, ముక్తిని ప్రసాదిస్తుంది. తెలుగునాట పల్లెల్లో "రామనామమే లడ్డంట – అది తినేవారికే తీపంట" అని గ్రామీణులు పాడుకొంటారు. మొల్ల అవతారికలో కూడ నీ నామమెఱుంగువారలకు నమ్మగవచ్చును భుక్తిముక్తులున్ అని చాటిచెప్పటం గమనార్హం.

ఇక ధనుర్భంగం, సీతాస్వయంవర ఘట్టం మొల్ల అమూలకంగా తీర్చిదిద్దింది. రాజకుమారులు శివధనుస్సుని చూచి ఇది, "విల్లా యిది? కొండా 'అని తల్లడపడి దాని దగ్గరికి రాకపోయారట. కొందరు సాహసించి పెనగిపెనగి పరుగుపెట్టారు. బలం చాలక మరికొందరు సందులు–గొందులు దూఱి పరుగెత్తారు" అంటుంది మొల్ల. తెలుగువారికి సహజమైన హాస్యరసానందాన్నిగొల్పే రచన. రాముడు విల్లెత్తడానికి ముందుకు వచ్చినప్పుడు లక్ష్మణుడు–

"ఓ భూమాతా! ఈ నేలని కదలకుండా పట్టుకో, ఓ అనంతా! నేలమీది పాముల్ని పట్టుకో, ఓ కూర్మమా! పాతాలమందలి పాములు, తాబేళ్ళు, ఎండ్రకాయలు వగైరాని వదలకుండా పట్టుకో, ఓ దిగ్గజములారా! ఈ తీగెలు, భూమి, తాబేలు, వరాహం మొదలైన వర్గాన్ని చెదరకుండా పట్టుకోండి" అని బిగ్గరగా ఎలుగెత్తి చాటాడు. ఇదికూడా అమూలకమైన సన్నివేశం.

సీతాస్వయంవరం ముగిసిన తర్వాత దశరథుడు సమస్త పరివారంతో అయోధ్యకు వెళ్ళుమంటాడు. ఇక్కడ పరశు రాముడు అడ్డువచ్చి "నీ పేరేమి" అంటాడు. "నేను దశరథుణ్ణి, ఈ చిరంజీవి రాముడు, నా కొడుకు" అని సమాధానం చెపుతాడు. అప్పుడు పరశురాముడు–

*కం॥ "రాముడు నేనైయుండగ*
*నామీద నొకండు కలిగెనామతి! యోఁగా*
*కేమాయో రణమొనర్పగ*
*రామా! రమ్మనుచుఁ బరశురాముడు పిలిచెన్"*

అంటాడు. ఈ అధిక్షేపం అచ్చంగా తెలుగువారి స్వభావానికి ప్రతీక. మూలరామాయణంలో ఇలాంటి సన్నివేశాలు కనపడవు.

మొల్ల అవతారికలో తనకు శబ్దంపైన పట్టులేదని వినయంగా చెప్పుకొంది. కాని ఆమెకు సంస్కృతాంధ్ర భాషలో చక్కని ప్రవేశముందనటానికి ఈ పద్యం ఒక్కటి చాలు–

*శా॥ పారావారగభీరికిన్ ద్యుతిలసత్పద్మారికిన్, నిత్య వి*
*స్ఫారోదార వి కోరికిన్ సుజనరక్షాదక్ష దక్షారికిన్*
*సారా చారవిచారికిన్ మదరిపుక్ష్మా? పాల సంహారికిన్*
*వీరా సాటి స్వపాలకుక? దశరథార్వ్ నాథ జంబారికిస్ – (98)*

దశరథుడనే ఆ యింద్రునికి సాటియైన రాజులు లేరు. ఆయన సముద్రమంత గాంభీర్యంగలవాడు. కాంతియందు చంద్రుని పోలినవాడు. నిత్యం ఔదార్యంతో తులతూగేవాడు. సజ్జనుల్ని రక్షించుటలో ఈశ్వరునికి ఈడైనవాడు. సంప్రదాయాన్ని పాటించేవాడు.

మదించిన రాజుల్ని పీచమణచేవాడు. మొల్ల కవితలో అక్షర రమ్యత, అనుప్రాస శైలి, రసపోషణ సంవిధాన రామణీయకత వంటి లక్షణాలు ధ్వనిస్తాయి. తెలుగు కవితా రంగంలో మొల్ల సరికొత్త ఒరవడిని స్థాపించింది. మి

డా॥ కసిరెడ్డి వెంకటపతిరెడ్డి
హైదరాబాద్
ఫోన్ : 9490577007



# స్త్రీల జానపద ప్రదర్శనలు

- టి. జయామనోహర్

ప్రపంచ పటంలో జానపద విజ్ఞానం కూడా ఓ స్థానాన్ని సంపాదించుకుంటూ వస్తూన్నది. చరిత్ర, సామాజిక శాస్త్రం, మానవశాస్త్రం, మనస్తత్వశాస్త్రం లాంటి శాస్త్రాలతో జానపద విజ్ఞాన శాస్త్రానికి అవినాభావ సంబంధం ఉంది.

ఇది చాలా విస్తృతమైన పరిధి కలిగిన సామాజిక సంబంధ శాస్త్రం. జానపద విజ్ఞానంలో జానపద కళలు సింహభాగాన్ని కలిగి ఉన్నాయి. జానపద కళలకు సంబంధించిన కథాగానాలు కూడా అధిక సంఖ్యలో ఉన్నాయి. అత్యంత ప్రాచీనతను కూడా కలిగిన కళలు. పూర్వం జానపద కళలను ప్రదర్శించే సమయంలో పురుషులు స్త్రీ పాత్రల్ని ధరించేవారు. కాలక్రమేణా జానపద కళల ప్రదర్శన విధానంలో చోటుచేసుకున్న మార్పుల్లో స్త్రీ పాత్రల్ని స్త్రీలే ధరించడం ప్రారంభమైంది. స్త్రీలు ప్రదర్శించేవే కాకుండా స్త్రీలకు సంబంధించిన సాంఘిక మతాంశాలకు సంబంధించిన ప్రదర్శనలు కూడా ప్రత్యేకించి ఉన్నాయి. ఉదాహరణకు స్త్రీల కోలాటం జట్టి జాము, గొబ్బెమ్మ, బతుకమ్మ, గరగలు బోనాలు - లాంటి జానపద కళారూపాలు.

నా అంశం 'స్త్రీల జానపద ప్రదర్శనలు' దీన్ని నేను విస్తృతార్థంలో స్వీకరించాను. స్త్రీలు పాలుపంచుకుని ప్రదర్శించే కళారూపాలు స్త్రీలకు సంబంధించిన సాంఘిక, మతాంశాలకు సంబంధించి ప్రదర్శించే జానపద కళారూపాలు. ఇలా రెండు విధాలైన ప్రదర్శనా విధానాన్ని వివరించడం నా ముఖ్యోద్దేశం.

**బతుకమ్మ :** ఇది సంపూర్ణంగా స్త్రీలకు సంబంధించిన మతాంశ సంబంధమైన జానపద కళారూపం. దీన్ని స్త్రీలు మాత్రమే ప్రదర్శిస్తారు. బతుకమ్మ పండుగ తెలంగాణా ప్రాంతంలో ప్రదర్శిస్తారు. బతుకమ్మ పండుగ సందర్భంగా దీన్ని ప్రదర్శిస్తారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి మహర్నవమి వరకు తొమ్మిది రోజులు బతుకమ్మ పండుగ జరుగుతుంది.

పుట్టమన్నుతో బొమ్మనుచేసి బహుళ పంచమినాడు దాన్ని ప్రతిష్ఠించి దానిమీద కలశాన్ని ఉంచి, పంచమినాడు పసుపు ముద్దతో గౌరమ్మను నిలిపి పూలతో అలంకరిస్తారు. చెరువు కట్టమీదో, కాలువ గట్టుమీదో, దేవాలయంలోనో ఈ బతుకమ్మను ఉంచి స్త్రీలు దాని చుట్టూ చేరి చప్పట్లు చరుస్తూ లయాత్మకంగా అడుగులు వేస్తూ పాటలు పాడుతూ తిరుగుతూ ఉంటారు. ఇది నృత్యరీతుల్ని కలిగి ఉంటుంది. బతుకమ్మ పాటల్లో ప్రతి చరణానికి చివరలో ఉయ్యాలో అనీ కోల్‌కోల్ అనీ చందమామా అనీ గౌరమ్మా అనీ - పదాలు ఉంటాయి.

బతుకమ్మ పాటల్లోని సాహిత్యమంతా దాదాపు లక్ష్మీ, సరస్వతుల మీద, సతీ అనసూయ శశిరేఖ, కృష్ణలీల, సీతాదేవికి సంబంధించినవై ఉంటుంది.

**సోది :** ఇది నిజానికి ప్రదర్శనాకళారూపం కిందికి రాదు. ఎరుకల స్త్రీలు చెప్పే జోస్యం. ఇది మతసంబంధమైన జ్యోతిష సంబంధి. ఇందులో కొంత లయాత్మకమైన ఆకర్షణీయమైన ఎరుక చెప్పే విధానం ఉంటుంది. ఎంతో కొంత కళాత్మకతను తనలో ఇముడ్చుకున్న ప్రక్రియగా పరిశీలకులు అభిప్రాయపడ్డారు. అందుకే ఎరుక కూడా ఒక కళగా పేర్కొంటూ వస్తున్నారు. కురవ జాతి స్త్రీలు చెప్పే ఎరుకను కురవంజి అని కూడా పిలిచారు. ఇది ఎరుకల సాని చెప్పే సోదిలాంటిదే. 'సోదెమ్మ సోదో' అంటూ తలమీద ఓ బుట్టలో వాక్కునిచ్చే దేవత అనే గవ్వలతో అలంకరించిన ఒక వస్తువును ఉంచుకుంటారు. అమ్మ పలుకు జగదంబ పలుకు, కంచి కామాక్షి పలుకు, బెజవాడ కనకదుర్గ పలుకు - అంటే అమ్మవారికి ప్రతిరూపాలుగా నిలిచిన అందరి పేర్లను పలుకుతూ సోది చెప్పడం ప్రారంభిస్తారు. స్త్రీలు మాత్రమే సోది చెబుతారు.

**శారద కథ :** శారద కథ స్త్రీలు వంతలుగా ఉండే జానపద కళాప్రక్రియ. కథాగానాల్లో శారద కథ కూడా చెప్పదగిన కళారూపమే. ఇది బుర్రకథను పోలివుంటుంది. ఇందులో కనిపించే తంబురను వీరు శారద అంటారు. శారదను ధరించి చెప్పే కథ కనుక దీనికి శారద కథ అనే పేరు వచ్చింది. శారద కథకు, బుర్రకథకు సామ్యత

కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. బుర్రకథ ప్రదర్శనలో వంతలుగా స్త్రీలు ఉండరు. కానీ శారద కథలో మాత్రం వంతలుగా స్త్రీలు మాత్రమే ఉంటారు. బాలనాగమ్మ కథ, రాములమ్మ కథ, ఎరుకల నాంచారి కథ, చిన్నమ్మ కథలను వీరు ప్రధానంగా తమ శారద కథాగానంలో చెబుతుంటారు.

**చిందు భాగవతం :** ఆంధ్రప్రదేశ్‌లో సుమారు రెండు వేల సంవత్సరాలనుండి చిందు భాగవతం ప్రదర్శనలు జరుగుతున్నాయని చిందు కళాకారులు చెబుతుంటారు. ఆనాటినుండి ఈనాటివరకు పండితుల్ని, పామరుల్ని అలరిస్తున్న అత్యంత ప్రాచీనమైన కళారూపం చిందు భాగవతం. నిరుపేదలైన చిందు భాగవతం కళాకారులు వారు ప్రదర్శించే ప్రదర్శనల్లో మాత్రం పట్టువస్త్రాలు ధరిస్తారు. అద్దాల బిళ్ళలతో అతికిన బంగారు రంగు ముచ్చిరేకులంటించిన కిరీటాలు ధరిస్తారు. వివిధ రకాలైన ఆభరణాలు కూడా ధరిస్తారు.

మృదంగం, హార్మోనియం, గజ్జెలు, తాళాలు వంటి వాద్యసహకారం వీరి ప్రదర్శనకు వన్నెతెస్తుంది. ప్రదర్శన సందర్భంగా పాడే పాటలు నేపథ్యంలోనే ఉంటాయి. చిందు భాగవతం కళాకారులు 'ఎల్లమ్మ ఆట'ను తప్పనిసరిగా ప్రదర్శిస్తారు. భారత, భాగవత, రామాయణ గాథల్ని నృత్య నాటకాలుగా ఆడుతారు. పగటిపూట కూడా వీరి ప్రదర్శనలు ఉంటాయి. చిందు భాగవతం కళాకారులు తెలంగాణా ప్రాంతంలోని కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాలో అధికంగా నివసిస్తారు. ఈ జిల్లాల్లో దాదాపు వందకు పైగా చిందు భాగవతం దళాలు ఉన్నాయి. చిందు భాగవతంలో స్త్రీల పాత్ర చెప్పుకోతగిందిగా ఉంటుంది. ప్రదర్శనలో స్త్రీలు మాత్రమే తాళాలు వాయిస్తారు. మగవారికి ఆడవారికి భేదం ఉండదు. చిందు భాగవతానికి చిందు యక్షగానం అనే పేరు కూడా ఉంది. చిందు నృత్యం అనడం కూడా కద్దు. ఇందులో సతీసావిత్రి, మైరావణుడు, సుందరకాండ, చెంచులక్ష్మి, సారంగధర, మోహినీ రుక్మాంగద, వీరాభిమన్యు మొదలైన నాటకాల్ని ప్రదర్శిస్తారు.

స్త్రీలు మాత్రమే ప్రదర్శించే నృత్యనాటక ప్రదర్శనల్ని చిందు జోగితలు ప్రదర్శిస్తారు. చిందు జోగితలను జోగులాంబలని పిలుస్తారు. జోగులాంబ దేవాలయంలో సేవకు అంకితమై నృత్యమాడతారు. కనుక వీరిని జోగులాంబలని పిలుస్తారు. ఎల్లమ్మ ఆట ఆడటం వీరి ప్రత్యేకత. చిందుల ఎల్లమ్మ చిందు భాగవతం కళాకారిణులలో చెప్పుకోదగిన స్థానాన్ని పొందింది. స్త్రీల పాత్రల్ని ఎంత సమర్థంగా పోషిస్తుందో పురుష పాత్రల్ని సైతం అంతే సమర్థంగా పోషిస్తుంది. చిందుల నీలమ్మ, చిందుల సుశీల, చిందుల చిన్నమ్మ – వీరంతా కూడా ఉత్తమ కళాకారిణులే. చిత్రాంగిగా చిందుల ఎల్లమ్మ అద్భుత నాటక కౌశలం ఆబాలగోపాలాన్ని అలరించింది.

**చెక్కభజన :** అత్యంత ప్రాచీనతను సంతరించుకున్న విశిష్ట కళారూపం చెక్కభజన. భగవంతుణ్ణి తన్మయత్వంతో రాగ తాళ యుక్తంగా సమిష్టిగా కీర్తించే విధానాన్ని భజన అంటారు. భజన అంటే సేవ. భగవంతుణ్ణి సేవించేందుకు మాత్రమే భజన చేస్తారు. అందుకే భజన అందరికీ సంబంధించిన జానపద కళారూపం. ఇది బృందనృత్యం. ఇందులో కోలాట భజన, హరిభజన, ఊరిభజన, కులుకు భజన, సప్త తాళ భజన, వేదాంత భజన అనే వివిధ రకాల భజనలు ఉన్నాయి.

చెక్కలను చేతుల్లో ధరించి చేసే భజనను చెక్కభజన అంటారు. అడుగు పొడవైన చెక్కలు అందంగా ఉండేందుకు సొంపుసొంపులను ఏర్పరచి, ధ్వని రావడం కోసం ఆ చెక్కలకు ఇరువైపులా గుండ్రటి ఇనుప బిళ్ళలనుగాని లేదా ఇత్తడి బిళ్ళలనుగాని రెండేసి చొప్పున అమర్చుతారు. వీటి ధ్వని శ్రావ్యంగా ఉంటుంది. మంచి శృతిలో వినిపించే ఈ ధ్వని భజన చేసేవారికి మంచి ఊపును, ఉత్సాహాన్నీ ఇస్తుంది.

చెక్కభజన బృంద నృత్యం. ఈ భజన చేసేవారి బృందంలో ఇరవైమంది నుండి ముప్పైమంది వరకు ఉంటారు. వీరికి ఒక గురువు కూడా ఉంటాడు. పల్లెటూళ్ళలో తీరిక సమయాలలో రాత్రివేళల్లో వీరంతా చెక్కభజనను అభ్యాసం చేస్తారు. ఇది చాలా శ్రమతో కూడుకున్న కళారూపం. అంతేకాదు కొంత శాస్త్రీయతను కూడా కలిగిన కళారూపం. క్రమశిక్షణతో నేర్చుకోవాల్సి ఉంటుంది. క్రమపద్ధతిలో బృందంలోని సభ్యులంతా లయాత్మకంగా అడుగులు వేయాల్సి ఉంటుంది. చేతిలోని చెక్కలను పాటకు అనుగుణంగా ఆడిస్తూ ధ్వనిచేయాలి. తదనుగుణంగా అడుగులు వేస్తూ మధ్యమధ్యలో అవసరానుగుణంగా క్రమపద్ధతిలో గెంతుతూ ఉండాలి. ఇది పాక్షికంగా శాస్త్రీయతను కలిగిన జానపద కళారూపం.

చెక్కభజన అత్యంత ప్రాచీన జానపద కళారూపం. ఆ కాలంలో స్త్రీల వేషాల్ని కూడా పురుషులే ధరించేవారు. భక్తిపాటలు, పురాణ సంబంధ పాటలు, వీరగాథలు నీతిని ప్రబోధించే పాటలు వంటివి చెక్కభజనలకు ఇతివృత్తాలుగా

ఉంటాయి. స్త్రీ పాత్రలకు గోపికల పాత్రలకూ కొందరు చెక్కభజన బృందంలోనివారే (పురుషులే) స్త్రీ పాత్రల వేషధారణ చేసుకుని భజన చేసేవారు. చెక్కభజన ప్రదర్శనకు వివిధ రకాల వాద్యపరికరాలను కూడా ప్రదర్శనకారులు అభిరుచిమేరకు అందుబాటులో ఉన్నమేరకు కాంగో, డప్పు, డ్రమ్ము, తబలా, ఫ్లూటు, డోలు, డోలకు, హార్మోనియం, సన్నాయి, క్లారినెట్ లాంటి వాద్యపరికరాల్ని భజనకు సంగీత సహకారంకోసం వినియోగిస్తారు.

ఇప్పుడు అక్కడక్కడ స్త్రీలు కూడా చెక్కభజనల్ని చేస్తున్నారు. ఉదాహరణకు ప్రకాశం జిల్లాలో అధిక సంఖ్యలో స్త్రీలే చెక్కభజనను నేర్పిస్తున్నారు. స్త్రీలు చెక్కభజన ప్రదర్శనలు కూడా ఇస్తున్నారు. ప్రకాశంజిల్లాలో చీమకుర్తి వాస్తవ్యురాలు సుబ్బమ్మ, చీమకుర్తికి చెందిన మరో మహిళ సుజాత ఈ కోవలోనివారే. ఒంగోలుకు చెందిన శారద, శ్యామల, సునీత చెప్పుకోదగిన చెక్కభజన మహిళా గురువులు, చిలకపాడుకు చెందిన మాధవీలత కూడా ఎంతోమందికి చెక్కభజనలో తర్ఫీదును ఇస్తున్నది. చెక్కభజనను అభ్యసించే స్థలాన్ని గరిడీ అంటున్నారు. ఇప్పుడు అన్ని రంగాల్లోనూ స్త్రీలు పురుషులతో సమానంగా ప్రవేశిస్తున్నారు. జానపద కళలో కూడా ఇందుకు మినహాయింపు కాదని చాలాచోట్ల రుజువౌతూ వస్తున్నది.

**కోలాటం :** జానపద బృంద నృత్యాల్లో కోలాటం ఒకటి. కోల+ఆట అనేది తమిళంలోని కోల+అట్టం నుండి పుట్టింది. కోలాట నుండి కోలాటం అనే పదం ఏర్పడింది. కోలన్న, కోలాటలు, కోలుకోలన్నలు, కొట్టమాట అనేవి రూపాంతరాలు. కోల అంటే దండం, కర్ర, పుల్ల అనే అర్థాలున్నాయి. ఆట అనే పదానికి తాండవం, నటనం, నర్తనం, నృత్తం, నృత్యం, నాట్యం, లాస్యం, క్రీడ, విమారం అనేవి పర్యాయపదాలు. స్థూలంగా కోలాటం అంటే కోలల్తో చేసే నృత్యం. రెండు చేతుల్లో కోలలు పట్టుకుని చేసే నృత్యం. కుడిచేతిలో ఒక కోల, ఎడమ చేతిలో ఒక కోల పట్టుకుని బృందనృత్యం చేస్తారు. బృందంలో ఇరవై నుండి ముప్పైమంది దాకా వుంటారు. అంతకన్నా మించి కూడా ఉంటారు. కానీ సరిసంఖ్యలోనే ఉండాలి.

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల్లో కోలాటం ఆడుతారు. కోలలు అధిక సంఖ్యలో ధరించి చేసే నృత్యం కనుక దీనికి కోలాటం అనే పేరు వచ్చిందనేది కూడా పరిశోధకుల అభిప్రాయం. పెద్దపెద్ద కొట్టాల (పశుశాల)లో కోలాటం వేస్తారు. కాబట్టి కొట్టమాట అనే పేరు వచ్చి ఉండవచ్చుననేది కూడా పరిశోధకుల భావం. కోలాటానికి కొట్టమాట అనే వాడుక చాలా తక్కువగానే ఉంది.

కోలాటం అనే పదానికి కొట్టం, దండనర్తనం, దండరాసకం, దండలాసకం, దండలాస్యం, వేష్టికం, హల్లీసకం అనేవి పర్యాయపదాలు. కోపాలు గుండ్రంగా ఉండి బొటనవ్రేలు లావు కలిగి, మూర పొడవైనవిగా ఉంటాయి. దాదాపు సండ్ర, నర్లంగి, ఏపె – కర్రలను మాత్రమే వీటి తయారీకి వాడుతారు. కోలాటం బృందనృత్యం. ఎక్కువగా రాత్రిళ్ళు మాత్రమే కోలాటం వేస్తారు. వీరి సంఖ్యలో మాత్రమే బృందం ఉంటుంది. ఇలా ఏర్పడ్డ బృందంలోని సభ్యులు వలయాకారంలో నిలబడి ఒకరి ఎదురుగా ఒకరు నిల్చుని కోలలను లయాత్మకంగా ఒకరితో ఒకరు కుడి ఎడమ చేతుల్లో తగిలించుకుంటూ ఆడతారు. ఇందులో ఆడే ప్రతి ఇద్దరినీ ఉద్ది అని పిలుస్తారు. ఉద్ది అంటే జత అని అర్థం.

కోలాటంలో బృందంగా ఏర్పడినవారంతా విశాలమైన ప్రదేశంలో వలయాకారంగా ఏర్పడి, తమకు ఇరువైపుల ఉన్నవారితో కోలలను తగిలిస్తూ లయాత్మకంగా పాటకు అనుగుణంగా అడుగులువేస్తూ కోలల్ని ఒకరి చేతులలోని కోలలకు మరొకరి చేతులలోని కోలల్ని తగిలిస్తూ నృత్యం చేస్తారు. కోలాటంలోని పర్యాయపదాల్లో ఒకటైన వేష్టితం సంస్కృత శబ్దం. వేష్టితంలో పలువురు స్త్రీలు వలయాకారంగా ఏర్పడి లయాత్మకంగా తిరుగుతూ నృత్యం చేస్తారు. ఇది మహిళలు వేసే కోలాట నృత్యంగా చెబుతారు. కాని ఇందుకు సంబంధించిన 'వేష్టితం' అనే పదం సాహిత్యంలో కనిపించదు. కనీసం లోక వ్యవహారంలో కూడా లేదు. ఇలాంటివే అంటే మహిళలు వలయాకారంగా ఏర్పడి ఆడే కోలాటం హర్లీసకం అనే పేరుతో కూడా మరొకటి ఉంది. పురుషులు ఆడే కోలాటం కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో స్త్రీలు ఆడే కోలాటం కూడా ఉంది. పురుషులు ఆడే కోలాటం మాత్రం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల్లో ఆడుతారు. పండుగ సందర్భాల్లోను తీరికవేళల్లోను కోలాటం ఆడుతారు.

**జట్టి జాము :** జట్టి జాము కూడా కోలాటం లాంటిదే. ఇది జానపద స్త్రీలు చేసే నృత్యం. శుక్లపక్షం వెన్నెల రాత్రుల్లో మహిళలు ఒకచోట చేరి గుండ్రంగా తిరుగుతూ పాటలు పాడుతూ నర్తిస్తారు. కుడికాలును ముందుకు చాచి ఒకరి తర్వాత మరొకరు కదలి ముమ్ముందుకు సాగిపోతూ నృత్యం చేస్తుంటారు. జట్టి జాము నృత్యంలో వాద్యసహకారం ఏదీ ఉండదు. తెలంగాణాలో జరిగే బతుకమ్మ నృత్యంలాగా

సాగుతుంది. నిజానికి బతుకమ్మ ఆటలో నృత్యంకంటే పాటలు, చప్పట్లు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటాయి. సాధారణంగా జట్టి జాము నృత్యం ఓ ముఖ్యోద్దేశ్యం కోసం ప్రదర్శించబడుతుంది. గ్రామాల్లో పంటలు బాగా పండాలని, పల్లెటూళ్ళలో నివసించే ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవనం సాగించాలని ప్రజల మేలుకోరుతూ గ్రామీణ స్త్రీలు జట్టి జాము నృత్యం చేస్తారు. వెన్నెల రాత్రిళ్ళు జట్టి జాము నృత్యం చేసేందుకు వీలుండే సమయం.

**జడకోపు కోలాటం :** జడకోపు కోలాటం బాలికలు వేస్తారు. బాలికల్లో ఒకే ఎత్తు కలిగినవారిని ఎంపిక చేస్తారు. సీతాకోక చిలుకల్లా చక్కగా ముస్తాబైన బాలికలు వాలుజడలు తీసుకుని వివిధ రకాల పూలను ధరిస్తారు. వీరు చేతిలో పట్టుకునే చిరుతలు రంగురంగులుగా ఉంటాయి. జడకోపు కోలాటం వేసేవారు సమసంఖ్యలో ఉంటారు. పైన కట్టిన తాళ్ళను క్రింద నిలబడి వలయాకారంలో పట్టుకుని నిలబడతారు. ఇలా నిలబడినవారంతా రెండు జట్లుగా విడిపోయి రెండు పక్షాలుగా చీలుతారు. ఇరుపక్షాలకు నాయకులు ఉంటారు. నిలబడి రెండు పక్షాలుగా విడిపోయినవారంతా లయ ప్రకారం తిరుగుతున్నప్పుడు వాళ్ళు పట్టుకున్న తాళ్ళన్నీ జడలాగా అల్లుకుంటాయి. లయలోను, అనుగుణంగా తిరగడంలోనూ ఏమాత్రం ఒక్కరు తప్పుచేసినా అల్లికలో తప్పుపడి జడ చిక్కుపడిపోతుంది. అందువల్ల ప్రతివారికి ఇందులో దాగివుండే లయ అవగతమై వుండాలి. ఇది నైపుణ్యంతో కూడుకున్న కళ. ప్రారంభంలో జడ అల్లడం నెమ్మదిగా జరుగుతుంది. రానురాను వేగాన్ని పుంజుకుంటుంది. తిలకిస్తున్న ప్రేక్షకుల్ని జడకోలాటం నృత్యం ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. ఆఖరి ఘట్టంలో అందరూ ఒకేదగ్గరకు చేరుకుంటారు. ఆ చేరువ ఒక పుష్పాకారంలో ఉంటుంది. ఇది అద్భుతంగా ఉంటుంది. చూడముచ్చటగా కూడా ఉంటుంది.

**బుర్రకథ :** బుర్రకథకు మూలం జంగం కథ. బహుళ ప్రచారం పొందిన జంగం కథ అత్యంత ప్రాచీనమైన జానపద కళ. కథాగానాల్లో అత్యంత ప్రాచీన కథాగానం కూడా ఇదే. పూర్వం జంగం కథను మతప్రబోధానికి బలంగా వాడుకున్నారు. ఆధ్యాత్మికతత్వాన్ని ప్రబోధించడానికి ఎంతగానో ఉపయోగపడిన కథాగాన కళ జంగం కథ. ఈ జంగం కథలో ఉన్న ఆకర్షణను త్వరితంగా ఏ అంశాన్నైనా తనలో ఇముడ్చుకోగల తీరును గమనించారు. ప్రజానాట్యమండలి కళాకారుల బృందం దీన్ని బుర్రకథగా మలిచి 1942 బుర్రకథను వెలుగులోకి తెచ్చారు. నాజరు, పురుషోత్తం, రామకోటి, మిక్కిలినేని, మాచినేని కోగంటి, పుట్టసెట్టి, పున్నయ్య, పెరుమాల్లు, సిరివిసెట్టి, చదలవాడ, వల్లం, కేశవరావులాంటి అనేకమంది ప్రజానాట్యమండలి కళాకారులు రాష్ట్రవ్యాప్తంగా బుర్రకథను పరిచయం చేశారు. నాటినుండి నేటివరకు బుర్రకథ బహుళ ప్రచారంలో ఉంది. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ వస్తున్నది. బుర్రకథలను వెలుగులోకి తెచ్చిన తర్వాత సామాజిక స్పృహను కలిగించే ఇతివృత్తాల్ని స్వీకరించి బుర్రకథల్ని మరింత ప్రచారంలోకి తెచ్చారు. బుర్రకథల్ని పురుషులు బృందాలుగా ఏర్పడి ప్రదర్శనలు ఎలా ఇస్తున్నారో స్త్రీలు కూడా బుర్రకథను ప్రదర్శిస్తూ వస్తున్నారు. ఎన్నో బుర్రకథలను గానం చేసే కళాబృందాలు రాష్ట్రంలో ఉన్నాయి. చెప్పుకోదగిన సంఖ్యలో బుర్రకథ గానం చేసి మహిళాబృందాలు కూడా ఉన్నాయి.

ప్రారంభంలో మోటూరు ఉదయం, మహంకాళి లక్ష్మి, చింతల కోటేశ్వరమ్మలు బుర్రకథ దళంగా ఏర్పడి ప్రజానాట్యమండలి తరపున ఎన్నో ప్రదర్శనలిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళా కళాబృందాల్లో చెప్పుకోదగినవి : 1. రాజేశ్వరి బుర్రకథ బృందం - తూర్పుగోదావరిజిల్లా, 2. గరిమెళ్ళ సత్యవతి బుర్రకథ బృందం - చిత్తూరు జిల్లా, 3. సరోజిని బుర్రకథ బృందం - ఖమ్మం జిల్లా - ఇవి కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఇంకా కొన్ని మహిళా బుర్రకథ బృందాలు ఉన్నాయి.

దేవదాసీ నృత్యాల్లోను, దొమ్మరాట ప్రదర్శనలోను, భజనల్లోను, తోలుబొమ్మలాట ప్రదర్శనలోను, వీధినాటకాల ప్రదర్శనల్లోను స్త్రీల ప్రమేయం అధికంగానే ఉంటుంది. ప్రతి జానపద కళారూపంలోను దాదాపు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో స్త్రీల ప్రమేయం ఇటు ప్రదర్శనలోను అటు నేపథ్యంలోను తప్పక ఉంటుంది అన్నది నిర్వివాదాంశం. ఇప్పుడిప్పుడే మహిళలు బృందాలుగా ఏర్పడి కోలాటం, చెక్కభజన, బుర్రకథలు వంటి జానపద కళాప్రదర్శనలను పురుషులకు ధీటుగా ప్రదర్శించగలుగుతున్నారు. ఇంకా ఇంకా మున్ముందుకు కొనసాగి మహిళలు అధిక సంఖ్యలో జానపద ప్రదర్శన కళలను సేవలందించాలని మనసారా కాంక్షిద్దాం, ప్రోత్సహిద్దాం, సహాయసహకారాల్ని కూడా అందిద్దాం.

(ప్రపంచ తెలుగు మహాసభల
ప్రత్యేక సంచిక - 2012)

మి



ఇ.ఎస్. రెడ్డి

# ఇ.ఎస్. రెడ్డి గురించి కొన్ని విషయాలు

– *టి. రవిచంద్*

ఆంధ్రేతరులకు ఇ.ఎస్. రెడ్డిగా పరిచితుడయిన ఏనుగ ఎస్. రెడ్డి భారతదేశ భక్తుడు, దక్షిణాఫ్రికా ప్రజాస్వామ్యవాది. ఐక్యరాజ్యసమితి (UNO) నుండి పదవీ విరమణ చేసిన తర్వాత ఆయనకు ఆసక్తి ఉన్న రంగాల్లో పరిశోధన, రచనావ్యాసంగం చేస్తున్నాడు. తెలుగువాళ్ళు విస్మరించిన అరుదయిన తెలుగు బిడ్డ. గాంధీ, దక్షిణాఫ్రికా చరిత్రలపై అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన అసాధారణ పండితుడు, పరిశోధకుడు. అటువంటి గొప్ప వ్యక్తి సోదరుడు ఏనుగ సీతారామరెడ్డితో చెన్నైలో రెండు రోజులు గడిపినట్టు సంపాదకీయంలో తెలిపారు. మీతో ఆయన ఆనాటి మద్రాసు ప్రెసిడెన్సీలోని తెలుగు ఆడబిడ్డలను గుర్తుచేశారని రాశారు. ఆయన పేర్కొన్న స్త్రీ మూర్తులు నిత్యస్మరణీయులు. వీరిలో శ్రీమతి ముత్తులక్ష్మీరెడ్డిని గురించి ప్రత్యేకంగా గుర్తుపెట్టుకోవాలి. ఆమె తీసుకొచ్చిన దేవదాసీ చట్టం రష్యావిప్లవంవంటి మహోన్నత విప్లమని డా॥ నటరాజ రామకృష్ణ ఒక సందర్భంలో అభివర్ణించారు. ఈ ఇద్దరు సోదరులు ఎవరి రంగంలో వారు కృషిచేస్తూ ఎనభైఏళ్ళ పైబడిన వయస్సులో నిత్య చలనశీరులుగా ఉండటం చూస్తే అరవిందాశ్రమం (పాండిచ్చేరి) మాత (మదర్) వృద్ధాప్యాన్ని గురించి ఒక సందర్భంలో అన్న మాటలు జ్ఞప్తికొస్తున్నాయి : "Old age does not come from a great number of years but from the incapacity of the refusal to continue to grow and progress. I have known old people of twenty and young people of seventy." అందువల్ల మానసికంగా ఎరగనివాళ్ళకే వృద్ధాప్యం కాని ఎనభైఏళ్ళ పైబడిన ఈ యువకులకు ఏళ్ళు (వయస్సు)తో పనిలేదు. ఎనభైఏళ్ళ ఈ యువకులు (Young people of eighty) నిత్య చలనశీలురు. ఏనుగ సీతారామరెడ్డి సోదరుడే ఇ.ఎస్. రెడ్డి ప్రపంచవ్యాప్తంగా ఉన్న గాంధీ పరిశోధకులకు మార్గదర్శి. ఆయన గురించి కొన్ని విషయాలు ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి.

గాంధీజీ దక్షిణాఫ్రికాలో 1893 నుండి 1914 వరకు ఉన్నాడు. ఒక సాధారణ బారిస్టరుగా దక్షిణాఫ్రికాలో ప్రవేశించి, అక్కడ భారతీయుల హక్కుల కోసం వినూత్న పద్ధతుల్లో పోరాటం చేసి ప్రపంచ ఖ్యాతి పొందాడు. ప్రపంచ చరిత్రను ప్రభావితం చేసిన "సత్యాగ్రహం" అనే భావనకు మూలం దక్షిణాఫ్రికాలో గాంధీజీ నిర్వహించిన ఆయుధ రహిత పోరాటంలోనే ఉంది. ఆ భావన ఆధారంగానే తర్వాత భారతదేశ స్వాతంత్ర్య పోరాటం కూడా నడిపాడు. దక్షిణాఫ్రికా ఆయన అనేక భావాలకు ప్రయోగశాల. ఆ ప్రయోగశాలలో రూపొందిందే వినూత్న విప్లవాత్మక ఆయుధం సత్యాగ్రహం. ఈ భావనను ప్రశంసిస్తూ, ఆమోదిస్తూ టాల్‌స్టాయ్‌లాంటి రష్యన్ మహా రచయిత గాంధీజీకి లేఖ కూడా రాశాడు. 1915లో గాంధీజీ భారతదేశానికి తిరిగి వచ్చాడు. 2015 నాటికి ఆయన భారత రాజకీయాల్లోకి అంటే దేశ స్వాతంత్ర్య పోరాటంలోకి అడుగుపెట్టి వందేళ్ళు పూర్తయిన సందర్భంగా 1915 చారిత్రక ప్రాధాన్యతను గుర్తిస్తూ వివిధ ఆంగ్ల పత్రికలు ప్రత్యేక సంచికలు, ప్రత్యేక వ్యాసాలు ప్రచురించాయి. 1915 జనవరి నెలలో దక్షిణాఫ్రికా నుండి గాంధీజీ భారతదేశంలోకి అడుగుపెట్టి 1948 జనవరి 30వ తేదీన ఒక మతోన్మాది చేతిలో హతుడయ్యేంతవరకు ఆయన జీవిత చరిత్ర ఎంతో కొంత భారతీయులందరికీ తెలిసిన విషయమే. ఐతే గాంధీజీ దక్షిణాఫ్రికా చరిత్ర గురించి అందరికీ పెద్దగా తెలియదు. ఈ విషయం పై రామచంద్ర గుహ అనే ఆధునిక భారత చరిత్రకారుడు. రాజకీయ వ్యాఖ్యాత విశేషమైన పరిశోధనచేసి "గాంధీ బిఫోర్ ఇండియా" (భారతదేశానికి పూర్వం గాంధీ) అనే 680 పుటల ఉద్గ్రంథాన్ని రచిస్తే, అంతర్జాతీయ ప్రచురణ సంస్థ పెంగ్విన్ బుక్స్ ప్రచురించింది. ఈ గ్రంథంలో గాంధీజీ లండన్‌లో విద్యాభ్యాసం, తర్వాత ఉద్యోగ నిమిత్తం దక్షిణాఫ్రికా వెళ్ళటం, అక్కడ భారతీయుల హక్కుల కోసం పోరాటం చేస్తూ సఫలీకృతుడవడం, అక్కడే భారతదేశ స్వాతంత్ర్య పోరాట యోధునిగా ఆయన పరిణామం చెందడానికి ఏర్పడిన పునాదుల్ని విశ్లేషిస్తూ ఈ బృహద్గ్రంథాన్ని రచించాడు రామచంద్ర గుహ. ఆధునిక భారత చరిత్రకారుడిగా, సుప్రసిద్ధ రాజకీయ వ్యాఖ్యాతగా ప్రసిద్ధుడైన రామచంద్ర గుహ ఈ గ్రంథాన్ని ఎవరికి అంకితం చేశాడో తెలుసా? తెలుగువాడయిన మన ఏనుగ ఎస్. రెడ్డికి! గాంధీజీపై వెలువడిన ఈ ఉద్గ్రంథాన్ని చదివిన తెలుగు పాఠకులు ఎంతమంది ఈ విషయాన్ని గుర్తించారో తెలియదు. ఈ గ్రంథరచయితకు కూడా ఇ.ఎస్. రెడ్డితో గతంలో పరిచయంలేదు. *గాంధీ బిఫోర్ ఇండియా* గ్రంథ రచనంతా మన దేశంలో, విదేశాల్లో (ఐదు దేశాల్లో) లభిస్తున్న డాక్యుమెంట్లు, అరుదైన లేఖల ఆధారంగా రచించాడు. ఈ పుస్తకంలోని ఎకనాలెడ్జ్‌మెంట్స్, ఏ నోట్ ఆన్

సోర్సెస్ చూస్తే ఆయన ఏ స్థాయిలో గాంధీజీ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో అడుగుపెట్టేవరకు (1915), లండన్, దక్షిణాఫ్రికాలోని ఆయన జీవితాన్ని వెలుగులోకి తేవడానికి ఎంత మౌలిక కృషి చేసిందీ అర్థమవుతుంది. ఈ పరిశోధనలో భాగంగా రామచంద్ర గుహ దక్షిణాఫ్రికా నాలుగుసార్లు పర్యటించాడు. అక్కడ వున్న గాంధీజీ కుటుంబ సభ్యుల్ని (వారసుల్ని), జీవిత చరిత్రకారులను కలుసుకున్నాడు. గాంధీజీ వారసుల్లో గోపాలకృష్ణ గాంధీ ఒకరు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా ఆయనతో రామచంద్ర గుహకు పరిచయం ఉంది. ఈ సుదీర్ఘ పరిచయంలో గాంధీజీ గురించి, గుజరాతీ సంస్కృతి గురించి, భారతదేశం గురించి గోపాలకృష్ణ తనకు ఎన్నో విషయాలు బోధించాడంటాడు ఈ గ్రంథ రచయిత.

అంతేకాదు – ఈ ప్రత్యేక పుస్తకం సందర్భంలో గోపాలకృష్ణ గాంధీ 1992 ప్రాంతాల్లో న్యూయార్క్‌లో ఉంటున్న ఇ.ఎస్. రెడ్డిని కలుసుకోమని పంపాడని చెబుతూ, ఆయన్ని కలుసుకోవటమే 'గ్రేటెస్ట్ గిఫ్ట్' (గొప్ప బహుమతి)గా భావిస్తున్నానంటాడు. ఆయన్ని UNO కేంద్ర కార్యాలయం సమీపంలో ఉన్న మిడ్‌టౌన్ మాన్‌హాటన్‌లోని చిన్న గదిలో కలుసుకున్నట్టు రాశాడు. ఈ జీవిత చరిత్ర పరిశోధనలో గాంధీని చేరుకోవటానికి నా మార్గాన్ని ప్రకాశింపచేశాడు ఇ.ఎస్. రెడ్డి అంటాడు రామచంద్ర గుహ. ఈ పుస్తక పరిశోధన సమయంలో, రాతప్రతిని సిద్ధం చేసేటప్పుడు ఆయన్ని నిత్యం కలుస్తూ గాంధీజీ గురించి దక్షిణాఫ్రికా చరిత్రలో ఆయనకు ఉన్న అసాధారణ జ్ఞానాన్ని (Phenomenal Knowledge) ఉపయోగించుకున్నానంటాడు. ప్రపంచవ్యాప్తంగా వివిధ ఆర్కైవ్స్‌లో గాంధీజీకి సంబంధించిన విషయాల్ని గురించి చెప్పడమే కాకుండా, ఆయన తన స్వంత సేకరణలో ఉన్న సామగ్రి (material) ని అందించి తన పరిశోధనకు చాలా దోహదపడ్డాడు అంటాడు. ఇ.ఎస్. రెడ్డి కుటుంబపరమైన బాధ్యతల్లో తలమునకలయి ఉండి కూడా తన రాతప్రతుల్ని చదివి, సరిదిద్దేవాడని, అందువల్ల ఈ పుస్తకాన్ని ఆయనకు అంకితమివ్వడమనేది, ఈ పరిశోధనలో ఆయనకు రుణపడిన దానికి తగిన వ్యక్తీకరణ కూడా కాదంటాడు.

ఇ.ఎస్. రెడ్డికి తన పుస్తకాన్ని అంకితం చేస్తూ రామచంద్ర గుహ రాసిన మాటల్ని చదివితే ఆయన గొప్పతనం ఏమిటో తెలుస్తుంది: "For E.S. Reddy: Indian Patriot, South African Democra, Friend and Mentor to Gandhi Scholars of all Nationalities" (ఇ.ఎస్. రెడ్డి, భారతదేశ భక్తుడు, దక్షిణాఫ్రికా ప్రజాస్వామ్యవాది, అన్ని జాతుల గాంధీ పరిశోధకులకు మిత్రుడు, సలహాదారుడు).

రామచంద్ర గుహ *గాంధీ బిఫోర్ ఇండియా* రచించే నాటికి ఇ.ఎస్. రెడ్డి దక్షిణాఫ్రికాలో స్థిరపడ్డ తమిళుడు, దేశభక్తుడు, గాంధీజీ సహచరుడు "తంబినాయుడు అండ్ హిజ్ ఫ్యామిలీ" (తంబినాయుడు – ఆయన కుటుంబం)పై ఒక చిన్న పుస్తకం రచించాడని, అది త్వరలో ప్రచురించ బడుతుందని తెలిపాడు. గాంధీచేత *ప్రౌడ్ పాపర్*గా కొనియాడబడ్డవాడు తంబినాయుడు. ఈయన గురించి గుహ తన పుస్తకంలో "టాల్‌స్టాయన్ ఇన్ జొహాన్స్‌బర్గ్" అధ్యాయంలో చర్చించాడు.

బిడియస్థుడు, ఉదాత్తుడు, గొప్ప అధ్యయనపరుడు, నిజమైన వీరోచిత వ్యక్తి అని *గాంధీ బిఫోర్ ఇండియా* గ్రంథ రచయిత రామచంద్ర గుహ చేత ప్రశంసలందుకున్న ఇ.ఎస్. రెడ్డి తెలుగువాడయినందుకు మనమంతా గర్వపడాలి. అరుదైన ఈ ఆంధ్రప్రముఖుడు 1997 ప్రాంతాల్లో నేను డా॥ కె.బి. కృష్ణ కొన్ని రచనల్ని వెలుగులోకి తెస్తున్న సమయంలో సోషలిస్టు మిత్రులు రావెల సోమయ్య గారి ద్వారా నాకు పరిచయమయ్యాడు. ఆయనకు డా॥ కె.బి. కృష్ణ అంటే చాలా అభిమానం. నాటి *త్రివేణి (1940)* ఆంగ్ల పత్రికలో వచ్చిన డా॥ కె.బి. కృష్ణ వ్యాసం – *మెటీరియలిజం అండ్ భగవద్గీత* (భౌతికవాదం – భగవద్గీత) చదివి చాలా ప్రభావితుడయ్యాడు. ఈ వ్యాసాన్ని తెలుగులోకి అనువాదం కూడా చేశాడు. కాని దాన్ని ప్రచురించలేదు. ఆనాటికి నాకు ఇ.ఎస్. రెడ్డి తో ప్రత్యక్ష పరిచయం ఏర్పడకపోయినా, లేఖాపరిచయం ఏర్పడింది. ఎప్పుడో విద్యార్థి దశలో డా॥ కె.బి. కృష్ణతో ఏర్పడిన పరిచయాన్ని దశాబ్దాలు గడిచినా ఆయన విస్మరించలేదు. చరిత్ర గుర్తించినవాళ్ళను గుర్తుపెట్టుకోవటంలో విశేషం ఏమీ లేదు. తమ సమకాలీన చరిత్రలోనే కాకుండా తర్వాత కాలంలో కూడా చరిత్రవల్ల దుర్మార్గంగా విస్మరించబడినవాళ్ళను స్మృతిపథంలోకి తెచ్చుకోవటమే గొప్పవాళ్ళ గొప్పతనం. డా॥ కె.బి. కృష్ణ చరిత్ర కాని తమిళ తంబినాయుడుల చరిత్రకానీ ఎవరికి కావాలి? వాళ్ళ గురించి రాస్తే మనకొచ్చేదేమిటి? అని ఆలోచించే పరిశోధకులు, మేధావులే మనకు ఎక్కువ. కానీ, ఇ.ఎస్. రెడ్డి లాంటి ఉదాత్త వ్యక్తిత్వంకలవాళ్ళు నిష్కాముకంగా తమ పనేదో తాము చేసుకొంటూ ముందుకు వెళ్తుంటారు. మన పక్కనే ఉన్న ఇటువంటి గొప్పవాళ్ళను తెలియనట్టు విస్మరించటమో, అదీ కుదరకపోతే అపహాస్యం చేయడమో చేసే సగటు తెలుగువాడి తెగులు గురించి ఎంత రాసినా తరగదు. అది వేరే విషయం అనుకోండి. దాన్ని ప్రస్తుతానికి అలా వదిలేద్దాం.

ఇ.ఎస్. రెడ్డి గురించి *భగవద్గీత* పై కొన్ని వినూత్న భావాలు (మిసిమి, జనవరి 2001) పేరుతో రాసిన వ్యాసంలో ప్రస్తావించాను. ఆసక్తిగల పాఠక మిత్రులు దీన్ని చూడవచ్చు.

మి

టి. రవిచంద్
బాపట్ల, గుంటూరు జిల్లా.
ఫోన్ : 9966134406



# షేక్స్‌పియర్ - బుచ్చిబాబు

- అంపశయ్య నవీన్

షేక్స్‌పియర్ లాంటి అనేక పాశ్చాత్య రచయితల పేర్లను మనం- అంటే తెలుగు పాఠకులం తరచు వింటుంటాం- కానీ షేక్స్పియర్ ఎక్కడ పుట్టాడు, ఎక్కడ పెరిగాడు, ఆయన రాసిన రచనలేమిటి? ఆ రచనల్లో యేముంది? ఆయనను గురించి అందరూ ఎందుకంత గొప్పగా చెప్పుకుంటారు? ఇలాంటి ప్రశ్నలకు చాలామంది సామాన్య పాఠకుల దగ్గర సమాధానాలుండవు.

బుచ్చిబాబు ఈ మహా రచయిత గూర్చి రచించిన వ్యాసాలేమిటో తెలుగు పాఠకులు తెలుసుకోవాలన్న ఉద్దేశ్యమే నేనీ వ్యాసం రాయటానికి కారణం.

మొట్టమొదట బుచ్చిబాబు రచించిన "షేక్స్‌పియర్ సాహితీ పరామర్శ" అన్న పుస్తకాన్ని చూద్దాం.

"ఆంగ్ల భాషతో గాఢమైన పరిచయం లేక, పెద్ద పాండిత్యమూ లేక షేక్స్‌పియర్‌ను గూర్చి తెలుసుకోవాలని కుతూహలపడే సామాన్య పాఠకులెందరో ఉంటారు. వారిని ఉద్దేశించే ఈ పుస్తకం రాశాను. సులువుగా, సూటిగా ప్రధాన భాగం అర్థమయ్యేలాగున, వ్యవహార భాషలో, పొడిమాటల్లో, విషయం సుబోధకం చెయ్యడమే తలపెట్టాను కాని, మక్కికి మక్కి మూలంలో ఉన్న తికమకల్ని, వైవిధ్యాన్నీ ఎరుకపరిచే పెద్దపెద్ద మాటల్లో అనువదించటం ఉద్దేశం కాదు"

బుచ్చిబాబు తనకై తాను నిర్దేశించుకున్న ఈ లక్ష్యం నెరవేరిందనే ఈ పుస్తకం చదివిన వారికి తెలుసొస్తుంది. బుచ్చిబాబు రాసిన ఈ పుస్తకానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి పురస్కారం లభించింది.

షేక్స్‌పియర్ గొప్ప కవి. ఆయన జీవిత విశేషాలు తెలిస్తే ఆయన రచనల విశిష్టత మరింత తెలుస్తుంది. నిన్న మొన్నటి వరకు ఆయనను గూర్చిన రూఢైన వివరాలు బైటపడలేదు. అసలు షేక్స్‌పియర్ అనేవాడు లేనేలేడని, ఇంకెవరో ఆ నాటకాల్ని రాసి ఆయన పేరు పెట్టారనే వాదన కూడా ఉండేది. పెద్దగా చదువుకోనివాడు, సంపన్న కుటుంబానికి చెందనివాడు ఇన్ని గొప్ప నాటకాలు రాసే అవకాశమే లేదనే వాదాన్ని కొందరు లేవదీశారు. కానీ అనేక పరిశోధనల తర్వాత, లిఖితపూర్వకమైన ఆధారాలు లభించాక షేక్స్‌పియర్‌ను గూర్చిన అపోహలన్నీ తొలగిపోయాయి. 1964వ సంవత్సరంలో షేక్స్‌పియర్ 400వ జన్మదిన ఉత్సవాలు జరిగిన సందర్భంగా, విద్యార్థిగా షేక్స్‌పియర్ పాఠశాలలో కూర్చున్న బెంచీ, దానిమీద అతడు చాకుతో తన పేరు చెక్కుకున్న దృశ్యం కనిపించింది. ఆ బెంచీని తీసికెళ్ళి షేక్స్‌పియర్ భాండాగారంలో ప్రదర్శించారు.

1564, ఏప్రిల్ 26వ తేది నాడు షేక్స్‌పియర్ జన్మించాడని ఇంగ్లండ్‌లోని స్ట్రాఫర్డ్ చర్చిలో రికార్డు చెయ్యబడి ఉంది. షేక్స్‌పియర్ జీవితానికి సంబంధించిన రెండో వివరం 18 సంవత్సరాల తర్వాత- అంటే నవంబర్ 27వ తేది, 1582వ సంవత్సరం - షేక్స్‌పియర్ అన్‌హతావె అనే ఆమెను వివాహమాడినట్టుగా స్ట్రాట్‌ఫర్డ్‌లోని ఒక చిట్టాలో ఉంది. ఆమె షేక్స్‌పియర్ కంటే ఎనిమిదేళ్ళు పెద్దదట!

1583, మే 26న షేక్స్‌పియర్ దంపతులకొక కూతురు (సుసన్న) పుట్టింది. ఆ తర్వాత ఆయనకు హామ్లెట్ అనే కుమారుడు, జూడిత్ అనే కుమార్తె కూడా పుట్టారు. 1585-1592 మధ్యకాలంలో షేక్స్‌పియర్‌ను గూర్చిన వివరాలేవీ లభించలేదు. కానీ 1593లో షేక్స్‌పియర్ రచించిన 'వీనస్, ఎడోనిస్' అనే కావ్యం ప్రచురించబడింది. ఆ తర్వాత ఆయన రచించిన నాటకాల వివరాలు లభించాయి. 1593లో ఇంగ్లాండ్‌లో ప్లేగువ్యాధి ప్రబలినప్పుడు షేక్స్‌పియర్ సౌతాంటన్ అనే భవనంలో ఉండి "లవ్స్ లేబర్ లాస్ట్" అనే నాటకం రాశాడు. 1593లో "కామెడి ఆఫ్ ఎర్రర్స్, టేమింగ్ ఆఫ్ ది ష్రు" అనే నాటకాల్ని రాశాడు.

చాంబర్లేన్ ఎర్రర్ అనే ఒక ధనిక కుటుంబానికి చెందిన సౌంతాప్టన్ ప్రభువు షేక్స్‌పియర్‌కు చాలా సహాయం చేశాడని

చెబుతారు. 1595 నాటికి షేక్స్‌పియర్ 6 నాటకాలు రాసేశాడు. 1596-1599 మధ్య మరో 9 నాటకాలు రాశాడు. 1599లో పదవవంతు లాభం తీసుకుంటూ గ్లోబ్ థియేటర్‌కు నిర్వాహకుడిగా ఉన్నాడు. ఆనాటి రాజుల చేత, రాణుల చేత గౌరవాలు పొందిన షేక్స్‌పియర్ 1616 ఏప్రిల్ 26వ తేదీన మరణించాడు. ఆయన పుట్టినతేది, చనిపోయిన తేది - ఏప్రిల్ 26 కావడం యాధృచ్ఛికం. ఆయన ఈ ప్రపంచంలో 52 సంవత్సరాలు మాత్రమే జీవించినా కొన్ని వేల సంవత్సరాల వరకు ఈ భూగోళం మీది ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్నాడు.

రచయితగా షేక్స్‌పియర్‌కు లభించినంత ప్రఖ్యాతి ప్రపంచంలో మరే ఇతర రచయిత క్కూడా లభించలేదంటాడు బుచ్చిబాబు.

"విశ్వంలో తిరుగాడుతున్న భూగోళం గురించీ, మానవజాతిని గురించీ చర్చించటం ఎట్లాంటిదో ఈనాడు షేక్స్‌పియర్‌ను గూర్చి చర్చించడం అట్లాంటిది" ఇవి 1964లో ప్రపంచమంతా జరిగిన షేక్స్‌పియర్ 400వ జన్మదినోత్సవం సందర్భంగా బి.బి.సీ.లో ప్రసంగిస్తూ, విమర్శకుడు వి.ఎస్. ప్రిచెట్ చెప్పిన మాటలు.

షేక్స్‌పియర్‌ను గురించి వ్రాయబడినన్ని పుస్తకాలు మరే కవిని గురించి కూడా రాయబడలేదు.

షేక్స్‌పియర్‌ను ప్రపంచ పాఠకులు ఇంతగా తమ హృదయాల్లోకి తీసుకోవడానికి కారణమేమిటన్న ప్రశ్నకు బుచ్చిబాబు సమాధానం: "మానవుడి అంతరంగ వికాసానికి దోహదమిచ్చే దృక్పథం, మన నిజస్వరూపాన్ని మనం చూసుకునే అవకాశం షేక్స్‌పియర్ రచనల్లో ఉండటమే". మానవుడి అంతరంగాన్ని షేక్స్‌పియర్ శోధించినంతగా మరే రచయితా శోధించలేదేమో.

ఈ కారణం చేతనే మానవుడి మనస్సులోని అంతరాంతర పొరల్ని శాస్త్రీయంగా శోధించిన సిగ్మండ్ ఫ్రాయిడ్ "అంతశ్చేతన" లేక Unconscious అనేదాన్ని తనకంటే ముందు షేక్స్‌పియర్ లాంటి రచయితలే కనుక్కున్నారని, తను దాన్ని శాస్త్రీయంగా మాత్రమే రుజువు చేశానని అన్నాడు. ప్రతి వ్యక్తిలో అతనికి తెలియని మరో ప్రపంచమొకటి ఉంటుందని, అది అతని బాహ్య ప్రపంచం మీద, అంటే అతని నడవడిమీద తీవ్ర ప్రభావాల్ని కల్గిస్తుందని షేక్స్‌పియర్ రచించిన అనేక నాటకాల్లో మనం చూస్తాం. షేక్స్‌పియర్‌ను గూర్చి బుచ్చిబాబు అన్న ఈ మాటలు మన్నించదగినవి:

"విశ్వంలో గోళాలు ఢీకొంటున్నాయి. సూర్యగోళం గతి తప్పి అనంతంలోకి పోతోంది. భూగోళం వెలుగులేక గడ్డకట్టి పోతోంది. మానవజాతి చరిత్ర రేపటితో సమాప్తమవుతుంది. కాబట్టి మానవులు తమ వీలునామాల్ని సిద్ధపరచుకోవాలి అని అశరీరవాణి శాసిస్తే షేక్స్‌పియర్ నాటకాలే మానవుడి వీలునామా అనేటంత పలుకుబడి తెచ్చుకున్నాయి ఈ నాటకాలు"

బుచ్చిబాబు రచించిన ఈ "షేక్స్‌పియర్ సాహిత్య పరామర్శ" పుస్తకంలోని మొదటి అధ్యాయంలో షేక్స్‌పియర్ నాటకాల్లో మానవ జీవితానికి సంబంధించిన అనేక పార్శ్వాల మీద ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యానాలను ఉదహరించాడు. అలాగే ఆయన నాటకాల్లో కొన్ని కవిత్వ సాంద్రతతో నిండిన వాక్యాలను ఉటంకించాడు. వాటిల్లో కొన్ని-

"రక్తం ఆమె బుగ్గలపైకొచ్చి తొంగి చూచింది.
వెన్న మీగడల రాణి ఆమె"

ఆయన నాటకాల్లోని మరొక నాయికను గూర్చి:

రాత్రిని వర్ణిస్తూ "నిశీధి చాచిన ఇనుప నాలుక" అంటాడు.

''సమానమైన చేతులు గల న్యాయం'' అని మొట్టమొదలన్నది షేక్స్‌పియరే.

"వస్త్రములవలె నదిలో నీరు ఒడ్డున చేరుతోంది.
సిగ్గుపడిన కన్యల తొడలవలె ఇసుక ఒడ్డున మెరుస్తోంది"

షేక్స్‌పియర్ ఒక వర్ణనను గూర్చి బుచ్చిబాబు "పుష్పంలోని మృదుత్వం, శిలా ప్రతిమలోని నునుపు- వీటి కలయికతో దైన్యం రంగుల్ని కూడా తెచ్చుకున్నట్లుంది. లోపలున్నప్పుడు ఆకుపచ్చ (కంఠనాళాలు) నవ్వురూపంలో బైటకొచ్చినప్పుడు పసుపు - ఇదొక అపూర్వమైన భావన అంటాడు.

**కొన్ని ప్రకృతి వర్ణనలు :**

"కన్యకలాంటి ముల్లు మీద వాలిన గులాబి"

"మృత్యువు కొట్టిన దెబ్బ - ప్రియుడు బుగ్గగిల్లడం లాంటిది - నొప్పిగా ఉన్నా కావాలంటాం"

జీవితం, మాన ప్రకృతిని గూర్చిన వ్యాఖ్యానాలు :

షేక్స్‌పియర్ మానవ ప్రకృతిని లోతుగా పరిశీలించి తరచి చూశాడు. పైకి ఎలా కనబడినా వారిలో ప్రాకృతిక

శక్తుల విజృంభణ, కామము, రహస్యమైన వాంఛలు అతని అంతశ్చేతనలో ఉంటాయనీ, వాటికి లొంగిపోయినప్పుడు మానవుడు పతనమౌతాడని ఫ్రాయిడ్ కంటే ముందే గ్రహించాడు షేక్స్పియర్. మానవ జీవితాన్ని గూర్చి చేసిన ఈ వ్యాఖ్యానాలు:

"పిల్లలు ఆటకోసం పురుగులను హింసించి చంపినట్లు భగవంతుడు తన ఆటకోసం మనల్ని చంపుతాడు"

"ఈ జీవితం ఒక శుంఠ చెప్పిన కథనం- ధ్వని, కసి తప్ప ఈ జీవితానికి వేరే అర్థం లేదు"

కింగ్ లీర్ నాటకంలో కూతుళ్ళు అల్లుళ్ళు తనను ఆదుకోక విడిచేసినప్పుడు అతడనుకుంటాడు:

"నిప్పు చక్రానికి కట్టేశారు నన్ను, కరిగిన సీసంలా నా కన్నీటి బిందువులే నన్ను కాలుస్తున్నాయి" అనుకుంటాడు.

"బలహీనున్ని లేవదీయటమే కాదు, అతన్ని నిలబెట్టాలి"

షేక్స్పియర్ నాటకాలన్నింటిలోకి "హామ్లెట్" అన్న నాటకం బహుళ ప్రాచుర్యాన్ని పొందింది. ఆ నాటకాన్ని గూర్చి రచించబడినన్ని వ్యాఖ్యానాలు ప్రపంచంలో మరే నాటకం మీద రచించబడలేదు.

నాటకం చివర్లో హామ్లెట్ చివరిశ్వాస విడిచేముందు తన మిత్రునితో ఇలా అంటాడు:

"నన్ను నీ మనస్సులో ఎప్పుడైనా తల్చుకుంటే ఒక్కక్షణం వినోదాన్ని మరచిపో. నాలాగే నువ్వు కూడా బాధపడు"

**మరోచోట :**

*"గంట గంటకీ పండిపోతుంటాం*
*మళ్ళా గంటగంటకీ కుళ్ళిపోతుంటాం.*
*ఆ నడుమ వేళ్ళాడుతుంది మన కథ"*
*"మంచంతటి పవిత్రత నీలో ఉన్నా నింద తప్పదు"*

షేక్స్పియర్ వాడిన కొన్ని ఉపమానాలు వాల్మీకిలోనూ, కాళిదాసులోనూ, శ్రీహర్షునిలోను, భవభూతిలోనూ ఉన్నాయంటాడు బుచ్చిబాబు.

ఈ పుస్తకంలోని రెండో అధ్యాయంలో షేక్స్పియర్ జీవిత విశేషాలను పొందుపర్చాడు బుచ్చిబాబు. క్లుప్తంగా షేక్స్పియర్ జీవిత విశేషాలు:

ఎంతమంది మేధావులో ఎన్నో పరిశోధనలు చేసిన ఫలితంగా షేక్స్పియర్ జీవిత విశేషాలేమిటో ఇప్పుడు రూఢి అయ్యాయి. షేక్స్పియర్ జీవితాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన బుచ్చిబాబు ఆయనను గూర్చి తాను తెలుసుకున్నదేమిటో ఇలా చెప్పాడు:

"షేక్స్పియర్ ప్రతిభాశాలియైన కవి. గొప్ప నాటకకర్త అవడమే కాకుండా లౌకిక పరిజ్ఞానం, వ్యవహార దక్షత, కార్యదీక్ష కల వ్యక్తి కూడా. కవులు ఊహాజగత్తులో విహరిస్తూ మతిమరుపుతో ఇహలోకం గురించి పట్టించుకోరని, లౌకిక వ్యవహారాలు వారికి బొత్తిగా తెలియవని, కావున ప్రపంచ వ్యవహారాలు వారికి అప్పగించకూడదన్న ప్రతీతి ఉంది. ప్లేటో పండితుడు ఈ కారణం చేతనే తన ఆదర్శ రాజ్యంలో కవులకు చోటు లేదన్నాడు. షేక్స్పియర్ జీవితం పరిశీలిస్తే ఇది తప్పని తెలుస్తుంది. ఆయన కొన్ని పనులు చెయ్యదల్చుకున్నాడు. అవన్నీ చేశాడు. ఒక రంగంలో విజయం సాధించదల్చాడు. అది సాధించాడు. సంసారం దిద్దుకున్నాడు. ఆస్తి సంపాదించాడు. రాజాస్థానంలో పలుకుబడి, గౌరవం పొందాడు. రాజలాంఛనమైన కోట్ ఆఫ్ ఆర్మ్స్ హోదాను తండ్రికి తెచ్చిపెట్టాడు. మానవుడి ఊహా సామ్రాజ్యపు పరిధుల్ని తరచి చూశాడు. ప్రేమించాడు. బాధపడ్డాడు. సుఖదుఃఖాలను తోటి మానవులతో కలిసి పంచుకున్నాడు. అతడు పరిపూర్ణమానవుడు"

ఈ పుస్తకపు మూడవ అధ్యాయంలో షేక్స్పియర్ రచించిన ఆనాటి కవితా ప్రక్రియల్లో ఒకటైన 'సానెట్స్'ను బుచ్చిబాబు పరిశీలించాడు.

నాటకాలే కాకుండా షేక్స్పియర్ కొన్ని కావ్యాలు కూడా రాశాడు. వీనస్, ఎడొనిస్, లుక్రీన్ అనే మూడు కథల్ని చెప్పే కావ్యాలతో బాటు సానెట్స్ అనే గేయగుచ్ఛాల్ని ఆయన రచించాడు. ఈ సానెట్స్ - ఒక్కొక్కటి 14 లైన్ల చొప్పున ఉంటాయి. షేక్స్పియర్ రచనల్లో హామ్లెట్ నాటకం తర్వాత ఎక్కువ చర్చ జరిగింది ఈ సానెట్స్ గురించే. 'ఈ 'సానెట్స్' 1591లో వెలువడ్డాయి. అప్పట్నించి ఈ ధోరణిలో ఇతర కవులు కూడా రాయడం ఒక కవితా సంప్రదాయం అయింది.

ఈ సానెట్స్ని "ఫిలప్ సిడ్నీ" అనే ఆయన 'స్టెలా' అనే ఆమెను సంబోధిస్తూ రాసినట్టుగా షేక్స్పియర్ రాశాడు. ఫిలిప్ సిడ్నీకి స్టెల్లా అనే ఆమె ప్రేయసి. స్టెలా అనే ఆమె నల్లటిదట. ఈ సానెట్స్లో ఒక సానెట్ ఇలా ప్రారంభమౌతుంది.

*"నువ్వు అందమైన దానివనీ*
*ప్రమాణం చేసుకున్నాను.*
*కానీ నువ్వు రాత్రిలో చీకటివి*
*నరకంలో నలుపువి"*

అట్లాంటి ఆమెను ప్రేమించినందుకు తనను తానే నిందించుకుంటాడు.

*"కామం కార్యానికి దిగితే*
*శక్తంతా అవమానం అనే బీడుభూమిగా మారుతుంది.*
*కార్యానికి దిగని కామం*
*చెడ్డది, దారుణమైంది, హత్యలాంటిది.*
*కఠినమైంది, నమ్మతగనిది.*
*చవి చూసిన వెంటనే రోతపుడుతుంది*
*బుద్ధి వేటకి చిక్కదు, చిక్కినా*
*తూరీగని మభ్యపెట్టినట్లు బుద్ధినే ద్వేషిస్తుంది"*

ఈ సానెట్స్‌లోని వ్యక్తులు ఎవరు? ఆ నల్లటామె - అంటే ఆ "శ్యామల" ఎవరు? అందమైన యువకుడెవరు? ఈ అంశాలను పరిశోధకులు ఇంకా పరిశోధిస్తూనే ఉన్నారు. ఎవరు ఎవరైందీ ముఖ్యం కాదు. ఏ కవికీ సాధ్యం కాని ప్రేమతత్వ పరిశీలన చేశాడు షేక్స్‌పియర్ ఈ సానెట్స్‌లో.

షేక్స్‌పియర్‌ను ప్రపంచ సాహిత్యంలో అగ్రశ్రేణి రచయితగా నిలిపినవి ఆయన రచించిన నాటకాలే. ఈ నాటకాల్ని ఆయన కావ్యాలుగా రచించాడు. ఆయన రచించిన నాటకాల్ని ఐదు దశలుగా విభజిస్తారు.

**మొదటి దశ : తొలి నాటకాలు.**
**రెండవ దశ: ఖండ కవితా ధోరణిలో సాగినవి,**
**మూడవ దశ : చారిత్రక సుఖాంత నాటకాలు,**
**నాల్గవ దశ : విషాదాంత నాటకాలు,**
**చివరిదశ : కాల్పనిక నాటకాలు.**

ఈ పుస్తకంలో ఐదవ అధ్యాయంలో బుచ్చిబాబు షేక్స్‌పియర్ నాటకాలు రాస్తున్న కాలంలో ఇంగ్లండ్‌లోని సామాజిక స్థితిగతుల్ని చర్చించాడు.

ఆరోజుల్లో ఇంగ్లాండ్‌ను మొదటి ఎలిజబెత్ రాణి పరిపాలిస్తోంది. ఆంగ్ల చరిత్రలో ఈ దశను ఎలిజబెత్ యుగంగా వ్యవహరిస్తారు. ఆ యుగాన్ని స్వర్ణయుగంగా కూడా భావిస్తారు. ఎలిజబెత్ రాణి సాహిత్యాన్ని, నాటకాలను పోషించేది. ఆరోజుల్లో నాటకాలు ఆడేవారిని హీనంగా చూసేవారు. ఎలిజబెత్ రాణి కాలంలో ఈ పరిస్థితి చాలావరకు మారింది. ఆమె షేక్స్‌పియర్ నాటకాలను మెచ్చుకుంది. ఆమె కాలంలో ఇంగ్లండ్‌లో వొక నూతన వికాసం, జిజ్ఞాస ప్రబలాయి. దీన్నే రినైజాన్స్ లేక సాంస్కృతిక పునరుజ్జీవన ప్రారంభం అంటారు. రాజకీయాలపై మత ప్రభావం తగ్గింది. ఒక నూతన స్వేచ్ఛాయుత వాతావరణం యేర్పడింది. వర్తక వ్యాపారాలు పెరిగాయి. ధనికవర్గం అభివృద్ధి కార్యక్రమాలకు పూనుకుంది. స్పెయిన్‌తో సముద్రం మీద జరిగిన యుద్ధంలో ఇంగ్లాండ్ గెల్చింది. దీంతో ఇంగ్లాండ్ నౌకాదళం ప్రపంచంలో అజేయశక్తిగా నిల్చింది. ఈ పరిస్థితులన్నీ షేక్స్‌పియర్ లాంటి ఒక మహా రచయితను సృష్టించటానికి దోహదం చేశాయంటాడు బుచ్చిబాబు.

షేక్స్‌పియర్ రాసిన నాటకాల్లో "రోమియో-జూలియెట్" నాటకం చాలా ప్రఖ్యాతి వహించింది. ప్రపంచ ప్రజలందరికీ ఎంతో ఇష్టమైన మూడు విషాదాంత రచనల్లో రోమియో-జూలియెట్ ఒకటి. (మిగతా రెండు: లైలా-మజ్నూ, దేవదాసు) ఈ నాటకాన్ని షేక్స్‌పియర్ తన 31వ యేట 1595లో రచించాడు.

విషాద గాథలు అనే పేరిట బోయిస్టా బాండెల్లో అనే ఇద్దరు ఫ్రెంచ్‌లో అనువధించిన గ్రంథాలలోనిదే దీంట్లోని కథ. ఆర్థర్ బ్రూక్ అనే ఆయన 1562లో ఈ గాథని ఇంగ్లిషులోకి అనువదించాడు. ఈ ఇంగ్లిషు అనువాదంలోని కథ ఆధారంగానే షేక్స్‌పియర్ ఈ 'రోమియో-జూలియెట్' నాటకాన్ని రచించాడు.

ఇటలీలోని వెరొనా అనే పట్నంలో మాంటాగ్యూ, కాప్యులేట్ అనే రెండు కుటుంబాల వారు ఎప్పుడూ తగువులాడుకుంటుంటారు. మంటాగ్యూ తెగకు చెందిన రోమియో, కాప్యులేట్ తెగకు చెందిన జ్యూలియెట్ ప్రేమించుకుంటారు. వారిద్దరు పరస్పరం ఎప్పుడూ కలహించుకునే కుటుంబాలకు చెందినవారు కావడం వల్ల వాళ్ళ పెళ్లిని ఆ కుటుంబాలు అంగీకరించవు. ఈ కారణం చేత వాళ్ళిద్దరు ఒకరికి తెలియకుండా ఒకరు విషం తాగి చనిపోయే పరిస్థితి యేర్పడుతుంది.

ఈ నాటకం ఒక మనోహరమైన ఖండ కావ్యంలా సాగుతుంటాడు బుచ్చిబాబు. ఈ నాటకం నిండా వెలుగు, కాంతి, తారకలు, చందమామ, సూర్యుడు, కాగడాలు, కొవ్వొత్తి, దీపాలు - అన్నీ వెలుగునిచ్చేవే కనబడ్తాయి.

బాల్కనీలో నిలబడ్డా జూలియెట్ కింద నిల్చున్న రోమియోకు ఎలా కనిపిస్తుందో షేక్స్‌పియర్ ఎలా వర్ణించాడో చూడండి:

"బద్ధకంగా కదిలే మేఘాల నడుమ స్వారిచేస్తూ తిరుగాడే దేవకన్య - రాత్రిలో ఉన్న వెలుగునంతటినీ తానే దాచుకొని

కంటిలో తెల్లగుడ్డు పైకెత్తి ఆశ్చర్యంతో దిగువ నిలబడి చూసే మానవుల్ని చకితుల్ని చేసే దేవకన్యలా కనిపించిందట" జూలియెట్ రోమియోకు.

ఇలాంటి వర్ణనలు ఈ నాటకంలో లెక్కలేనన్ని ఉంటాయంటాడు బుచ్చిబాబు.

"పేరులో యేముంది? గులాబీని ఏ పేరుతో పిలిచినా అంత తియ్యగానూ పరిమళిస్తుంది కదా!" అన్న ఎందరో ఎప్పుడూ కోట్ చేసే మాట ఈ నాటకంలో ఉన్నదే!

"రోమియో జూలియెట్ – ఇద్దరూ చనిపోయాక తీవ్రమైన భౌతికానందం తీవ్రంగా పరిసమాప్తమౌతుందేమో"

"అతను చనిపోయాక చిన్నచిన్న తారకల కింద అతన్ని ముక్కలు చెయ్యి. ప్రపంచం సూర్యుణ్ణి విడిచేసి రాత్రినే ప్రేమిస్తుంది" అంటాడు షేక్స్పియర్.

చాలా ప్రఖ్యాతి చెందిన షేక్స్పియర్ మరో నాటకం "మర్చంట్ ఆఫ్ వెనిస్"

ఇది ఇటలీ దేశపు కథ. 'పోర్షియా' అనే ఓ ధనికురాలిని బెస్సానియో వరిస్తాడు. ఆమెను పెళ్లి చేసుకోవాలంటే పోర్షియా దగ్గరున్న మూడు భరిణెల్లో– (ఒకటి బంగారంది, రెండోది వెండిది, మూడోది సీసంది) యేది సరియైనదో తెలుసుకోవాలి. ఇదో స్వయంవరం లాంటిది. ఈ స్వయంవరంలో పాల్గొనాలంటే బెస్సానియోకు కొంత డబ్బు కావలసి ఉంటుంది. అతడి స్నేహితుడు ఏంటోనియో షైలాక్ అనే వడ్డీ వ్యాపారస్తుడి దగ్గర అప్పు చేసి బెస్సానియో కిస్తాడు. అయితే ఆ అప్పును సకాలంలో తీర్చకపోతే ఏంటోనియో తన శరీరంలోంచి ఒక పౌండు మాంసం కోసి షైలాక్కు ఇస్తానని అప్పుపత్రం మీద రాసిస్తాడు. బెస్సానియో స్వయంవరం గెలిచి పోర్షియాను పెళ్ళి చేసుకుంటాడు. కానీ ఏంటానియో సకాలంలో అప్పు తీర్చకపోవటం వల్ల షైలాక్ కోర్టులో ఫిర్యాదు చేసి ఏంటానియో శరీరం నుండి పౌండు మాంసాన్ని కోసివ్వాలంటాడు.

అప్పుడు బెస్సానియో భార్య పోర్షియా మారువేషంలో కోర్టుకొచ్చి ఏంటానియో శరీరం నుండి ఒక్క చుక్క రక్తం బొట్టు పడకుండా పౌండు మాంసం షైలాక్ను తీసుకోమంటుంది. ఎందుకంటే అప్పుపత్రం మీద పౌండ్ మాంసం అనే ఉంది తప్ప రక్తం విషయం లేదుకదా అని వాదిస్తుంది. షైలాక్ కేసు ఓడిపోతాడు. అక్కడివారి ఆక్షేపణకు గురయి వెళ్ళిపోతాడు.

ఈనాటికి కూడా అప్పు వసూలు చెయ్యడంలో క్రూరంగా ప్రవర్తించేవారిని షైలాక్ అనీ, కఠినమైన షరతులు పెట్టినప్పుడు 'పౌండ్ ఆఫ్ ఫ్లెష్' అనడం మనం వింటుంటాం.

షేక్స్పియర్ మూడవదశలో– అంటే 1597 నుండి 1600 వరకు ఎనిమిది నాటకాలు రాశాడు. వాటిలో ఐదు చారిత్రక నాటకాలే. 1597–98లో రాసినవి నాల్గవ హెన్రీని గూర్చిన రెండు నాటకాలు. ఈ రెండు నాటకాల్లో ఫాల్స్టాఫ్ అనే పాత్ర ఎంతోమంది పండిత పామరులకు విపరీతంగా నచ్చిన పాత్ర. హామ్లెట్ పాత్ర తర్వాత ఈ ఫాల్స్టాఫ్ పాత్రను గురించే అనేకమంది విమర్శకులు వ్యాఖ్యానాలు రాశారు. ఫాల్స్టాఫ్ స్థూలకాయుడు.

ఎప్పుడూ ప్రగల్భాలు పలుకుతుంటాడు. తాగి, తిని, సుఖిద్దాం అనేవాడు. రాజుకు ఇష్టుడైన స్నేహితుడు. రాజును చెడు తోవకు మళ్ళించినవాడు. ఇతని హాస్యం చాలావరకు రెండర్థాలు గల మాటల ప్రయోగంపైనా, ప్రాంతీయాలపైనా ఆధారపడి ఉంటుంది.

షేక్స్పియర్ రాసిన మరో విషాదాంత చారిత్రక నాటకం: "జూలియస్ సీజర్"

జూలియస్ సీజర్ రోమన్ సామ్రాజ్యాన్ని పాలిస్తున్న చక్రవర్తి. అతడు నిరంకుశుడుగా మారుతున్నాడన్న కారణంతో బ్రూటస్, కాసియస్ మొదలైన ఆర్గురు సెనెటర్లు కుట్ర చేసి సెనెట్ హాల్లోనే కత్తులతో పొడిచి చంపేస్తారు. బ్రూటస్ను తన కొడుకులా చూసుకునే సీజర్ బ్రూటస్ కూడా తనను హత్య చేయడానికొచ్చినప్పుడు "బ్రూటస్– నువ్వు కూడానా" (యూ టూ బ్రూటస్) అంటాడు సీజర్.

మనకెంతో నమ్మకస్తులనుకున్న వాళ్లు మనల్ని మోసం చేస్తే "యూ టూ బ్రూటస్" అనేమాట ఈనాటికీ వాడుకలో ఉంది. అలాగే సీజర్ను చంపేసిన బ్రూటస్ బృందాన్ని గూర్చి రోమన్ ప్రజలనుద్దేశించి సీజర్ నమ్మకస్తుల్లో ఒకడైన ఆంటోని చేసిన ఉపన్యాసం కూడా చాలా ప్రసిద్ధి చెందింది. బ్రూటస్ బృందాన్ని గౌరవనీయులని పొగుడుతూనే వాళ్లు సీజర్ను చంపి, రోమన్ ప్రజలకు ఎంత ద్రోహం చేశారో ఆంటోనీ ప్రజలకు చెప్పడంతో వాళ్ళు బ్రూటస్ బృందం మీద తిరగబడ్డారు. ఒక ఉపన్యాసం ప్రజల్నెంత కదిలిస్తుందో, ఎంత ఉత్తేజితుల్ని చేస్తుందో ఆంటోనీ ఇచ్చిన ఈ ఉపన్యాసం ద్వారా షేక్స్పియర్ రుజువు చేశాడు. ఆంటోని చేసిన ఈ ఉపన్యాసంలోని ఎన్నో భాగాలు అత్యంత ఉద్రేకపూరితంగా,

వింటున్నవారి హృదయాల్ని భగ్గున మండించి ప్రతీకానికి పురికొల్పేలా ఉంటాయి. అందులోని ఒక వాక్యం:

"బ్రూటస్ నేనై, బ్రూటస్ ఆంటోని అయితె ఆ ఆంటోని, మీ ఉద్రేకాలని రెచ్చగొట్టి సీజర్ గాయాలలో, తలో నాలుకా ఉంచి రోమ్ నగర వీధుల్లో రాళ్ళని సహితం కదిల్చి తిరుగుబాటుకి, ప్రతీకారనికి పురిగొల్పదా!" అంటాడు ఆంటోని. ఆంటోనీ ఉపన్యాసం విన్న ప్రజలు ఉద్రేకపూరితులు కావడంతో సీజర్‌ను హత్య చేసిన కుట్రదారులు పారిపోతారు.

షెక్స్‌పియర్‌ను ప్రపంచ సాహితీ ప్రపంచంలో అజరామరం చేసిన ఆయన రాసిన నాల్గు విషాదాంత నాటకాలు. అవి: హామ్లెట్, ఒథెల్లో, కింగ్‌లీర్, మాక్‌బెత్. ఈ నాల్గు నాటకాల్ని బుచ్చిబాబు విశ్లేషించిన తీరు అద్భుతం. ఈ నాల్గు నాటకాల్లోని సారాన్నంతా బుచ్చిబాబు ఈ రచనలో చెప్పాడు. బుచ్చిబాబుకు "హామ్లెట్" నాటకం అంటే చాలా ఇష్టం. ఆయన రాసిన "చివరకు మిగిలేది" నవలలోని నాయకుడు దయానిధి హామ్లెట్ పాత్రలో తనను చూసుకొని ఆ నాటకాన్ని విశ్లేషిస్తూ పెద్ద వ్యాసం రాస్తాడు.

1600వ సంవత్సరం నుండి 1608వ సంవత్సరం మధ్యకాలంలో షేక్స్‌పియర్ ఈ విషాదాంత నాటకాలను రచించాడు.

హామ్లెట్ కథ గురించి క్లుప్తంగా: హామ్లెట్ డెన్మార్క్ దేశపు రాజకుమారుడు. మనసున్న మేధావి. తండ్రి చనిపోయాక అతని చిన్నాన్న క్లాడియస్ హామ్లెట్ తల్లిని పెళ్ళి చేసుకొని రాజవుతాడు. ఒకరోజు హామ్లెట్ తండ్రి దయ్యం రూపంలో హామ్లెట్‌కు కనిపించి తనను తన తమ్ముడే హత్యచేసి రాజయ్యాడని, అతని మీద నువ్వు ప్రతీకారం తీర్చుకోవాలని చెబుతాడు. అప్పట్నించి హామ్లెట్ వాళ్ళ చిన్నాయన క్లాడియస్‌ను చంపెయ్యాలనుకుంటాడు.

కానీ ఎన్ని అవకాశాలొచ్చినా క్లాడియస్‌ను చంపకుండా వదిలేస్తాడు. తల్లి గెర్ట్రూడ్ అంటే ఒకవైపు ప్రేమ, మరోవైపు ద్వేషం. తల్లి చిన్నాయనతో కలిసి కుట్రపన్ని తండ్రిని చంపించిందంటే నమ్మలేకపోతాడు. నిజంగా క్లాడియస్ - గెర్ట్రూడ్‌లు కలిసి తన తండ్రిని చంపారని రుజువయ్యాక కూడా వెంటనే క్లాడియస్‌ను చంపలేకపోతాడు. జీవితాన్ని గూర్చి, జీవితంలోని విషాదాన్ని గూర్చి అనేక వ్యాఖ్యానాలు చేస్తూ తాత్సారం చేస్తాడు. చివర్లో క్లాడియస్ పన్నిన కుట్ర కారణంగా హామ్లెట్ చనిపోతాడు. హామ్లెట్ తల్లి గెర్ట్రూడ్, చిన్నాయన క్లాడియస్‌లు కూడా చనిపోతారు. హామ్లెట్‌కు ఎన్నో అవకాశాలొచ్చినా చిన్నాయనను ఎందుకు చంపడు? అన్నది ఈ నాటకంలోని ప్రధాన సమస్య. ఎర్నెస్ట్‌జోన్స్ అనే ఫ్రాయిడ్ శిష్యుడు, ప్రముఖ మానసిక శాస్త్రజ్ఞుడు 'హామ్లెట్' నాటకాన్ని విశ్లేషిస్తూ హామ్లెట్‌లో ఈడిపస్ కాంప్లెక్స్ అనే మానసిక రుగ్మత ఉందని, ఆ కారణం చేతనే హామ్లెట్ చిన్నాయనను చంపకుండా తాత్సారం చేశాడని తేల్చాడు.

ఈడిపస్ కాంప్లెక్స్ అంటే తల్లిమీద విపరీతమైన ప్రేమ ఉండటం... అది కామపరమైన వాంఛ దాకా వెళ్ళడం. హామ్లెట్‌కు తల్లిమీదున్న విపరీతమైన ప్రేమ కారణంగానే... చిన్నాయన క్లాడియస్‌ను చంపితే ఆమె బాధపడ్తుందని క్లాడియస్‌ను చంపడానికి వెనకాడ్తాడు. "చివరకు మిగిలేది" నవలలో దయానిధిది కూడా ఇదే సమస్య. అందుకే దయానిధి హామ్లెట్‌లో తనను చూసుకుంటాడు. చాలామంది విమర్శకులేమంటారంటే షేక్స్‌పియర్ కూడా హామ్లెట్‌లో పూర్తిగా మమేకమయ్యాడని. ఆ పాత్రంటే అతనికి ఎనలేని అభిమానమని. షేక్స్‌పియర్ తన కొడుకుల్లో ఒక కొడుకుకు హామ్లెట్ అన్న పేరు పెట్టాడు.

హామ్లెట్‌లోని ఎన్నో తాత్వికాంశాలు మనల్ని తీవ్రంగా ఆలోచించేలా చేస్తాయి. ముఖ్యంగా హామ్లెట్ సుదీర్ఘమైన స్వగతాలు, ఈ నాటకాన్ని తాత్వికపరమైన నాటకంగా మార్చేశాయి.

"టు బి ఆర్ నాటు టుబీ" అన్న స్వగతం మనకు నిత్యజీవితంలో యేదైనా గడ్డు సమస్య ఎదురయినప్పుడు గుర్తొస్తుంది. కన్యాశుల్కం నాటకంలో గిరీశం చాలాసార్లు "టుబి ఆర్ నాట్టుబీ"ని గుర్తు చేసుకొని హామ్లెట్ పడ్డ అవస్తలో పడ్డామే అనుకుంటాడు. "టుబి ఆర్ నాట్ టుబీ"తో మొదలయ్యే స్వగతాన్ని బుచ్చిబాబు ఇలా అనువదించాడు.

"ఉండటమా? ఉండకపోవడమా? అదీ సమస్య. ఉండి ఈ లోకంలో సముద్రం అంతటి కష్టాలకు తట్టుకోవడమా? చచ్చి మనం ఊహించని పరలోకపు బాధల్ని భరించటమా? ఏది మంచిది?"

స్మశానంలో ఒక పుర్రెను చేతిలోకి తీసుకొని ఇలా అనుకుంటాడు హామ్లెట్:

***"అయ్యో... అయ్యో... ఇది ఓరిక్‌ది***
***నేను ఎరుగుదును... ఎన్ని తమాషాలు చేసేవాడు.***
***నన్ను వెన్నుమీద వేసుకొని తిప్పేవాడు.***

*ఎన్నోసారులు ముద్దిడిన*
*ఆ పెదవులు వేలాడుతున్నాయి.*
*నీ ఛలోక్తులు యేమయ్యాయి.*
*నీ ఆటలు, ఎగురుళ్ళ పాటలు*
*అందర్నీ నవ్వించే బూటకపు*
*కబుర్లు ఏవి. నిన్ను చూసి*
*వెక్కిరించేందుకు ఒక్కటీ లేదా"* ఇలా స్మశానంలో ప్రతి మానవుడు మట్టిలో కలిసిపోవడం గురించి తనలో తనే మధనపడ్డాడు.

*"రోమన్ చక్రవర్తి, సీజర్‌ను గురించి హామ్లెట్*
*సామ్రాజ్య చక్రవర్తి సీజర్ ప్రభువు*
*మట్టి అయితే గాలి చొరకుండా*
*కంతను నింపడానికి పనికొచ్చును"* అనుకుంటాడు.

ఈ హామ్లెట్ కథను రంగస్థలం మీద చూసినవారు హామ్లెట్ కోరినట్టుగానే అతని కథను బాధతో నిట్టూర్చి చెప్పుకుంటారు. ఆ తర్వాత అంతా నిశ్శబ్దమే!

'హామ్లెట్' నాటకాన్ని గూర్చి బుచ్చిబాబు ఇంకెన్నో విషయాలు చెప్పాడు. టి.ఎస్. ఎలియెట్ లాంటి విమర్శకులు హామ్లెట్ నాటకం గొప్ప నాటకం కాదన్న విషయం చెప్పాడు. ఇంకెందరో విమర్శకులు హామ్లెట్ నాటకాన్ని గూర్చి యేం చెప్పారో కూడా చెప్పాడు. హామ్లెట్ తన చిన్నాయనను చంపడంలో అంత జాప్యం ఎందుకు జరిగిందన్నదాని మీద చాలామంది చాలా సిద్ధాంతాలు చేశారని, కాని తన దృష్టిలో అదంత చర్చించాల్సిన విషయమేమీ కాదని, హామ్లెట్ ఒక ఆదర్శ పురుషుడు కాబట్టి, హింసకు వ్యతిరేకి కాబట్టి ఈ జాప్యం జరిగిందని తాను అభిప్రాయపడ్తున్నా నంటాడు బుచ్చిబాబు.

షేక్స్‌పియర్ రాసిన విషాదాంత నాటకాల్లో మరో ముఖ్యమైన నాటకం "ఒథెల్లో". భార్య పరపురుషునితో సంబంధం పెట్టుకున్నదన్న అనుమానంతో ఒథెల్లో తన భార్య డెస్డిమోనాను చంపేయడం ఈ నాటకంలోని ప్రధాన కథ. అప్పటి నుండి ఇప్పటి వరకు మన సమాజంలో అనుమానంతో భార్యను హత్య చేసే సంఘటనలు ఎన్నో జరుగుతూనే ఉన్నాయి. నిజానికి ఒథెల్లో భార్య డెస్డిమోనాకు భర్తే ప్రపంచం. అతన్ని అమితంగా ప్రేమించింది. అతడూ ఆమెను గాఢంగా ప్రేమించాడు. అయినా ఇయాగో అనే వాడి మాటలు, చూపించిన బూటకపు రుజువులు నమ్మి ఒథెల్లో అత్యంత పవిత్రురాలైన డెస్డిమోనాను చంపేశాడు. వాస్తవమేమిటో తెలిశాక ఒథెల్లో విపరీతమైన అపరాధ భావనకు లోనై అతడూ చనిపోతాడు.

పరిహాసం, వక్రోక్తి – ఒథెల్లో నాటకంలో సంఘటనలకు పదునిస్తాయంటాడు బుచ్చిబాబు.

షేక్స్‌పియర్ రాసిన మరో గొప్ప విషాదాంత నాటకం "కింగ్ లీర్". కూతుళ్ళ మీది పిచ్చి ప్రేమతో తన జీవితాన్ని నాశనం చేసుకున్న ఓ రాజు కథ యిది. భారతీయుల సెంటిమెంట్‌కు ఈ కథ చాలా దగ్గర. కొందరు విమర్శకులు షేక్స్‌పియర్ రచనలన్నింటిలోనూ "కింగ్ లీర్" నాటకమే గొప్పదన్నారు. ఎందుకంటే "కింగ్‌లీర్" తన అవసానదశలో మానవ జీవితాన్ని గూర్చి చెప్పిన కొన్ని మాటలు ఈ నాటకాన్ని అత్యున్నత స్థాయికి చేర్చాయంటారు. తెలుగులో చాలాకాలం క్రితం విడుదలయిన 'గుణసుందరి కథ' పేరుతో వచ్చిన సినిమా కథకు కింగ్ లీరే ఆధారం.

కింగ్ లీర్ అనే రాజు తన ముగ్గురు కూతుళ్ళను పిలిచి మీరు నన్ను అధికంగా ప్రేమిస్తారా? లేక మీ భర్తల్ని అధికంగా ప్రేమిస్తారా? అని అడుగుతాడు. పెద్ద కూతుళ్ళిద్దరు మిమ్మల్ని మా భర్తలకంటే అధికంగా ప్రేమిస్తున్నా"మంటారు. చిన్న కూతురు కార్డీలియా మాత్రం నాకు మీరు నా భర్త తర్వాతే అని నిజం చెబుతుంది. నేను "దురదృష్టవంతురాలని. అక్కలకి మల్లే నా గుండెను నోటిలోకి లాగలేను. నా శక్తి ప్రకృతిని బట్టి నిన్ను ప్రేమిస్తాను తండ్రీ. ఒక కూతురు తండ్రిని ఎంతవరకు ప్రేమించగలదో అంతవరకు ప్రేమించగలను" అని కూడా కార్డీలియా చెబుతుంది.

కార్డీలియా నిజం చెప్పిందని రాజు అనుకోడు. పెద్దకూతుళ్ళిద్దరే నిజం చెప్పారనుకుంటాడు కింగ్‌లీర్. అతని మీద నిజమైన ప్రేమ ఉన్నది చిన్నకూతురుకే అనే విషయం అతని బుర్రకు తట్టదు. పెద్దకూతుళ్ళిద్దరికి తన రాజ్యం ఇచ్చేసి చిన్నకూతుర్ని దేశం నుండి బహిష్కరిస్తాడు. త్వరలోనే అతని పెద్దకూతుళ్ళు అతని రాజ్యాన్ని కాజేసి అతన్ని జైళ్ళో పెట్టారు. పెద్దకూతుళ్ళిద్దరూ అతన్ని మోసం చెయ్యడంతో షాక్‌కు గురైన లీర్ పిచ్చివాడైపోతాడు. చివరికతన్ని చిన్న కూతురే ఆదుకుంటుంది. లీర్ చిన్నకూతురు కార్డీలియాను కలుసుకున్నప్పుడు బాధతో కుమిలిపోతూ "నన్ను ఆక్షేపించకు బిడ్డా! నేను వెర్రివాణ్ణి. చపలమైన వృద్ధుణ్ణి. నన్ను అగ్ని చక్రాలకి కట్టేశారు. నా కన్నీరే సీసం కరిగినట్లు కరిగి నన్ను

కాలుస్తోంది” అంటూ తీవ్రమైన ఆవేదనకు గురవుతాడు. లీర్ జీవితం అత్యంత విషాదంగా ముగుస్తుంది. అతని చిన్నకూతురు కార్డిలియాను ఆమె శత్రువులు ఉరితీస్తారు. ఇంకా బతికి ఉందనే భ్రమతో లీర్ కూతురి శవాన్ని ఎత్తుకొని తిరుగుతాడు. చివరకు లీర్ కూడా చనిపోతాడు.

లీర్ కథను చదివాక తనకు రామాయణంలోని దశరథుడు గుర్తొచ్చాడంటాడు బుచ్చిబాబు.

షేక్స్‌పియర్ రచించిన మరో గొప్ప విషాదాంత నాటకం “మేక్‌బెత్”. రాజుకు ఎంతో విశ్వాసపాత్రుడుగా ఉంటున్న సైన్యాధ్యక్షుడు మేక్‌బెత్‌కు తనే రాజునైపోవాలన్న కోరిక కల్గుతుంది. అతడు, అతని భార్య కలిసి రాజు డంకన్‌ను వాళ్ళింటికి భోజనానికి పిలిచి చంపేస్తారు. తర్వాత మేక్‌బెత్ రాజవుతాడు. కానీ త్వరలోనే డంకన్‌రాజు కొడుకులు అతని మీద ప్రతీకారం తీర్చుకుంటారు.

రాజ్యకాంక్ష అనేది– అంటే పైకెగసి పోవాలన్న పిచ్చి కాంక్ష ఒక వ్యక్తి పతనానికి ఎలా దారితీస్తుందో మేక్‌బెత్ నాటకం తెలియజేస్తుంది. అలాగే పురుషుల్ని చెడు పనులవైపు స్త్రీలెలా మళ్ళిస్తారో కూడా ఈ నాటకంలో మనం చూస్తాం. నిజానికి మేక్‌బెత్ మంచివాడే. రాజుకు అత్యంత విశ్వాసపాత్రుడే. రాజుకావాలన్న కోరిక అతని పతనానికి కారణమౌతుంది. ఎంతో మంచివాళ్ళు కూడా వాళ్ళళ్ళో తలెత్తే పైకెగిసిపోవాలన్న కోరిక వాళ్ళనెలా పతనం చేస్తుందో ఈరోజుల్లో కూడా మనం చూస్తూనే ఉన్నాం.

అపరాధ భావనతో కుమిలిపోతూ మేక్‌బెత్ "Life is a tale told by an idiot full of sound and fury signifying nothing" అనుకోవడం – జీవితంలో మనం చేసిన తప్పుల్ని గుర్తుచేసుకుంటూ ఇలా అనేకమంది అనుకోవడం అన్ని కాలాల్లోనూ జరుగుతూనే ఉంది.

మేక్‌బెత్ మంచివాడే. శూరుడు, ధీరోదాత్తుడు. యోగ్యుడు. కానీ రాజ్యకాంక్ష అతన్ని పతనం చేసింది అంటాడు బుచ్చిబాబు. “చీకటి శక్తులు మనల్ని అథోలోకంలోకి ఈడ్చేటందుకే మనల్ని గూర్చిన నిజం చెబుతాయి”

‘‘ఇప్పటి భయం ముందునాటి ఊహలంత ప్రమాదకరమైనవి కావు”

మేక్‌బెత్ రాజును హత్య చెయ్యనా? వద్దా అని సంకోచిస్తూ వితర్కించే స్వగతాలు గంభీరమైనవి. మరుపురానివి అంటాడు బుచ్చిబాబు.

షేక్స్‌పియర్ రచించిన చరిత్రాత్మక నాటకం “ఆంటోని–క్లియోపత్ర” నాటకం కూడా గొప్ప విషాదాంత నాటకాల్లో చేరేదే.

గొప్ప వీరుడు ఆంటోనీ. జూలియస్ సీజర్ నాటకంలో కూడా ‘ఆంటోనీ’ ఒక ముఖ్య పాత్ర. సీజర్ హత్య జరిగాక రోమ్ ప్రజలనుద్దేశించి ఆంటోనీ మాట్లాడిన మాటలు– అంటే అతని ఆవేశపూరితమైన ఉపన్యాసం... సీజర్ హంతకులని గౌరవనీయులంటూనే వాళ్ళు సీజర్‌ను కుట్రపూరితంగా చంపి ప్రజలకెంత అన్యాయం చేశారో చెబుతాడు. అయితే సీజర్ చనిపోయాక అక్టేవియస్ సీజర్ రోమన్ సామ్రాజ్యానికి రాజవుతాడు. తర్వాత ఆంటోనీకి ఆక్టేవియస్ సీజర్‌కు విభేధాలు రావడంతో రోమన్ సామ్రాజ్యాన్ని ఇద్దరూ పంచుకుంటారు. ఈజిప్టు భాగానికి ఆంటోనీ అధిపతి అవుతాడు. ఈజిప్టుకు రాణి, అపూర్వ సౌందర్యరాశి అయిన క్లియోపాత్ర ప్రేమలో ఆంటోనీ పడిపోయి ఈజిప్టులోనే ఉండిపోతాడు. క్లియోపాత్రను ఇదివరకు జూలియస్ సీజర్ కూడా ప్రేమించాడు.

ఇద్దరు మహావీరులను తన అందంతో కట్టిపడేసిన ఘనత క్లియోపాత్రది. ఆక్టేవియస్ సీజర్‌తో జరిగిన యుద్ధంలో ఆంటోనీ ఓడిపోతాడు. అంతటి మహావీరుణ్ణి క్లియోపాత్ర ప్రేమ నిర్వీర్యుణ్ణి చెయ్యడంతో అతడు ఓడిపోయిన అవమానంతో ఆత్మహత్య చేసుకుంటాడు. అంతకంటె ముందే ఆక్టేవియస్ సీజర్ తనను ఖైదీని చేస్తాడనుకొని క్లియోపాత్ర కూడా పాముతో కరిపించుకొని చనిపోతుంది.

క్లియోపాత్ర మృతదేహాన్ని కౌగిలించుకొని ఆంటోనీ కూడా చనిపోతాడు. క్లియోపాత్ర చూపించిన ప్రచండమైన ఉద్రేకానికి, కామానికి ఆంటోనీ బలైపోయాడంటాడు బుచ్చిబాబు.

షేక్స్‌పియర్ రచించిన చారిత్రక నాటకాలన్నిటిలోనూ ఇదే ఉత్తమమైందని అనేకమంది విమర్శకులు భావించారు.

ఈ నాటకంలోని కొన్ని వర్ణనలు:

“మెరుగుపెట్టిన సింహాసనంవలె ఆమె కూర్చున్న నావ నీటిపై ధగధగ వెలిగిపోతూంది. మలచిన బంగారం నావ ముందుభాగం, తెరచాపలు ఎరుపు– వాటి పరిమళానికి గాలులు, ప్రేమజాడ్యానికి గురైనట్టు కూడా వెళ్ళాయి.”

క్లియోపాత్ర అందం గురించి: “గాలి ఊది ప్రకృతిలో శూన్యం యేర్పడుతుందన్న భయం లేకపోతే క్లియోపాత్రను

చూడ్డానికి ఆ గాలి కూడా వెళ్ళి, ప్రకృతిలో ఖాళీ ఏర్పరచి ఉండేది"

**చనిపోతున్నప్పుడు ఆంటోనీ ఫీలింగ్స్ :**

"చనిపోయాక పెండ్లికొడుకునై ప్రేయసి పక్కమీదకు వెళ్ళినట్లు జారుకుంటాను.

ఈజిప్టు దేశమా! నేను చనిపోతున్నాను. ఎన్నో వేల ముద్దులలో కడసారి ముద్దును నీ అధరాలపై ఉంచుతాను"

క్లియోపాత్ర పాము విషంతో చనిపోయే ఘట్టంలో పరిచారిక "కానివ్వు అమ్మా! వెలిగిన రోజు సమాప్తమైంది. ఇంక మనం చీకటికి సిద్ధపడాలి" అంటుంది. చనిపోయే ముందు క్లియోపాత్ర: "మృత్యువు కొట్టిన దెబ్బ బాధించినా కావాలనిపించే ప్రియుడు బుగ్గను మెలిపెట్టడం లాంటిది" ఇలాంటి మన హృదయాల్లో పలికే అద్భుతమైన మాటలెన్నో ఈ నాటకంలో ఉన్నాయి. "ఏంటోనీ-క్లియోపాత్ర" నాటకాన్ని ఎందరో విమర్శకులు గొప్ప విషాదాంత ప్రణయకావ్యంగా వర్ణించారు.

షేక్స్పియర్ రచించిన నాటకాల్ని ఎందరో వేనోళ్ళ పొగిడినా కొందరు ఘాటుగా విమర్శించటం కూడా జరిగిందన్న విషయాన్ని బుచ్చిబాబు చెప్పాడు. షేక్స్పియర్ నాటకాల్లో నైతిక విలువలు లేవని టాల్స్టాయ్ విమర్శించాడు. ప్రతీకారం అనే ముఖ్య ఉద్దేశ్యంతో రచించబడిన హామ్లెట్ నాటకం గొప్ప నాటకం కావడానికి వీల్లేదన్నాడు టి.ఎస్. ఎలియట్. షేక్స్పియర్ కంటె నేనే గొప్ప నాటకకర్తను. అతని నాటకాల్లోని కవిత్వంలో సంగీతం తప్ప మరే గొప్పతనం లేదన్నా"డు బెర్నార్డుషా. అలాగే షేక్స్పియర్ నాటకాల్లో వ్యక్తులు తప్ప సమాజం లేదన్నాడు షా. "ఎవడో ఎవత్తినో ప్రేమిస్తే అది చూడటానికి నేను మూడు గంటలు థియేటర్లో కూర్చోవలసిన అవసరం లేద"ని కూడా అన్నాడు.

ఇలాంటి విమర్శలు ఎన్ని ఎదురైనా షేక్స్పియర్ నాటకాలు బతికాయి. ఆయన జన్మించి 450 సంవత్సరాలు గడిచిపోయినా ఆయన సృష్టించిన పాత్రలు, ఆ పాత్రలు మాట్లాడిన మాటలు, ఆయన సృష్టించిన ఉపమానాలు, పదబంధాలు, మానవుడి మనస్తత్వాన్ని గూర్చి ఆయన చేసిన వ్యాఖ్యలు ఈనాటికి కూడా సజీవంగానే ఉన్నాయి. మనకు తెలియకుండానే మన దైనందిన జీవితంలో షేక్స్పియర్ సృష్టించిన ఎన్నో మాటల్ని, నానుడుల్ని, వ్యాఖ్యానాల్ని వాడుతూనే ఉంటాం. "టుబి నాట్టు బీ", "వాట్స్ ఇన్ ఎ నేమ్", "యాజ్‌యూ లైకిట్" లాంటి ఎన్నో జాతీయాలు మన దైనందిన జీవితపు భాషలో చేరిపోయాయి.

షేక్స్పియర్ విశ్వరూపాన్ని ఇంత చిన్న పుస్తకంలో కళ్ళకు కట్టినట్టు చూపించిన బుచ్చిబాబుకు తెలుగు పాఠకులెంతో రుణపడి ఉంటారు. షేక్స్పియర్ రచనల్ని ప్రత్యక్షంగా చదివి అర్థం చేసుకోలేని ఎంతోమంది సామాన్య పాఠకులకు ఈ పుస్తకం చదివితే సూక్ష్మంలో మోక్షంలా షేక్స్పియర్ రచనలన్నింటిని చదివిన అనుభూతి కల్గుతుంది.

తన మీద షేక్స్పియర్ ప్రభావం ఎంతో ఉందంటాడు బుచ్చిబాబు. అందుకు ఆధారంగా 'చివరకు మిగిలేది' నవలలోని కొన్ని కవితాత్మకమైన వాక్యాలను ఉదహరించి షేక్స్పియర్‌ను చదివి ఉండకపోతే ఈ వాక్యాల్ని ఇలా రాయగల్గేవాడిని కాదంటాడాయన.

కార్లైల్ అనే పండితుడు అన్నాడట- హిందూ సామ్రాజ్యం అంటే ఇండియా ఎల్లాగూ మన చేతిలోంచి జారిపోయింది. కానీ షేక్స్పియర్‌ని మాత్రం మేం వదులుకోలేం" అని.

బ్రిటిష్ సామ్రాజ్యమంతా ఒక ఎత్తైతే షేక్స్పియర్ సాహిత్య సామ్రాజ్యమంతా మరో ఎత్తవుతుందన్న అభిప్రాయం కల్గినవాళ్ళు ఈనాటికి చాలామందే వున్నారు.

ఆ మహా రచయితను తెలుగువాళ్ళకు ఇంత అద్భుతంగా పరిచయం చేసిన బుచ్చిబాబును తెలుగు పాఠకులెప్పుడూ మరచిపోలేరు.

ఈ సంవత్సరం బుచ్చిబాబు శతజయంతి ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా (14-6-2015 - 14-6-2016) ఆయన మనకిచ్చి పోయిన సాహిత్య సంపదను గుర్తుచేసుకోవడానికి ఈ వ్యాసం కొంచెమైనా ఉపకరిస్తుం దనుకుంటాను.



**అంపశయ్య నవీన్**
**(కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత)**
**వరంగల్లు, ఫోన్ : 99 89 29 12 99**

# మా నాన్న చెన్నారెడ్డి

శ్రీలు పొంగి చెలువారే పాలగిరి గ్రామం ఆనాడు కడప జిల్లా కమలాపురం తాలూకాలో ప్రముఖ స్థానం ఆక్రమించి వుండేది. బ్రాహ్మణులకు, కోమట్లకు, కాపులకు, దేవదాసీలకు, కుమ్మరి, చాకలి, మంగలి వాళ్ళకు ఒక్కొక్కరికి ఒక వీధి ప్రత్యేకంగా వుండేది. గ్రామ నడిబొడ్డున దాదాపు రెండెకరాల స్థలంలో వెలసి వున్న చెన్నకేశవస్వామి ఆ గ్రామ ఇలవేల్పు. ఆ దేవస్థానంలో ఆనాటి రాజులు క్రీ.శ. 1056 లో కృష్ణ II (కన్నడ), 1554 లో ఇమ్మడి నరసింహ, 1520 లో మహామండలేశ్వర రుచిరాజు బసవయ్యదేవ కుమారుని కాలం నాటి శిలాశాసనాలు ఉన్నాయి. పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమయ్య ఈ పాలగిరి గ్రామానికి వేంచేసి చెన్నకేశవస్వామిపై '**పాలగిరి రాయడా, పాలగిరి చెన్నా**' అంటూ కొన్ని పదకవితలు రచించాడు. 19వ శతాబ్దం ఆఖరు దశకంలోనే 3 ప్రాథమిక పాఠశాలలు వుండేవి. రెండు ప్రభుత్వ ఆదిఆంధ్ర, ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు. మూడవది ప్రభుత్వ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల. ఈ ఎయిడెడ్ పాఠశాలలో మా తండ్రి ఏడేళ్ళ వయసులో చేరి నాలుగవ తరగతివరకు చదువుకున్నాడు. ఆ రోజుల్లో హైస్కూలు చదువు 5వ క్లాసుతో ప్రారంభమయ్యేది. ఊళ్లో చదువు 12వ సంవత్సరాల వయస్సుకంతా పూర్తయింది. 20 సంవత్సరాల వయస్సు వరకు ఆయన వ్యవసాయ పనులు, సొంతంగా నాగలి పట్టడం, విత్తడం, కపిల తోలడం, బండి తోలడం మొదలైనవి చక్కగా చేసేవాడట. విత్తనం వేస్తే మొలిచిన తర్వాత ఆ చాళ్ళు వంకర లేకుండా సమాంతర సరళరేఖల మాదిరి వుండేవని ఆయన సమకాలీన పెద్దలు చెపుతూవుంటే పాఠశాల రోజులలో విన్నాను.

మధ్యాహ్నానికంతా వ్యవసాయ పనులు ఆపేస్తారు. తరువాత చాలమంది యువకులు చెన్నకేశవ దేవాలయ ప్రాంతంలో ఎత్తాట (చిళ్ళ పెంకుపై రెండు రాగి కానులు వుంచి ఎగరేస్తే రెండూ బొమ్మలు పడతాయా లేక బొరుసులు పడతాయా అని పందెం కట్టడం) ఆడేవారు. మా తండ్రికి కూడా ఇది బాగా అలవాటయింది. తల్లి మందలించినా పట్టించుకునేవాడు కాదు. క్రీ.శ. 1930 ప్రాంతాల దీనిని పెద్ద దురలవాటనేవారు. మగ దిక్కులేని సంసారమయినందున మా తండ్రి ఒక రకంగా జులాయిగా పెరిగినట్టే లెక్క. మా తండ్రి ఆయన అమ్మ, అమ్మమ్మల లాగా దబ్బ పండు చాయతో మంచి రూపవంతుడు. 22 ఏళ్ళ ప్రాయంలో మా అమ్మ ఓబులమ్మతో పెండ్లి జరిగింది. ఆయన ప్రతిరూపం తన రెండు, నాలుగో (సత్యనారాయణ రెడ్డి, ప్రభాకర రెడ్డి) సంతానాల్లో కనిపిస్తుంది.

క్రీ.శ.1930 ప్రాంతాల్లో ఆయనకు చదువు చెప్పిన ఆ స్కూలు మేనేజ్‌మెంటు టీచరు, ముతుకూరు పెద్ద పాలేటిరెడ్డి గాలికి తిరిగే మా తండ్రిని పిలిపించి ఒక తరగతికి రోజూ తన బదులుగా బోధించమని సొంత పనులు చూసుకొనేవాడు. ఒకరోజు స్కూళ్ల డిప్యూటీ ఇన్‌స్పెక్టరు ఆకస్మిక తనిఖీకి వచ్చి మా తండ్రి బోధనకు ఆశ్చర్యపడి లోయర్ గ్రేడ్ సర్టిఫికెట్‌కు అర్హుడని వ్రాసి యిచ్చాడు. ఆరోజుల్లో స్కూళ్ల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లకు ఆ అధికారముండేది. ఆ సర్టిఫికెట్ ఆధారంతో ఆయన అక్కడ కొన్ని సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. నెలకు ఐదు రూపాయల జీతమిచ్చేవారు. నేనా సర్టిఫికెట్ జె.ఇ గా వుండగా చూశాను. నేను కూడా అదే మేనేజ్‌మెంట్ పాఠశాలలో 5వ తరగతి వరకు చదువుకున్నాను. మా తండ్రికి చదువు చెప్పిన మేనేజ్‌మెంట్ టీచరుగారి చిన్న కుమారుడు గంగిరెడ్డి, మా తండ్రి వద్ద చదువుకున్న ఒక విద్యార్థి, అప్పుడా స్కూలుకు ప్రధానోపాధ్యాయులుగా ఉండేవాడు. ఈ విషయాలన్నీ ఆయన నేను ఇంజనీరునైన తరువాత నాకు తెలిపాడు. మా తండ్రి నెల జీతం తీసుకొని సంతకం చేసివున్న కాగితాలు కూడా నేను చూశాను.

మా నాన్న రామాయణ భారత భాగవతాది కావ్యాలకు ప్రతిపదార్థ తాత్పర్యాలు చక్కగా చెప్పగలిగేవాడు. విద్వాన్ పరీక్ష వ్రాసే హయ్యర్ గ్రేడ్ టీచర్లకు ఆనాటి ఒక పాఠ్యపుస్తకం శ్రీనాథకవి విరచిత శివరాత్రిమాహాత్మ్యం. ఆయన వారికది అప్పుడప్పుడు బోధించడం నేనెఱుగుదును.

ఆ వయస్సులో వెన్నెరాత్రులలో నన్ను మా నాన్న తన పొట్టపై పడుకోబెట్టుకుని నాకు చిన్న చిన్న కథలు చెప్పేవాడు.

ఆ కథలు వింటూ నేను ఆకాశంలో చుక్కలు చిన్నవిగా వున్నాయి మరి చంద్రుడేమో చాలా పెద్దగా ఎందుకున్నాడు లాంటి ప్రశ్నలు వేసేవాడినట. ఆయన ఏం చెప్పేవాడో నాకు గుర్తులేదు. ఆయనకు నేనంటే అమితమైన అనురాగమని మాత్రం నాకు గుర్తు. స్కూలుకు వెళ్ళేటప్పుడు నన్ను వేలు పట్టుకుని నడిపించుకుంటూ, నడవలేనప్పుడు ఎత్తుకుని స్కూలుకు వెళ్ళి మేజా మీద కూర్చోబెట్టి విద్యార్థులకు పాఠాలు చెప్పేవాడు. ఆనాటి చదువులో తెలుగు, గణితం ముఖ్య భాగాలుగా వుండేవి. ప్రకృతి శాస్త్రము, లోకజ్ఞానం చూచాయగా చెప్పేవారట. రాత్రి ఆయన తన మీద పడుకోబెట్టుకున్నప్పుడు అడిగేవాడట – నాయనా! ఈ రోజు అక్కా వాళ్ళకు ఏ పద్యం చెప్పినాను? చెప్పగలవా? – అనేవాడట. నేను 'ఓయమ్మ నీ కుమారుడు' అనే పద్యం వచ్చీరాని మాటలతో చెప్తే వూరీవూరని వూరగాయ రుచి అనుభవించే వాడినని నాకు చెప్పాడు.

మా నాన్న ఉదయం ఏడు గంటల వేళ రోజూ మా మల్లెపూల తోటలో చెట్లు తవ్వడానికి వెళ్ళేవాడు. ఆ తోట ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఏటి గట్టున వుంది. కపిల తోరణానికి ఒక చిన్న చుట్టుబావి వుంది. నాకప్పుడు ఐదేళ్ళ వయస్సు వుంటుంది. ఓ రోజు ఆయన వెళుతూ వుంటే నేను వెంట పడ్డాను. నడిచినంత వరకూ నడిపించి, తర్వాత ఎత్తుకున్నాడు. త్రవ్వకం పది గంటల వరకు చేసి తిరిగి వస్తూ దారిమధ్యలో వున్న కల్లు గుడిసెలో మూడు ముంతల ఈత కల్లు – ఒక కానీ – కొని ఆయన రెండు ముంతలు తాగి నాకు ఒక ముంత తాపేవాడు. అక్కడ పనిచేసే వాళ్ళందరూ కూడా ఇలాగే తాగేవాళ్ళు. రుచి మరిగిన నేను రోజూ మా నాన్న వెంటపడేవాడిని. మా అమ్మ వారించినా మా నాన్న తీసుకెళ్లేవాడు. 'నాకొక చిన్న పారుకోల చేయించు నేను కూడా తవ్వుతాన'ని మా నాన్నతో పట్టుపట్టాను. ఆయన నవ్వుకుంటూ చిన్నది ఒకటి చేయించి ఇచ్చాడు. ఇద్దరమూ వెడతాము. ఆయన రోజుకు 20 పాదులు త్రవ్వుతాడు. నేనేమో ఒక పాదు దగ్గరనే గీకుతూ వుంటాను. ఇంటికి వెళ్ళే సమయమప్పుడు ఆయన నా దగ్గరకు వచ్చి ఎంత చక్కగా తవ్వినావయ్యా ఇంక చాలు, వెళదాము రా అనేవాడు. దారిలో కల్లు త్రాగి ఇంటికి వచ్చేవాళ్ళం. కల్లు త్రాగాలనే కాంక్షవున్న నాకు పాదులు త్రవ్వుతాననడం ఒక సాకు మాత్రమేనని మా నాన్నకు తెలుసు. అయినా ఆయన నా కోరిక మన్నించేవాడు. ఆయన జీవించిన 59 సంవత్సరములలో నా కోరికకు ఎప్పుడూ అడ్డు చెప్పని గొప్ప ప్రేమగల తండ్రి. ఆయన ఇచ్చిన స్వాతంత్ర్యాన్ని నేను కూడా ఆయన జీవిత కాలంలో ఎప్పుడూ దుర్వినియోగం చేయలేదు.

మా ఇంట్లో ఒక తాళపత్ర గ్రంథం ఉండేది. దాన్ని మా నాన్న అప్పుడప్పుడు చదివి అటక మీద పెడుతుండేవాడు. ఆ అటక క్రింద ఒక చెక్కరెక్కలు గల గూడు లాంటి చిన్న అలమారు వుండేది. నేను ఆ అలమారు రెక్క పట్టుకుని ఒక కాలు గూట్లోపెట్టి ఆ గ్రంథంలో ఒక తాటాకు తీసుకుని దాన్ని దాదాపు మూడు ముక్కలు చేసి, మరో ఇద్దరు స్నేహితులతో చొప్పదంటుకు ఒక తుమ్మ ముల్లు ఆ తాటాకుకు గుచ్చి గాలికి ఎదురుగా పరుగెత్తితే ఆ తాటాకు గిర గిరా తిరుగుతూ వుంటే ఎంతో ఆనందించే వాణ్ణి. తరువాత ఎపుడో మా నాన్న ఆ తాళపత్ర గ్రంథం చదువు కుందామని తీస్తే దాంట్లో 20 ఆకులు లేవు. మా అమ్మనడిగితే విషయం చెప్పింది. మా నాన్న 'ఎంతపని చేసినావయ్యా! ఈ తాళపత్ర గ్రంథం అచ్చయిందో లేదో తెలీదు. వావిళ్ళ వారికి పంపి తెలుసుకుందామనుకున్నాను. నీవేమో 20 ఆకులు తినేసావ'న్నాడు. 'నాకీవిషయం తెలియదుకదా!' అన్నాను. మా నాన్న నన్ను దండించలేదు. మా నాన్న దగ్గర వావిళ్ళవారి రామాయణ, భారత భాగవతాలు, ఉత్తరరామాయణం, విజయవిలాసం, మనుచరిత్ర మొదలగు అన్ని ప్రబంధాలు వుండేవి. పైగా ఆయన వెంకట పార్వతీశ్వర కవుల 'ఆంధ్ర గ్రంథమాల' ప్రచురణలన్నీ తెప్పించేవాడు. ఇంకా కొవ్వలి, జంపన, చలం వారి రచనలు కూడా తెప్పించుకునేవాడు. ఇంట్లో వున్నప్పుడెప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూ వుండేవాడు. వూరక చదువుతూ కూర్చోకపోతే, సంపాదన వచ్చే మరోపనేదైనా చేయవచ్చుకదా అని చికాకు పడేది మా అమ్మ.

మా తండ్రి ఉపాధ్యాయ వృత్తి మానేసిన తర్వాత వేరుశనగ కాయలు కమిషన్‌పై సేకరించడానికి వూరూరా తిరిగేవాడు. దాదాపు 15 రోజులు వూళ్ళో వుండేవాడు కాదు. అప్పుడు జరిగిన ఒక సంఘటన వివరిస్తాను. ఆ రోజు నేను ఉదయం ఆలస్యంగా నిదుర లేచేటప్పటికి కొందరు ఆడవాళ్ళ గుంపు మాయింట్లో సందడి చేస్తూంది. వాళ్ళు నా కొక బుల్లి తమ్ముడు పుట్టాడన్నారు. నాకు బాగా గుర్తు – వాళ్ళలో నే నభిమానించే ఒక ముసలామె పేరు రామక్క. నేనామెను 'జేజి' (నాయనమ్మ) అని ఇష్టంగా పిలిచే వాణ్ణి. "వీడు తెల్లగా, ముద్దుగా ఉన్నాడు, నీలాగ కర్రిగా లేదు" అన్నదామె. నాకు

ఉక్రోషం వచ్చింది. “ఇప్పుడు ముగ్గురం ఉన్నాం కదా! ఇంకొకడెందుకూ ?” అన్నాను. అక్కడున్న వాళ్ళంతా ఫక్కున నవ్వారు. మా తండ్రి యిళ్ళు చేరేటప్పటికి ఆ నవజాత శిశువుకు ‘పాలేటి రెడ్డి’ అని నామకరణం చేశారు వాళ్ళు. ఇంటికి రాగానే మా తండ్రి వాళ్ళను తిట్టి “నా కొడుక్కు పేరు పెట్టడానికి మీ రెవరు? ఏ అధికారంతో పేరు పెట్టారు? వీడు ప్రభాత సమయాన పుట్టాడు కాబట్టి ‘ప్రభాకర రెడ్డి’ అని పేరు పెడుతున్నాను. మీరంతా నోరుమూసుకొని ఉండండి” అని అన్నాడు. ఆ కాలంలో అంత అర్థవంతమైన, అందమైన పేరు పెట్టడం విశేషం. ఎక్కువగా తమ పూర్వీకుల పేర్లు, ఎంత మొరటువైనా పెట్టేవాళ్ళు తమ సంతానానికి.

తను వూళ్ళో లేనపుడు నన్ను మా అమ్మ ఏమైనా అన్నదంటే మా నాన్న ఏ మాత్రం సహించేవాడు కాదు. మా వూళ్ళో మొలకల పౌర్ణమికి పొడవైన వెదురు కఱ్ఱకు చివర వివిధ రకాలైన అలంకారాలు చేసి (కోటప్ప కొండ ప్రభలలాగ) వాటిని వూరేగించేవారు. ఒకసారి నేను ఒక వెదురుగడ తీసుకుని ఇంటికి వచ్చినపుడు ఇంట్లో గోడకు వున్న ఒకే ఒక పటం – శ్రీకృష్ణుడు – కు అది తగిలి కిందపడి పగిలిపోయింది. నాకప్పుడు దాదాపు 6 సంవత్సరాల వయసుంటుంది. మా అమ్మకు కోపం వచ్చి చొప్పదంటు తీసుకుని నాలుగు దెబ్బలేసి వూరి చివర వుండే శివాలయంలో చదువు చెప్పే భట్రాజు దగ్గర నెలకు నాల్గణాల జీతంపై చదువు చెప్పమని వదిలింది. మా తండ్రి వూరునుండి వచ్చిన వెంటనే నన్ను చూడడం ఆయనకు అలవాటు. మామూలుగా నేను కనిపించకుంటే ఎక్కడని మా అమ్మను అడిగాడు. ఆమె విషయం చెప్పింది. నీకు వాని విషయంలో జోక్యం చేసుకోవద్దని ఎన్నిసార్లు చెప్పానని కోపపడి సరాసరి నా దగ్గిరకి వచ్చాడు. ‘ఏమయ్యా! నీకు చదువుకోవాలని వుందా?’ అన్నాడు. ‘అవును! ఈయన బాగా చదువు చెపుతాడు. చూడు కావాలంటే అని అమరకోశంలోని మొదటి శ్లోకం –

*‘యశ్య జ్ఞాన దయాసింధో రగాధస్యా నఘాగుణః,*
*సేవ్యతా మక్షయో ధీర సశ్రితైచా మృతాచః’*

అని ముద్దు ముద్దు మాటల్లో చెప్పాను. ఆయన ‘ఈ చదువు ఈ రోజులలో పనికిరాదయ్యా, ఇంగ్లీషు చదువు కావాలి, పద. నేను చదువుకున్న స్కూలులో చేర్పిస్తాను’ వివరించిన మా తండ్రి గురువుగారి చిన్న కుమారుడు గంగిరెడ్డి టీచర్, పైగా తన శిష్యుడు, ఆ స్కూలు హెడ్మాస్టర్ దగ్గరకు తీసుకుని వెళ్ళి విషయం చెప్పాడు. సరే మామా! నేను చూచుకుంటానులే అన్నాడాయన. 1వ తరగతిలో రెండు నెలలు మాత్రమే వున్నాను. రెండవ తరగతిలో కూడా రెండు నెలలే. మూడవ క్లాసులో మాత్రం సంవత్సరమంతా ఉన్నాను. ఒక సమర్థుడైన ఉపాధ్యాయుడు రామసుబ్బన్న నన్ను తీర్చిదిద్దాడు. తరువాత ఆయన వీరప్పనాయుని పల్లెలో ఒక ఎయిడెడ్ మేనేజిమెంట్ స్కూలుకు అనుమతి తీసుకుని దానిని హైస్కూలు, జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, పోస్టుగ్రాడ్యుయేట్ కాలేజీలుగా తీర్చి దిద్దాడు. ఆయనను ఉత్తమ ఉపాధ్యాయుడుగా భారత ప్రభుత్వం గుర్తించి సత్కరించింది.

ఒకసారి నేను మా నాన్నతో ‘మొదటి, మూడవ తమ్ముళ్ళు నీలాగ అందంగా వున్నారు. నేనెందుకు నల్లగా పుట్టానని’ అడిగాను. మా నాన్న ‘నలుపు నారాయణుడు మెచ్చు, శ్రీకృష్ణుడు, శ్రీరాముడు నల్లగా లేరా? ఎఱ్ఱగా వుండగానే సరిపోయిందా? అందంగా వుండొద్దూ. నీతో పోలిస్తే వారి అందం తీసికట్టు. అయినా భగవంతుడిచ్చిన రూపాన్ని ప్రశ్నించకూడదు నాయనా. నీవు మూడు నెలల వయస్సులో విరేచనాలతో చనిపోయావని అందరూ అన్నా ఆరుమైళ్ళ దూరంలో గల గంగిరెడ్డి పల్లె గవర్నమెంటు RMP ఆస్పత్రికి తీసుకెళ్ళి రెండు నెలలు మీ అమ్మ, మా అమ్మ, మీ అవ్వ, నేను వుండి బతికించుకున్నాము. బహుశ మమ్మల్ని ఉద్ధరించడానికేనేమో నీవు బతికి బట్టకట్టావు. కాలం మాత్రమే దీనికి తీర్పు చెప్పాలి’ అన్నాడు. ఆయన చెప్పింది నాకు పూర్తిగా అర్థం కాలేదు కానీ నేను మిగతా తమ్ముళ్ళ కంటే అందంగా వున్నానని అన్నాడని అనుకున్నాను.

మరొకసారి “పుల్లారెడ్డి అనే నా పేరు ఏమీ బాగాలేదు. తమ్ముళ్ళకేమో సత్యనారాయణరెడ్డి, నీలకంఠారెడ్డి, ప్రభాకరరెడ్డి అని మంచి పేర్లు పెట్టావు. నాకు కూడా పెట్టాల్సిందేనని మా నాన్నతో పట్టుబట్టాను.” “పుల్లారెడ్డి అంటే పుల్లయ్యస్వామి పేరు నాయనా! నీకాపేరు పెట్టినందువల్లే తమ్ముళ్ళు ముగ్గురూ బ్రతికార’’న్నాడు. అయినా నేను పట్టువదలక పేరు మార్చాల్సిందే నన్నాను. “అయితే నీకేపేరు ఇష్టమ”న్నాడు మానాన్న. “అమరనాథరెడ్డి అనే పేరు పెట్టుకుంటాన”న్నాను. “సరే, స్కూలుకు వెళ్ళి మార్పిద్దాం పద” అని “గంగిరెడ్డి హెడ్మాస్టరు దగ్గరకు తీసుకెళ్ళి విషయం చెప్పాడు” మానాన్న. హెడ్మాస్టరు “జాబితా Inspector of Schoolsకు పంపాము, ఇక మార్పు చేయలేమని చెప్పి, తల్లిదండ్రులు బాగా ఆలోచించి పెట్టిన పేరు బాగాలేదనడానికి నీకు బుద్ధిలేదూ!” అని నన్ను తిట్టాడు. అంతే! పుల్లారెడ్డి అనే పేరుతోనే బ్రతుకు

వెళ్ళబుచ్చుతున్నాను. ఇప్పుడు పుల్లారెడ్డికి చక్కెర వ్యాధి కూడా! నేను పాలగిరిలో చదువుకునే కాలంలో ప్రతి కుటుంబంలోని ఆడపిల్లలకు ఐదో క్లాసు వరకు తప్పక చదువు చెప్పించేవారు. మా అమ్మ కాలంలో ఆ పద్ధతి వున్నట్టు లేదు. అందువల్ల ఆమె నిశానీగానే మిగిలిపోయింది. మూడవ క్లాసులో నాతోపాటు పదిమంది ఆడపిల్లలు వుండేవారు. నాకు ఎనిమిదేళ్ళు వచ్చేవరకు – మూడవ తరగతిలో కూడా – మా అమ్మ నాకు చక్కగా జడవేసి రిబ్బను పెట్టి మల్లెపూలు తురిమి స్కూలుకు పంపుతుండేది. ఒకరోజు ఏమైందోమరి ఆడపిల్లలందరూ 'నీకు జడ వుంది. పూలు పెట్టుకున్నావు కాబట్టి నీవు ఆడపిల్లవు. మా పక్కన కూర్చోమని' ఎగతాళి చేసారు. దానికి నేను క్లాసులో ఫస్ట్ రావడం కారణమేమో? ఇంటికి వచ్చి మా అమ్మతో జడ కత్తిరిస్తేగాని స్కూలుకి పోనని మొరాయించాను. "బ్రతికి బట్టగట్టిన వాడివి నీవొకడివే కాబట్టి నీ వెంట్రుకలు తిరుపతి వెంకటేశ్వరస్వామికి ఇస్తామని మొక్కుకున్నాము. అందువల్ల అక్కడికి వెళ్ళి తీయిస్తా"మంది. నాకు చిర్రెత్తుకొచ్చి "సరే! అక్కడికి వెళ్ళి తిరిగొచ్చేంతవరకు స్కూలుకు వెళ్ళ"నన్నాను. రెండు రోజులు స్కూలుకు పోలేదు. ఇంతలో మా నాన్న కమిషన్ వ్యాపారం చేసే ఒక గ్రామం నుండి తిరిగి వచ్చాడు. విషయం తెలుసుకుని వెంకటేశ్వర స్వామి పటం పెట్టి మంగలిని పిలిపించి తల నీలాలు తీయించాడు. మా అమ్మ ఏదో అనబోయింది. మా నాన్న "భగవంతుడు లేని చోటు ఎక్కడుంది? అన్ని చోట్లా, అన్ని వేళలా వున్నాడు. ఏం ఫరవాలేదు. ఆయన అర్థం చేసుకోగలడని" సముదాయించాడు.

పాలగిరిలో వుండగా ఎత్తాట కాలం చెల్లిపోయింది. దానికి బదులుగా పేకాట – 12 ముక్కల దౌను, నవరసం, 304, మణిఆఫ్, మంగత్తై వచ్చాయి. మా తండ్రి బలహీనతలో ఇవన్నీ చోటుచేసుకున్నాయి. పేక బాగా ఆడేవాడు. గెలిచినపుడు ఐదు వేళ్ళకు ఐదు వుంగరాలు పెట్టుకునేవాడు. ఒకసారి అకస్మాత్తుగా ఆయనకు పక్షవాతం వచ్చింది. బహుశ ఇది 1946లో కావచ్చు. ఊళ్ళో చాలమంది పెద్దలు వచ్చి చూశారు. నా వయస్సు అప్పుడు 8 సంవత్సరాలుండవచ్చు. చూడడానికి వచ్చినవారిలో మా చిన్నాయన కూడా ఒకరు. ఆయన మా నాన్నను అడిగిందల్లా ఐదు వుంగరాలూ ఎక్కడ తాకట్టు పెట్టావు? ఎక్కడ ఉన్నదీ మానాన్న చెప్పాడు. ఆయన ఐదు వుంగరాలూ విడిపించుకుని కూతురుకు నగ చేయించుకున్నాడు. అంతే కాని అన్నకిలా వుందే చికిత్స చేయించాలన్న ఆలోచనే లేకుండా వెళ్ళిపోయాడు. ఇంట్లో ఒక రూపాయి కూడా లేదు. అప్పుడు దేవుడు పంపించినట్లు లక్కిరెడ్డి చెన్నారెడ్డి, ఎరమలపల్లె, పాలగిరి మజరాగ్రామం రెడ్డి (V.M.) విషయం తెలుసుకుని స్వయంగా బండి తెచ్చి రోగిని ఎక్కించి ప్రొద్దుటూరుకు తీసుకువెళ్ళి బాగుచేయించాడు. అక్కడి డాక్టర్లు మా నాన్నను రోజూ మూడు ఔన్సులు బ్రాంది త్రాగమని చెప్పారు. అవి ప్రొహిబిషన్ రోజులు. మా వంటి పేద వారికి బ్రాందీ ఎక్కడ దొరుకుతుంది? అది క్రమంగా నాటు సారా త్రాగడానికి దారి తీసి ఆయన్ను విపరీతమైన త్రాగుడుకు బానిసను చేసింది. కాని పేకాట మాత్రం మానేశాడాయన.

పాలగిరిలో దాదాపు 65 ఏళ్ళ వయసు గల ఊటుకూరు నాగిరెడ్డి అనే ఒక మంచి విజ్ఞుడు ఉండేవాడు. చక్కని సలహాలిస్తాడు. పంచాయతి న్యాయంగా చేస్తాడని ప్రతీతి. భూస్వామి. ఆయనకు మా తండ్రి మంత్రిలాంటి వాడు. ఆయనను మా నాన్న చిన్నాయన అని పిలిచేవాడు. ఏదైనా ఆచరించాలంటే పథకంవేసి మా నాన్నతో ఆచరింపచేసేవాడు. అందుకు ఇదొక ఉదాహరణ. ఆ గ్రామంలో గాండ్ల వీరయ్య అనే ఆయన క్రమక్రమంగా ధనవంతుడైనాడు. ఏదో ఒక సందర్భంలో ఆయన అయాచితంగా ఊటుకూరి నాగిరెడ్డి మేనల్లుని – (రెడ్డి కులస్తులలో ఆ గ్రామంలో మొదటిసారిగా ఇంగ్లీషు చదువుకున్నందువల్ల ఆయనను ఇంగ్లీషు సుబ్బిరెడ్డి అనేవారు. తరువాత 1948లో వేంపల్లె బోర్డు హైస్కూలులో ఇంగ్లీషు సుబ్బిరెడ్డి, నాకు ట్యూషన్ చెప్పిన దేవిరెడ్డి గంగిరెడ్డి ఇద్దరూ నాకు III ఫారంలో ఉపాధ్యాయులు) అసభ్యంగా మాట్లాడాడట. నాగిరెడ్డి విషయం తెలుసుకొనడానికి వీరయ్యకు కబురు చేశాడు. ఆయన పిలిస్తే వూరులో వెళ్ళని వారు ఉండరట. కానీ వీరయ్య వెళ్ళలేదు. మా తండ్రి అప్పుడప్పుడే పక్షవాతం నుండి కోలుకుంటున్నాడట. నాగిరెడ్డి మా తండ్రిని పిలిపించి పథకం రచించి వీరయ్యకు బుద్ధి చెప్పే పనిని మా తండ్రికి అప్పగించాడు. వీరయ్యను ఆ సుబ్బిరెడ్డితోనే చెప్పుతో కొట్టించాడు మా తండ్రి. అడ్డం వారెవరూ లేరు. భయభ్రాంతుడైన వీరయ్య పరుగెత్తి నాగిరెడ్డి శరణుజొచ్చాడు. నాగిరెడ్డి వీరయ్యను బుద్ధిగలిగి నడుచుకోమని చెప్పి పంపాడు.

ఒకసారి మా నాన్న "చిన్నాయనా! నాకు ధనరేఖ జెర్రిపోతులాగా మిగతా మూడురేఖలంత లావుగా వుందే, మరి నేను ఎందుకు ఇంత దారిద్ర్యమనుభవిస్తున్నాను" అని

అన్నాడు. ఆయన సమాధానం "వెర్రివాడా! నీ కా ధనరేఖ వుండబట్టే తినడానికింత మిగులుతూంది. లేకపోతే నీ పొలకువే వుండి వుండదు. పోతే ఆ రేఖ నీకు ఉపయోగం లేకపోవచ్చు. నీ సంతానానికి ఉపయోగపడుతుందేమో ఎవరు చూశారు" అని అన్నాడు. ఇది ప్రవచనం అనవచ్చు. ఎందుకంటే ఈనాడు మేము, మా బిడ్డలు ఉన్నత స్థితిలో వున్నాము కదా!

నేను నాలుగో క్లాసు చదవలేదు. మూడు నుండి సరాసరి ఐదుకు ప్రమోట్ చేశారు. ఆ సంవత్సరం హెడ్మాస్టరైన గంగిరెడ్డిగారు, B.T. College, Madanapalli Principal, Duncan Greenless వ్రాసిన National Reader Book I వరకు నాకు ఇంగ్లీషు చదువు బోధించాడు. మా నాన్న నాకు వచ్చిన ఈ చదువు ఫస్ట్ ఫారం (6వ తరగతి)లో చేరడానికి సరిపోతుందని పులివెందుల బోర్డు హైస్కూలుకు నన్ను తీసుకెళ్ళాలని అనుకున్నాడు. పులివెందుల వెళ్ళాలంటే వేంపల్లె గ్రామం గుండా వెళ్ళాలి. పొలగిరికి రెండు మైళ్ళ దూరంలో వున్న పొద్దుటూరు వేంపల్లి రోడ్డులో నడిచే ఒకే ఒక coal gas bus కు ఎదురు చూడాలి. ఆ బస్సు రావచ్చు రాకపోవచ్చు. అందువల్ల ఆరు మైళ్ళ దూరం అడవి గుండా నడిచి వేంపల్లె చేరుకున్నాము. నాకు కాళ్లకు చెప్పులు కూడా లేవు. నేను మొదటిసారిగా చెప్పులు 1954లో B.A. Juniorలో వుండేటప్పుడు తొడిగాను. రాత్రి అక్కడే బస చేశాము. అక్కడ రాజా టూరింగ్ టాకీసులో రాత్రి నేనూ, మా నాన్న సినిమాకి వెళ్లాము. నేల టిక్కెట్టు మానాన్నకి రెండణాలు, నాకు ఒక అణా. నేను సినిమాలో బొమ్మలు మాట్లాడటం చూసి ఆశ్చర్యపోయి తెర వెనుక నుండి వారికి నాటకంలో మాదిరి ప్రాంప్టింగ్ ఇస్తున్నారని వెళ్ళి చూసాను. ఎవరూ లేరు. మా నాన్న నా సందేహాన్ని తీర్చడానికి 'సినిమా బొమ్మలు మాట్లాడతాయి, వెనక ఎవరూ వుండరు నాయనా!' అన్నాడు. నాకు నమ్మకం కలగలేదు.

మళ్ళీ రెండోసారి తెరవెనుకకు వెళ్ళి చూచాను. ఎవ్వరూ లేరు. ఆనాడు నేను చూసిన సినిమా పేరు అప్పుడు నాకు తెలీదు. చాలా ఏళ్ళకు అది వాహినీ వారి 'దేవత' సినిమా అని తెలుసుకున్నాను. మరుసటి రోజు కడప నుండి పులివెందులకు వెళ్ళే పెట్రోలు బస్సులో పులివెందులకు వెళ్ళాము. అక్కడ 6వ తరగతి అడ్మిషన్సు చూచేవారు మా గ్రామం రెడ్డి (V.M.) కుమారుడు సెకండరీ గ్రేడ్ టీచర్ లక్కిరెడ్డి చెన్నారెడ్డి. అందరూ ఆయనను అద్దాల చెన్నారెడ్డి అంటారు. మా నాన్నకు ఆయన బాగా తెలుసు. వెళ్ళి విషయం చెప్పాడు. పరీక్ష వ్రాయమన్నాడు. తెలుగు, గణితంలో మంచి మార్కులు వచ్చాయి. కానీ ఇంగ్లీషులో వ్రాయమన్న వ్యాసం (గుర్రంపై) వ్రాయలేక తెల్ల కాగితం ఇచ్చాను. అప్పుడు "ఆయన వీడికి ఇంగ్లీషు రాదు.

అందువల్ల ఆరో క్లాసులో చేర్చుకోలేనన్నాడు". మా నాన్న – "నీవే ట్యూషన్ చెప్పి ఇంగ్లీషులో ఆరో క్లాసుకు సరిపోయేటట్లుగా తయారు చెయ్యమని" అర్థించాడు. ఆయన మధ్యతరగతి కంటే ఉన్నతుడు. అహంభావే కాని చక్కని ఉపాధ్యాయుడు. నా భార్య తండ్రికి ఆయనే టీచరు. తరువాతి కాలంలో నేను పొలగిరిలో దేవిరెడ్డి గంగిరెడ్డి అనే సెకండరీ గ్రేడ్ టీచరు (ఖాళీగా వుండే ఈయన కూడా ఆయన శిష్యుడే) వద్ద ఒక సంవత్సరం ట్యూషన్ చెప్పించుకున్నాను. 1948లో కడప జిల్లాలో బోర్డు ఉన్నత పాఠశాలలు తామర తంపరగా వెలిశాయి. అందులో మా గ్రామానికి 12 కిలోమీటర్ల దూరంలో ఇడుపుల పాయ దగ్గర వున్న వేంపల్లె గ్రామం ఒకటి. మానాన్న మా అమ్మకు నచ్చ చెప్పి కుటుంబాన్నంతా వేంపల్లెకు మార్చాడు. నన్ను III ఫారం (8వ తరగతి)లో చేర్చాడు. ఆఫీసు క్లార్కు వేమన్న – తరువాత ఆయన RDOగా రిటైర్ అయ్యాడు. నాకు మంచి స్నేహితుడుగా మిగిలాడు – నా వివరాలు రాసుకుంటూ వయస్సెంత అని అడిగాడు. మా నాన్న పది సంవత్సరాలు – నా పుట్టిన తేదీ 13-8-1938 – అంచనా అన్నాడు. "పోవయ్యా! పది సంవత్సరాల వయస్సులో III ఫారంకు ఎట్లా వస్తాడన్నాడ"న్నాడు వేమన్న. అయితే 11 సంవత్సరాలు వేసుకోమన్నాడు మా నాన్న. వేమన్న రూలు ప్రకారము 1-7-1937 అని వేశాడు. కావలిలో 10 సంవత్సరాల వయస్సులో III ఫారం చదివిన కె.వై.వేణుగోపాలరావు మొదలగు వారంతా ఛీఫ్ ఇంజనీర్లు అయినారు. నాకు మూడు సంవత్సరాలు (బి.ఏ + టీచరు ఉద్యోగం) నష్టమైనా సరైన వయస్సు వేసి వుంటే ఒక సంవత్సరము ఛీఫ్ ఇంజనీరుగా పనిచేసే అవకాశముండేది కానీ సూపరింటెండింగ్ ఇంజనీరు గానే రిటైర్ అయ్యాను.

మా తండ్రికి సంగీత జ్ఞానం బాగా వుండేది. చిన్నతనంలో బాలకృష్ణుడి వేషం వేశాడట. విన్న పద్యాల రాగాలనీ సరిగా చెప్పేవాడు. ఒకసారి నేను మా నాన్నను 'భార్యాభర్తలు' సినిమాకు 1961లో కడప కృష్ణా థియేటర్‌కు తీసుకువెళ్ళాను. మొదటి నుండీ బాగా లేదని విసుక్కుంటూనే

వున్నాడు. ఆ చిత్రంలో ఆనంద్ (నాగేశ్వరరావు) శారదను (కృష్ణకుమారి)ని వేధించేవాడు. ఒక సన్నివేశములో శారద అతనికి బుద్ధి గరపడానికి కోపోద్రిక్తయై శ్రీమదాంధ్ర మహాభారతం, విరాటపర్వంలోని ఈ పద్యం 'బిలహరి రాగంలో' పాడింది. (ప్లే బాక్ సుశీల)

*చ॥ విరటుని రాణివాసమున వెల్గెడు భారత శక్తి ద్రౌపదిన్*
*మొరటుదనాన కీచకుడు మోహపిశాచవశం వదాత్ముడై*
*యరసి చెలియటంచు పలుకాడగాబోయెనొ లేదొ యంతతో*
*స్ఫురదరుణాక్షులన్ కినుక జూపుచు మాలిని వానికిట్లనెన్*

"ఇదేం బిలహరి రాగమయ్యా, ఏమీ బాగాలేదు కపిలవాయి రామనాథ శాస్త్రి 'పూరయ మమకామం' పాట బిలహరి రాగంలో, వేమూరి జగ్గయ్య మధ్యమావతి రాగంలో నిటలాక్షుడిపుడెత్తి వచ్చినన్', పద్యం కల్యాణి రాగంలో 'పరాబ్రహ్మ పరమేశ్వర' పాట ఇవీ రాగాలంటే. ఈ పనికిమాలిన సినిమా రాగాలు బాగాలేవయ్యా" అంటూ నన్ను ఇంటికి తీసుకువెళ్ళాడు.

పొద్దుపుచ్చటానికి అప్పుడప్పుడూ వేంపల్లెలో వుండగా మా నాన్న అక్కడి వృషభాచలేంద్రస్వామి పూజారి పలూరం నరసింహభట్టర్, సుబ్బిరెడ్డి, ఎయిడెడ్ స్కూలు మేనేజిమెంటు టీచరు సుబ్బరాజు – అభ్యుదయ కథానికా రచయిత నాగముని రాజు – మరికొందరు పూజారి మండువా లోగిలో పేకాడేవారు. సెలవు రోజులలో నేను మా నాన్న వెనక నుండి చూచి ఆడే పద్ధతి నేర్చుకున్నాను. నన్ను ఆయన అక్కడ వుండవద్దని అనలేదు. తరువాత కాలం గడిచే కొద్దీ ఆయన తన నలుగురు కుమారులతో ఇంట్లోనే 1961-62 లో పేకాడేవాడు. ఎప్పుడూ మూడవ, నాలుగవ కుమారులే గెలిచేవారు. మా అమ్మ 'నువ్వు చెడింది కాక వాళ్ళను కూడా చెడగొడుతున్నావంటూ' గోల చేసేది. మా నాన్న అనేవాడు కదా 'తిక్కదానా! నా కొడుకులు ఆఫీసర్లవుతారు. క్లబ్బుకు పోతారు. అక్కడ పేకాట ఆడవలసి వుంటుంది. అనుభవం లేకపోతే డబ్బు పోగొట్టుకుంటారు. అందుకని ఇప్పుడే తర్ఫీదు ఇస్తున్నాను' అనేవాడు. మా అమ్మ తెల్లమొగం వేసేది. ఇక్కడ నేను 1952లో ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి చేశాను.

మద్రాసు యూనివర్సిటీలో 16ఏళ్ళ వయస్సు లేకపోతే ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్ ఇవ్వరు. లేదా యూనివర్సిటీ వారి అనుమతి (Exemption) వుండాలి. ఈ అనుమతి రావటానికి సమయం దాటిపోయింది. అందువల్ల వయస్సుతో నిమిత్తం లేని ఆంధ్రాయూనివర్సిటీతో అనుబంధం వున్న వి.ఆర్.ఎస్. కాలేజీ, చీరాలలో Intermediate (M.P.C.) విభాగంలో చేర్పించారు. 1954లో మా క్లాసులో ఫస్ట్ క్లాసులో పాసయిన 11కొందు మందిలో నేను కూడా ఒకడిని. 1954లో రాయలసీమలో కరువు తాండవిస్తోంది. గంజి కేంద్రాలు కూడా తెరిచారు. నేను ఇంజనీరింగుకు వెళ్ళడానికి ఆర్థిక సమస్య ఎదురయింది. అందువల్ల కడప కాలేజీలో బి.ఎ. చదివించటానికి కుటుంబాన్నంతా కడపకు మార్చారు. అప్పుడొకసారి మా నాయనమ్మ కడపకు వచ్చి మా చిన్నాయన కొడుకు – ఆయన బి.టి. కాలేజి, మదనపల్లెలో ఇంటర్మీడియెట్ చదువుకున్నాడు – ను కూడా తన వద్దనే వుంచుకుని చదివించాలన్నది. మా నాన్న అప్పుడు 'అమ్మా, తమ్ముడికి సంతానం లేని బావమరిదున్నాడు. ఇప్పటి వరకూ సమస్తం తానై చదివించాడు. వీడిని సౌకర్యవంతంగా చదివించగలడు. నా బిడ్డలను చదివించుకోలేక అగచాట్లు పడే నా దగ్గర వాడికేం సౌకర్యంగా ఉంటుంది వద్దమ్మా' అన్నాడు. అప్పుడు ఆమె 'వాడికి చదువు సరిగా రాలేదు. నీ కొడుకేమో ఫస్టు క్లాసులో పాసయినాడు. అందువల్ల నీ దగ్గర వుంటే వాడికి కూడా చదువు బాగా వస్తుంది, అన్న దగ్గిర వుంచమని నీ తమ్ముడు అడిగాడు. నీవంగీకరించవలసిందే' అన్నది. తల్లి మాట జవదాటలేని మానాన్న సరే అనవలసి వచ్చింది. బి.ఎ.లో నేను II క్లాసులో, మా అన్న III క్లాసులో పాసయ్యాము. క్లాసుకంతా ఒకటే I క్లాసు.

1956లో B.A. Mathematics పాసయిన తర్వాత నంది మండలం బోర్డు ఉన్నత పాఠశాలలో Untrained Graduate Mathematics Assistantగా నెలకు 89 రూపాయల జీతం పైన నియామకం జరిగింది. మా కుటుంబమంతా నా వెంట షరా మామూలే.

ఈ సందర్భంగ మా తండ్రికి తెలుగులో గల సాహిత్య పరిచయాన్ని ఆ నందిమండలం హైస్కూలులో జరిగిన ఒక సంఘటన ద్వారా పరిచయం చేస్తాను. అక్కడ ఉపాధ్యాయులకు వెయిటింగ్ రూము వుండేది కాదు. తరగతిలో బోధించడం పూర్తయిన తరువాత అందరూ ప్రధాన భవనానికి దగ్గరలోవున్న విశాలమైన కాంపౌండులో వేపచెట్ల క్రింది రాతి అరుగులపై కూర్చునేవారు. ఆ వూరు బస్టాండు కూడా అక్కడే కాబట్టి ఆ అరుగులెప్పుడూ ఊరిపెద్దలతో సందడిగా వుండేవి. ఒక రోజు ఆ చెట్ల క్రింద ఆసీనులైన ఉపాధ్యాయులతో నేను, మా తండ్రి ఉన్నాము. తెలుగు పండితులవారు – మహమ్మదీయులు, పేరు జ్ఞాపకం లేదు

– ఆనాడు భారతంలోని విదుర నీతిలోని యీ క్రింది పద్యం IV ఫారం పిల్లలకు బోధిస్తున్నారు.

*తే॥ కొంచెమైనను తగపంచి కుడువమేలు,*
*పనులయెడ దుఃఖమోర్చి యల్పంబు సుఖము*
*ననుభవించుట హితము, శత్రునకునైన*
*నిచ్చుటయె లెస్స యడిగిన యెడ నృపాల!*

తెలుగు పండితుల వారి స్వరం స్పష్టంగా బయటికి వినపడుతోంది. 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! మానవుడైన వాడు కొంచమైనా యితరులకివ్వాలి. చిన్న సుఖం అనుభవించడానికైనా దుఃఖమోర్చుకోవాలి. అడిగిన వాడు శత్రువైనా సరే యివ్వాలి. అందుచేత పాండవులకు వారడిగినది యివ్వడం న్యాయం' అని బోధిస్తున్నారు. పిరియడ్ అయిపోయిన తరువాత పండితులవారు వచ్చి మా సరసన ఆసీనులయ్యారు. మా తండ్రి అపుడాయనతో "సార్! క్లాసులో మీరింతవరకు చెప్పిన పద్యార్థము, ఆ పద్యంలోని పదాలు అటు, ఇటు త్రిప్పి చెప్పినట్లుంది. కాని విదురునివంటి నీతికోవిదుడు, ప్రజ్ఞాశాలి, తెలివిపరుడు అయిన ధృతరాష్ట్ర భూపతికి మీరు చెప్పినట్లుండే సర్వసాధారణ నీతిని ఉపదేశించి ఉండి ఉంటాడంటే నేనెందుకో నమ్మలేకున్నాను. పైగా తిక్కనామాత్యుడు అలతి, అలతి వాడుక పదాలలో గంభీరమైన అర్థపుష్టి నింపగల దిట్ట. పైగా యీ పద్యం అప్పకవీయంలో ఆదియకారానికి ఉదాహరణగా యివ్వబడి మరో ప్రాముఖ్యాన్ని సంతరించుకొంది.

అందువల్ల యీ పద్యానికి అర్థం వివరించేటప్పుడు బాగా యోచించి చెప్పాలన్నది నా భావన గమనించండి. తనకే కొంచెమున్నా అందులో ఎంతోకొంత ఇతరుల శ్రేయస్సుకు వెచ్చించ మంటుంది ధర్మశాస్త్రం. ఉన్నదందరికి సంతర్పణ చేసిన తరువాత ఒక యాచకుడొస్తే రంతి దేవుడు – అన్నా! కొన్ని మధురాంబువ్వులున్నవి. అందుకోమన్నాడు. కాని ధృతరాష్ట్ర మహీపాలా! మీరు అఖండ భారత సామ్రాజ్యాధి నేతలు. పాండవులడిగింది వారి భాగం మాత్రమే. అది కొన్ని అలంతి పల్లియలని – తరువాత విదురుడు తన నీతిలో స్పష్టం చేశాడు. ఆ కొంచెము వారికి పంచి యిచ్చి మిగిలిన సామ్రాజ్యమంతా మీరనుభవించవచ్చుకదా? అన్నది మొదటి పద్యపాదానికి అర్థము. మానవుని స్థూల జీవన గమనంలో ప్రముఖ ప్రస్థానం సుఖమయ జీవనం. సుఖోపయోగానికెన్నో పద్ధతులున్నాయి. ఇతరులకు బాధాకరం కానివి, సామాజిక నిబంధనలకు లోబడిన చర్యలన్నీ సుఖోపజీవనం క్రిందికే వస్తాయి. ఇందుకు ప్రకృతి సిద్ధమైన అడ్డంకులే కాక, సామాజిక రుగ్మతలు, వ్యక్తిగత ద్వేషాలు, ఆత్మైక బలహీనతలు మొదలైనవి కూడా ప్రతిబంధకాలే. అందులో ప్రముఖమైనది మానవుడు ఎన్నెన్నో కారణాలవల్ల దుఃఖభాజితుడు కావడం. అలాంటి దుఃఖాన్ని కూడా సహించి తను చేయవలసిన పనులు, అనగా బాధ్యతలు సక్రమముగా నిర్వర్తించి ఓ వీసమెత్తు సుఖమైనా సరే అనుభవించడం మేలు.

ఇది రెండవ, మూడవ పద్యపాదంలో సగానికి అర్థం. శత్రువును ఎప్పుడు శత్రువుగా చూచినందువల్ల మన ఆంతరంగిక భద్రత కోసం ఎంతో వెచ్చించవలసి వస్తుంది. పైగా మనశ్శాంతి కోల్పోవడం కద్దు. శత్రువెప్పుడూ ప్రక్కలో బల్లెమే. ఆ శత్రువే లేనప్పుడు ఇతర కార్యాలపై దృష్టి కేంద్రీకరించవచ్చు. ప్రజానురంజకంగా పరిపాలన చేయవచ్చు. అలాంటి శత్రువే నీ దగ్గర చేయి చాచినపుడు సహాయం చేయమంటుంది రాజనీతి. ఆ శత్రువును పూర్తిగా మట్టు పెట్టడానికి అదొక మహదవకాశం. ఆ అవకాశాన్ని జారవిడువ రాదు. ఇది మిగిలిన మూడవ, నాలుగవ పూర్తి పద్యపాదానికి అర్థం" – అని ముగించాడు. పండితుల వారు నివ్వెరపోయి రెండు చేతులెత్తి మా తండ్రికి నమస్కారం చేశారు.

నందిమండలంలో టీచరు కాలపరిమితి 1957 మార్చికంతా పూర్తయింది. కావాలంటే మళ్ళీ అదే ఉద్యోగం చెయ్యవచ్చు. Reappointment orders ఇస్తారు. మా నాన్నకు అదెందుకో ఇష్టం లేకపోయింది. ఇద్దరం ఆ వేసవిలో కడపకు బయల్దేరాము. ఆనాడు ఆర్.టి.సి. బస్సులు లేవు. కడప పట్టణం మధ్యలో ఒక మునిసిపల్ బస్టాండ్ వుండేది. అక్కడి నుండి మా నాన్నకు తెలిసిన ఒక లాయరు ఇంటి మీదుగా వెళు తూవుంటే ఆయన మమ్మల్ని చూసి లోపలకు పిలిచాడు. కడపకు ఎందుకు రావలసి వచ్చిందో మా నాన్న ఆయనకు వివరించాడు. ఆ లాయరు నన్ను ఇంజనీరింగులో చేరడానికి నీకు Age bar కాలేదా? అన్నాడు. ఇంకా రెండు సంవత్సరాలు వుందన్నాను. అయితే ఇంజనీరింగుకు అప్లికేషన్ పంపు. సీటు వస్తే నేను చదివిస్తానని 20 రూపాయలు ఇచ్చాడు. కాకినాడకు అప్లికేషన్ పంపడం అనంతపురం ఇంజనీరింగు కాలేజీలో సీటు రావడం జూలై కంతా అక్కడ చేరిపోవడం జరిగింది. నాలుగేళ్ల తర్వాత APSE Boardలో జూనియర్ ఇంజనీరుగా చేరాను.

1963లో కర్నూల్లో జూనియర్ ఇంజనీర్గా వుండగా మా నాయనమ్మ చనిపోతే మా చిన్నాయన ఆ విషయం మా

తండ్రికి చెప్పలేదు. తెలిసిన తర్వాత మా నాన్న ఒక వారం రోజులు ఏడ్చాడు. 1964 ఆఖరుకు నాకు కర్నూలులో వుండగా అసిస్టెంటు ఇంజనీరుగా (నేటి A.D.E.) ప్రమోషన్ వచ్చి నాలుగు జిల్లాలకు కేంద్రమయిన – అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలు – అనంతపురం S.E. ఆఫీసులో A.E. Commercial గా చేరాను. వివాహితుడనయినా కొన్ని కారణాల వల్ల నేను ఏకాకినే. ఒకసారి మానాన్న కర్నూలు నుండి నా ఆఫీసుకు వచ్చి నా గదిలోకి వస్తూవుంటే అక్కడి అటెండర్ అడ్డగించి చీటి రాసిమ్మని అక్కడ కూచోపెట్టాడు. నాలుగు జిల్లాల నుండి ప్రజలు తమ అవసరాల నిమిత్తం ఆ ఆఫీసుకు వచ్చేవారు. వచ్చినవారందరితో మాట్లాడటం మొదలు పెడితే ఆఫీసులో నేను చేయవలసిన పని ఆగిపోతుంది. అందువల్ల గంటకు ఒకసారి చీటీలు చూసి విజిటర్స్‌ను లోనికి పిలిపిస్తుంటాను. కొన్ని చీటీలు అయిపోయిన తర్వాత చూస్తే ఒక చీటీ మా నాన్న సంతకంతో వుంది. అటెండర్‌ని పిలిచి చీటీని చూపించి ఈయన వచ్చి ఎంతసేపయిందని అడిగాను. గంటదాటిందని చెప్పాడు. పిలవమని చెప్పాను. నేను “మీ సార్ తండ్రినంటే లోనికి రానిస్తాడు కదా! చీటీ ఇచ్చి అక్కడ కూచోవడమెందుకు?” అని అన్నాను. ఆయన అన్నాడు కదా “నాకు పనేముంది? నిన్ను చూడడానికే కదా వచ్చింది. నేను కూడా లోనికి వెళ్ళలేనంత హోదాలో నా కుమారుడుంటే నాకది గర్వకారణం కదా!” అంటుంటే – నా కళ్ళు చెమ్మగిల్లాయి!

1965 మధ్యకాలంలో ఆయన కడుపులో నొప్పి అనేవాడు. కర్నూలులో ఎం.బి.బి.యస్. చదువుతున్న ఆఖరు తమ్ముడు ప్రభాకరరెడ్డి కర్నూలు జనరల్ హాస్పటల్‌లో చూపిస్తే ఏమీలేదన్నారు. అయినా ఆయన నొప్పి అనేవాడు. తరువాత మా అమ్మను తీసుకుని నా దగ్గరకు అనంతపురం వచ్చాడు. నేను ఆయనను వెల్లూరు సి.ఎమ్.సి. హాస్పటల్‌కు – తీసుకువెళ్ళి పది రోజులు చికిత్స చేయించాను. వారు కూడా కడుపులో నొప్పికి కారణం లేదన్నారు. తరువాత ఆయన మళ్ళీ కర్నూలు వెళ్ళాడు.

అది అక్టోబరు 1966 మూడవ వారం. అప్పుడు నేను ప్రొద్దుటూరులో పనిచేసేవాడిని. అక్కడ కూడా నేను ఒంటరినే. ఆఫీసులోనే వెనక భాగంలో వుంటుండేవాడిని. ప్రొద్దుటూరులో చేరినప్పటి నుండి నా దురలవాట్లకు అడ్డు – ఆపు లేదు. ఆ రోజు శలవు. మత్తుగా పడుకుని వున్నాను. సాయంత్రం 3 గంటల ప్రాంతాల వాచ్‌మెన్ తలుపులు బాదుతుంటే బయటికి వస్తే ఒక టెలిగ్రాం ఇచ్చాడు. 'Father serious, start immdiately, Prabhakar' అని వుంది. అప్పుడు ఆర్.టి.సి. బస్సులు లేవు. మధ్యాహ్నం కడప నుండి కర్నూలుకు 2.45కు మొదటి బస్సు, రెండవ బస్సు 4.00గం॥లకు బయల్దేరుతాయి. అంటే ఒక బస్సు వెళ్ళిపోయింది. రెండవ బస్సు 4 గంటలకు బయల్దేరి మైదుకూరు జంక్షనుకు వచ్చేసరికి 4.30 గం॥లు అవుతుంది. అప్పటికి నేనక్కడ వుండాలి.

నాకొక Dodge Van వుండేది. డ్రైవర్ తిమ్మప్ప. మంచివాడు. శలవు రోజు కాబట్టి అతను కూడా బాగా తాగి వుంటాడు. విషయం చెప్పి రాగలడేమో అడగి రమ్మని వాచ్‌మెన్‌ను పరుగు పెట్టించాను. డ్రైవర్ ఏం ఫరవాలేదు మైదుకూరు ప్రొద్దుటూరుకు 25 కిలోమీటర్లే కదా పద వస్తానని వచ్చాడు. అప్పటికి 4 గంటలయింది. అక్కడ కడపలో బస్సు నాలుగు గంటలకు బయల్దేరింది. ఇక్కడ నేను 4 గంటలకు మైదుకూరుకు బయల్దేరాను. నేను మైదుకూరు చౌరస్తాకు చేరుకుని Van ను రాస్తాకు అడ్డంగా పెట్టాను. వెంకటేశ్వర ట్రాన్స్‌పోర్టు బస్సు వచ్చి ఆగింది. ఆ బస్సువారు overload చెయ్యరు. సీటు లేదన్నారు. కాస్తాగమని నేను బస్సు ఎక్కి అత్యంత అవసరం లేనివారెవరైనా వుంటే వారి సీటు నాకివ్వమని విషయం వివరించాను. ఎవరో ఒక మహనీయుడు దిగి నాకు తన సీటు ఇచ్చి వెళ్ళమన్నాడు. టికెట్టు డబ్బు కూడా వద్దన్నాడు. రాత్రి పది గంటలకు హాస్పిటల్ గేటు దగ్గిర దిగితే ప్రభాకర్ నాకోసం అక్కడ వున్నాడు. మా నాన్నను మార్చురీలో పెట్టారన్నాడు. డాక్టరు స్టూడెంటు కాబట్టి లోనికి వెళ్ళనిచ్చారు. రెండు కాలి బొటన వేళ్ళకు, రెండు చేతులకు కలిపి తాడుతో కట్టి వున్నారు. చలించిపోయాను.

ప్రభాకర్ చెప్పిన విషయం – రెండు మూడు రోజుల నుండి నడిచేటప్పుడు మా నాన్న తూలుతుండేవాడట. 'ఏమైనా మింగావా నాన్నా!' అని ప్రభాకర్ అడిగాడట. మీరందరూ నన్ను చక్కగా చూసుకుంటుండగా ఏమైనా తినడానికి నాకేం ఖర్మ నాయనా అన్నాడట మా నాన్న. ఆయన నిత్య మధుపానాసక్తుడు. కాబట్టి తాగి వుంటాడులే అనుకున్నాడట ప్రభాకర్. రెండ్రోజుల తర్వాత నోట్లో నురుగు వస్తే హాస్పటల్‌కు తరలిస్తుండగా ఆయన ప్రాణవాయువులు అనంత లోకాలకు వెళ్ళిపోయాయి. తెలిసిన విషయమేమంటే పిడికిటి నిండుగా Gardinal Tablets మింగాడని. Postmortem చెయ్యాలన్నారు. Dhone D.S.P. నారాయణస్వామి నాకు మిత్రుడు. పనిమీద కర్నూలుకు వచ్చి వున్నాడు. ఆయన

సాయంతో మా నాన్న రాసిన Suicide Note చూపించి Discharge Certificate తీసుకుని పాలగిరి తీసుకుని వెళ్ళి దహనం చేశాం. కడుపులో భరించలేని నొప్పి అనేవాడు. నొప్పి లేకున్నా నొప్పి అని ఆత్మహత్య చేసుకునే పిరికివాడు కాదు మా నాన్న. ఆనాడున్న వనరులతో డాక్టర్లు ఆయనకున్న జబ్బు నిర్ధారణ చేయలేకపోయారనుకుంటాను. బహుశ కడుపులో కాన్సర్ వుండి వుండవచ్చు. ఆరోజు 14 అక్టోబర్ 1966. అప్పటికి ఆయన వయస్సు 59 సంవత్సరాలు.

ఆత్మహత్య చేసుకున్నాననే ఉత్తరం (suicide note)లో నా గురించి ఉన్న రెండు మాటలు ఉటంకిస్తాను. 'దశరథుడు చనిపోతూ పది కొంపలు గల ప్రతి పల్లెలో శ్రీరాముని దేవాలయముంటుందని వరమిచ్చాడు. అట్లాగే నేను కూడా నా ప్రియ కుమారునికి ద్రోహమెవరు తలపెట్టినా నశిస్తారని శపిస్తున్నాను. నేను మళ్ళీ నా కుమారునికి పుత్రుడుగా పుట్టాలనే కోరిక వుంది.' భగవంతుడు ఆయన ఈ విన్నపమెంతవరకు ఆలకించాడో తెలీదు కానీ, నా రెండవ సంతానం డా. రవికుమార్ మా తండ్రి అంశతో జన్మించిన మహామేధావని నమ్ముతాను. ఆయన అన్ని అలవాట్లు మానుకున్నాడు కానీ, తాగుడుకు దూరం కాలేకపోయాడు. నాకు తెలిసినంత వరకు కరుణామయుడు. తనకు చేతనయినంత వరకు ఇతరులకు సహాయం చేసిన వాడు. ఎవరికీ హాని చేసిన వాడు కాదు. ఒకసారి నేను ఆయనతో నీవు ఈ త్రాగుడు ఎందుకు మానలేకపోతున్నావు. అంత బలహీనుడివా? అన్నాను. అప్పుడాయన 'ఏ లోపమూ లేకపోతే మనిషి భగవంతునికి దగ్గరవుతాడు. నాకు ఈ దురలవాటు వుండడం వల్ల మనిషిగా మిగిలిపోయాను. మరొకరు ఇంకొక దురలవాటుకు లోనయి మనిషిగా మిగిలిపోతాడు. లోక చరిత్ర ఇంతే' అన్నాడు.

ఆయన మా కుటుంబ భవిష్యత్తును అంచనా వేసి దిశానిర్దేశం చేసిన ద్రష్ట అనవచ్చు. ఆయన ఉద్దేశాన్ని చక్కగా అమలుచేసింది మా తల్లి. లేకపోతే దారిద్ర్య రేఖకు ఎంతో దిగువన వున్న ఈ కుటుంబం ఇంత ఎత్తుకు ఎదిగిందంటే మొదట స్మరించదగినవాడు మా నాన్న. తరువాత మా అమ్మ.

మా తండ్రి అప్పుడప్పుడూ చెపుతూ వుండిన సూక్తులు కొన్ని వివరిస్తాను –

1) ఏపనైనా ఆత్మవిశ్వాసంతో చెయ్యాలి, 2) చేతనైనంత వరకు అవసరమైన వారికి సహాయం చెయ్యాలి. 3) మనస్సాక్షి వద్దని ప్రబోధించే పనులను ఎవరు చెప్పినా చెయ్యరాదు, 4) మనిషికి ధైర్యం ముఖ్యం. అదున్న చోటుకు ఏ భయాలు రావు, 5) మంచి పుస్తకాలు – రామాయణ భారత భాగవతాలు – జీవితంలో నమ్మదగిన మిత్రులు, 6) చదువుకంటే సంస్కారం గొప్పది. ఇవన్నీ ఆయన జీవితకాలంలో ఆచరించి చూపాడు.

**కోడూరు పుల్లారెడ్డి**
**రిటైర్డ్ సూపరింటెండింగ్ ఇంజనీరు,**
**హైదరాబాదు. ఫోన్ : 95 50 81 84 95**

## అచ్చయ్య కోడూరు



అచ్చయ్య కోడూరు

నటుడు, దర్శకుడు, ప్రయోక్త, నాటకకర్త. ఈయన కృష్ణాజిల్లా ముదినేపల్లెలో జన్మించాడు. నాటక కళా లక్ష్యంతో పనిచేశాడు. తొలుత 1939లో ముదినేపల్లి ఎక్సెల్షియన్ థియేటర్ ప్రదర్శించిన *ఆశాజ్యోతి* నాటకానికి దర్శకత్వం వహించాడు. అక్కినేని నాగేశ్వరరావును నటుడుగా తీర్చిదిద్దిన వ్యక్తి. సాధన (రిహార్సలు) చేయించడంలో, నటీనటుల క్రమశిక్షణను పాటించేటట్లు చేయడంలోను, నాటక పఠన దశ నుంచి నాటక ప్రదర్శన వరకు అన్ని దశలను అతి చాకచక్యంతో, కట్టుబాటుతో నిర్వహించడంలో అచ్చయ్య మేటి. ప్రజా నాట్య మండలి కృష్ణాజిల్లా దళానికి దర్శకత్వం వహించి, అఖండ విజయం సాధించడంతో ఈయనకు యావదాంధ్ర ఖ్యాతి లభించింది. రంగస్థలంమీద, సినిమాలో అతి సమర్థవంతంగా నటించి పేరుపొందాడు. *పెత్తందారు* నాటకం రచించి, దర్శకత్వం చేపట్టి, పాత్రను పోషించి విజయవంతంగా ప్రదర్శించి మెప్పుపొందాడు.

*ఆశాజ్యోతి, ముందడుగు, మాభూమి, అపనింద, పరితాపం, పెత్తందారు, తప్పు నాదే* మొదలైన నాటకాలకు దర్శకత్వం వహించి, అచ్చయ్య (ముందడుగు,) వెంకటరావు (మాభూమి), లాయరు (అపనింద, తప్పు నాదే), రైల్వేపోర్టర్ (ఆశాజ్యోతి), పెత్తందారు (పెత్తందారు) మొదలైన పాత్రలలో నటించి కళారాధకుల ఆదరాభిమానాలు చూరగొన్నారు.

# భవాని

ప్రపంచ సాహిత్యంలో కథకు ఒక విశిష్టస్థానం ఉంది. ఇందులో సంఘటనలు, పాత్రపోషణ, శైలి, శిల్పముల ఆధారంగా కథకునికి పేరుప్రఖ్యాతులు లభిస్తాయి. చాలాకాలంగా తెలుగు కథానిక పత్రికలో వచ్చిన ఒక వార్తకో, సంఘటనకో వక్రోక్తికో కొనసాగింపుగా వుంటోంది. పోలీసు డైరీలా చలనరహితంగా ఒక స్థిర బిందువుగా నిలచిన తెలుగు కథానికకు ఒక నూతన ప్రక్రియలో సొగసులను అద్ది కొత్త స్థాయిలో మానవ అంతశ్చేతనే ప్రధానంగా ఆ స్థిరబిందువులో సింధువును చూపించారు రచయిత.

ఈ కథను చదివిన కొందరు కథకులు దీనిని 'విషాద సౌందర్యమని', ఇంకొందరు 'రొమాంటిక్ రినైజాన్స్' అని అన్నారు. మరికొందరు కవులు 'కథాకావ్యం' అన్నారు. ఆలోచనాపరులు ఇది 'వాస్తవ సంఘటనా?' అని ప్రశ్నించారు. మరి మీరేమంటారు? *–సంపాదకులు*

*ఉత్తమ పురుషలో రాస్తున్న ఈ కథ ఓ స్త్రీ అంతరంగ మథనం. అందుకే ఉత్తమ స్త్రీ కథనం అందామా? కాలావధులు – పరిసరాల పరిధులు, వీటికి అతీతంగా ఈ వ్యక్తుల్ని – ఇందులో సంఘటనలనూ – అవీ నామమాత్రం – వ్యక్తులకి పేర్లు కూడా అవసరం లేని విధంగా కథను వినిపించాలనుకోవటం సాహసమే.*

*మరి అలాంటి సాహసాలు చేయకపోతే – మర్త్యులు, గంధర్వులెలా అవుతారు?*

*ధూళి నుంచి మధూళి ఎలా లేస్తుంది? కన్నీటి చుక్కలో హరివిల్లు ఎలా విరుస్తుంది? ఇక వినండి...*

**కొం**దరికి జీవితంలో కొన్ని తొందరగా జరిగిపోతుంటాయి. పదకొండేళ్ళకే ఓణీలు వేశాను – పదిహేను నిండకనే మెట్రిక్ పూర్తిచేశాను. పదిహేడవ ఏటనే ఎమ్‌సెట్ రాశాను.

వయసుతోపాటు శరీరంలో వచ్చే మార్పులు గమనిస్తూనే వున్నాను. ఇవి బాహిరకమూ ఆంతరికమూను. అంతేనా – నాతోటివారు, కుటుంబంలోని వారిలోని మార్పులూ గుర్తించకనూపోలేదు. పైట సింగారంతో గొంతులో వచ్చిన గందుతనం నాకే వినిపించింది! నెలసరి, చిమ్మిలి చిరాకులు – రొమ్ములు పొంగటం, కనురెప్పలు బరువెక్కటం, చనుమొనలు పదునెక్కటం, ఇవేమీ నా చదువుకు ఆటంకం కాలేదు.

మెడిసన్‌లో చేరిన కొత్తలో – ఒక కొత్త వాతావరణం – పరిచయం అయింది. కాస్త బెదురూ కలిగింది – కాని మొదటి అనాటమీ క్లాసు సంఘటన...

ఆ వెలుగు నీడల హాలులోకి అందరితోపాటు వెళ్ళాను. ఒక్కసారిగా ఏదో మందు వాసన గాలిలో ఘాటుగా కలిసిపోయివుంది. నాలుగు వరసల్లో తొట్టెలున్నాయి. నాతోపాటు పదిమంది అమ్మాయిలు పదహారుమంది అబ్బాయిలున్నారు. అనాటమీ అసిస్టెంటు ప్రొఫెసరు – ఒక అటెండరు – ఆ తొట్లలో ఏమున్నదో అన్న ఉత్సుకతే తలా ఒకచోటికి చేర్చింది. మరొక అయిదు నిమిషాలకు అయిదుగురు అమ్మాయిలు మూర్ఛపోయారు. మరో ముగ్గురు బైటకు పరుగుపెట్టారు – వాంతి చేసుకోవటానికి.

ఇక అబ్బాయిలు – సగం పైగా ఇదే పరిస్థితి!

నాతోపాటు మరో అమ్మాయి స్థిరంగానే వుంది. అప్పుడే నాకు నా ఎదురుగా వున్న తొట్టెలో వున్న మానవుణ్ణి చూసినప్పుడు అతని ముఖంలోని బాధ అలాగే మృత్యువులో చేరి ఘనీభవించిపోయింది. చేతులు, రెండు ప్రక్కలా దీనంగా వాలిపోయి వున్నాయి. మోకాళ్ళవరకు వంగిన కాళ్ళు నీరంతా

పోయి, ఎండిపోయి ఉన్నాయి. తొట్టిలో ఫార్మాల్డిహైడ్ ద్రవంలో తన రహస్యాలు కనుక్కోమని ఆహ్వానిస్తున్న 'ఆ డెడ్ బాడీ'ని చూసి నిలబడినపుడే నాకు జీవితం మీద నమ్మకం కలిగింది. మరణం మీద బెరుకూ పోయింది. ఇది కూడా పద్దెనిమిది ఏళ్ళకే జరిగిపోయింది.

అప్పటివరకూ ఈ విషయాలపై ఆలోచనలు పోయినా యౌవనారంభపు వసంతంలో ఆకులు రాలటం కూడా చూసి జీవితంలో 'విషాద'మంటే అవగాహన కలిగింది. కానీ ఇదే నా తదుపరి జీవితానికి పునాదులని ఇప్పుడే నాకెలా తెలుస్తుంది?!

అదే కొన్నికొన్ని కొందరి జీవితాలలో తొందరగా జరిగిపోతాయి.

* * *

రెండో సంవత్సరంలో ఒకరిద్దరు వెంటబడినా అదీ నా అందాన్ని చూసి కాదు. వారి వయసు వేడికి ఒక తోడు, ఆడుకోవటానికి ఆడది కావాలి కదా – అందుకే అనుకున్నాను. అదీ నా అందంమీద నా నమ్మకం. కాని అడపాతడపా నా గొంతులోని గందుతనం గుర్తించిన వాళ్ళు, పాడమని ప్రోత్సహించేవాళ్ళు, నాకూ కూనిరాగాల నుండి, రాగాల స్పృహ రావటానికి చాలాకాలమే పట్టిందని చెప్పాలి. అయినా ఇవన్నీ నన్ను నేను ఆనంద పరచుకోవటానికే పరిమితం కాని, కచ్చేరీలు చేయటంవరకూ రాలేదు.

అప్పుడే శివుడు పరిచయం అయ్యాడు. పరిచయం అంటే నాకు రెండేళ్ళు సీనియర్ అన్నమాట. నేను కాస్త వళు ్ళ చేయటానికి, సీనియర్ల కళ్ళు పడటానికీ ఆమాత్రం సమయం పడుతుంది – పట్టింది. అయినా మీకు శివుని గురించి చెప్పాలి.

* * *

నాకు అన్ని విషయాల్లో శివుడు మరో ధృవం! నేను పొడగరి. అతను నా ఎత్తు కూడా వుండడు. నా వంటి ఛాయ బంగారం అనలేనుకాని, పసుపు, పాలు కలిసినట్లుంటుంది. మరి శివుని రంగు – మనవాళ్ళు ఆనవాయితీగా అనే గారంటీ కలర్! సరే, రంగు – 'స్కిన్‌డీప్' అనుకుంటాం! నాకు బోలెడంత జుత్తు – పిరుదులు తాకే జడ! శివది – ఎప్పుడూ మొలిచే ఆకుమడి! "నీకు జుట్టు పెరగదా?" అంటే 'పెరగనివ్వను' అనేవాడు. దీనికీ ఒక సంకేతం వుంది. ముందుముందు మీకు తెలుస్తుంది. ఆ విధంగా శివ నా వెంట పడ్డాడని చెప్పనుగాని మా స్నేహాన్ని పెళ్లిదాకా తీసుకువెళ్ళింది అతనే! తను డాక్టరు డిగ్రీ తీసుకోగానే పెళ్లి అన్నాడు. 'నేను ఇంకా రెండేళ్లు చదవాలికదా' అంటే 'నేను పాఠాలు చెబుతాలే' అని దాటవేశాడు.

ముందే చెప్పినట్లు కొందరి జీవితంలో కొన్ని తొందరగా జరిగిపోతాయి. అలా నా పెళ్లి కూడా తొందరగానే జరిగిపోయింది!

* * *

నేను డాక్టరు డిగ్రీ తీసుకోక పూర్వమే కాపురం పెట్టాల్సి వచ్చింది. అయితే చదువుతున్నచోటే కాబట్టి చదువుకు ఆటంకం కలగలేదని చెప్పాలి! మరుసటి సంవత్సరం ఒక మగ పురుగు పుట్టుకువచ్చాడు. చూశారా కొన్ని కొందరి జీవితాలలో ఎంత తొందరగా జరిగిపోతుంటాయో – అప్పుడే ఏమయింది – భార్యనయ్యాను – ఎలాగో డాక్టర్నయ్యాను – అమ్మనయ్యాను – ఇంకేం కావాలి? పి.జి. చేసే కోరికా, ఓపికా ఇద్దరికీ లేదు. మామూలు డిగ్రీలయినా నేను గైనో డిప్లమో – శివుడు ఎనస్తీషియా 'డిప్' చేతబట్టుకుని, పొట్ట చేతబట్టుకొని బాబుని ఉయ్యాలదింపి, ఒకమాదిరి టౌన్‌లో అదీ అంతగా కాంపిటేషన్ లేని టౌన్‌లో క్లినిక్ – ఓ పెద్దాయనతో క్లిక్‌మనిపించాము. అదే మెల్లగా నర్సింగ్‌హోంగా మారింది.

ప్రాక్టీసు ప్రవాహంలాగా లేదుగానీ పొట్టకూటికి ఇబ్బంది లేదు.

ప్రకృతిసిద్ధంగా జరిగే ప్రసవాలే ఎక్కువ! రెండు చేతులడ్డంపెట్టి కాన్పులు చేస్తుంటాము. అమాయకులు అందుకు 'ఫీజు'లూ ఇస్తుంటారు. సరేలే, ఇవన్నీ లౌకికంగా అంత నేరం కాదు ఈ రోజుల్లో.

ఈ రోజుల్లోనే శివుడు బయట ఊళ్ళకు వెళ్తుండేవాడు. సర్జరీకి ముందు మత్తుమందు ఇవ్వటానికి, అతని సంపాదన బాగానే వుందనుకున్నరోజుల్లో–

ఒక రాత్రి ఇంటికి విపరీతమైన తలనొప్పితో వచ్చాడు. తలనొప్పికి వంద కారణాలుంటాయి. ప్రొద్దున్నే మామూలుగా నిద్ర లేవలేక "భవా! ఇవాళ ఎక్కడికీ వెళ్ళలేను. ఏమైనా ఫోనులు వస్తే చెప్పేయి" అంటూ ఏదో పెయిన్ కిల్లర్ వేసుకుని పడుకున్నాడు. నేను క్లినిక్, పేషెంట్లు గొడవతో అంత సీరియస్‌గా శివ తలనొప్పిని పట్టించుకోలేదు – కాని వారంరోజులు ఆగి ఆగి వస్తున్న అతని తలనొప్పిని అశ్రద్ధ

చేయలేకపోయాను. గుంటూరు తీసుకెళ్ళి స్కాన్ చేయించాను. స్కాన్ రిపోర్టులు చూస్తే నూరోసర్జన్ – ఎడిమాలా వుంది. ఎంత త్వరగా సర్జరీ చేస్తే, అంత మంచిదని సలహా ఇచ్చాడు. ఇప్పుడు కారణాలడగనా? 'వీన్' ఒకచోట చిన్న బెలూన్‌లా వుబ్బి వుందని, ఎప్పుడైనా పగలవచ్చని, ఇది 'లైవ్ బాంబ్' అన్నాడు. సర్జరీకి ముహూర్తం పెట్టమన్నాం. శివుడు, జుట్టు ఎందుకు పెరగనివ్వడో తనకి ఈ సింప్‌టమ్స్ ఎప్పటినుంచో వున్నాయా? అశ్రద్ధ చేశాడా? వెంటనే సర్జరీ చేయటానికి నూరోసర్జన్ అందుబాటులో వుండాలికదా. మందులిచ్చి ఆ డేట్‌కి రమ్మన్నారు! ఎక్కువ దూరం కూడా లేదు ఆ రోజు. అందుకని నేనూ తొందర చేయలేదు. ఒకరోజు ముందుగా వెళ్ళి సర్జరీకి సిద్ధంగా వుండాలి. ఆ రోజు ఉదయం నుంచీ అతని తలనొప్పి పెరిగిపోయింది. వెంటనే కారులో ఎక్కించుకుని, గుంటూరు పరుగెత్తాను. వెనకసీటులో నా ఒడిలో పడి, బాధతో నన్నే చూస్తున్నాడు. బెజవాడ బారేజీమీదకు వచ్చేసరికి అతని కళ్ళల్లో వెలుగు ఆరిపోయింది. నాతో ఏమీ చెప్పే అవకాశం కూడా లేదు.

నేను సిద్ధంగా లేని ఈ సంఘటన నన్ను, నా నమ్మకాలను వమ్ముచేసింది. ప్రాణం – ఇంత పెళుసా? సబ్బునీటి బుడగా? నా ఒడిలో వున్న శివ శవాన్ని – ఇప్పటివరకూ అతను శివ – ఇప్పుడు శవం! కేవలం డెడ్‌బాడీ! ఎన్ని డెడ్‌బాడీలు చూడలేదు – జీవన్మరణాల సన్నటి గీత తెలియదా? కాని నా జీవితంలో ఇంత తొందరగా అది చెరిగిపోతూందని ఎట్లా అనుకుంటాను?

ఎందుకో నాకు నా మొదటి ఎనాటమీ హాలు – తొట్టెలో అపరిచితుని 'బాడీ' గుర్తుకు వచ్చింది. ఇప్పుడు – ఈ బాడీని ఏంచెయ్యను?

అలాగే గుంటూరు తీసుకువెళ్ళి 'మరణ కారణం' తెలుసుకోవాలికదా? ఆటోప్సి చేసి 'బాంబు' పేలింది – అతని మెదడు కణాలన్ని రక్తంలో తడిసి, ప్రాణం పోగొట్టుకున్నాయి. మెదడునుంచి సంకేతాలు రాకపోతే శరీరంలో మిగతా అవయవాలు పనిచేయవు. So - death is instant.

* * *

ఈ పరిస్థితి నుంచి, నేను తేరుకోవటానికి మరీ ఎక్కువ రోజులు తీసుకోలేదు.

కర్మకాండలన్నీ పూర్తయి – శివ ఫోటోరూపంలో గోడకు చేరింతర్వాత గంధం బెరడు దండవేస్తూ ఎందుకిలా చేశావు? నిండా ముప్పయి నిండలేదు. ముచ్చటలన్నీ ముగిసిపోయినట్లేనా? ఒంటరి జీవితం ఎలా గడపాలి – ఒకప్పటికి వున్నది – ఇప్పుడు లేదనుకుంటే, ఆ వెలితి మరింతగా భయపెడుతుంది – ఎందుకు నా జీవితంలో అన్ని తొందరగా జరిగిపోతున్నాయి. బాబును ఎలా పెంచాలి? ఎన్నేళ్ళు – నాకంతా చీకటిగానే వుంది! గోడమీద బొమ్మ మౌనంగానేవుంది.

* * *

కాలం ఎవరి కష్టాలు పట్టించుకోదు. ఋతువులు క్రమం తప్పకుండా గడిచిపోతున్నాయి. జీవితంలో వెలితి ఏర్పడిన తర్వాత పూడ్చుకోక తప్పదు. కాని ఇది పూడ్చగలిగిన – సరిపుచ్చుకో కలిగిన వెలితి కాదు. మానసికంగా – భౌతికంగా – పేషెంట్లు – మందులు – నా పగళ్ళు ఎక్కువ సమయం గడిచిపోవటానికి ఆసరాగా వుంటున్నారు. క్రింద క్లినిక్ వదిలి మెట్లెక్కి ఇంటికి చేరగానే – ఒక శూన్యం – నిశ్శబ్దం మనస్సంతా ఆవరించేది. పుస్తకాలు చదవటం అలవాటు చేసుకున్నాను. పాతవి – కొత్తవి – బాబుని ఎక్కువగా అమ్మ సంరక్షించేది.

ఒంటరితనం కోర్కెలను మంటపెట్టేది! ఋతుక్రమంలో సెగలు రేపేది – ఇవి ఆరే మంటలు కావు. తీరే కోర్కెలూ కావు! అణచుకోవాలి – ఆర్పుకోవాలి ఎలా?? ఇదేకదా జీవితంలో విషాదం!

సినిమాలు చూడటం – పుస్తకాలు చదవటం, సభలకు వెళ్ళటం – ఇవన్నీ భౌతిక సమయాన్ని ఆక్రమించేవిగాని – మానసికంగా శూన్యాన్ని పెంచేవి – రాత్రికి ఒంటరిగా మంచంమీద చేరితే – వేడితో – తోడు కోసం శరీరం ఉడికిపోయేది. ఏ.సి. ఎంతవరకు? చర్మానికి ఉపరితలానికే కదా – అయినా నిద్ర, కలత నిద్రే కానివ్వండి కలలతో సేదతీర్చేది.

* * *

కొన్నాళ్ళు పూర్వ విద్యార్థుల సంఘంలో చేరి, ఊళ్ళు పూళ్ళు తిరిగాను. అక్కడందరూ ఆనందంగా వున్నట్లు కనిపించేవారు. కాని ఎవ్వరి కష్టాలు వారికున్నాయి. అవి ఎక్కువ వృత్తి సంబంధం – విత్త సంబంధం – కాని నాలాగా గుండె లోతుల్లో మొదలయి వళ్ళంతా మరగపెడుతున్న నీటిలో నిప్పు కాదు. ఇది ఆరేది కాదు.

పుస్తకాలు ఎందరినో పరిచయం చేశాయి. చాలా

మందితో సంభాషణలు – చర్చలు నడిచాయి. అవి పుస్తక విషయాలకే పరిమితం – కొన్ని స్నేహాలు కుదిరాయి. అవి సభలకు – సమావేశాలకు మాత్రమే, ప్రాంగణమితం! కొందరు పేరున్న, వయసులో పెద్దయినవారు ఇంటికి వచ్చేవారు. అదీ నా ఆహ్వానంమేరకే. ఇవన్నీ నా శూన్యాన్ని తగ్గించుకోవటానికే, కాని విస్తృతమైన నా మనోభావనా ప్రపంచంలోకి ఎవరూ ప్రవేశించలేకపోయారు.

*నాకు తెలియకుండా – ఈ శూన్య వేదన నా హృదయాన్ని రమణీయ సుందర వనంగా మార్చివేసింది. పారిజాతాలు – బొండుమల్లెలు విరగబూసి పరిమళంతో నిండిపోయింది. ఆ చీకటిలో మెల్లమెల్లగా వెన్నెల పొరలు ప్రవేశించాయి. మంచుతెరల్లా విడిపోతున్నాయి. చలితెమ్మెరలకు ఊగిసలాడే లతల నీడలో చలువరాతి సింహాసనం ఎప్పుడు రూపుదిద్దుకుందో నేను గుర్తించేలోపు సిద్ధమయి కూర్చుంది! ఈ వింత వనంలో కొమ్మల రెమ్మల పూవుల ఊయలలో ఊగుతూ ఆ చలువరాతి పీఠాన్ని చూస్తుంటాను. అది ఎవరికోసం?*

*వెన్నెల కిరణాలలో నుంచి గంధర్వుడు దిగి వస్తాడా?*

*పూలపరిమళాలు రూపుదిద్దుకుని మూర్తిమంతమవుతాయా? లతానికుంజాల పార్శ్వం నుంచి – దారి చేసుకుంటూ నడివస్తాడా? కేవలం నా కోర్కెలలో, భావనలలో అంతరంగకేళిలలో మరిగిమరిగి పోతపోసుకుంటున్న ఈ 'మూర్తి'ని – నేనెలా గుర్తుపట్టేది??*

నాకిష్టమయిన పాటలు వింటూ బాల్యాన్ని, గతాన్ని మరిచిపోవటానికే ప్రయత్నించాను. ఈ లలిత సంగీత సమీరాలు – నాలో ప్రేమ భావాన్ని మరింతగా పరిపుష్టం చేశాయి. ఇంతవరకూ ఎవర్నయినా ప్రేమించానా? ఏమో? శివుడు ఒక సందర్భం – అంతే – అప్పుడు ప్రేమకు – రమణీయమైన భావనలకు, అవకాశం ఏది? అదీ అంత సమయం లేకుండానే సమసిపోయింది! కార్డియం – తన వర్జినిటీని ఎవరికోసం కాపాడుకుంటోంది? నాకెలా తెలుస్తుంది?

* * *

ప్రకృతిలో ఒక్కో ఋతువు ఏదో ఒక జీవానికి పదునుపెడుతుంది.

జల్లులు పడితే నేల పదునెక్కుతుంది. వర్షాలు పడితే నదులు పరుగులు పెడతాయి. పూలు పూసి, పిందెలు కాయలవుతాయి. చిరువేడి ఎండ పొడలకు కాయలు పండ్లవుతాయి. ప్రాణికోటి తమతమ ఋతువుల్లో పునరుత్పత్తికి పదునెక్కుతాయి. ఇవన్నీ సహజంగా జరిగిపోతుంటాయి.

*కాని, ఆరోగ్యంగా, ఉడుకు రక్తంతో పరుగులు పెడ్తున్న నా శరీరం పదునెక్కి, అదే కీట్సు అన్నట్లు 'ripening breasts' బరువెక్కి ప్రతి రాత్రి నా భావనావనంలో నేనూగే ఊయల లతలు తెగిపోతాయేమోనని భయంతో, వెన్నెలతో తడిసిన చలువరాతి పీఠాన్ని చూస్తూనే వున్నా – అది ఖాళీగా నన్ను వెక్కిరిస్తున్నట్లు నవ్వుతోంది.*

*ఏదీ – ఈ లలిత లతానికుంజాల గజిబిజిలో చలి వెన్నెల వేడిలో పొగడపూల పరిమళాల గిలిగాలులలో ఎన్నాళ్ళకొస్తాడు? ఎదురు చూసి వాలిపోతున్న రెప్పల బరువుకు కొలమానం ఏ ఋతువు??*



* * *

జీవితం మనకు కావలసినట్టు ఎప్పుడూ ఉండదని నాకెప్పుడో కనువిప్పు కాలేదా? అయితే బ్రతుకులో వెలితి ఎలా పూడుతుంది? ఎవరికి వారు నింపుకోగలిగితే ప్రేమకు ఎవరి ఆసరా అవసరంలేదుకదా? మరి ఎలా వుంటుందో – ఎక్కడుంటుందో ఎప్పుడుంటుందో తెలియని 'మూర్తి' కోసం ఎలా గాలించాలి? ఏ గాలినడగాలి? లేకపోయినా పరవాలేదు – రాకపోయినా పరవాలేదు – కాని ఎదురుగా వుంటే ఎంత బాగుండును? అని ప్రతి నిద్రలోని కలలో కలవరిస్తూనే వున్నాను.

*కలల మబ్బుల్ని పిండితే వలపు తేనియలు రాలతాయా?*

*పూల తేనెలను మోసుకొచ్చే తేనెటీగల్లా నా ఆలోచనలన్నీ మనసుని – మధురాతి మధురమైన ప్రేమతో*

*నింపివేసాయి.*

* * *

ఆ రోజు ఏదో సమావేశం – సమాజంలోని వ్యక్తులు ఏదో మిషతో కలిసే సందర్భం – అక్కడే ఆ సాయంత్రమే అతనిని గుర్తుపట్టాను. గుర్తు పట్టానంటే అంతకు ముందు కలిశానని కాదు.

కవితల కలతలలో – కథల సంపుటిలో పరిచయం వున్న, రేఖామాత్రంగా ఆ ముఖాన్ని ఏ పుస్తకం చివరో చూసినవాడే, ఒక్కసారిగా గుర్తుపట్టానంటే – నే వెదికేది ఇతడేనేమో? ఎలా తెలుస్తుంది – గుండె దడ వినబడటానికి ఇది ప్రశాంతవనం కాదు. అంతా గడబిడ ధ్వనులే. అయినా గుండె లోపల గొణుగుడు – పెదవిపైన వణుకుగా తెలుస్తుంది.

సమావేశ మందిరం బయట పచ్చికలోనో ఆ గట్టుమీదో కూర్చున్నాం. ఇంకా ఒకరిద్దరు వున్నారు. ఏదో మాట్లాడుతున్నారు. అందరూ అందరితో, అతనంతగా పట్టించుకోలేదు. 'మీ కథలు చదివాను. కవితలూ చదివాను' అంటూ చొరవ తీసుకుంటే 'మీరూ?' అని అంటాడు. 'నేనెవ్వరిని?' అది నాకే వింతగా అనిపించింది. పరిచయం చేసుకుంటుంటే – 'ఓ' 'ఇంకా ఏమి చదివారు?' 'మీకు తీరుబడి వుంటుందీ' అలా – మాటలు సాగితే రాత్రి ఆగిపోతుందా?

'మళ్లీ కలుద్దాం' అనుకుని విడిపోయాను.

*ఆ రాత్రి నా ఆలోచనల వనంలోని చలువరాతి పీఠం ఖాళీగా కనిపించలేదు, ఏదో వెన్నెల నీడ పరచుకొన్నట్లు!*

* * *

అతని కథలన్నీ మళ్ళీ చదివాను – కవితలన్నీ మళ్లీమళ్లీ చదివాను. ఆ రచనలన్నీ అనుభూతి రచన లేననిపించాయి. కథల్లోని వ్యక్తులు నాతో స్నేహం చేస్తున్నట్లు – కవితల భావావేశం నన్ను చుట్టివేస్తున్నట్లు ఉక్కిరిబిక్కిరి అయిపోయాను.

*ఒక్కసారిగా నా మధురోహలన్నీ మూర్తిమంతమయి – మనోహరంగా చలువరాతి పీటమీద ఆసీనమయినట్లు – నాకు తెలియకుండా నేను వెతికే వ్యక్తి సజీవంగా స్నేహపూర్వకంగా ఎదురుచూస్తున్నట్లు – కలవరపరచి – కలల వరాలు రాలుస్తున్నట్లు–*

*హృదయావేదన నిదానమై – నన్ను ఇన్నేళ్ల కలవరింతల నుంచి మేలుకొలుపుతున్నట్లు రమణీయ భ్రమల సంభ్రమాల సంరంభంలో తలమునకలయి మర్నాడుదయం నిద్రలేచాను.*

ఎండ కొత్తగా వుంది. చెట్లు సరికొత్తగా తలలూపుతున్నాయి. ఇప్పుడే ప్రవేశిస్తున్న శీత గాలులు మరింతగా కేరింతలు చిలుకుతున్నాయి. ఉదయపు నడకలో లోగిళ్ళ ముగ్గులు నాకోసమే ఆదరంగా పరుచుకుని లేలేత ఎండ పొడకు వళ్ళు విరుచుకుంటున్నాయి. కాలవలో నీరు పెళ్లి నడకతో కదులుతుంది. ఒకటి రెండు కొంగలు – పచ్చగడ్డి పురుగులేరుకుంటున్నాయి. ఎప్పుడూ చూడని పూలు రంగులు పూసుకుని కళ్లు తెరుచుకుని తుమ్మెదలకోసం ఎదురు చూస్తున్నాయి.

ప్రకృతి ఇంతగా పరివశించిపోతున్నట్లు నేను గుర్తించానా? లేక నా మానసికోల్లాసం ఈ ఉదయ శోభను మరింతగా వెలిగిస్తుందా?

* * *

ఇప్పటివరకూ ఎన్నో తొందరగా జరిగిపోయిన నా జీవితం ఇప్పుడు స్లో మోషన్‌లో వెళ్తున్నట్లు! మళ్ళీ ఎప్పుడు కలుస్తాడో? ఎక్కడ ఎలా కలవాలి – నాలో ఒక ఆలజడి – ఒక అసహనం పెరిగిపోతున్నది. చివరికి తెగించి ఒకరోజు ఫోను చేశాను. 'చెప్పండి!' అన్నాడు. హలో అనాలికదా? ఫోనులో అతని గొంతు – మంద్ర గమకాలతో హాయిగా వినిపించింది! 'నేను, మొన్న క్షేత్రంలో కలిశాం' అని గుర్తుచేశాను. 'ఆఁ – ఎలా వున్నారు!' ఎలా వున్నానో ఎలా చెప్పను? మరి ఏమి మాట్లాడాలి? 'వచ్చే ఆదివారం – లంచ్‌కి రాగలరా?' 'ఏమిటి విశేషం?' 'మీరు రావటమే' 'మరో ఫ్రెండ్‌తో...' 'మీరొక్కరే రండి' అని 'వచ్చే ఆదివారం – ఎదురు చూస్తుంటాను' అంటూ ఎలాగో ముగించాను. నా మానసిక స్థితి అస్తవ్యస్తంగా వుంది.

ఆదివారం ఇంకా ఎన్నిరోజులు? పేషంట్లనూ – నర్సునీ విసుక్కుంటున్నాను – రాత్రిళ్ళు నిద్ర తగ్గిపోయింది. ఎందుకీ అలజడి? రేపు ఆదివారం అనుకుంటాను –

*ఆ రాత్రి నిద్ర లేదు. నిద్ర లేకపోతే కలలెలా వస్తాయి. కల రాకపోతే వెన్నెల వనంలో చలువరాతి పీఠం ఎలా కనపడుతుంది – ఆ పీఠాన్ని అలంకరించిన 'అతగాడు' ఎలా కనబడతాడు? నాకు ఒక్కసారిగా ప్రేమస్వరూపం అవగతమయింది. నా హృదయంలో ప్రేమ ఉప్పొంగి ఉప్పెనగా నన్ను ముంచేస్తోంది – ఊపిరి సలపక ఊయల – లలిత లతాశృంఖలాల ఊయలనుంచి – అతని ఒడిలో*

*పడిపోయి ఎప్పుడో నిద్రపోయాను. చలువరాతి ఆసనం పూల రథంలా మారిపోయింది!*

*మధురోహాలు పూల పుప్పొడిలా కలల కలవరింతలు వడివడిగా వరవడిగా ఒడలంతా పరచుకుంటే రాగరంజితమో – అనురాగ రంజితమో తెలియని మానసిక స్థితి స్థిరంగా ఎలా వుంటుంది? ఇప్పటివరకూ దర్శనమిచ్చిన నా భావనా వనంలోని చలువరాతి ఆసనం పూలరథంలా మారిపోతే ఆశ్చర్యపోవటమే నేను మెలకువలో కలగనటం!!*



*మాధవీ లతలు మల్లెల మాలలూ పెనవేసుకుపోయి నిర్హేతుక హృదయావేదనలు రగిలిస్తుంటే సంవేదనల ఝరి వెన్నెల ఏరయింది–*

* * *

ఆదివారం దాదాపు పదిగంటలకు కారు ఆగిన శబ్దం విని – గుండె దడ పెరిగింది. మెట్లు దిగి ఎదురువెళ్ళి నవ్వుతూ ఆహ్వానించాను. గుప్పెడు గులాబీలు ఇచ్చాడు – ఇన్ని తొక్కుడు లడ్డూలు తెచ్చాడు – పైకి తీసుకెళ్ళి పుస్తకాల గదిలో కూర్చోబెట్టాను. కాస్త ఆశ్చర్యంగా – 'చాలా పుస్తకాలున్నాయే' అన్నాడు. నేను అతన్నే చూస్తున్నాను. అంతలో నా 'సీజర్' వచ్చి అతని కాళ్ళదగ్గర కూర్చుంది – ఇది కూడా ఇతన్ని గుర్తుపట్టిందే!

కాస్సేపు పుస్తకాలు చూస్తూ 'చాలా చదివారు' స్వగతంలా అన్నాడు. అతన్నే చూస్తున్నాను.

ఎలా వుంటాడో మీకు తెలుసుకోవాలని వుంటుంది!

కాని అతను నా ప్రేమస్వరూపం – ఆ రూపానికి ప్రేమ, రమణీయ – కమనీయ కవచం. చూస్తూ వర్ణించలేని అంధత్వం నాది. అతనికి నేనేమి సంకేతాలివ్వగలను?

పదహారేళ్ళ మనసేగాని – పడుచు ఈడు కాదు – యౌవనోద్రేకంలో మైమరచి లేనుకదా – నా ప్రేమకు ఆసరాగా లభించిన బహుమతిని చేజార్చుకునే ఆవేశం లేదుకదా–

అందుకే – అతన్ని శ్రద్ధగా పరీక్షగా గమనించాను.

బహుశా నా వయస్సే ఉంటుంది. జుట్టు కాస్తంత పలచబడుతోంది. నుదురు నదరుగా వుంది – కనురెప్పలు పెద్దవే. ఐ లాషెస్ పొడవుగా కాస్త వంపులో ఉన్నాయి.

ఆ రెప్పల చాటున తెల్లని కనుగుడ్డులో నల్లని పాపలు – నావంక చూసినప్పుడు రెండు వెలుగు చుక్కలు మెరుస్తూ! కనుబొమ్మలు తీర్చినట్లున్నాయి. ముక్కు సూటిగా కొనదేలింది. దాని క్రింద చిన్న మూతి, తక్కువ మాట్లాడతాడేమో. సన్నని మీసకట్టు – చుబుకంలో కాస్త చీలిక – కనపడని ఆడమ్స్ యాపిల్ – చెవులు కాస్త పెద్దవే, ఎటువంటి వంకా లేకుండా బుద్ధుని తమ్మునిలా వున్నాయి. ఎక్కువగా వింటాడేమో.

చెంపలు మరీ నునుపుగా లేవు. చాలా జాగ్రత్తగా షేవ్ చేసుకొని ఓల్డ్ స్పైస్ రాసుకున్నట్లుంది. సైడ్‌లాక్స్‌లో ఒకటి రెండు వెండి వెంట్రుకలు! లేత నీలం రంగు కలర్ ప్లస్ లినెన్ షర్టు – ఫుల్ హ్యాండ్స్ గుండీలు – ఎడంచేతికి సిటిజన్ ఈకో వాచ్ మెరుస్తుంది – వేళ్ళు మరీ పొడవు కాదు. గోళ్ళు నీట్‌గా మెనిక్యూర్ చేయబడి ఉన్నాయి. ఎమరాల్డ్ రాయితో ఉంగరం ఉంది కుడిచేతికి. అరచేతులు రక్తంతో గులాబి రంగులో ఉన్నాయి. 'కాకీస్' సీ బ్లూ జీన్‌ప్యాంటు నీలాకాశంలా ఉంది. బూట్లు బయట విప్పాడు కదా – గ్రే రంగు సాక్సులో పాదాలు దాక్కున్నాయి. ఆరోగ్యంగా ఉన్నాడు. but he knows how to present himself.

ఇవన్నీ అతని అందాన్ని పరిచయం చేయటానికి చెప్పటంలేదు. మీకు ఎక్కడైనా కనిపిస్తే గుర్తుపట్టగలరేమోనని!

అయినా నా ప్రేమస్వరూపం రమణీయం – రమణీయ రమణీయంగా వుండక మరెలా ఉంటుంది!

నా మనసు ఆనందంతో పరవళ్ళు పోతున్నది. తన పుస్తకాలు చూసి కళ్ళు పెద్దవిచేసి నావంక చూశాడు. 'అన్నీ చదివాను – ఒకటికి రెండుసార్లు' అన్నాను. 'ఏమిటీ విశేషం?' 'మీ శైలి – అనుభూతి వేదన, దానికి అతికిన ఊహల తళుకు – పూర్తికాని వాక్యాలు – రమణీయ విషాదం, అంతంకాని ఆ కథాంతాలు!'...

'అబ్బా చాలా వున్నాయే. నా కవిత ఏదయినా చదివి

వినిపిస్తారా?'

సుషుప్తి నిక్షిప్తాల నుండి
స్వప్నాకాశపు కాల మేఘాలకావల
కనిపించే నీ రూపు...
తళుక్కున మెరుస్తూ
ఇక్కడినుంచే చేతులు సాచి
నేనేడుస్తూ...!

ప్రేమ విషాద కవిత చదవడం మొదలుపెట్టాను. అతను కళ్ళు మూసుకుని వింటున్నాడు.

"అవ్యక్త మహాశూన్యపు ఒంటరితనం నాది...
అమ్మ జ్ఞాపకాల కోసం జన్మ రహస్యాన్ని వెతుకుతున్న దురదృష్టం నాది."

అతని కంటి చివర ఓ తడిచుక్క..

"నా నిరీక్షణా నిష్ఠురతతో,
ప్రకృతినుండి నీవు ఉద్భవించాలి
నా ప్రేమ ఆర్ద్రతలో నుంచి
నీవు ప్రాణం పోసుకోవాలి
లేని నిన్ను సృష్టిస్తాను,
రాని నిన్ను రప్పిస్తాను.."

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు - సూటిగా నా కళ్ళల్లోకి చూశాడు! ఆ చూపుల్లో సూదులే వున్నాయి. అవి నన్ను దాటి చూస్తున్నాయి.

అతనికి సంకేతాలు చేరాయని నాకు తెలిసింది - అర్థమయ్యిందనీ అర్థమయ్యింది.

* * *

వెండి పళ్ళెం - బంగారు పువ్వుతో వున్న వెండి పళ్ళెంలో పూర్ణాలు పెట్టాను - వేడి గారెలూ పెట్టాను - పూర్ణంలో నా చూపుడువేలుతో నొక్కి కమ్మటి నెయ్యి వేశాను - అతను ఇష్టంగా తింటుంటే - చక్కని అతని పలువరస చూశాను - 'ఊఁ బాగుంది!' అంటే కొసరి కొసరి వడ్డించాను. మల్లెపూవులా మెత్తని అన్నం వడ్డించి, ఆవకాయ ముక్క వేసి, ముద్దపప్పులో నెయ్యి పోసి... అతను కలుపుకుని తింటుంటే నా కడుపు నింపుకున్నాను. మళ్ళీ దప్పళంలో పప్పు కలిపించి తినిపించాను. బెండకాయ వేపుడు పచ్చిపచ్చిగా వేసింది, తెల్లని అన్నంలో పచ్చగా కలిపించి తినిపించాను. ములక్కాయ, సొరకాయ ముక్కలతో పప్పుచారు వేడిగా ఆరగింపచేశాను. ఎక్కిళ్ళు వస్తే వెండి గ్లాసుతో నీళ్ళందించాను. గడ్డపెరుగు మీగడతో వేసి, చక్రకేళి వలిచి పళ్ళెంలో పెట్టాను. ఏవో కబుర్లు చెబుతూనే తినిపించాను.

'మీరు భోజనం చేయండి' అంటే 'తరువాత' అన్నాను. నా ఆకలి తీరిపోయిందని అతనికెలా తెలియజేయను?

చేయి కడిగించి, తువ్వాలుతో నేనే తుడిచాను - 'అయ్యో' అంటున్నాడు.

మళ్ళీ పుస్తకాల గదిలో కూర్చోబెట్టి - పాయసం తెచ్చి యిచ్చాను - అతను స్పూనుతో పాయసం నోటికందిస్తుంటే - వేడికి తన పెదవులు కందిపోతాయేమోనని భయపడ్డాను - పాయసంతో తడిసిన పెదవులు తియ్యగా వుండవా!

'ఎందుకు మీకీ శ్రమ'

ఎందుకు? నాకు నేనే సమాధానం చెప్పుకోలేని - వెతుక్కోవలసిన ప్రశ్న! ఎందుకంటే ఏమిచెప్పను? ఆ తరువాత పుస్తకాలు - పాటలు - సినిమాలు ఎన్ని కబుర్లు చెప్పుకున్నా - నేను గాలిలో మూడు అడుగులు ఎత్తులోనే వున్నాను - అతన్ని నాకంటే ఒక అడుగు ఎత్తులోనే కూర్చోపెట్టాను - తర్వాత విడిపోవటం బాధాకరం కాబట్టి ఆ వివరాలు చెప్పలేను.

ఆ కథ ఇక్కడితో ఆపివేస్తే బాగుంటుంది. కాని తర్వాత ఏమి జరిగిందో తెలుసుకోవాలని మీరు ఆతృతతో ఎదురుచూడటం నేనర్థం చేసుకోగలను. కాని, అప్పుడు, నాకు తర్వాత జరిగే సంఘటనలు ఎలా తెలుస్తాయి? ఏ విధంగా అర్థమవుతాయి!

మర్నాడు, తెలతెలవారక ముందే తూరుపు చెరువు వైపు వెళ్ళాను. చిరుగాలులు అలసిపోయినట్లు ఇంకా మేలుకోలేదు. చెరువులో అలలే లేవు. పురుగుల కోసం పిట్టలు వాలటమూలేదు.



కొంతసేపు తూర్పు వెలుగు కోసం చూస్తూ నిలుచున్నాను. సుదూరంగా సూర్య రథాశ్వాల గిట్టల శబ్దంగా పిట్టలు వాలటం వినిపించింది. వాటి వెనకే దిగంతంలో బంగారపు దుమ్ము రేగింది. తాటిచెట్ల వెనకనుంచి బాలభాస్కరుడు తప్పటడుగులతో ఎగబాకుతున్నాడు.

నా జీవితంలో ఒక క్రొత్త పొద్దు – రాగరాగరంజితమై వెలుగు రెక్కలు విప్పుకుంది! అలా ఎంతసేపు నిలుచున్నానో – చివరికి ఎండ చురుక్కుమంటున్నప్పుడు తిరిగి ఇంటికి చేరాను – అప్పటికే ఒకరిద్దరు రోగులు వచ్చి బల్లమీద కూర్చున్నారు. మళ్ళీ మందుల ప్రపంచంలోకి...

* * *

అలా రోజులు – ఇంతకు పూర్వంలాగా కాకుండా ఒక ఉత్సాహంతో ఏదో తెలియని, ఏదో జరగబోతున్నదనే కొత్త ఆశతో తేలికగా తేలిపోతున్నాయి. రోగుల్ని నవ్వుతూ నయం చేస్తున్నా – నర్సును విసుక్కోవటం తగ్గించాను – వాళ్ళు అన్నీ గమనిస్తుంటారు – 'అమ్మగారు – ఆనందంగా వున్నారు! డాక్టరుగారు నవ్వుతున్నారు' అనటం వింటూనే వున్నాను. నాలో మార్పును గమనించిన సీజర్ చనువు ఎక్కువగా తోక ఆడిస్తోంది. అమ్మ ముఖంలో ఏదో తెలియని తేలికదనం.

అప్పుడే వసంతం ప్రవేశిస్తోంది – కొత్త మావిచివుళ్ళు మేసి కోయిలలూ పిలుస్తున్నాయి. పెరటిలో మామిడిచెట్టు పిందెలు వేలాడదీసింది. వేపచెట్టు పూత విరగబూసింది. ఈ రోజుల్లోనే – మా స్నేహం దగ్గరయ్యిందని అనుకోవచ్చు – అనుకున్నాను. అంతేనా – ఎప్పుడూ నేతచీరలు కట్టుకునేదాన్ని – కాశ్మీరు సిల్కు, కంచిపట్టు చీరలే కడుతున్నాను – ఎప్పుడూ చేతిగోళ్ళు మరీ పొడవుగా కాకుండా తీరుగావుంచి – గోరింటాకు పెడుతున్నాను – అరచేతుల్లో 'ఆకు' పెట్టి పండించాను – కొత్త కారూ కొన్నాను. పాయిజన్ పెర్ఫ్యూమ్ కూడా వాడుతున్నాను!

అతని ప్రతి ఉత్తరం ప్రేమలేఖలా అనిపించేది – అందులో విషయాలేమి వున్నా – అతని ప్రతి కవితా నా కోసమే రాసినట్లుండేది. ఒకసారి అడిగాను – 'పత్రికలకు పంపకూడదూ?' అంటే 'అవి ఎవరికి చేరతాయి' అని నవ్వి ఊరుకుంటాడు.

ఒకటో, రెండో నేనే పంపాను కూడా – అవి అచ్చయితే – 'కాపీరైటు ఉంటుందని తెలుసుకదా!?' అని మందలింపు – అయినా నాకెంత ఆనందమో అవి అచ్చులో కనపడితే – ఈ మధ్య పగటి కలలు ఎక్కువైనాయి మరి.

ఒకసారి కొత్త కారులో అతని ఆఫీసు దారిలో వెళ్తూ – పాటల కాసెట్టు ఇచ్చాను. ఇస్తూ "వినండి – రాత్రి ప్రశాంతంగా కళ్ళు మూసుకుని?" అన్నాను. 'నువ్వు కనపడతావా?' అన్నాడు. అప్పటికే ఏకవచనమే కావాలని పిలిపించుకుంటున్నాను – ఆ మర్నాటినుంచే అతని ఫోనుకోసం ఎదురుచూశాను. రెండు మూడు రోజులు ఏ ఫోనూ లేదు. వినలేదా? వింటే ఈ మౌనానికి అర్థం ఏమిటి? ఈ సస్పెన్సు భరించటం కష్టంగానేవుంది. ప్రేమ వున్నచోట అహం వుండదు. అహం లేనిచోట తెరలూ వుండవు. ఓ రాత్రి పదిగంటలకు ఫోన్ చేశాను! అతని తీయని గొంతు వగరుగా వినిపించింది. 'విన్నారా౹ 'ఆఁ, ఇప్పుడు కూడా వింటున్నాను' 'ఇంకా?, స్వింగ్‌లో కూర్చుని వైన్ – సిప్ చేస్తున్నా' 'అబ్బో బావుందే' – 'ఈ అదృష్టం మీకు లేదుకదా!' 'అవును – ఇప్పటికి ఉన్నవాటితోనే ఎక్కువైపోయి' అని. 'ఏమీ అనుకోలేదుకదా?' 'అనుకోవలసిందే – అనుకున్నాను, మనం అమాయకులం కాదుకదా?' 'మరి?' 'మరి సమాజం?'

'ఆమాత్రం నాకు తెలియదా?' అంటూ ఫోనుపెట్టాశాను.

*గుండె బరువుగా వుంది. బయట డాబామీదకు వచ్చాను – నిండు పున్నమి వెచ్చగా వుంది. మామిడిపండు – అందనంత దూరంలో చెట్టు కొమ్మకు నిండుగా వుంది. పొగడపూలు – జాబిలి కన్నీటి బిందువుల్లాగా రాలుతున్నాయి. అనంత లోకాలలోని తారలు ఆరి వెలుగుతున్నాయి – వెన్నెలలో నా చెక్కిళ్ళు వెచ్చని కన్నీళ్లతో తడుస్తున్నాయి.*

*రాత్రంతా కళ్ళు తెరిచే నిద్రపోయాను – కలలు – పగటి కలలు – ఇప్పుడు పీడకలలై కళ్ళు పీకుతున్నాయి.*

* * *

పుస్తకాల సంత జరుగుతుంటే ఓ సాయంత్రం వెళ్ళాను – అలా తిరుగుతుంటే ఓ చోట చుట్టూ మనుషులతో గంధర్వుడు కనిపించాడు! చాలాసేపు దూరంనుంచే చూస్తూ నుంచున్నాను – నా ఉనికి గమనించి, లేచి వచ్చాడు. ఇద్దరం–

తర్వాత పుస్తకాల దుకాణాల వెంట – చాలాసేపు కలిసి తిరిగాము. దాదాపు రెండు గంటలు నాకు గాలిలో కలిసిపోయాయి. సాయంత్రం రాత్రయింది. రాత్రి ఎనిమిదయ్యింది – ఇక వెళ్ళిపోవాలి – నాకు వెళ్ళాలని లేదు – 'సినిమాకెళదామా?' 'మనం చూసే సినిమాలేమున్నాయి? అయినా నీకు ఆలస్యం అయిపోతుంది – దూరం వెళ్ళాలి

కదా?' అని నా నెత్తిని నీళ్ళు జల్లాడు – విడిపోయేముందు – ఒకసారి అతనిచేతిని రెండు చేతుల్లోకి తీసుకుని – గుండెకద్దుకున్నాను – 'ఏమిటీ పిచ్చి?' అని రహస్య వేదనతో, అదే వెచ్చని చేతితో నా చెక్కిలి నిమిరాడు. అవును ఇది పిచ్చికాదా? ఎలాగో ఎప్పుడో ఇల్లు చేరాను.

ఈ పరిస్థితికి అతనే పరిష్కారం చూసినట్లున్నాడు. ఒకరోజు ఫోన్‌చేసి "ఊరు మారిపోతున్నాను – నీకు దూరంగా వెళ్ళిపోతున్నాను" అన్నాడు – 'ఎందుకు ఇంత సడెన్‌గా?', 'మరో వ్యాపకం', 'నేను రాలేనంత దూరమా?' 'మనం కలవలేనంత దూరం', 'పారిపోతున్నారా?' 'మారిపోవటం లేదుగా – ఫోన్ చేస్తుంటాను – మాట్లాడు!' అంతే – ఫోన్ ఆగిపోయింది. అతని తియ్యని గొంతు విషపు బిందువులు రాల్చినట్లు నాకు వళ్ళంతా మండిపోయింది. నేను పూర్తిగా కోలుకోవటానికి వారంరోజులు పట్టింది.

* * *

ఇంతలో ఎన్ని మార్పులు – సెల్‌ఫోన్లు వచ్చాయి – అప్పటికే ఇంటర్నెట్ గూడు అల్లుకుంది – నాకు రోగులు పెరిగారు – రోగాలు ఎక్కువగా ముసురుకుంటున్నాయి. ఏ రోగం ఎందుకు వస్తుందో – ఏ మందు దేనికి పనికివస్తుందో డాక్టర్లకే తెలియని పరిస్థితి వచ్చేసింది. ఏ జ్వరం దేనిదో – మలేరియా, చికెన్‌గున్యా, డెంగ్యూ – ఒకటేమిటి రోగులను చూస్తుంటే జాలివేస్తుంది. రోజులో పదిగంటలు క్లినిక్‌లోనే గడిచిపోతుంది. రాత్రిళ్ళు ఇన్‌పేషెంట్లు ఉండనే ఉంటారు – శరీరం అలసిపోతే – మనసు విశ్రాంతి తీసుకుంటుంది – ఎండలు ముదిరిపోతున్నాయి – వేసవి తెచ్చే రోగాలు పెరిగిపోతున్నాయి.

ఒకరోజు సెల్‌ఫోన్ మోగింది – 'ఎక్కడ వున్నావు' నేనే అడిగాను. 'హాస్పిటల్‌లో' ఎంత డాక్టర్నయినా – ఏదో కీడు శంకించాను – 'ఏమయింది' నా గొంతు పూడుకుపోయింది – 'ఏయ్ – నథింగ్ - 'I was knocking the soft golden gates of St. Peter for three days and nights...' 'నీ కవిత్వం ఆపి – ఏమయింది, చెప్పు – 'అదే Haematoma - Burr hole evacuation మూడు రోజులు కోమాలో, అంటే జీవితంలో మూడు రోజులు మిస్సింగ్!'... ఏదో అంటున్నాడు – 'సరే – సరే' అని ఫోన్ ఆపివేశాను.

'అయ్యో – ఎంత దురదృష్టం – ఎంతదృష్టం! ఏం చెయ్యాలి? వెళ్ళనా? తట్టుకోగలనా? నాకే ఎందుకిలా జరుగుతోంది – కట్టుకున్నవాడు – మెదడు బాంబుతో గట్టెక్కాడు.

నేను అపురూపంగా – మనసంతా ప్రేమతో నింపుకున్న గంధర్వుడు – ఇప్పుడు అదే, అలాంటి మరో ప్రమాదంలో కోమాలోకి వెళ్ళివచ్చాడు – ఇదేనా నా 'అమిడాస్ టచ్?'

ఒకప్పుడు నేను క్లినిక్‌లో కూర్చుని రోగులకోసం చూస్తుండేదానిని. ఇప్పుడు రోజులో ఎప్పుడూ రోగులుంటున్నారు. రోగుల సేవలో సేదతీరుతున్నాను – దీనికీ ఒక కారణం వుంది. ఇప్పుడే చెబుతాను–

అతను నాకు దగ్గర్లో వున్నప్పుడే తన గురించి చెప్పాడు – తను పెరిగిన వాతావరణం – తన ఒంటరితనం – ఆ వివరాలు మీకు అవసరం లేదు కానీ – నాకతని 'లోతు' తెలియటానికి – ఈ నాగరకతను, ప్రపంచాన్ని అతని దృష్టిలో చూడగలిగాను. నా హృదయంలో అప్పటివరకూ అమృతంలా నిండిన ప్రేమ – అతనిపట్ల ఆరాధనగా పరివేదన చెందటానికి – ఆ వేదనలోని అమృత బిందువులు, దుఃఖంలోనూ సాంత్వన పొందటానికి దోహదం చేసింది. అప్పటినుంచే రోగుల్ని మరింత శ్రద్ధగా పట్టించుకుంటున్నాను. ఒకప్పుడు పదిమంది రోగుల్ని చూస్తే అలసిపోయేదాన్ని. ఇప్పుడు పదిగంటలు పనిచేసినా రోగులతో, అలసట తెలియటంలేదు. ఎంతో ఇష్టంగా సేవలో సేదతీరుతున్నాను. ఇదీ అతని పుణ్యమే అనుకున్నాను.

* * *

హాస్పిటల్ నుంచి బైటపడిన తరువాత రోజూ ఫోను చేస్తున్నాడు – అతనిలో ఏదో తెలియని మార్పు – నాకిష్టమైన మార్పే స్పష్టంగా వినపడుతోంది. 'ఎక్కడున్నానో చెప్పనా – కాకుల గోల వినపడుతుందా?' నవ్వుతూ అంటాడు! అంటే పార్కులో వున్నాడన్నమాట – చాలాసేపు మాట్లాడుతున్నాడు – 'నీ ఆరోగ్యం ఎలావుంది?' 'నాకేమిటి మృత్యుంజయుణ్ణి కదా?' అయ్యో అతనికి ఎలా చెప్పాలి? 'సరే, వుంటాను' అని ఫోన్ కట్‌చేశాను. కాలక్రమేణా నేను మాట్లాడటం తగ్గించాను. ఈ సమయంలోనే అతని కవితలు వచ్చి నన్ను కలవరపెట్టాయి. ప్రతి కవితా ఒక విషాద సౌందర్యమే! ఒక కథ కూడా పంపాడు, గుండెలో గుండుసూదులు గుచ్చుతూ. ఇవన్నీ నన్ను ఆనందంలో ముంచి తేల్చవలసింది. ఎందుకు ఆందోళన చెందుతున్నాను? ఈ పరిస్థితికి నాకు స్పష్టంగా కారణం – ప్రేరణ తెలుసు. కాని అతనికి ఎలా



తెలియచెప్పాలి?

* * *

నెలరోజులు చాలా తీవ్రంగా ఆలోచించాను – ఎటూ పాలుపోవటంలేదు. ఇంకా ఆలస్యం చేస్తే అతనే వస్తాడేమో? ఏమో? మళ్ళీ నా నీడపడితే? వద్దు... వద్దు... నా వృత్తిలో ఎన్ని మరణాలు చూడలేదు – మృత్యువు ప్రకృతిలో భాగమని తెలియదా? కాని దానిచుట్టూ ఎంతటి విషాదపు గోడు! భౌతికమైన మరణం – అగాధమైన విషాదానికి దోహదం కావటంలేదా?

* * *

*మరి మరి నా గంధర్వుణ్ణి రెక్కలు తెగిపడిన అడోనెస్‌లా ఊహించగలనా – నా సుప్తచేతనం నుండి తెగిపడిన స్వప్నంలా భావించుకోగలనా? నా కలల పదార్థం ఆవిరైపోతుంటే భరించగలనా? ఇది – ఇంతకంటే విషాదం ఏముంటుంది?*

*ఈ రోజులలోనే నా రాత్రులన్నీ భరింపజాలని వేదనలో భారమైపోయాయి. పూల తోరణాల మనోవనంలో విహరించటానికి మనసొప్పటం లేదు. అయినా నా విషాదం అటే నడిపిస్తోంది. కలలు, కల్లోల లోకమైపోయాయి. హఠాత్తుగా ఒక రాత్రి నిద్రలోని మెలకువలో, మండు వేసవిలో వాడివత్తలయిన మృదుల పూలహారాల హాహాకారాలు నిశ్శబ్దంగా వినిపించాయి. హరిత లతానికుంజాలు ఎండిపోయి హృదయవిదారకంగా కనిపించాయి. ఎంతసేపని వెదికాను? కఠిన శిలాశకలాలు కర్కశంగా గాయపరుస్తున్నాయి. నా చలువ రాతి గూడు పూల పుప్పొడితోబాటే వెన్నెల పొడిగా మారిపోయి అంతర్థానమైపోయింది. అయ్యో... అయ్యో... నా గంధర్వుణ్ణి ఎక్కడ కూర్చోబెట్టాలి? ఈ శిథిల సమాధుల వనంలో మరో స్మృతిఫలకం ఎలా చూడగలను..?*

నా మధురోహల ప్రేమవనం – సమాధుల పెనంలా దర్శనమిస్తోందేమిటి?

* * *

పగళ్ళు కదలటంలేదు – రాత్రిళ్ళు వదలటంలేదు – ఈ సమయంలోనే ఒక రోగికి నెలరోజుల పైగా జ్వరం వస్తున్నది. నా దగ్గరకు రావటమే ఆలస్యం చేశాడు. రక్త పరీక్షలు, స్కాన్ చేస్తే బ్రెయిన్ టి.బి. అని తేలింది. వెంటనే గుంటూరు పంపాను. ఇక్కడ నేను చేయగలిగింది ఏమీలేదు. ఇది జరిగి ఎన్నాళ్ళయిందో కూడా గుర్తులేదు. తర్వాత అతని బంధువులు వచ్చి కోమాలో వున్నాడని చెప్పాడు...

*ఆ సాయంత్రం బెజవాడ నుంచి తిరిగివస్తూ ఒకచోట ఆగి, పడమటి దిక్కువైపు చూశాను. చెంగావి సంజెపొద్దు, దిగంతాన్ని కాషాయంతో నింపివేసింది. వాలిపోతున్న దివసాంతం నా వేదనను మరింతగా పెంచింది. ఆ ప్రకృతి సౌందర్యం నన్ను దుఃఖంలో ముంచివేసింది.*

* * *

ఆ ఉదయం ఆలస్యంగా మేల్కొని, చాలా ఆందోళన చెందాను – వెంటనే నా దేవుడికి ఫోన్ చేశాను – 'ఎక్కడ?' 'న్యూరోఫిజీషియన్ దగ్గర' అన్నాడు. 'వద్దు... సెల్ మాట్లాడకు' అని పెట్టేశాను. ఆ తర్వాత అతనే ఫోన్ చేశాడు. 'అంతా బాగానే వుంది, అప్పుడప్పుడు కాస్త తలనొప్పి వస్తుంటే చూపించాను' అన్నాడు.

'This is the last straw...' అనుకున్నాను. 'సరే, Take care, సెల్ మాట్లాడకు, మంచిదికాదు' అని ముగించాను.

* * *

ముగించాను అంటే – ఇక అతనితో మాట్లాడటం ముగించాను. నా ఇంగితాన్ని ఇంతటితో ముగించాను – అతని ప్రాణదీపం కోసం – నా ప్రేమపాశాన్ని తెంచాను.

అదే, కొందరికి జీవితంలో అన్నీ తొందరగా ముగిసిపోతాయి...

మి

* * *

# నాకు తెలిసిన చాట్ల

- ఎన్నార్కె

నేను వరంగల్‌లో పనిచేస్తున్నప్పుడు దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన **స్వప్న** అన్న చిత్రాన్ని చూశాను. కొంతకాలం తర్వాత ఆదిలాబాద్‌లో పనిచేస్తున్నప్పుడు **జేగంటలు** అన్న చిత్రాన్ని చూశాను. ఈ రెండు చిత్రాలు మిత్రులతో కలిసి  చూడటం తటస్థించింది. ఈ చిత్రాలను చూసి బయటకు వచ్చిన తర్వాత ఆ చిత్రాల గురించి కంటే ఆ చిత్రాలలో ముఖ్య పాత్ర ధరించిన ఒక నటుని గురించి, అతని నటనా ప్రతిభ గురించి ఎక్కువగా మాట్లాడుకున్నాం. ఇంతలో ఒకరన్నారు ఆయన **చాట్ల శ్రీరాములు** నాటకాలు వెయ్యటంలో వాటికి దర్శకత్వం వహించటంలో అత్యంత ప్రతిభాశీలని. సినిమాల కంటే నాటకాలకే ఎక్కువ ప్రాధాన్యత యిస్తారని చెప్పారు.



ఆయన్ని కలవాలని, మాట్లాడాలని అనిపించింది. ఆయన వేసిన ఈ రెండు చిత్రాలలో చికాకుతో నిత్యం రుసరుసలాడే ఒక కోపిష్టి వేషం వెయ్యటంతో, ఎంతోకొంత కోపిష్టి స్వభావం లేకుండా అంతలా నటించటం సాధ్యమా? అని అనిపించింది. సినిమాలలో నటీమణి అయిన సూర్యాకాంతాన్ని ఒక మినహాయింపుగా భావిస్తాను. కాని ఈయన దర్శకుడాయే! డ్రామా దర్శకులు రిహార్సల్ సమయంలో సరియైన భావ ప్రకటన చేయలేనప్పుడు నటులను ఎలా తిడతారో ప్రత్యక్షంగా కొన్నిసార్లు చూశాను. దాంతో ఆయన్ని కలిసే విషయమై పక్కన పెట్టాను.  కొన్నాళ్ళ తర్వాత ***మిసిమి*** సంపాదకులైన అశ్వినీకుమార్ మాటల సందర్భంలో ఆయన తనకు ఆప్తులని చెప్పి ఆయన్ను కలవడానికి నన్ను తీసుకొని వెళ్ళారు. మొదటి సారిగా ఆయన్ను కలిసినప్పుడు నా అంచనాలన్నీ తల్లక్రిందులయ్యాయి. నేనూహించినట్లు ఆయన సీరియస్‌గా లేకుండా ఎంతో ప్రశాంతంగా చిరునవ్వుతో మమ్మల్ని రిసీవ్ చేసుకున్నారు. నేను అంతకు ముందు చూసిన ఆ రెండు చిత్రాలతో పాటు ఆయన టి.వి.లో వేసిన టంగుటూరు ప్రకాశం పంతులు పాత్ర పోషణ గురించి కూడా ప్రశంసించాను. "నేను మీ అభిమాని" నన్నాను. ఆయన "అంతకంటె ఎక్కువగా నేను మీ అభిమానిని మీరు వ్రాసే చిత్రకళా వ్యాసాలకు" అంటూ నవ్వుతూ పలకరించారు. మీ ఎడిటరుగారు నన్ను రచయితను చూశారు! అనేవారు! తర్వాతి కాలంలో ***మిసిమి*** లో మంచి ఆకర్షణీయమైన చిత్రాలు ప్రచురించబడినప్పుడు అందరి కంటే ముందుగా (ఆయనకు ***మిసిమి*** కాపీ ప్రతి నెల 1వ తారీఖుకే చేరుతుంది. అదొక ఆశ్చర్యం!) అంటే ఒకటో తారీఖునాడే ఫోన్ చేసి అభినందించేవారు. డిసెంబరు 2015, జనవరి 2016 చిత్రాలపై వచ్చిన ముఖచిత్రాలను చూసి అభినందించడానికి ఆయన లేరనే వాస్తవం బాధాకరం.

గొల్లపూడి మారుతీరావు **గోటు హెల్**, ఎన్నార్ నంది **మరో మొహెంజదారో** నాటకాలకు జీవంపోస్తే ఆయన వాటికి జవసత్వాలు చేకూర్చి ప్రజల ముందుకు తెచ్చారు. నేను ఎంతో కాలం ప్రత్యక్షంగా ఈ నాటకాలను చూడాలనే ఆకాంక్ష వారి ద్వారా తీరింది. అంతేకాదు, జపనీస్, చైనీస్ నటుల యొక్క ఆబ్‌స్ట్రాక్ట్ నాటకాలను కూడా ఆయన మాకు చూపించారు. ప్రఖ్యాత మరాఠీ నటుడు శ్రీమాన్ లగ్గు నాటకం **నటసామ్రాట్**కు తెలుగు అనువాదమైన **నాటకాంతం** స్క్రిప్ట్‌ను నేను కోరిన వెంటనే నాకు పంపారు.

ఆయనకు మార్లిన్ బ్రాండో, దిలీప్ కుమార్ల మెథడ్ యాక్టింగ్ అంటే చాల ఇష్టం. దానిని ఉనికిలోకి తెచ్చిన స్టాన్లీ విస్కీ గురించి వివరంగా ఒక నాడు కారులో ప్రయాణం చేస్తున్నప్పుడు చెప్పారు. అయితే ఆయన వివరణ అంతా ఇంగ్లీషులో కొనసాగింది. దానిని తెలుగులోకి అనువాదం చేసి ప్రచురించాలనుకున్నారు. బహుశా ఆయనకు నివాళిగా ఆ వ్యాసం ప్రచురించబడుతుంది.

# వేదిక

దేవికారాణి వర్ణచిత్రమంటూ ముఖపత్రంగా ప్రచురించిన దాంట్లో ఏదో తిరకాసు వుంది.

1. అది దేవికారాణిని పోలిలేదు. ఇది చిత్రకారిణి కళాభిజ్ఞతను సందేహించడం కాదు. ఆమె జ్ఞాపకశక్తిని సంశయించడం.
2. ఎదురుగా దేవికారాణి ఉండగా వేసినదనుకోవడానికి అవకాశాలు తక్కువ, యిరువురూ ఒక సమయంలో బెంగుళూరులో ఉన్నప్పటికీ. ఇక ఒక ఫోటోను అనుసరించి వుండాలి.
3. వంగ స్త్రీలు సాధారణంగా తల్లో పువ్వులు పెట్టుకోరు. ఇంతకు ఆ ఫోటో ఎవరిది?

ఆ కాలంలో (1940–45) తీసినదే భానుమతి ఫోటో అలాంటి దొరకటున్నది. దాని నకలు పంపుతున్నాను. అది



భానుమతి

చూసి సుబ్బులక్ష్మి గారు గుర్తు చేసుకొంటారేమో!

పాఠకుడు చెరుకువాడ వెంకట రామయ్యగారు వెల్చేరు నారాయణరావు వ్యాసం గురించి వ్రాసిన దానితో ఏకీభవిస్తున్నాను. వెల్చేరు గురించి మరి రెండు మాటలు. ఒక పుస్తకం (గాడ్ ఏస్ కస్టమర్, ఒ.యు.పి.)లో మందర పర్వతమంటే గో, గోప, గోపీజన సంరక్షణార్థం శ్రీకృష్ణుడెత్తిన పర్వతమన్నారు. కేవలం అమర్‌చిత్రకథా జ్ఞానంతో అది సరికాదని, ఆ పర్వతం గోవర్ధనమని నా మేనల్లుడు చిన్న వయసులోనే తేల్చాడు. అందులోనే అంగ్లపదం 'కంప్లైంట్'ని 'బ్లేమ్' అన్న అర్థంలో వాడారు. ఇవి రెండూ ఒకటి కావని నాలాంటి ఇంటర్‌ఫెయిలైన వాడికీ తెలుసు. వెన్న దొంగిలించావని కృష్ణునితో అంటే బ్లేమ్ (దోషారోపణ) అదే విషయం యశోదతో అంటే కంప్లైంట్ (చాడీ). ఇవి వారి తెలియనితనానికి రుజువులా? కాదు. వారి నిర్లక్ష్యానికి ఉదాహరణలు.

సరోజినీనాయుడు గురించి తెలుగులు గొప్పలు చెప్పుకోవడం పాత విషయం. ఎన్నో విషయాలు తెల్పిన వరవరరావు తమ వ్యాసం చివర ఆమెపై పాడిన వారికి యీ సాంస్కృతిక వారసత్వం తెలుసునా అని ప్రశ్నించారు. వరవరరావుగారికి 'అమ్మ సరోజిని దేవి' పాడింది ఘంటసాల అని తెలియదు.

(నార్ల చిరంజీవి గారింట్లో సరోజినిదేవిపై పాడిన వారి గురించి, వరవరరావు గారి వ్యాఖ్య –సం.)

సరోజినీదేవి గురించి మరొక్కమాట. అర్ధశతాబ్దం క్రితం కొందరు పెద్ద మనుషులు, కించితజ్ఞానులు ఆమెకొక రహస్య ప్రియుదున్నట్లు ఆమె రచనల్లో తెలుస్తుంది అని గుసగుసలు పోయేవారు. ఉన్నాడు మీరాకి, నమ్మాళ్వార్‌కి, జయదేవునికి ఉన్నట్లే. అయితే వారి ప్రియుడు విశ్వవ్యాపి అయిన కృష్ణుడు. తానెరిగిన మహనీయుల గొప్పతనాన్ని తన మనసులో కరగించి తేల్చిన నిగ్గుతో తానే రూపొందించిన ఉహామూర్తే సరోజినీదేవి రహస్య ప్రియుడు.

ఇక డా॥ ఎమ్. పురుషోత్తమాచార్య వ్యాసంలో తోలేటి ఘంటసాలల లేశమాత్ర దోషాలు, కాకతాళీయమైన విషయాలు గుణాలుగా, ఉద్దేశపూర్వకమైన నగిషీలుగా అభివర్ణించ విఫల ప్రయత్నం చేశారు.




చివరి పేరాలో 'వాటి పంక్తులలోని రెండవ అక్షరం నుంచి లయ ప్రారంభమవుతుంది' అన్నారు. ద్వితీయాక్షర ప్రాస పాటించని యీ రచనలో కొన్ని చోట్ల మొదటి అక్షరం లఘువు కొన్ని చోట్ల గురువు. అప్పుడు పంక్తిలో రెండవ అక్షరం ఏదనుకోవాలి?

"ఆముక్తమాల్యద" అందాలు ప్రోవు పెట్టిన ఆచార్య దామోదరనాయుడు 'మాంసాహార' విషయాల విశదీకరణ సమంజసం కాదన్నారు. ఈ మడి ఎవరు కట్టుకొన్నది, వారా, **మిసిమా**, **మిసిమి** పాఠకులా!

'ఊటీలో ఉదయ రేఖలు' మార్పిడి, ముద్రణ బాగాలేవు.

మొట్టమొదటే చెప్పవలసినది చిట్టచివర చెబుతున్నాను. నేను మిసిమి చదివినంత శ్రద్ధగా మరొక పత్రికను చదవను. అచ్చుతప్పులు హెచ్చుగా వుంటున్నవి. సెక్సునీ, ఛూమంత్రకాళి జానపదాలను తిరగతోడుతున్న పత్రికలలో వాటిని పట్టించుకొనము. సాంకేతిక విషయాలు తెలిపే మిసిమిలో వాటి ఉనికి విషమం. గ్రహించ ప్రార్థన.

మి

**వి.ఎ.కె. రంగారావు, మద్రాసు.**
**ఫోన్ : 94447 34024 (త.నా.)**
**99511 68911 (ఆం.ప్ర.)**

# వేదిక

*మిసిమి*లో ప్రచురింపబడుతున్న వ్యాసాలు ఆయారంగాలలో పరిశోధనలు చేసిన పండితుల రచనలుగా భావించడంలో అభిప్రాయ భేదాలుండవు కాని రచయితల అభిప్రాయాలతో ఏకీభవించని పాఠకులు గూడ వుంటారుగదా. అటువంటప్పుడు పత్రికాముఖంగా చర్చ జరిగితే ఎంతో బాగుండును అన్న అభిప్రాయం చాలా సంవత్సరాలుగా నా మనస్సులో వుంది. *మిసిమి*లో "వేదిక" ఏర్పాటు చేసినందుకు అభినందనలు.

సాయి, జయశ్రీ గారు రాస్తున్న వ్యాసాలు శాస్త్రీయంగా, హేతుబద్ధంగా వున్నాయి. ఐతే గుజరాత్, కచ్ ప్రాంతాలలోని గిరిజనులపై అధ్యయనం చేయవలసిన అవసరం చాలా వుంది. ఒకప్పుడు మూలముండాభాష మాట్లాడే ప్రజలు సింధునుండి బ్రహ్మపుత్ర వరకు వ్యాపించి వుండేవారు. వీరు (సవరలు) ఆస్ట్రోలాయిడ్ వర్గానికి చెందిన మానవులు. చప్పి ముక్కు, పొడుచుకొచ్చిన ఎత్తైన దవడలు, (హనువులు), పెద్ద పెదవులు కలిగి వుంటారు. (మన హనుమంతుని లాగ) వీరు పొట్టివారు. నాటి శబరులే (మూల ముండా జాతులు) నేటి సవర, ముండారి, సంతాలి మొదలైన జాతులవారు. ఋగ్వేదం ఐతరీయ బ్రాహ్మణంలో ఆంధ్రులతో పాటు మూతిబ, శబర, పుళిందాది జాతులను పేర్కొనడం జరిగింది. ఒకప్పుడు వీరు సింధు నుండి బ్రహ్మపుత్ర వరకు వ్యాపించి వుండేవారు.

'వన నరులే' 'వానరు'లు అయారు. 'స ఓల' (స ఓర, ల ర లకు అభేదం) 'స' అంటే చాటు అనీ 'ఓల' అంటే ఆకు అనీ అర్థం. 'స'ఓల (స'ఓర) అంటే ఆకుచాటు (చెట్టుచాటు) మనిషి అని సవర పండితులు చెప్తారు.

ఎఫ్. బి. జె. కూపర్ ఇరవయ్యవ శతాబ్దపు నాలుగవ దశకంలో ముండాభాషల తులనాత్మక పరిశీలన చేస్తూ, సంస్కృత, ప్రాకృత, ద్రావిడ పదాలలో 40 శాతం వరకు మూల-ముండా పదాలు వున్నావంటూ తను రచించిన "ప్రోటో ముండా వర్డ్స్ ఇన్ శాన్సిక్రుత్" అన్న గ్రంథంలో రాశారు. శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు సర్వజిత్ (1947) భారతిలో "ప్రాచీన భారతీయ భాషలు" అన్న వ్యాసంలో ఇదే విషయాన్ని సోదాహరణంగా రాశారు. అధర్వణ వేదంలోకంటే ఋగ్వేదంలో ముండాభాషా పదాలు ఎక్కువగా ఉన్నాయి అనీ, అధర్వణ వేదంలో ద్రావిడ భాషా పదాలు చోటుచేసుకొన్నాయనీ విట్జల్ (1999) తెలియజేస్తున్నారు. అందుచేత ఆర్యులు వచ్చేనాటికి నిషాదులు పంజాబ్ ప్రాంతలో వుండేవారని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శబరులు ఏయే ప్రదేశాలలో వుండేవారో ఆయా ప్రదేశాలలో 'గోదారి' లు ఉంటాయి. 'గోదావరి' కాదు. 'గోదారి' అన్నదే సరైనమాట. ఇది సవర (శబర, మూలముండా) మాట. 'ద' అంటే 'నీరు'. ఈ మాట ఇదే అర్థంలో అన్ని ముండా భాషలలోను వుంది. 'ఇ' అన్న క్రియ కదలికను తెలుపుతుంది. 'ద + ఇ' = "నీరు ప్రవహించు" (క్రియ) 'ఆర్' అన్న ప్రత్యయం క్రియను నామవాచకంగా మారుస్తుంది. ఇది మధ్య ప్రత్యయం. 'ద + ఆర్ + ఇ = దారి = 'నీటి ప్రవాహం. 'గో' అంటే 'గొప్ప, ఎక్కువ, పెద్ద' అన్న అర్థాలు. "గోదారి" అంటే "గొప్ప నీటి ప్రవాహం" అని అర్థం. 'గ్రాండ్ రియో'. అందుచేత "గొప్ప నీటి ప్రవాహం" ఎక్కడున్నా అది 'గోదారి'. 'వంశధార' ను 'పెద్దేరు' అని 'నాగావళి' ని 'చిన్నేరు' అనడం వాడుక. ముండా భాషలలో 'లంక' అంటే 'మీద, ఎత్తు(ప్రదేశం) అన్న అర్థం వుంది. ఈ దృష్టితో రావణ లంకను సోధించవచ్చేమో, సాయిగారు ప్రయత్నించాలి.

" పాళీ అనే భాష లేదు. ఆ పేరుతో చెప్పబడుతోంది ఆంధ్ర ప్రాకృతం. 'పాళీ' అనేది వ్రాసే పనిముట్టు('నిబ్'). ఈ పదం మరే భారతీయ భాషలోనూ (ఆంధ్రములో) తప్ప కనిపించదు" అంటూ బాలగంగాధరరావుగారు తమ భావం వ్యక్తం చేశారు. (వేదిక-జనవరి16) "పాళీ" అన్న పదం సంస్కృతం, తెలుగు, తమిళం, హిందీ భాషలలో వుంది.

"పాళీ" అంటే 'నిబ్' అన్న అర్థం 'ఒక్క ఆంధ్రం లోనే వుంది." అన్నారు. ఐతే సంశయం ఏమిటంటే - వస్తువు ముందా పేరు ముందా అన్నది. కలం ముందా, పాళీ ముందా? సిరా లేకుండానే పాళీతో రాత వుందా? మాగధీ ప్రాకృతంలోని పాటలీపుత్ర మాండలికాన్ని 'పాళీ' అంటారు.

''మథుర, బృందావనాలు శ్రీకాకుళం జిల్లాలో వున్నాయి.'' అంటూ ఆచార్య బాలగంగాధరరావుగారు

⇨⇨

# వేదిక

"గడియారం రామకృష్ణశర్మగారి స్వీయ చరిత్ర *శతపత్రము* పై *మిసిమి* డిసెంబరు 2015 సంచికలో వచ్చిన వ్యాసం సమగ్రమైనది. అందుకు ఆ రచయితకు నా అభినందనలు. అయితే స్వీయచరిత్రలో నన్ను బాగా ఆకట్టుకున్న ఒక విషయాన్ని పాఠకుల దృష్టికి తేదలచాను.

రామకృష్ణశర్మగారి అభిమాన విషయాలు అనేకం. అందులో శాసన పరిశోధన, చరిత్ర ఉన్నాయి. వారి చారిత్రక దృష్టిని తెలిపే ఒక విషయాన్ని వారే ఒక ప్రసంగంలో ప్రస్తావించారు. నెల్లూరులో 1974లో జరిగిన తిక్కన జయంతి సందర్భంగా ఎఱ్ఱాప్రెగ్గడపై చేసిన ఆ ప్రసంగంలో వారేమన్నారంటే – ఎఱ్ఱాప్రెగ్గడ చారిత్రక దృష్టితో రచనలు చేసినారు. (వారి) రామాయణం లభించకపోయినా ఆ కథ తెలిసినదే. రాముడు నానాకష్టాలుపడి శత్రు సంహారం చేసి పట్టాభిషేకం చేసుకుంటాడు. భారత అరణ్య పర్వశేషంలో పాండవులు అవస్థలు పడుతుంటారు. చివరకు యుద్ధంలో విజయం పొంది సుఖిస్తారు. *హరివంశం* కృష్ణావతార చరిత్ర ఆది నుండీ అంతం వరకూ ఉంది. బాల్యంలో బాధలు, దుష్టసంహారము, లోకకల్యాణము జరుగుతుంది. *నృసింహపురాణంలో* భక్తప్రహ్లాదుని, చిత్రహింసలు, దైవం సాక్షాత్కరించి దుష్టసంహారం చెయ్యడం ఉంది. ఈ గ్రంథాలన్నిటిలో ఒకే ఇతివృత్తము విభిన్న రీతులలో వర్ణింపబడింది.

ఎఱ్ఱాప్రెగ్గడ 14వ శతాబ్ది మొదటి భాగంలో ఉన్నాడు. అప్పుడు దుష్టులైన ముస్లింల దురాగతాలతో ఆంధ్రదేశం తల్లడిల్లిపోతున్నది. ముసునూరి ప్రోలయ నాయకుడు తురకలను తీరాంధ్ర నుండి పారద్రోలి రాజ్యాన్ని స్థాపించాడు. 'విలస' గ్రామంలో అతడు 1325లో వేయించిన శాసనంలో ఆనాటి దుస్థితి వర్ణించబడింది.

*ప్రతాపరుద్ర తిగ్మాంశౌ లోకాంతర తిరోహితే*
*తరుష్కాంధ్ర తమిస్రేణ! సమాక్రాంత మహీతలం!!*

(కాకతీయరుద్రుడనే సూర్యుడు అస్తమించగానే భూతలాన్ని ముస్లింలనే కటిక చీకటి ఆవరించింది)

*ధనదారాదికే నృణాం కశ్మింశ్చిదపి వస్తుని*
*స్వాయత్తీతా మతిః నా భూత భవితస్యాం మహాపది*

(భూమండలానికి కలిగిన ఆ మహావిపత్తులో ఇది నా భార్య, ఇది నా ధనము అని చెప్పుకోగల స్థితి లేదు.)

ఆ పరిస్థితులను కళ్లారా చూసిన ఎఱ్ఱాప్రెగ్గడ అటువంటి ఇతి వృత్తాలనే గ్రహించాడు. ఇంకొక మాట ఏమంటే పెద్దన గారి సామాజిక దృష్టిని తెలిపే ఒక విషయాన్ని ఆరుద్రగారి సమగ్రాంధ్ర సాహిత్యంలో మనం చూడవచ్చును. రామరాజ్యం ఎలా ఉంటుందో ఎఱ్ఱన గారు *హరివంశంలో* సంక్షేప రామావతారంలో వ్రాశారు.

కం॥ *మునులు సురలును వేడుక*
*మనుజులలో గలిసి మెలిసి మనుచుండు రెం*
*డను గడువుదు గట్టుదుగొను*
*డను మాటలనే వినగవచ్చు నఖిల క్షోణిన్.*

– *హరి. పూ. 4.67*

ఎక్కడ చూచినా తినండి, కట్టుకోండి, తీసుకోండి అనే పుష్కలమైన మాటలు వినబడి అంతకన్నా మంచి రాజ్యం ఎక్కడుంటుంది అని అన్నారు ఆరుద్రగారు. ఇటీవలి కాలంలో ఎన్నికల సమయంలో బాగా ప్రచారానికి వచ్చిన "తినడానికి తిండి, కట్టుకోడానికి బట్ట, ఉండటానికి ఇల్లు" అనే నినాదానికీ, ఎఱ్ఱనగారి పై మాటలకీ పోలిక ఉందనుకున్నా, ఆ మాటలు వారి సామాజిక దృష్టిని తెలిపేవిగా ఉన్నాయని నా అభిప్రాయం.

**కణుగుల వేంకటరావు, శ్రీకాకుళం**

రాశారు. 'బృందావనాలు' లేని చోటేది? శ్రీకాకుళం జిల్లా సిగడాం మండలంలో 'సంతవురిటి మధుర విజయరామపురం' అనే ఊరు వుంది. 'సంతవురిటి మధుర విజయరామపురం' అంటే 'సంతవురిటి గ్రామానికి చెందిన కుగ్రామం విజయరామపురం' అని అర్థం. 'మధుర' అంటే 'కుగ్రామం(హేమ్‌లెట్). ఇది రెవెన్యూ పదం.

**డా॥ అల్లంసెట్టి చంద్రశేఖర రావు**
**పొందూరు. ఫోన్ : 99 49 40 51 41**

# చదవండి...

– ఎన్నార్కె




✦ **కథకు శతమానం :** (కథానిక సాహిత్య వ్యాసాలు) సంపాదకుడు. శి. గిరిజా మనోహరబాబు. సాహిత్య ప్రక్రియల్లోని అన్ని విశేషాలను తనలో ఇముడ్చుకోగల కథాసాహిత్య ప్రక్రియ లోతు పాతులను, గురుజాడతో మొదలుకుని అనేక మంది ఉద్ధండ పండితుల రచనలను వాటి ప్రత్యేకతను సమగ్రంగా విశ్లేషించిన వ్యాస సంపుటి. తెలంగాణ కథ, సాహిత్యాల గురించి జరిపిన సుదీర్ఘ చర్చ. చదవదగ్గది. ఇందులో మొత్తం 43 వ్యాసాలున్నాయి.

*పేజీలు : 424, వెల : ₹ 200/–, ప్రతులకు – ఫోన్ : 9949013448*




✦ **యువజన విజ్ఞానము :** గ్రంథకర్త నూత గవేషణా బద్ధులైన పరిశోధకులు సురవరం ప్రతాపరెడ్డి. ఇందులో నున్న 14 వ్యాసాలు సామాజిక పరమైనవి. విషయ సాంద్రత, భాషాసరళత పుష్కలంగా ఉన్న రచనలు. ప్రజాసేవలో మోక్షము గలదు అన్న మాటతో సురవరం వారు యువజన విజ్ఞానము అన్న గ్రంథానికి ముగింపు పలకటం ఆయన ఆలోచన ధోరణికి అద్ధం పడుతుంది.

*పేజీలు : 238, వెల : ₹ 250/–, ప్రతులకు – సురవరం పుష్పలతా రెడ్డి. సాహితి వైజయంతి ట్రస్ట్ – బి – 6. డి.డి. కం.నీ, హైదరాబాద్ – 500007.*




✦ **వ్యాస రాజిక :** రచయిత్రి డా॥ ఆర్. రాజేశ్వరమ్మ, పోతన నుంచి, కొడవటిగంటి కుటుంబరావు మొదలుగా గల అనేక రచయితల సాహిత్య విశ్లేషణ. మొత్తం 16 వ్యాసాలు.

*పేజీలు : 116, వెల : ₹ 60/–, ప్రతులకు – ఫోన్ : 9491420180*




✦ **మానవీయ ఉపాధ్యాయుడు :** రాబోయే తరాలకు మార్గదర్శకునిగా ఉపాధ్యాయుడిని మించిన సమాజం ఉండదు అన్న నానుడికి అద్దం పడుతుందీ రచన. డాక్టర్ శివాకర్షక విజయకుమార్ రచయిత.

*పేజీలు : 232, వెల : ₹ 225/–, ప్రతులకు – ఫోన్ : 7032875756*



✦ **వెండితెరపై వెన్నెల సంతకం :** మహానటి సావిత్రిపై వచ్చిన మరో పుస్తకం సంకలన కర్త హెచ్. రమేష్‌బాబు. ఆమె నటనను ప్రస్తుతించి వ్రాసిన 30 వ్యాసాల సంపుటి. (కొన్ని ఆమె వ్రాసిన వ్యాసాలతో కలిపి) ప్రతి పేజిలోని ఆమె మనోహర ఛాయా చిత్రాలు ప్రచురించ బడ్డాయి. కొన్ని ఇంతకు ముందు మనమెప్పుడూ చూడనివి.

*పేజీలు : 95, వెల : ₹ 60/–, ప్రతులకు – చిన్నీ పబ్లికేషన్స్, నాగర్ కర్నూలు, మహబూబ్ నగర్. ఫోన్ : 9440925814*



✦ **కళాప్రపూర్ణ గణపతి రాజు అత్యుత రామరాజు** : జీవిత గాథ.

*పేజీలు : 200, వెల : ₹ 100/–*




✦ **నీరాజనం :** ముందు ప్రస్తావించిన పుస్తకంలానే. ఇది కూడ వెలమాటి సుందరమ్మ గారి స్మారక సంచిక మిగతా వివరాలు మామూలే.

*పేజీలు : 52, వెల : అమూల్యం.*

✦ రాజుగారి ఆస్థానంలో వుంటూనే దేశభక్తిని నిర్వహించిన ధీశాలి, సంప్రదాయ కుటుంబంలో పుట్టి దానినే సవాలు చేసిన ధైర్యశాలి, ఆశల కోసం ఆశయాలను వదులుకోని ఆదర్శాల ప్రతిబింబం శ్రీ గురుజాడ అప్పారావు. ఆయన ఔన్నత్యాన్ని తిరిగి మరొకసారి మన ముందుంచే ప్రక్రియలో భాగంగా ప్రజాశక్తి బుక్ హౌస్ వారు నాలుగు పుస్తకాలను విడుదల చేశారు.




1. ఇందులో మొదటిగా చెప్పవలసింది తెలకపల్లి రవి విశ్లేషించిన **గురుజాడ యుగస్వరం** – ఇందులో ఆయన పుట్టిన స్థల, కాల పరిస్థితులు, వాటి పరిమితులు మొదలయిన విషయాలన్నీ సవివరణాత్మకంగా పాఠకుని ముందుంచారు. *పేజీలు : 210, వెల : ₹ 125/–*
2. **దిద్దుబాటు** గురుజాడ కథానికలు. *పేజీలు : 56, వెల : ₹ 35/–*
3. **దేశభక్తి తదితర గేయాలు** గురుజాడ అప్పారావు రచనలు. *పేజీలు : 72, వెల : ₹ 45/–*
4. **మధురవాణి** : ఉహాత్మక ఆత్మకథ. నెల్లూరు నుంచి వెలువడిన *జమీన్ రైతు* పత్రికలో వారం వారం మాటకచేరి శీర్షికలో స్థానిక విషయాల గురించి, గొప్ప గ్రంథాల పరిచయంతో బాటుగా వైవిధ్యం గల విషయాల మీద తనదైన శైలిలో వ్యాసాలు వ్రాసిన ప్రముఖులైన పెన్నేపల్లి గోపాలకృష్ణ దీని రచయిత. పుస్తకం లోపల బొంకుల దిబ్బ, విజయనగర రాజమహళ్ళ ఫొటోలు ప్రచురించారు. మోహన్ వేసిన మధురవాణి లాంటి రేఖా చిత్రాలు జీవంతో తొణికిసలాడుతున్నాయి. *పేజీలు : 223, వెల : ₹ 150/–*




పైన పేర్కొన్న ప్రతి పుస్తకానికి గురుజాడ చిత్రాన్ని భిన్నమైన రీతిలో చిత్రించిన గిరిధర్ చిత్రాలు ఆకర్షణీయంగా ఉన్నాయి.




✦ **దేహమన్నది భ్రాంతి యేనా ! :** ఈ పుస్తకపు వెల దీనిని ఆమూలాగ్రంగా చదవటమే! అని పేర్కొన్నారు రచయిత. "ఇది ఒక నచికేత యత్నము. నచికేతునికుండిన శ్రద్ధాభక్తులు నాకు లేవు. మనః స్థితి మాత్రము నచికేతుని దే, ఇది సత్యము" అని వినయంగా పేర్కొంటారు రచయిత పరిగొండ కాంతారావు గారు. వెల : ఆమూలాగ్రంగా చదవటమేనని పేర్కొన్నారు.

*పేజీలు : 20, ప్రతులకు – ఫోన్ : 9441886824*




✦ **దూరాలు దగ్గరవ్వాలి** : (నవలా) రచయిత, అరసం కార్యదర్శిగా పనిచేసి, ప్రగతి శీల దృక్పథంతో, అభ్యుదయ భావాలలో సిద్ధాంతిక అవగాహన వున్న రచయిత అయిన శ్రీ అడపా రామకృష్ణ కలం నుండి వచ్చిన ఒక మంచి నవల.

*పేజీలు : 122, వెల : ₹ 60 /– ప్రతులకు – ఫోన్ : 9505269091*




✦ **శతక సాహిత్యం-నైతిక విలువలు :** అన్న ప్రధాన అంశంపై వరంగల్లులో నిర్వహించబడిన జాతీయ సదస్సులో పండితులైన ఉపన్యాసకులందరు వివిధ దృక్కోణాలను తమ తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. సోదర భాషలైన కన్నడ, తమిళ భాషల్లో దీని విస్తృతినీ, దీని ఆవశ్యకతనూ, ఔన్నత్యాన్నీ చర్చించారు. సావనీర్ సైజ్‌లో వీటన్నిటినీ ఏరి కూర్చి ప్రచురించిన వ్యాసాల సంపుటి ఈ పుస్తకం.

*పేజీలు : 160, వెల : ₹ 200/–, ప్రతులకు – ఫోన్ : 9949013448*

## మిసిమి విజ్ఞానదాయకం, వినోద ప్రసాదం!

**మిసిమి పత్రిక ప్రతి నెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని**
**ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹ 300/- తోపాటు పంపండి.**
**బయటి చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు అదనంగా ₹ 50/- కలపండి.**

1. **పేరు :** ..............................................................
2. **చిరునామా :**
   ఇం.నెం. ..............................................................
   వీధి ..............................................................
   ఊరు ..............................................................
   పిన్ ..............................................................
   సెల్ ..............................................................
3. **సంతకం :** ..............................................................

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |



రెండు సంవత్సరాల చందాదారులకు (₹ 600+50/-) *ఏరియల్ (షెల్లీ)* గ్రంథం బహుమతి



మూడు సంవత్సరాల చందాదారులకు (₹ 900+50/-) *బైరన్ (జీవిత కథ)* గ్రంథం బహుమతి



నాలుగు సంవత్సరాల చందాదారులకు (₹ 1200+50/-) *నా కథ చార్లీ చాప్లిన్* గ్రంథం బహుమతి





అయిదు సంవత్సరాల చందాదారులకు (₹ 1500+50/-) మిసిమి 2013/2014 సంచికల బౌండ్ పుస్తకం బహుమతి

**మిసిమి**
మాసపత్రిక
**మీరు బహుమతిగా పంపండి**

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు మిసిమిని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపిక చేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితులకోసం చందా మిసిమి పేర ₹ 300/- పంపండి. వారి పూర్తి చిరునామా ఈ ప్రక్కగడులలో ఇవ్వండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా మిసిమి పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే మంచి సారస్వతంతో....

**ఈ క్రింది బహుమతి పుస్తకాలలో**
**మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి**

1. పారాయణ వర్గ, 2. నేనొక ప్రవాహాన్ని (అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి), 3. బుద్ధ-ధమ్మ-సంఘ (జె. లక్ష్మీరెడ్డి), 4. బుద్ధుని సూత్రసముచ్చయం, 5. మానవీయ బుద్ధ, 6. యతిగీతం – వివేకానందుడు (గజ్జెల మల్లారెడ్డి), 7. అంతర్వీక్షణం, 8. దూరతీరాలలో, 9. అగాధం, 10. ఓ ఖైదీ వీరగాథ, 11. నాలో నేను (వి. అశ్వినీకుమార్), 12. మిసిమి వ్యాసాలు (డా. ఇన్నయ్య).

**బహుమానంగా పంపవలసినవారి చిరునామా :**

..............................................................
..............................................................
..............................................................

**మిసిమి**
మాసపత్రిక
**Kala Jyothi Process Pvt. Ltd.,**
Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536.



అనామిక

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2015-17
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.01.2016



గోపిక